‘ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 229

సోమవారం 10-11-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

6,6,6,6,6,6,6,6

8 వరుస బంతుల్లో 8 సిక్స్‌లు.. మేఘాలయ క్రికెటర్ ఆకాశ్ అద్భుతం

-12లో

రిటర్న్‌లకు ఇంకా చాన్సుంది

బిలేటెడ్ ఐటీఆర్ సమర్పించొచ్చు.. డిసెంబర్ 31 వరకు గడువు

- 13లో



ఉత్తరాఖండ్ మార్గంలో నడవాలి

ఉమ్మడి పౌరస్మృతి అమలు తదితర అంశాల్లో ఇతర రాష్ట్రాలూ ఉత్తరాఖండ్ మార్గంలో నడవాలని ప్రధాని మోదీ సూచించారు.

వివరాలు 6లో ▸



బహు భార్యత్వంపై నిషేధం

అస్సాం మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. బహుభార్యత్వ నిషేధం బిల్లుకు ఆమోదం తెలిపారు.

వివరాలు 6లో ▸

అద్వానీ సుదీర్ఘ సేవలందించిన నేత

అద్వానీ వంటి దిగ్గజ నేత గుణగణాలను కేవలం ఒకే ఒక్క ఘటనతో నిర్ధారించడం సరికాదని శశి థరూర్ అభిప్రాయపడ్డారు.

వివరాలు 6లో ▸

న్యాయ సహాయం నైతిక బాధ్యత

ప్రజలకు న్యాయ సహాయం అందించడం అనేది నైతిక బాధ్యత అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ స్పష్టంచేశారు.

వివరాలు 6లో ▸

• రూ.10,000 కోట్ల టూరిజం ఆస్తిపై గురి..

ప్రైవేట్‌కు ‘హరిత’ హారం

ఏపీటీడీసీకి చెందిన 22 హరిత హోటళ్లు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి!

లాభాలు వస్తున్నా సరే నిర్వహించలేమంటూ వదిలించుకుంటున్న కూటమి సర్కారు

అత్యంత విలువైన ప్రభుత్వ ఆస్తిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర

చివరికి గిరిజన చట్టాలనూ కాలరాస్తున్న చంద్రబాబు ప్రభుత్వం

ఏజెన్సీలో టూరిజం హోటళ్లను సైతం ప్రైవేట్‌కు ఇచ్చేలా పావులు

ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీల నుంచి అన్నీ ప్రైవేట్ పరం చేస్తున్న కూటమి సర్కారు

ఇసుక, మద్యం, రాజధాని నిర్మాణం పేరుతో దోపిడీ..

108, 104 సేవలు నిర్వీర్యం

ప్రైవేట్‌కు ఏది కట్టబెట్టాలి..? ఎలా కట్టబెట్టాలి..? రాబట్టుకోవడం ఎలా..? ఇదే ధ్యాసలో టీడీపీ పెద్దలు

2లో

గిరిజన చట్టాలు తుంగలోకి...!

తమకు నచ్చిన వ్యక్తులకు పర్యాటక ఆస్తులను దోచిపెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. ముందుగానే ఆరు క్లస్టర్లకు సంబంధించి ప్రైవేట్ ఏజెన్సీలను నిర్ణయించిన తర్వాత నామమాత్రంగా రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పీ)లను పిలిచినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకున్న వ్యాపారులతో పాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలకు చెందిన కంపెనీలకు హరిత హోటళ్లను ధారాదత్తం చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే హార్సిలీహిల్స్ హోటల్‌ను ఓ ఆధ్యాత్మిక గురువుకు అప్పగించేందుకే ప్రస్తుతం ఆర్‌ఎఫ్‌పీలో చేర్చలేదని సమాచారం. మరోవైపు బయటి వ్యక్తులు వ్యాపారాలు సాగించేందుకు అనుమతి లేని గిరిజన ప్రాంతంలోని హోటళ్లను సైతం ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదిలీ నియంత్రణ చట్టం 1/70 ప్రకారం గిరిజనుల నుంచి గిరిజనేతరులకు భూమి బదిలీ చేయడం నిషిద్ధం. తద్వారా గిరిజనుల భూమికి భద్రత లభిస్తుంది. అయితే ఇప్పుడు అరకులోని ఐదు హోటళ్లను ప్రైవేట్‌కు అప్పగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గిరిజన చట్టాలను సైతం కూటమి సర్కారు కాలరాస్తుండటం తీవ్ర విస్మయం కలిగిస్తోంది.

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Municipal Administration & Urban Development (CRDA) Department – Administrative Sanction for an amount of ₹524.70 crore for completion of balance works viz., architectural finishes, internal and external electrical works, plumbing and sanitary fixtures, fire-fighting provisions, lifts, DG sets, HVAC, security systems, external development, landscaping, etc. for multi-storeyed quarters comprising 432 apartment units in 18 towers (S+12 floors) for Hon'ble MLAs, Hon'ble MLCs and All India Services Officers near Nelapadu, Amaravati, Andhra Pradesh - Orders – Issued.

===

MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT (CRDA) DEPARTMENT

G.O.RT.No. 676 Dated: 13-07-2025

28% పనుల కోసం రూ.524.70 కోట్లు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో

బిగ్‌బాస్ బరితెగింపు!

రాజధాని నిర్మాణ పనుల్లో అడ్డగోలుగా దోపిడీ

72 శాతం పనులకు రూ.363.68 కోట్లు

మిగతా 28 శాతం పనులకు మాత్రం ఏకంగా రూ.524.70 కోట్లు

అంతులేని అవినీతి, దోపిడీకి ఇది మరో నిదర్శనమంటున్న ఇంజినీర్లు

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌ల కోసం రాజధానిలో 432 ఫ్లాట్ల నిర్మాణం
- 2017లో రూ.635.90 కోట్లతో ఎన్‌సీసీ సంస్థకు సీఆర్‌డీఏ పనుల అప్పగింత..
- 2019 నాటికి రూ.363.68 కోట్లతో 72% పనులు పూర్తి
- మిగిలిన పనుల అంచనా వ్యయం రూ.272.22 కోట్ల నుంచి రూ.524.70 కోట్లకు పెంపు
- ఈ లెక్కన ఒకేసారి అంచనా వ్యయం ఏకంగా రూ.252.48 కోట్లు పెంపు
- పరిపాలన అనుమతి లేకుండానే ఆ పనులను మళ్లీ ఎన్‌సీసీకే కట్టబెట్టిన వైనం
- స్టీలు, సిమెంట్, నిర్మాణ సామగ్రి ధరల్లో వ్యత్యాసం లేదు.. పైగా ఇసుక ఉచితం
- అయినా దాదాపు వంద శాతం అంచనా వ్యయం పెంచేయడంపై సర్వత్రా విస్మయం.. పెంచిన అంచనా వ్యయం మొత్తం బిగ్‌బాస్ జేబులోకే అంటున్న అధికార వర్గాలు

2లో

నేడు కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన సోమవారం ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఇటీవల ఎస్ఐపీబీలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలపనున్నారు. విశాఖలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సు తదితర అంశాలపైన సమావేశంలో చర్చించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

ఐసిస్ ఉగ్ర కుట్ర భగ్నం

గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) కీలక ఉగ్ర కుట్రను ఛేదించింది. అత్యంత ప్రమాదకరమైన రసాయన విషం ‘రైసిన్’ తయారీకి ప్రయత్నిస్తున్న వైద్యుడిని, మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది. వీరిలో ప్రధాన నిందితుడైన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయీద్ స్వస్థలం ఖమ్మం జిల్లా కాగా హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు.

6లో

నేటి గ్రుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గ్రుడ్ల ట్రేబుల్ ధర ₹84

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 108 కిలో

రిటైల్ లైవ్ బర్డ్ 135 కిలో

డ్రెస్సింగ్ స్కిన్‌తో 196 కిలో

స్కిన్ లెస్ 223 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

అక్రమ బదిలీలకు బ్రేక్!

‘సాంకేతిక విద్య’లో నిలిచిన డిప్యుటేషన్ల బాగోతం

మా సంగతి తేల్చాలంటున్న డబ్బులిచ్చిన లెక్చరర్లు, అధికారులు

డిప్యుటేషన్ బదిలీ కోసం ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు వసూలు

‘సాక్షి’ కథనంతో ఆగిపోయిన స్థానచలనాలు

టీడీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన టెక్నికల్ ఎడ్యుకేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖలో లెక్చరర్లు, ఇతర అధికారుల డిప్యుటేషన్ పేరుతో అక్రమ బదిలీలకు బ్రేకులు పడ్డాయి. గత నెలలో 30 మందికి, నవంబర్‌లో 90 మందికి డిప్యుటేషన్లు వేసి బదిలీ చేసేందుకు ఆర్డర్లు సిద్ధంచేశారు. కానీ, టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగంలో జరుగుతున్న బదిలీల బాగోతంపై ఇటీవల ‘సాక్షి’ పత్రిక ‘బదిలీ మంత్రం.. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ తంత్రం’ పేరుతో అక్కడ జరుగుతున్న వ్యవహారాలను వెలుగులోకి తెచ్చింది. దీంతో.. అప్పటికే పూర్తిచేసిన బదిలీలను అధికారులు నిలిపివేసి తాము తప్పుచేయలేదని

మిగతా 2వ పేజీలో ▶

పరమ పవిత్రం.. శ్రీవారి లడ్డూ ప్రసాదం

ఏది నిజం?

రాజకీయ కుట్రతోనే కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం

సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కుతంత్రం

అవాస్తవ ఆరోపణలతో ఎల్లో మీడియా రాద్ధాంతం

చిన్న అప్పన్న వైవీ సుబ్బారెడ్డి పీఏ కాదు.. ఏపీ భవన్ ఉద్యోగి

ఫిర్యాదు వస్తే విచారణకు ఆదేశించడం కూడా తప్పేనా?

భోలే బాబా డెయిరీ పాల సేకరణపై పరస్పర భిన్న కథనాలు

సిట్ దర్యాప్తు పేరుతో ఎల్లో మీడియా కట్టు కథలు

- నేటి మంత్రి కొలుసు, టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతి నాటి టీటీడీ బోర్డులో సభ్యులే
- భక్తుల మనోభావాలు దెబ్బ తీస్తున్న కూటమి ప్రభుత్వం
- లడ్డూ ప్రసాదం కోసం కల్తీ నెయ్యి వాడలేదని తేల్చి చెప్పిన టీటీడీ ఈవో
- అందుకు విరుద్ధంగా చంద్రబాబు అవాస్తవ ఆరోపణలు
- నెయ్యి, ఇతర సరుకుల కొనుగోలుకు టీటీడీలో పటిష్ట వ్యవస్థ.. శతాబ్దాలుగా కొనసాగుతున్న పవిత్రత పరంపర
- వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా నెయ్యి కొనుగోలు.. ఐదేళ్లలో ఒక్క రోజూ లడ్డూ నాణ్యతపై ఫిర్యాదు చేయని భక్తులు
- ఎన్నికల మేనిఫెస్టో అమలులో కూటమి ప్రభుత్వం విఫలం.. అందుకే డైవర్షన్ డ్రామాలో భాగంగా లడ్డూ ప్రసాదంపై కుట్ర

4లో

ఇంకుజాత్

అసలు ఓటర్ల లిస్టే డస్ట్ బిన్ లో వేశారు..!!

బిహార్ ప్రచార ఘట్టానికి తెర

రెండో దశ పోలింగ్ రేపే

తొలి దశ రికార్డు స్థాయి పోలింగ్‌తో అంచనాలు తారుమారు

తమకే అనుకూలం అంటూ అధికార, విపక్షాల ధీమా

అసెంబ్లీ ఎన్నికలపై మరింత పెరిగిన ఉత్కంఠ

6లో

ఏపీసెట్ ఎప్పుడు?

అనిశ్చితిలో అభ్యర్థులు

నోటిఫికేషన్ జారీలో తాత్సారం

చివరిసారిగా గతేడాది ఏప్రిల్‌లో నిర్వహణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులు, పీహెచ్‌డీ ప్రవేశాలకు కావాల్సిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్టు (ఏపీసెట్) నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసింది. చివరిసారిగా గత ప్రభుత్వం 2024 ఏప్రిల్‌లో ఏపీసెట్‌ను నిర్వహించింది. మళ్లీ తిరిగి ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏపీసెట్‌ను నిర్వహించాల్సి ఉంది. అయితే

మిగతా 14వ పేజీలో ▶

ఎంబీబీఎస్, మెడికల్ పీజీ తాత్కాలిక ఫీజుల ఖరారు

2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ కోర్సులకు తాత్కాలిక ఫీజులను ఖరారు చేస్తూ వైద్య శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2020–23 బ్లాక్ పీరియడ్ ఫీజులపై ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో 10 శాతం, పీజీ కోర్సుల్లో 15 శాతం చొప్పున పెంపుతో తాత్కాలిక ఫీజులను నిర్ణయించింది. కోర్టు కేసుల తీర్పులకు అనుగుణంగా తుది ఫీజులను నిర్ణయిస్తామని తెలిపింది.

- వివరాలు 14లో

మీ కళ్లు చెబుతాయిక... మీ జబ్బులేమిటో!

నయనాలు చూసి గుండె ఆరోగ్యం చెప్పేయొచ్చు

వృద్ధాప్యాన్ని, వయసు వేగాన్ని లెక్కకట్టొచ్చు

రోగ నిర్ధారణలో కీలకం కానున్న సమాచారం

- వివరాలు 5లో

సింపుల్‌గా జాబ్ మారుతున్నారు!

ఏడాదిలోనే కంపెనీని వదిలేస్తున్నారు

వేతనమే జెన్-జీ తరం తొలి ప్రాధాన్యత

తర్వాతే.. పని సౌలభ్యం, వర్క్-లైఫ్ బ్యాలెన్స్

12లో

న్యాయవాదుల సంబరాలు

విజయవాడ కోర్టు ప్రాంగణంలో ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ నిర్వహించిన క్యారమ్స్, చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని 400 మందికి పైగా న్యాయవాదులు పాల్గొన్నారు. వీరిలో 50 మందికి పైగా విజేతలుగా నిలిచారు. విజేతలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య బహుమతులు అందజేశారు. న్యాయవాదుల ఐకమత్యానికి ఇలాంటి పోటీలు దోహదపడతాయని జస్టిస్ నైనాల జయసూర్య అన్నారు. స్టేట్ బార్ ఫెడరేషన్, బీబీఏ అధ్యక్షుడు ఏకే బాషా, చలసాని అజయ్ పాల్గొన్నారు. - విజయవాడ లీగల్

మెగాలిథిక్ యుగపు ఆనవాళ్లు

తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మేడారం గ్రామంలో అరుదైన మెగాలిథిక్ యుగం నాటి మానవ ఆకారపు శిల్పాలు వెలుగు చూశాయి. వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలోని చరిత్ర విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరుకు చెందిన సంగు వెంకట్‌రెడ్డి ఆదివారం ఆ శిల్పాలను గుర్తించారు. మేడారంలోని రెక్కల స్తంభం గండి వద్ద మెగాలిథిక్ యుగం నాటి మానవాకారపు శిల్పాన్ని గుర్తించారు. ఇది క్రీపూ 1,200– క్రీపూ 300 మధ్య కాలానికి చెందినదిగా నిర్ధారించారు. - సాక్షి, యాదాద్రి

సాహిత్యపు సౌరభాలు

ప్రముఖ తెలుగు కవి పెరుగు రామకృష్ణకు అత్యున్నత సార్క్ సాహిత్య పురస్కారం లభించింది. ఫౌండేషన్ ఆఫ్ సార్క్ రైటర్స్ అండ్ లిటరేచర్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం న్యూఢిల్లీలో ప్రారంభమైన 66వ సార్క్ సాహిత్య సదస్సులో రామకృష్ణకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. అనురసిరి హెట్టిగే (శ్రీలంక), ఫరీద్–ఉర్–రహమాన్, ఖమ్రుల్ హస్సన్ (బంగ్లాదేశ్), ఇబ్రహీం వహీద్ (మాల్దీవులు), లక్ష్మీ మాలి (నేపాల్)లకు కూడా ఈ పురస్కారాలను అందజేశారు. రామకృష్ణ రచించిన 'ఈకోస్ ఆఫ్ నెల్లూర్'ను సభకు పరిచయం చేశారు. - సాక్షి, న్యూఢిల్లీ

క్లుప్తంగా...

సమరశీల ఐక్య పోరాటాలకు బీసీలంతా సిద్ధమవ్వాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బీసీ సామాజికవర్గం నేతలంతా సమరశీల ఐక్య పోరాటాలకు సిద్ధమవ్వాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. బీసీల సమస్యల పరిష్కారానికి అడ్డుగా ఉన్న న్యాయ–రాజ్యాంగపరమైన అవరోధాలను అధిగమించి, సామాజిక న్యాయం సాధించేందుకు అన్ని బీసీ కుల సంఘాలు ఐక్యంగా పోరాడాలన్నారు. విజయవాడలో ఆదివారం సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. 26 జిల్లాల నుంచి వచ్చిన బీసీ ప్రతినిధులు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జనగణనతోపాటు సమగ్ర కులగణనను శాస్త్రీయంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా దామాషా మేరకు బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలన్నారు. బీసీల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచి సామాజిక న్యాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్, సంఘం రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌రెడ్డి కేసులో మరో వ్యక్తిని విచారించిన పోలీసులు

పెనమలూరు: ఎన్ఆర్ఐ మాలపాటి భాస్కర్‌రెడ్డి కేసులో మరో వ్యక్తి చంద్రశేఖర్‌రాజును పోలీసులు ఆదివారం విచారించారు. యూకేకు చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు భాస్కర్‌రెడ్డి తన తండ్రి మరణించటంతో కృష్ణా జిల్లా పెనమలూరు మండలం చోడవరానికి వచ్చిన సందర్భంగా పోలీసులు అతడిని అరెస్టు చేసి, చిత్రహింసలకు గురి చేసిన ఘటన వివాదంగా మారింది. ఈ కేసులో పోలీసులు వెంకటగిరికి వెళ్లి వ్యాపారి కొండూరు చంద్రశేఖర్‌రాజును అదుపులోకి తీసుకుని ఆదివారం పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎన్ఆర్ఐ యూకే గ్రూపులో చంద్రశేఖర్‌రాజు ఉండటంతో అనుమానంతో పోలీసులు విచారించారు. ఎన్ఆర్ఐ గ్రూపు వివరాలు అడిగారు. చంద్రశేఖర్‌రాజుకు చెందిన సామాజిక మాధ్యమాల ఖాతాలను పోలీసులు తనిఖీ చేశారు. అతను ఎక్కడా పోస్టులు పెట్టకపోవటంతో పోలీసులు అతనిని విచారించి స్టేట్‌మెంట్ నమోదు చేసి రాత్రికి వదిలేశారు.

కాపులపై కూటమి ప్రభుత్వం వివక్ష

కాపు రిజర్వేషన్ పోరాట సమితి బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల పట్ల కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోందని, కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని కాపు రిజర్వేషన్ పోరాట సమితి (కేఆర్‌పీఎస్) మండిపడింది. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు కేఆర్‌పీఎస్ రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు, కన్వీనర్ రావి శ్రీనివాస్ రాసిన బహిరంగ లేఖను ఆదివారం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు కాపుల ప్రయోజనాలను కాపాడే విధంగా కనీసం ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదని, కాపు కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. దొమ్మర కులం వారిని గిరి బలిజలుగా మారుస్తూ జీవో ఇవ్వడంపై బలిజ, కాపు సంఘాలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తి, ఉద్యమానికి సిద్ధమైనప్పటికీ ఆ జీవోను రద్దు చేయకుండా ప్రభుత్వం స్టేటస్‌కో తరహాలో ఉంచిందన్నారు. కందుకూరు దారకానిపాడులో ఓ బలిజ కుటుంబాన్ని తుదముట్టించేలా జరిపిన మారణకాండను వెలుగులోకి రానీయకుండా స్థానిక ఎమ్మెల్యే, అక్కడి మంత్రి కలిసి కుల రాజకీయం చేశారన్నారు. ఆ దుర్మార్గాన్ని కాపు నాయకులు వెలుగులోకి తేవడంతో గత్యంతరం లేక ప్రభుత్వం పరిహారం ప్రకటించిందన్నారు.

బిగ్‌బాస్ బరితెగింపు!

రాజధాని నిర్మాణ పనుల్లో అడ్డగోలుగా దోపిడీ

72 శాతం పనులకు రూ.363.68 కోట్లు

మిగతా 28 శాతం పనులకు ఏకంగా రూ.524.70 కోట్లు

పెంచిన అంచనా వ్యయం మొత్తం బిగ్‌బాస్ జేబులోకే అంటున్న అధికార వర్గాలు

(₹ in crore)

Sl. No	Name of the work	Date of agreement	Intended date of completion	Agreement value	Gross value of work done	Progress of work (in percentage)	
						Financial	Physical
1.	MLAS & AIS Housing	13/11/2017	12/02/2019	635.90	363.68	57.19	72
2.	APCRDA Project office (G+1)	20/11/2017	19/09/2018	39.69	17.12	43.13	52
3.	NGOs Housing	13/11/2017	12/08/2019	866.10	417.79	48.24	60
4.	Gazetted Type I &II and Class-IV	06/03/2018	12/02/2019	707.40	389.11	55.01	65
5.	APCRDA Project Office (addl. 6 floors)	13/08/2018	12/08/2019	45.05	26.58	59.00	65
	Total			2,294.14	1,214.28		

ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌ల నివాసాల కోసం చేపట్టిన ప్రాజెక్టులో రూ.363.68 కోట్లు వెచ్చించి 72 శాతం పనులు పూర్తి చేసినట్లు 2023లో స్పష్టం చేసిన కాగ్ నివేదిక ఇదీ...

సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణ పనుల్లో అడ్డగోలు దోపిడీకి సర్కారు పెద్దలు బరితెగించారు. ఇష్టారాజ్యంగా అంచనా వ్యయం పెంచేసి 'నీకింత–నాకింత' అంటూ పంచుకుంటున్నారు. తుదకు పరిపాలనా అనుమతులు లేకుండానే పనులు కట్టబెట్టారంటే ఏ రీతిన అవినీతికి పాల్పడుతున్నారో ఇట్టే స్పష్టమవుతోంది. రాజధానిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారుల క్వార్టర్స్ కోసం ఎస్+12 పద్ధతిలో 18 టవర్లలో 432 ఫ్లాట్ల (యూనిట్లు) నిర్మాణ పనులు 2019 నాటికే 72 శాతం పూర్తయ్యాయి. ఆ పనులకు రూ.363.68 కోట్లు బిల్లులు చెల్లించారు. మిగిలిన 28 శాతం పనుల వ్యయం రూ.272.22 కోట్లు. కానీ.. ఆ పనుల అంచనా వ్యయాన్ని రూ.524.70 కోట్లకు పెంచేసి, 2017లో వాటిని అప్పగించిన ఎన్‌సీసీ సంస్థకే మళ్లీ ఇప్పుడు కట్టబెట్టారు. అంటే.. అంచనా వ్యయాన్ని రూ.252.48 కోట్లు పెంచేసినట్లు స్పష్టమవుతోంది. 2018–19 నాటితో పోల్చితే ఇప్పుడు స్టీలు, సిమెంటు, పెట్రోల్, డీజిల్, నిర్మాణ సామగ్రి ధరల్లో పెద్దగా వ్యత్యాస్యం లేదు. పైగా ఇసుక ఉచితం. అయినా సరే మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని 92.75 శాతం పెంచేయడంపై ఇంజినీర్లు నివ్వెరపోతున్నారు. పెంచేసిన అంచనా వ్యయం మొత్తం బిగ్‌బాస్ జేబులోకి చేరుతుందంటున్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో అడ్డగోలు దోపిడీకి ఇది మరో నిదర్శనమని ఇంజినీర్లు చెబుతున్నారు. రూ.608 కోట్ల అంచనా వ్యయంతో 432 ఫ్లాట్ల నిర్మాణానికి 2017లో సీఆర్‌డీఏ టెండరు పిలిచింది. 4.59 శాతం అధిక ధరలకు కోట్ చేసి రూ.635.90 కోట్లకు ఆ పనులను ఎన్‌సీసీ సంస్థ దక్కించుకుంది. ఈ పనులను ఎన్‌సీసీకి అప్పగిస్తూ 2017 నవంబర్ 13న సీఆర్‌డీఏ ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం ప్రకారం 2019 ఫిబ్రవరి 12 నాటికి ఈ పనులు పూర్తి కావాలి. అయితే 2019 నాటికి 72 శాతం పూర్తయినట్లు.. అందుకు రూ.363.68 కోట్లను వ్యయం చేసినట్లు 2023లో కాంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తేల్చింది. అంటే.. మిగిలిన 28 శాతం పనుల అంచనా వ్యయం రూ.272.22 కోట్లు మాత్రమే.

రద్దు చేసి.. అంచనా వ్యయం పెంపు

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పనుల కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేశారు. మిగిలిన 28 శాతం పనుల అంచనా వ్యయాన్ని రూ.272.22 కోట్ల నుంచి రూ.524.70 కోట్లకు పెంచేసి మళ్లీ టెండర్లు పిలిచి.. అదే ఎన్‌సీసీ సంస్థకు మళ్లీ అప్పగించారు. అంటే.. నాడూ, నేడూ వాటిని టెండర్ ద్వారా ఒకే కాంట్రాక్టు సంస్థకు అప్పగించారన్నది స్పష్టమవుతోంది. సాంకేతికంగా చూస్తే.. 2017లో ఆ పనులను దక్కించుకున్న సంస్థే 2025లో వాటిని మళ్లీ దక్కించుకోవడం సాధ్యం కాదు. టెండర్ నోటిఫికేషన్ జారీ చేయక ముందే సిండికేట్ కాంట్రాక్టర్లకు బిగ్‌బాస్ దిశా నిర్దేశం చేసి.. సీఆర్‌డీఏ అధికారులకు కనుసైగ చేయడం వల్లే పెంచిన అంచనా వ్యయంతో చేపట్టిన పనులను మళ్లీ ఎన్‌సీసీకే కట్టబెట్టారని ఇంజినీర్లు స్పష్టం చేస్తున్నారు.

పరిపాలన అనుమతి లేకుండానే ఒప్పందం

అంచనా వ్యయాన్ని రూ.524.70 కోట్లకు పెంచేస్తూ చేపట్టిన పనులను పరిపాలన అనుమతి లేకుండానే సీఆర్‌డీఏ అధికారులు ఏప్రిల్ 28న ఎన్‌సీసీ సంస్థకు కట్టబెట్టేస్తూ ఒప్పందం చేసుకున్నారు. కాంట్రాక్టు అగ్రిమెంట్ విలువలో పది శాతం (ఐదు శాతం మెషినరీ, ఐదు శాతం లేబర్) మొబిలైజేషన్ అడ్వాన్స్‌ను కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం చెల్లించాలి. ఆ మేరకు ఎన్‌సీసీ సంస్థకు మెషినరీ విభాగం కింద 5 శాతం... అంటే రూ.26.68 కోట్లు చెల్లించాలని సీఎఫ్ఎంఎస్ (కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ద్వారా పీఏవో (పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్)కు సీఆర్‌డీఏ అధికారులు ప్రతిపాదన పంపారు. పరిపాలన అనుమతి లేకుండా ఆ పనిని చేపట్టిన నేపథ్యంలో మొబిలైజేషన్ అడ్వాన్స్ చెల్లించలేమంటూ పీఏవో దానిని సీఆర్‌డీఏ అధికారులకు తిప్పి పంపారు. దాంతో సీఆర్‌డీఏ అధికారులు చేసుకున్న ఒప్పందాన్ని కేబినెట్‌లో ఆమోదింపజేసి.. జూలై 13న ఆ పనులకు పరిపాలన అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయించడం గమనార్హం.

రూ.457.92 కోట్లకు పైగా దోపిడీ!

రాజధానిలో ప్రభుత్వం సీఆర్‌డీఏ ద్వారా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారులకు నిర్మిస్తున్న తరహాలోనే హైదరాబాద్ మహా నగరంలో అత్యంత ప్రాధాన్యమైన ప్రాంతంలో, ఇటాలియన్ మార్బుల్స్, అత్యాధునిక హంగులతో నిర్మించిన ఫ్లాట్ల ధర ఒక్కొక్కటి రూ.కోటికి మించదని ఇంజినీర్లు, రియల్టర్లు, బిల్డర్లు గుర్తుచేస్తున్నారు. అది కూడా భూమి విలువతో కలిపి. కానీ.. సీఆర్‌డీఏ పరిధిలో భూమి ఉచితం.. ఇసుక ఉచితం.. అయినా సరే 432 ఫ్లాట్ల అంచనా వ్యయం రూ.888.38 కోట్లు. (2019 నాటికి చేసిన వ్యయం రూ.363.68 కోట్లు+తాజా వ్యయం రూ.524.70 కోట్లుకు చేరుకుంది.) అంటే.. ఒక్కో ఫ్లాట్ నిర్మాణ వ్యయం రూ.2.06 కోట్లు. ఈ లెక్కన ఒక్కో ఫ్లాట్‌పై రూ.1.06 కోట్లు చొప్పున అధికంగా వ్యయం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. దీనిని బట్టి ఈ ఫ్లాట్ల నిర్మాణంలో మొత్తంగా రూ.457.92 కోట్లకుపైగా దోపిడీ చేస్తున్నారని ఇంజినీర్లు చెబుతున్నారు.

రూ.10,000 కోట్ల టూరిజం ఆస్తిపై గురి..

ప్రైవేట్‌కు 'హరిత' హారం

ఏపీటీడీసీకి చెందిన 22 హరిత హోటళ్లు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి!

లాభాలు వస్తున్నా సరే నిర్వహించలేమంటూ వదిలించుకుంటున్న కూటమి సర్కారు

ఏజెన్సీలో టూరిజం హోటళ్లను సైతం ప్రైవేట్‌కు ఇచ్చేలా పావులు

సాక్షి, అమరావతి/భవానీపురం(విజయవాడ పశ్చిమ): నిన్న ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీలు.. నేడు టూరిజం శాఖ హోటళ్లు..! కొత్తగా సంపద సృష్టించకపోగా.. భావి తరాలకు దక్కాల్సిన విలువైన ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా ప్రైవేటు పరం చేస్తోంది! ప్రభుత్వ ఆస్తులను భద్రంగా పరిరక్షించాల్సింది పోయి.. ప్రైవేట్‌కు ఏది కట్టబెట్టాలి? ఎలా కట్టబెట్టాలి? రాబట్టుకోవడం ఎలా? అనే ధ్యాసలోనే టీడీపీ పెద్దలు ఉండటం విభ్రాంతి కలిగిస్తోంది. ఒకపక్క ఇసుక నుంచి మద్యం సిండికేట్ల దాకా పచ్చ ముఠాల దోపిడీని ప్రోత్సహిస్తూ మరోవైపు ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెడుతూ నీకింత.. నాకింత...! అనే రీతిలో దోపిడీ వ్యవహారాలకు తెర తీశారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అగ్గిపుల్ల.. కుక్కపిల్ల.. సబ్బుబిళ్ల కాదేదీ కవితకు అనర్హం అని శ్రీశ్రీ అన్నట్లుగా.. ప్రతిదీ ప్రైవేట్‌పరం చేస్తూ కాసులు పిండుకుంటున్నారు! ఇప్పటికే 108, 104 సేవలను నీరుగార్చేశారు. రాజధాని నిర్మాణం పేరుతో దోపిడీని కొనసాగిస్తూ తాజాగా పర్యాటకశాఖ హోటళ్లపై కన్నేశారు! మంచి లాభాల్లో నడుస్తున్న హరిత హోటళ్లను తాము నిర్వహించలేమంటూ ప్రైవేట్ వ్యక్తులకు కూటమి ప్రభుత్వం కారుచౌకగా దోచిపెడుతోంది! ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన హరిత హోటళ్లు, అనుబంధ ఆస్తులు ఒక్కటి కూడా లేకుండా చేయడంలో భాగంగా ఈ కుట్రకు తెర తీసింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో గిరిజన ప్రాంతం అరకులోని హరిత హోటళ్లను సైతం ప్రైవేట్‌కే ఇచ్చేందుకు రంగం సిద్ధం కావడం తీవ్ర విస్మయం కలిగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రూ.వేల కోట్ల విలువ చేసే 22 హరిత హోటళ్లను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనలు (ఆర్ఎఫ్‌పీ) ఇప్పటికే ఆహ్వానించారు. బిడ్ల దాఖలు గడువు ఈ నెల (నవంబర్) 7తో ముగియగా, వాటిని ఓపెన్ చేసి టెక్నికల్ వ్యాల్యూయేషన్ చేయాల్సి ఉంది. టెండర్లలో అర్హత సాధిస్తే కేబినెట్‌లో పెట్టి ఆమోదించుకోవటమే మిగిలింది!

రూ.10 వేల కోట్ల ఆస్తి ప్రైవేటు పరం!

ఏపీటీడీసీ హోటళ్లను ఆరు క్లస్టర్లుగా విభజించి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని టీడీపీ కూటమి సర్కారు నిర్ణయించింది. సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఈ హోటళ్లు ఉండగా మార్కెట్ రేటు ప్రకారం వీటి విలువ దాదాపు రూ.10 వేల కోట్లు వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇంత విలువైన ఆస్తులను దశాబ్దాల పాటు నామమాత్రపు లీజుకు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. వార్షిక స్థూల ఆదాయం/ఏపీటీడీసీ నిర్ణయించిన సగటు వార్షిక లీజు రేటు ఆధారంగా రెండింటిలో ఏది ఎక్కువైతే అది ప్రైవేటు ఏజెన్సీలు చెల్లించాలని ఆర్ఎఫ్‌పీలో పేర్కొన్నారు. ఓ ప్రైవేట్ సంస్థ తన ఆదాయాన్ని ఎంత వరకు కచ్చితత్వంతో వెల్లడిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ప్రస్తుతం హోటళ్లు ఉన్న ప్రాంతంలో ఖాళీ స్థలంలో నిర్మాణాలు చేపట్టాలంటే మార్కెట్ విలువ ప్రకారం కాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రేటు ప్రకారం ఒక్క శాతాన్ని లీజుగా నిర్ణయించడం చూస్తుంటే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుకు ధారాదత్తం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఉద్యోగుల కుటుంబాలు బలి..

ఏపీటీడీసీలో హోటళ్లు, వాటర్ ఫ్లీట్, ట్రాన్స్‌పోర్టు.. ఇలా వివిధ విభాగాల్లో సుమారు 1,300 మంది రెగ్యులర్, కాంట్రాక్టు, ఆప్కాస్, కన్సల్టెంట్లు, డైలీ వేజ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. ముఖ్యంగా హోటళ్లలో రెగ్యులర్ ఉద్యోగులు డీవీఎంలు, మేనేజర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయా హోటళ్లలో పని చేస్తున్న అన్ని రకాల ఉద్యోగులను ప్రైవేట్ ఏజెన్సీలే తీసుకోవాలంటూ జీతభత్యాలు, ఉద్యోగ భద్రతను ప్రభుత్వం గాలిలో దీపంలా మార్చింది. ప్రైవేట్ ఏజెన్సీలు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగులను కొనసాగించుకోవాలని, రెండు నెలలకు ఒకసారి వారి పనితీరును అంచనా వేయాలని, అప్పటికీ సంతృప్తికరంగా లేకుంటే ఏపీటీడీసీ, ప్రైవేటు ఏజెన్సీ కలిసి నిర్ణయం తీసుకుంటాయని పేర్కొంది. అంటే వారికి ఉద్యోగ భద్రత లేదని తెలిపోతోంది. ప్రైవేట్ ఏజెన్సీలు ఉద్యోగులను తీసుకుంటే డీవీఎంలుగా సేవలందిస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు అక్కడే పనిచేస్తారా? వారికి జీతాలు ఎక్కడి నుంచి చెల్లిస్తారు? అనే దానిపై స్పష్టత లేదు. ప్రైవేట్ ఏజెన్సీల కింద పని చేయాల్సి వస్తే డీవీఎం కార్యాలయాలు, వాటికి అనుబంధంగా ఉండే సీఆర్‌వో కార్యాలయాలు మూతపడే అవకాశం లేకపోలేదు. తద్వారా అక్కడ పని చేస్తున్న ఉద్యోగులు రోడ్డున పడే ప్రమాదం ఉంది. హోటళ్లు ప్రైవేట్‌కు వెళ్లిపోవడం వల్ల ఇన్నాళ్లూ ప్రజలకు సేవలందిస్తున్న చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నంలోని డీవీఎం కార్యాలయాలను మూసివేయాల్సిన పరిస్థితి ఉత్పన్నం కానుంది.

భారీగా రాబడి కోల్పోతున్న టూరిజం..

ఏపీటీడీసీ హోటళ్ల అభివృద్ధికి గతంలోనే ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా రూ.100 కోట్లతో హోటళ్లను ఆధునికీకరించారు. దీనికోసం విజయవాడలోని బెరంపార్కు హోటల్‌తో పాటు ఇతర హోటళ్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని చూపించి జీజీహెచ్‌కు సమీపంలోని ఓ స్టేట్‌బ్యాంక్ నుంచి రూ.150 కోట్ల రుణానికి అనుమతులు పొందారు. ఇందులో రూ.100 కోట్లతో హోటళ్ల ఆధునికీకరణ పనులు కూడా పూర్తి చేశారు. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లాభాల్లో నడుస్తున్న అభివృద్ధి చేసిన హోటళ్లను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతుండటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే టీటీడీ దర్శన టికెట్ల కోటాను రద్దు చేయడంతో ఏపీటీడీసీ ఏడాదికి రూ.72 కోట్ల నుంచి రూ.84 కోట్ల రాబడిని కోల్పోయింది. ఇప్పుడు 22 హరిత హోటళ్లను ప్రైవేట్‌కు అప్పగించడం వల్ల ఏటా మరో రూ.70 కోట్ల నుంచి రూ.80 కోట్ల మేర రెవెన్యూకి గ్యారంటీ లేకుండా పోతుంది. ఇంత అభద్రత మధ్య ఉద్యోగులు, ఏపీటీడీసీ భవిష్యత్తును పణంగా పెట్టి ప్రైవేటు వ్యక్తులతో కూటమి సర్కారు వ్యాపారం చేస్తోంది.

అక్రమ బదిలీలకు బ్రేక్!

▶ మొదటి పేజీ తరువాయి

తప్పించుకునేందుకు ప్రయత్నించారు. అలాగే, అక్టోబరులో కొందరు లెక్చరర్లను బదిలీ చేసినా వారి ఆర్డర్లను సైతం నిలిపివేశారు. ఈ క్రమంలో.. డబ్బులిచ్చిన అధికారులు, లెక్చరర్లు తమ సంగతి తేల్చాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. డిప్యుటేషన్ బదిలీ కోసం ఒక్కో లెక్చరర్ నుంచి రూ.2 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. ఇప్పుడీ అక్రమ బదిలీలు నిలిచిపోవడంతో తాము ఇచ్చిన డబ్బు వెనక్కి ఇవ్వాలని లేదా చెప్పిన ప్రకారం 'సర్వీస్' బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అయితే, ఈ బాగోతం ఇప్పటికే మీడియాకెక్కడంతో కొన్నాళ్లు ఆగాలని అధికారులు వారిని బుజ్జగిస్తున్నట్లు తెలిసింది.

సాంకేతిక విద్యాశాఖలో ఇష్టారాజ్యం..

నిజానికి.. 2014–19 మధ్య పాలిటెక్నిక్ విద్యను నాటి టీడీపీ ప్రభుత్వం అస్తవ్యస్తంగా మార్చేయడంతో విద్యార్థుల చేరికలు తగ్గిపోవడంతోపాటు ఉన్నవారికి సైతం సరైన ప్లేస్‌మెంట్లు లేవు. అయితే, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఈ విభాగానికి సమర్థులైన అధికారులను నియమించింది. పాలిటెక్నిక్ కోర్సులు చదివే విద్యార్థులకు ఉద్యోగాల కల్పనకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ విధానం అమలుచేసింది. ఈ క్రమంలో దేశంలోనే ప్రముఖ సంస్థలను ఆయా కాలేజీలకు ఆహ్వానించింది. ఫలితంగా.. విద్యార్థులకు 98% ఉద్యోగావకాశాలు దక్కాయి. అయితే, 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యారంగాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. సాంకేతిక విద్యాశాఖలో అయితే కొందరు అధికారులు ఆడింది ఆటగా... పాడింది పాటగా.. సాగుతోంది. డెప్యుటేషన్లపై వచ్చి ఇక్కడే తిష్టవేసి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా.. కాంట్రాక్టు లెక్చరర్ల బదిలీలు జోన్ పరిధిలోనే చేయాల్సి ఉండగా, ఏకంగా రీజియన్ పరిధి మార్చి వారిని 600 కి.మీ.కు పైగా దూరంలో పోస్టింగ్‌లు ఇచ్చి పంపించారు. వారు ఉద్యోగాన్ని వదులుకుంటే తమకు కావాల్సిన వారికి ఇచ్చుకునేందుకు కుట్ర చేసినట్లు విమర్శలు వచ్చాయి.

కాసులిస్తే బదిలీలు, డిప్యుటేషన్లు..

జూన్‌లో సాధారణ బదిలీలు చేపట్టి ఖాళీలను చూపలేదు. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో డబ్బులిచ్చిన వారికోసం డిప్యుటేషన్లు, బదిలీలు చేపట్టారు. దీనికి వర్క్ అడ్జస్ట్‌మెంట్ అని పేరు పెట్టారు. ఈ వాస్తవాలను 'సాక్షి' వెలుగులోకి తేవడంతో ఆక్టోబరులో చేపట్టిన డిప్యుటేషన్లు నిలిపేశారు. దీంతో డబ్బులిచ్చినవారు ఒత్తిడి చేస్తుండడంతో బదిలీ ఆర్డర్ ఇవ్వలేక, సమాధానం చెప్పలేక కీలక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలిసింది.

ఏడు రాష్ట్రాల్లో 'ఈసీబీసీ'

- రాష్ట్రంలో 786 భవనాల్లో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ అమలు
- దేశవ్యాప్తంగా 2,446 భవనాలను ఈసీబీసీలోకి మార్చాలని లక్ష్యం

సాక్షి, అమరావతి: పర్యావరణ అనుకూల భవన నిర్మాణాలను ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో నిర్మించే కొత్త వ్యాపార భవనాలలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) అమలుకు కేంద్రం ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ(బీఈఈ) ఈసీబీసీ అమలుకు మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించింది. అందులో భాగంగా బీఈఈ, ఈఈఎస్ఎల్ సలహాదారు ఎ.చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం మంత్రి నారాయణ, పట్టణ, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్‌ను విజయవాడలో కలిసి ఈసీబీసీ అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ఏడు పెద్ద రాష్ట్రాల్లో 2,446 భవనాలను ఈసీబీసీ నిర్మాణాలుగా మార్చాలని బీఈఈ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అందులో అత్యధికంగా ఏపీలో 786 భవనాలను ఈసీబీసీ భవనాలుగా మార్చేందుకు కేంద్రం సహకరించనుందని తెలిపారు. ఏపీ తర్వాతి స్థానాల్లో తెలంగాణ (738), పంజాబ్ (552), ఉత్తర ప్రదేశ్ (201), హరియాణా(100), కేరళ (57), ఉత్తరాఖండ్ (12) ఉన్నాయని ఆయన వివరించారు. పురపాలక శాఖ, బీఈఈ సహకారంతో రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ఈసీబీసీ అమలు బాధ్యతలు నిర్వర్తిస్తుందని చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు.

వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ సభ్యుల నియామకం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ (స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) సభ్యులుగా డి.నవీన్‌బాబు (చింతలపూడి), పీజీ రాంపుల్లయ్య యాదవ్ (కర్నూలు)ను నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరిద్దరిని ఎస్‌ఈసీ సభ్యులుగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ప్రకటన విడుదల చేసింది.

నేడు, రేపు న్యాయవాదులు కోటి సంతకాల సేకరణ

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 10,11 తేదీల్లో చేపట్టనున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో న్యాయవాదులందరూ పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు మలసాని మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ విభాగంలోని న్యాయవాదులతో(సభ్యులతో) ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రభుత్వాల సమస్య కాదని ఇది పేదలు, మధ్యతరగతి వర్గాలకు సంబంధించిన సమస్య అని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ నెల 12న ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాజీ మంత్రి అప్పలరాజుకు మళ్లీ పోలీసు నోటీసులు

పలాస: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు పోలీసులు మళ్లీ నోటీసులు ఇచ్చారు. కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి ఆదివారం అప్పలరాజు ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు. ఇటీవల నకిలీ మద్యంపై కాశీబుగ్గ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట అప్పలరాజు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. దీనిపై కొందరు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు. కాగా, శనివారం రాత్రి పది గంటల వరకు సీదిరిని 2024 అక్టోబర్ 27న నమోదైన కేసుకు సంబంధించి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో విచారించారు. ఆ విచారణ ఇంకా పూర్తి కాకుండా మరో కేసుపై నోటీసు ఇచ్చారు.

చిత్తూరులో పవన్ పర్యటన

- గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంటకు
- అక్కడి నుంచి రోడ్డు మార్గంలో మామండూరు అటవీ ప్రాంతానికి వెళ్లి వాచ్ టవర్ ఎక్కి అటవీ ప్రాంతం పరిశీలన, అనంతరం తిరుపతి గోదాములో ఎర్రచందనం దుంగల పరిశీలన
- అక్కడి నుంచి రోడ్డు మార్గాన రేణిగుంటకు, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు..

- హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంటకు
- అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ముసలిమడుగుకు చేరుకుని కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రం పరిశీలన
- అక్కడి నుంచి అదే హెలికాప్టర్‌లో రేణిగుంటకు..
- రేణిగుంట నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం

పవన్ కారు ఢీకొని మహిళకు గాయాలు!

ముసలిమడుగు వద్ద పవన్ కళ్యాణ్ కారు ఢీకొని ఓ మహిళకు తీవ్ర గాయమైంది. కుంకీ ఏనుగుల పరిశీలన అనంతరం తిరుగు ప్రయాణమైన పవన్‌ను కలిసేందుకు స్థానికులు ముసలిమడుగు వద్ద రోడ్డు మీదకు వచ్చారు. ఈ సందర్భంగా హేమ(32) అనే మహిళ కాలు మీదగా కారు ముందుకు వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు. ఆమెను పలమనేరు ఆస్పత్రికి తరలించారు. తాను ప్రయాణిస్తున్న కారు మహిళ కాలు పైనుంచి వెళ్లిపోయినప్పటికీ పవన్ కారు ఆపలేదని ప్రత్యక్ష సాక్షులు, సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ గుంటూరు పర్యటనలో వ్యక్తిపై నుంచి కారు వెళ్లిందంటూ నానా హడావుడి చేసి కేసులు నమోదు చేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో ఏ చర్యలు తీసుకుంటుందని నిలదీస్తున్నారు.

మహిళను కారు ఢీకొన్న ఘటన వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వైఎస్సార్‌సీపీపై పోలీసుల కక్షసాధింపు

పార్టీ సోషల్ మీడియా కార్యకర్త మధుసూదన్‌రెడ్డికి పోలీసుల నోటీసు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు అడ్డే లేకుండాపోతోంది. కర్నూలు బస్సు ప్రమాదానికి అసలు కారకులను వదిలేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వేధింపులకు పాల్పడుతోంది. ఇప్పటికే పార్టీ చీఫ్ పీఆర్‌ఓ పూడి శ్రీహరికి నోటీసులు ఇవ్వగా.. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన కర్నూలు జిల్లా పోలీసులు పార్టీ సోషల్ మీడియా విభాగంలో పనిచేసే మారుజోళ్ల మధుసూదన్‌రెడ్డికి నోటీసు ఇచ్చారు. కర్నూలు వన్ టౌన్ సీఐ హేమంత్‌కుమార్‌రెడ్డి నోటీసు అందించారు. తొలుత ఈ నోటీసును ఎవరికి ఇస్తున్నారో రాయకుండా సీఐ తీసుకొచ్చారు. దీనిపై వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. దీంతో అక్కడి నుంచే సీఐ ఉన్నతాధికారులను ఫోన్‌లో సంప్రదించారు. కొంతసేపటికి అక్కడినుంచి వెళ్లిపోయి 4 గంటల పాటు అధికారులతో చర్చించి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు పార్టీ కార్యాలయానికి తిరిగి వచ్చారు. కర్నూలు బస్సు ప్రమాదానికి నకిలీ మద్యం కారణమని ప్రచారం చేశారని, దాని వెనుక మధుసూదన్‌రెడ్డి ఉన్నారని నోటీసులో రాశారు. మూడు రోజుల్లో విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు.

12న జరిగే ర్యాలీలను విజయవంతం చేద్దాం

- వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుదాం
- కోటి సంతకాల సేకరణ.. రచ్చబండ కార్యక్రమాలకు అనూహ్య స్పందన
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు

సాక్షి, అమరావతి: 'వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 12న అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే ర్యాలీలను సూపర్ సక్సెస్ చేద్దాం. వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుదాం. ప్రజాస్పందనను బలంగా వినిపిద్దాం' అని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ, ఎస్ఈసీ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్స్, పార్టీ మండల అధ్యక్షులు, జెడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలతో ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని ఆయన చెప్పారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

ర్యాలీలు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించాలి

'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ నెల 12న ర్యాలీలు జరగనున్నాయి. కోటి సంతకాల సేకరణ కోసం క్షేత్రస్థాయిలో మీరంతా ఉన్నారు. ఇదంతా ఒక ప్రజా ఉద్యమంగా కొనసాగుతోంది. మీ అందరి భాగస్వామ్యంతో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రయాలు విజయవంతంగా నడుస్తున్నాయి. మనం తీసుకుంటున్న ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేలా 12న జరిగే ర్యాలీలు ఉండాలి. వైద్య వ్యవస్థను జగన్ ప్రజలకు చక్కటి గొడుగులా తయారు చేస్తే.. చంద్రబాబు దానిని నిర్వీర్యం చేశారు. మనం చేసే ఆందోళనలు, ర్యాలీలు జాతీయ స్థాయిలో చర్చ జరిగేలా ఉండాలి. అప్పుడే చంద్రబాబు ప్రభుత్వం దిగివస్తుంది. కలిసి వచ్చే పార్టీలందరినీ కలుపుకుపోదాం. కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్లు ఇలా అందరినీ కలుపుకుపోదాం. ఇందుకు అవసరమైన కసరత్తు పూర్తిచేయాలి. ఏ మాత్రం ఏమరుపాటు వద్దు. అందరూ ఈ కార్యక్రమాన్ని పర్సనల్ గా తీసుకుని సక్సెస్ చేయాలి. సోషల్ మీడియా, డిజిటల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకుందాం. మీ పరిధిలో ఉన్న వారందరినీ ఒక్క తాటిపైకి తీసుకొచ్చి ర్యాలీలు సక్సెస్ చేయాలి' అని సజ్జల పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

'స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా మీరంతా సిద్ధంగా ఉండాలి. దీనిపై కూడా సీరియస్‌గా దృష్టి పెట్టాలి. క్షేత్రస్థాయి నుంచి పార్టీ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీల నియామకంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఈ కమిటీలన్నీ పూర్తయితే దాదాపు 13 లక్షలతో మన సైన్యం సిద్ధమవుతుంది. ఇదంతా పారదర్శకంగా డిజిటలైజేషన్ చేయాలి. పరిశీలకుల సహకారం తీసుకుని పక్కాగా చేయండి. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అవసరమైన సహకారం ఉంటుంది. అన్ని నియోజకవర్గాల్లో డిజిటల్ మేనేజర్లను కూడా నియమించాం. కమిటీల ఏర్పాటు పకడ్బందీగా చేయాలి. ప్రతి ఇంట్లో మన పార్టీ ఉంటుంది. నిత్యం ప్రజాసమస్యలపై మనం చేస్తున్న పోరాటాలకు అనూహ్యమైన మద్దతు లభిస్తోంది. ప్రజల్లో మన పార్టీకి ఉన్న ఇమేజ్‌ను మరింతగా పెంచుకుందాం. కూటమి ప్రభుత్వ అరాచకాలను దీటుగా ఎదుర్కొందాం. రెడ్ బుక్ పాలనకు చరమ గీతం పాడుదాం' అని సజ్జల అన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవును.. అంత నష్టంలేదు

- తుపాను ప్రభావంతో కురిసిన వర్షపు నీరు వెళ్లిపోయింది
- అందుకే వరితో సహా ప్రధాన పంటలకు పెద్దగా నష్టం జరగలేదు
- 4.03 లక్షల ఎకరాల్లోనే వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది
- 'సాక్షి' కథనంపై వ్యవసాయ శాఖ

సాక్షి, అమరావతి: 'నిజమే.. మోంథా తుపానువల్ల అనుకున్నంత నష్టం జరగలేదు. తుపాను ప్రభావం అధికంగా ఉండవచ్చన్న ముందస్తు సమాచారంతో, తుపాను తీరాన్ని దాటబోయే ముందురోజు అప్పటి వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకుని, మరింత వర్షపాతం ఉంటే పంట నష్టం అధికంగా ఉండవచ్చన్న ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక పంట నష్టం అంచనాలను కాస్త ఎక్కువగా చూపించాం. అయితే, తుపాను ప్రభావం ఓ మోస్తరుగానే ఉంది. ముంపునకు గురైన పొలాల్లోనిలిచిన నీరు త్వరగానే బయటకుపోవడంతో పంటలకు అనుకున్నంత నష్టం జరగలేదు. అందుకే.. తొలుత రూ.875 కోట్లకు పైగా ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాల్సి వస్తుందని ప్రాథమికంగా అంచనా వేశాం. కానీ, తుది అంచనాల ప్రకారం ఈ మొత్తాన్ని రూ.390.03 కోట్లకు కుదించాల్సి వచ్చింది'.. అంటూ వ్యవసాయ శాఖ స్పష్టంచేసింది. 'అంత నష్టంలేదట' శీర్షికతో 'సాక్షి'లో వచ్చిన కథనంపై ఆదివారం ఈ మేరకు వివరణ ఇచ్చింది.

15.60 లక్షల ఎకరాల్లో పంటలపై ప్రభావమని చెప్పి..

నిజానికి.. మోంథా తుపాను 24 జిల్లాల్లో 403 మండలాల్లో తీవ్ర ప్రభావం చూపింది. దీని తీవ్రతను దృష్టిలో పెట్టుకుని 15,59,925 ఎకరాల్లో పంటలపై ప్రభావం ఉంటుందని అధికారులు తొలుత అంచనా వేశారు. రైతులు కూడా 24 జిల్లాల పరిధిలో 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అంచనా వేశారు. అయితే, తుపాను బాధిత రైతులను ప్రభుత్వం గాలికొదిలేయడంతో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణాజిల్లాల్లో ఈనెల 4న పర్యటించి బాధిత రైతులకు బాసటగా నిలిచారు. ఎన్యుమరేషన్ కోసం తమ పంట పొలాల వైపు ఏ ఒక్కరూ కన్నెత్తి చూడలేదని రైతులు జగన్ ఎదుట ఎకరవు పెట్టారు. సుంకు విరిగిన వరికంకులను చూపించి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అక్టోబరు 31లోగా ఎన్యుమరేషన్ పూర్తిచేయాలని ఒకరోజు గడువుతో ప్రొసీడింగ్స్ ఇవ్వడంపై జగన్ ఆ రోజే రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో.. అప్పటివరకు నిర్దేశించిన గడువులోగా 3.45 లక్షల ఎకరాల్లోనే పంట నష్టం జరిగినట్లు ప్రకటించిన ప్రభుత్వం ఆ తర్వాత గడువును వారం రోజులపాటు పొడిగించినట్లు వ్యవసాయ శాఖ తన ప్రకటనలో తెలిపింది. వాస్తవానికి.. ఎన్యుమరేషన్ గడువు పెంచినట్లు ఎక్కడా వెల్లడించలేదు. ఇక ఈనెల 8 వరకు ఎన్యుమరేషన్ కొనసాగించడంతో మరో 58 వేల ఎకరాల్లో పంట నష్టం అధికంగా జరిగినట్లు గుర్తించామని ప్రభుత్వం ప్రకటించింది. చివరికి.. 3.23 లక్షల మంది రైతులకు చెందిన 4.03 లక్షల ఎకరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు 33 శాతానికి పైగా పంట నష్టం జరిగినట్లు నిర్ధారించామని పేర్కొంది.



దేశ నైతిక పునరుజ్జీవనానికి ఉద్యమించటం
అనే మహా కార్యం అత్యున్నత ఆశయానికి నిదర్శనం.
– 'రాష్ట్రగురు' సురేంద్రనాథ్ బెనర్జీ

సాక్షి
సోమవారం, 10 నవంబర్ 2025

బాలోత్సవం

కథ పుట్టడమూ, పిల్లల కథ పుట్టడమూ వేరుగా జరిగివుండదు. పిల్లల కంటే బాగా 'ఊ'కొట్టగలిగేవారెవరు! పిల్లలను మైమరిపించడానికే పెద్దలు కథలు అల్లివుంటారు. ఆ వంకతో తమ చిన్నతనంలోకీ జారుకునివుంటారు! చిన్నతనానికీ పెద్దరికానికీ ఉన్న స్పష్టమైన తేడా: బాల్యంలో ఊహలకు సంకెళ్లుండవు. తార్కిక పరిమితి కలలను అణిచివేయదు. ఎంత సాగితే అంత, ఎంత చూస్తే అంత, ఎంత కావాలనుకుంటే అంత. అక్కడ ఆశలు అనంతం. రెక్కలు అమాంతం. కప్పలు పకపకా నవ్వొచ్చు. కుందేళ్లు చకచకా మాట్లాడొచ్చు. కాకులు నీతులు చెప్పొచ్చు. జింకలు కోతలు కోయొచ్చు.

పిల్లల కథ అనేది మబ్బుల్లోకి గెంతించే మాయా కిటికీ. సముద్రం అడుగుకు ఈదనిచ్చే గాలి పడవ. ప్రతి తరమూ తర్వాతి తరానికి అవసరమయ్యే వివేకపు రాశిని కథల రూపంలోనే బదిలీ చేస్తుంది. లోకాన్ని ఎదుర్కోవడానికి అవసరమయ్యే కాఠిన్యాన్ని అందులోనే కూరి ఉంచుతుంది. ఈసప్ కథలు, పంచతంత్రం కథలు, వెయ్యొన్నొక్క రాత్రుల అరేబియన్ కథలు, జంగిల్ బుక్, కాంచన ద్వీపం, గలివర్ సాహసయాత్రలు, 'చందమామ' కథల నుంచి; టామ్ శాయర్, నొప్పి డాక్టర్, లిటిల్ ప్రిన్స్, హాబిట్, హారీ పాటర్ దాకా పిల్లల మనో ప్రపంచపు ఎల్లలను విశాలపరిచినవే! కథల వల్ల పిల్లలకు ఊహాశక్తి పెరుగుతుంది, సమస్యా పరిష్కారం తెలుస్తుంది, భాష అబ్బుతుంది, వ్యక్తీకరణ అలవడుతుంది, లోకరీతి అర్థమవుతుంది, ప్రపంచపు భిన్నత్వం పట్ల అవగాహన కలుగుతుంది, సాటి జీవుల పట్ల సానుభూతి కలుగుతుంది, తమ సాంస్కృతిక వారసత్వపు గొప్పతనం అనుభవంలోకి వస్తుంది, అన్నింటికీ మించి అమితమైన ఆనందం దొరుకుతుంది. జీవితపు సంరంభంలోంచి వచ్చే ఆనందానికి అదనంగా, మనిషికి ఉన్న మరో ఆనందపు వనరు కథలు కాక మరేమిటి?

అసలు పిల్లల కథలు పిల్లలకు కలిగించే ప్రయోజనాలన్నీ పెద్దలకు కూడా కలిగిస్తాయి. ఏం పెద్దల్లో మాత్రం పిల్లలు బజ్జునిలేరా? అంతెందుకు, ఆరిస్టాటిల్ లాంటి తత్త్వవేత్త కూడా నిజమైన మంచి జీవితం గడపడం కోసం కాల్పనికత అవసరాన్ని సమర్థించాడు. అసలు సాధ్యం కానిది కూడా ఊహించగలగడం అవసరమని ఆయన వాదించాడు. టాల్‌స్టాయ్ లాంటి మహారచయిత కూడా పిల్లల కోసం కథలు రాశాడు. కాకపోతే ఇదీ నీతి అంటూ ప్రత్యేకంగా చెప్పకూడదనీ, కథ ద్వారా పిల్లలు తమకు కావాల్సింది తాము తీసుకుంటారనీ అన్నాడు. మీరు ఎంతపెద్దవాళ్లయినా బాలసాహిత్యాన్ని చదవాలంటుంది కాథెరీన్ రండెల్ అనే బాలసాహిత్య రచయిత్రి. పిల్లల పుస్తకాలు మనం మర్చిపోయిన విషయాలనే కాదు, మనం మర్చిపోయామని మర్చిపోయిన విషయాలను కూడా గుర్తుచేస్తాయంటుందామె.

లండన్‌లోని థేమ్స్ నదిలో పడవ షికారుకు పోయినప్పుడు తన వెంటున్న స్నేహితుడి ముగ్గురు కూతుళ్లకు ఓ కథ చెప్పాడట లూయిస్ కరోల్. అందులో అలీస్ లిడ్డెల్ అనే పదేళ్ల పాప కూడా ఉంది. ఒక రోజు నది ఒడ్డున విసుగ్గా కూర్చున్న 'అలీస్'కు కోటు తొడుక్కుని, గడియారం పెట్టుకున్న ఒక తెల్ల కుందేలు కనబడటమూ, దానివెంట ఆమె ఆ కుందేలు బొరియలోకి పోవడమూ, అక్కడ్నుంచి వింతలూ విచిత్రాలూ... వాహ్! విన్న వెంటనే దాన్ని తనకోసం రాసిపెట్టమందట అలీస్. అట్లా 'అలీస్(స్) అడ్వెంచర్స్ ఇన్ వండర్‌లాండ్' పుస్తకంగా రూపుదాల్చింది. 1865 నవంబర్‌లో తొలిసారి ప్రచురితమైన దీనికి ఈ నెలలోనే 160 ఏళ్లు వచ్చాయి. జంతువులు జంతువుల్లా ఉండకుండా, మనుషులు మనుషుల్లా కాకుండా ప్రవర్తించే సాహిత్యాన్ని 'నాన్సెన్స్ లిటరేచర్' అని వర్గీకరించడం ఉంది. దాన్ని నిరర్థకమైనదని కాకుండా, హేతువుకు అందని అర్థవంతమైన సాహిత్యం అన్న అర్థంలో చూడాలి. అందుకేనేమో, ఇకనుంచీ బాల సాహిత్యానికీ తమ అవార్డు ఇవ్వనున్నట్టు బుకర్ ఫౌండేషన్ ఇటీవలే ప్రకటించింది. 8–12 ఏళ్ల చిన్నారులను ఉద్దేశించి రాసే ఉత్తమ రచనకు 'చిల్డ్రన్స్ బుకర్ ప్రైజ్' పేరుతో యాభై వేల పౌండ్లు ఇవ్వనున్నారు. బాలసాహిత్యం అనేది తీసేయదగినేది కాదనీ, బాలసాహితీవేత్తలు తక్కువ రచయితలేమీ కారనీ చెప్పే ఘనమైన వార్త ఇది. కాదామరి... నేటి బాలలే రేపటి ప్రపంచ నిర్మాతలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తిక మాసం, **తిథి:** బ.పంచమి ఉ.7.59 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** పునర్వసు రా.1.17 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.1.50 నుండి 3.22 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.06 నుండి 12.51 వరకు, తదుపరి ప.2.21 నుండి 3.06 వరకు, **అమృత ఘడియలు:** రా.11.06 నుండి 12.38 వరకు.

సూర్యోదయం: 6.06
సూర్యాస్తమయం: 5.23
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

ఏమీ లేదా?

నేను చనిపోయి సంతోషంగా నా సృష్టికర్తను కలిసినప్పుడు, ఆయన నా గాయాలను చూపించమని నన్ను అడుగుతాడు. అప్పుడు నేను నాకు ఎలాంటి గాయాలూ లేవని చెబితే నా సృష్టికర్త నన్ను ఇలా అడుగుతాడు: 'పోరాడటానికి విలువైనది ఏమీ లేదా?'

– నాన్సీ పెలోసీ, యూఎస్ హౌస్ మాజీ స్పీకర్

మంచి పనులు

ఇతరులకు సహాయం చెయ్యండి. ఎవరినైనా సంతోషపెట్టే శక్తి మీకు ఉంటే దానిని ఉపయోగించుకోండి. లక్ష్య సాధనలో మీకు అవసరమైన ఆత్మ విశ్వాసాన్ని, ఇతరుల కోసం మీరు చేసే మంచి పనులే మీకు అందిస్తాయి. మీకొకరు ఆదర్శంగా ఉన్నట్లే, మీరూ కొందరికైనా ఆదర్శంగా ఉండాలి.

– మీకా సింగ్, ర్యాపర్

కంగారొద్దు!

గడియారం వైపు చూడకండి. తన పని తనను చేయనివ్వండి. మీ పని మీరు చెయ్యండి. విజయమే అంతిమం కాదు. వైఫల్యం ప్రాణాంతకం కాదు. కనుక ముందుచూపుతో చిన్న చిన్న అడుగులు వేయండి. కాలమే మీ అడుగు జాడల్లో నడిచి రాకుంటే అప్పుడు అడగండి.

– ర్యాన్ విలియమ్స్, 'ఇండియన్' సాకర్ ప్లేయర్

మహిళా శక్తి

అమ్మాయిలు విజయం సాధించటానికి సరైన అవకాశాలను, సాధనాలను కల్పించినప్పుడు వారు తమకే కాకుండా, తమ చుట్టూ ఉండేవాళ్లకీ అద్భుతమైన భవిష్యత్తును సృష్టించగలరు. ఆఫీస్‌లో, ఇంట్లో, ఎక్కడైనా మహిళ బాస్‌గా ఉండటంలోని ప్రయోజనమిదే.

– మేఘన్ మార్కెల్, బ్రిటన్ రాజకుటుంబ సభ్యురాలు

అడిగింది ఇవ్వాలి!

మీకెంత ప్రతిభ ఉందన్నది కాదు, మీ నుంచి ఏం కోరుకుంటున్నారో అది కచ్చితంగా ఇవ్వగలగటమే అసలైన ప్రతిభ. నా దర్శకుడికి కావలసినట్లుగా నేను నటించాలి. ఆయన ఆలోచనకు, లేదా దృష్టికి నేను సరిగానే ప్రతిస్పందిస్తున్నానా అని నేను ప్రతిసారీ ఆలోచిస్తాను.

– కార్తీక్ ఆర్యన్, నటుడు

దేవ గానం

నా అంతిమ లక్ష్యం దేవుని ఎదుట పాడటం. నేననుకుంటాను, నశించటం అనేది ఉండదని. శరీరం మాత్రమే శిథిలం అవుతుంది. ఆత్మ బతికే ఉంటుంది. ఆత్మగానైనా వెళ్లి ఆ అంతర్యామి ఎదుట నిలుచుని భక్తితో చేతులు జోడించి పాట పాడటమే నా అంతిమ లక్ష్యం.

– కె.జె. ఏసుదాస్, నేపథ్య గాయకుడు

ఏది నిజం?

పరమ పవిత్రం శ్రీవారి లడ్డూ ప్రసాదం

రాజకీయ కుట్రతోనే కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం.. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కుతంత్రం

సాక్షి, అమరావతి : రాజకీయ కుట్ర కోసం ఎంతకైనా దిగజారుతామని టీడీపీ కూటమి ప్రభుత్వం పదేపదే నిస్సిగ్గుగా ప్రకటిస్తోంది. అందుకోసం ఏకంగా శ్రీవారి దివ్య క్షేత్రమైన తిరుమల పవిత్రత, లడ్డూ ప్రసాదం ప్రాశస్త్యంపై దుష్ప్రచారం చేసేందుకు కూడా తెగిస్తామని నిరూపిస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయలేక చేతులెత్తేసిన చంద్రబాబు ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలతో లడ్డూ ప్రసాదం పవిత్రతకు కళంకం తెచ్చేందుకు తెగబడుతోంది. ఆ పక్కా కుట్రలో భాగంగానే సిట్ నివేదిక పేరుతో ఎల్లో మీడియా ద్వారా మరోసారి విషం చిమ్ముతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిపై అవాస్తవ ఆరోపణలతో అసత్య కథనాలు వండి వారుస్తోంది. రాజకీయాలకు తిరుమల శ్రీవారి ఆలయాన్ని దూరంగా ఉంచాలన్న సుప్రీంకోర్టు సూచనను కూడా ప్రభుత్వం బేఖాతరు చేస్తూ దుష్ప్రచారానికి బరితెగిస్తోంది. శతబ్దాలుగా కొనసాగుతున్న లడ్డూ ప్రసాదం ప్రాశస్త్యానికి భంగం కలిగిస్తూ తమ మనోభావాలను దెబ్బ తీస్తున్న ఎల్లో మీడియాపై ప్రపంచ వ్యాప్తంగా తిరుమల శ్రీవారి భక్తులు మండిపడుతున్నారు. అందుకే ఈ వ్యవహారంలో ఎల్లో మీడియా కుతంత్రాలను తిప్పికొడుతూ అసలు వాస్తవాలను ×సాక్షి₹ ప్రజల ముందు ఉంచుతోంది.

చిన్న అప్పన్న ఏపీ భవన్ ఉద్యోగి

తిరుమల లడ్డూ ప్రసాదం ముసుగులో రాజకీయ కుట్ర కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తోంది. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో చిరుద్యోగి అయిన చిన్న అప్పన్నను టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ అంటూ దుష్ప్రచారం చేస్తోంది. తద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లాలన్నదే కూటమి ప్రభుత్వ కుట్ర. ఏపీ భవన్‌లో చిరుద్యోగి అయిన చిన్న అప్పన్న గతంలో ప్రస్తుత టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పీఏగా పని చేశారు. ఆ వాస్తవాన్ని మాత్రం టీడీపీ కూటమి ప్రభుత్వం కప్పిపుచ్చేందుకు యత్నిస్తుండటం గమనార్హం. చిరుద్యోగి అయిన ఆయన ఏకంగా టీటీడీ జీఎం స్థాయి ఉన్నతాధికారుల్ని ప్రభావితం చేశారని కట్టుకథలు అల్లుతోంది. ఆయన వ్యక్తిగతంగా కొనుగోలు చేసిన ఆస్తుల ఉదంతాన్ని వక్రీకరిస్తోంది. వాటి ఆధారంగా చిన్న అప్పన్నను బెదిరించి, వేధించి తమకు అనుకూలంగా అబద్ధపు వాంగ్మూలం ఇప్పించాలన్నదే చంద్రబాబు ప్రభుత్వ కుతంత్రమన్నది స్పష్టమవుతోంది.

ఫిర్యాదుపై విచారణకు ఆదేశించడం కూడా తప్పేనా!?

నెయ్యి నాణ్యతపై ఫిర్యాదు రావడంతో టీటీడీ చైర్మన్ హోదాలో వైవీ సుబ్బారెడ్డి విచారణకు ఆదేశించడం తప్పన్నట్టుగా పోలీసులు వక్రీకరిస్తుండటం గమనార్హం. ఓ అనాకమ ఫిర్యాదు వస్తే బోలే బాబా డెయిరీ సరఫరా చేస్తున్న నెయ్యి నమూనాలను మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహించాలని ఆయన ఆదేశించినట్టు పోలీసులు తమ నివేదికలో పేర్కొనడం గమనార్హం. మామూలుగా ఫిర్యాదు వస్తే విచారణకు ఆదేశించకపోతే పట్టించుకోలేదని విమర్శిస్తారు.. విచారణకు ఆదేశిస్తే ఎందుకు ఆదేశించారని ఈనాడు, ఇతర టీడీపీ ఎల్లో మీడియా తిరిగి ప్రశ్నిస్తుండటం విస్మయ పరుస్తోంది. టీడీపీ రాజకీయ కుట్రలో భాగంగా కేవలం విష ప్రచారం చేయాలన్న కుట్రే తప్ప, వాస్తవాలతో తమకు నిమిత్తం లేదన్నట్టుగా వ్యవహరిస్తోంది.

చైర్మనే సర్వస్వం కాదు.. టీటీడీ బోర్డు ఉంటుంది

ఇక రాజకీయ కుతంత్రంతో కూటమి ప్రభుత్వం, ఎల్లో మీడియా టీటీడీ వ్యవస్థాగత నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదు. తిరుమల–తిరుపతి వ్యవహారాలకు టీటీడీ చైర్మనే సర్వస్వం, సర్వాధికారి కాదు. టీటీడీ బోర్డుదే అత్యున్నత అధికారం. ఆ బోర్డులో సభ్యులు చర్చించి తీసుకున్న నిర్ణయాలనే టీటీడీ అమలు చేస్తుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఖరారు నిర్ణయాన్ని కూడా అదే రీతిలో బోర్డు తీసుకుంది. ఎల్లో మీడియా ఉద్దేశ పూర్వకంగా విస్మరిస్తున్న మరో విషయం ఏమిటంటే.. నెయ్యి సరఫరా కాంట్రాక్టును ఆమోదించిన ఆనాటి టీటీడీ బోర్డులో ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కొలుసు పార్థసారథి, టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి కూడా సభ్యులుగా ఉన్నారు. టీటీడీ పర్చేజ్ కమిటీలో కూడా సభ్యులుగా నెయ్యి సరఫరా కాంట్రాక్టుపై నిర్ణయాన్ని బోర్డుకు సిఫార్సు చేసింది కూడా వారే కావడం గమనార్హం.

భోలే బాబా డెయిరీ పాల సేకరణపై భిన్న కథనాలు

పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ కూటమి ప్రభుత్వం కనికట్టు చేసేందుకు యత్నిస్తోంది. ఈ కేసుకు సంబంధించి భోలే బాబా డెయిరీ గురించి ప్రభుత్వం, ఎల్లో మీడియా పరస్పర విరుద్ధ వాదనలు వినిపిస్తుండటమే అందుకు తార్కాణం. భోలే బాబా డెయిరీ రైతుల నుంచి ఒక్క పాల చుక్క కూడా సేకరించకుండా టీటీడీ నుంచి రూ.240 కోట్ల నెయ్యి కాంట్రాక్టు పొందిందని సిట్ దర్యాప్తులో వెల్లడైనట్టు ఎల్లో మీడియా తన కథనంలో పేర్కొంది. మళ్లీ భోలే బాబా డెయిరీ ఉత్తర్‌ప్రదేశ్‌లో 60 వేల మంది పాడి రైతుల నుంచి పాలు సేకరించి, పాల ఉత్పత్తులు తయారు చేస్తోందని అదే కథనంలో పేర్కొనడం గమనార్హం. మరి ఆ డెయిరీ పాలు సేకరిస్తున్నట్టా.. సేకరించనట్టా? రెండూ ఎల్లో మీడియానే చెబుతుంటే అందులో ఏది వాస్తవం!?

డైవర్షన్ డ్రామా కోసం తిరుమల పవిత్రతపై దుష్ప్రచారం

ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయలేక చేతులెత్తేసిన చంద్రబాబు ప్రభుత్వం డైవర్షన్ డ్రామాలో భాగంగానే కల్తీ నెయ్యి అంటూ రాద్ధాంతం చేస్తోంది. అందుకోసం ఏకంగా తిరుమల ఆలయ పవిత్రతకు భంగం కలిగించేందుకు బరితెగిస్తోంది. గత ఏడాది బుడమేరుకు భారీ వరద వస్తుందని నిపుణులు ముందే హెచ్చరించినా, కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడ లేదు. దాంతో భారీ వరద విజయవాడను ముంచెత్తి అతలాకుతలం చేసింది. తమ వైఫల్యం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యిపై దుష్ప్రచారానికి తెగబడింది. కూటమి నేతలు, ఎల్లో మీడియా పక్కా పన్నాగంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బ తీసేందుకు ఏమాత్రం వెనుకాడ లేదు. కానీ టీడీపీ కూటమి నేతల కుట్రను అప్పటి టీటీడీ ఈవో శ్యామలరావు అధికారిక ప్రకటనే తిప్పికొట్టింది. ఆ వ్యవహారం ఇలా సాగింది.

2024 జులై 23

వనస్పతి కలిసింది.. ట్యాంకర్లు వెనక్కి పంపాం

నెయ్యిలో కల్తీ జరిగిందని శాంపిల్స్ పరీక్షల్లో తేలింది. వెజిటబుల్ ఫ్యాట్ అంటే వనస్పతి కలిసిందని వెల్లడైంది. దాంతో కాంట్రాక్టరును బ్లాక్ లిస్ట్ పెట్టి షోకాజ్ నోటీసు ఇచ్చాం. ఆ సంస్థ సరఫరా చేసిన ట్యాంకర్లను వెనక్కి పంపాం. ఆ నెయ్యిని లడ్డూ ప్రసాదం కోసం వినియోగించనే లేదు.

– టీటీడీ ఈవో శ్యామలరావు

2024 సెప్టెంబర్ 18

నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారు : చంద్రబాబు

టీటీడీ ఈవో అధికారిక ప్రకటనలకు విరుద్ధంగా లడ్డూ ప్రసాదం తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారని చంద్రబాబు నిరాధార ఆరోపణలు చేశారు.

సెప్టెంబర్ 22

నాలుగు ట్యాంకర్లను వెనక్కు పంపాం : టీటీడీ ఈవో

అయినా సరే చంద్రబాబు ఆరోపణలను టీటీడీ ఈవో శ్యామలరావు తిప్పికొట్టారు. నమూనాలను పరీక్షించాక అది కల్తీ నెయ్యి అని తేలడంతో ఆ డెయిరీ పంపిన నాలుగు ట్యాంకర్లను వెనక్కి పంపాం. ఆ డెయిరీ నుంచి నెయ్యి సరఫరాను నిలిపి వేశామని తెలిపారు.

సెప్టెంబరు 22

ఆ నెయ్యి వాడారు : చంద్రబాబు

అయినా సరే చంద్రబాబు తన దుష్ప్రచారాన్ని కొనసాగించారు. నాలుగు ట్యాంకర్లు అప్పటికే వచ్చేశాయి. అందులోని కల్తీ నెయ్యిని వాడారని మళ్లీ దుష్ప్రచారం చేయడం గమనార్హం. అంటే వాస్తవాలతో తనకు నిమిత్తం లేదని, రాజకీయ ప్రయోజనం కోసం తిరుమల లడ్డూ ప్రసాదం ప్రాశస్త్యాన్ని దెబ్బ తీసేందుకు వెనుకాడనని నిరూపించారు.

- ఇంతటితో ఆగకుండా, టీడీపీ కూటమి ప్రభుత్వం తన డర్టీ పాలిటిక్స్‌కు మరింత పదును పెట్టింది. 2024 సెప్టెంబర్ 18న తిరుమల లడ్డూపై ఆరోపణలు చేస్తే.. ఆ మర్నాడే అంటే సెప్టెంబర్ 19న ఎన్‌డీడీబీ నివేదికను టీడీపీ ప్రధాన కార్యాలయం విడుదల చేసింది. వాస్తవానికి ఎన్‌డీడీబీ నివేదికను గోప్యంగా ఉంచాలి. కానీ అధికారిక రహస్యాల చట్టాన్ని ఉల్లంఘిస్తూ టీడీపీ కార్యాలయం ఆ నివేదికను విడుదల చేయడం గమనార్హం.

నందిని డెయిరీని తప్పించింది చంద్రబాబు ప్రభుత్వమే

కర్ణాటక సహకార రంగంలోని నందిని డెయిరీ దశాబ్ద కాలం పాటు టీటీడీకి నెయ్యి సరఫరా చేసింది. ఆ పరంపరను 2015లో చంద్రబాబు ప్రభుత్వమే అడ్డుకుంది. టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టు కోసం నందిని డెయిరీతోపాటు పలు సంస్థలు టెండర్లు దాఖలు చేశాయి. కానీ అప్పటి టీడీపీ ప్రభుత్వం నందిని డెయిరీని కాదని మహారాష్ట్రకు చెందిన ప్రైవేటు రంగంలోని గోవింద్ డెయిరీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇచ్చింది. దీనిపై అప్పట్లోనే తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తినా, చంద్రబాబు ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. అంటే నందిని డెయిరీని తొలిసారిగా పక్కన పెట్టేసి మరో ప్రైవేటు డెయిరీకి కాంట్రాక్టు ఇచ్చింది చంద్రబాబు ప్రభుత్వమేనన్నది సుస్పష్టం. ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నెయ్యి సరఫరా కోసం టీటీడీ నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో నందిని డెయిరీ అసలు పాల్గొన లేదు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం తాము కోట్ చేసిన ధరకు కాంట్రాక్టు ఇవ్వ లేదు కాబట్టి.. టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులో పాల్గొనమని చెప్పింది. వాస్తవాలు అలా ఉంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నందిని డెయిరీకి ఎందుకు కాంట్రాక్టు ఇవ్వలేదని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నిస్తూ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించారు. అసలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టెండర్ల ప్రక్రియలో పాల్గొనని నందిని డెయిరీకి ఎలా కాంట్రాక్టు ఇస్తారు? ఇస్తే అసలు టెండరు వేయని డెయిరీకి ఎలా కాంట్రాక్టు ఇచ్చారని అప్పటి ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ ప్రశ్నించేది కాదా? టెండరులో పాల్గొన్న ఇతర డెయిరీలు కూడా అభ్యంతరం తెలుపుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించేవి కదా!

టీడీపీ వీరవిధేయ సిట్‌తో కుతంత్రం

నెయ్యి వివాదాన్ని టీడీపీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలని కూటమి ప్రభుత్వం యత్నించింది. అందుకే ఈ ఆరోపణలపై దర్యాప్తు కోసం టీడీపీ వీర విధేయ పోలీసు అధికారులతో గత ఏడాది హడావిడిగా సిట్‌ను ఏర్పాటు చేసింది. 2024 ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా పని చేసిన గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించింది. అప్పటి విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజులను సభ్యులుగా నియమించారు. గోపీనాథ్ జెట్టి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య అల్లుడు. రిటైరైన తర్వాత కొన్నేళ్లు హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్‌గా వ్యవహరించిన కృష్ణయ్యను 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో కీలకమైన ఏపీఐఐసీ చైర్మన్‌గా నియమించారు. 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయనకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పదవి కట్టబెట్టడం గమనార్హం. సిట్‌ను ఏర్పాటు చేసిన తర్వాత.. నెయ్యిలో కల్తీపై టీటీడీ ద్వారా తిరుపతిలోని ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించడం గమనార్హం. ఆ ఫిర్యాదు చేసే ముందు రోజు రాత్రే తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐని బదిలీ చేసి, ఆ స్థానంలో టీడీపీకి అనుకూల పోలీసు అధికారిని నియమించడం ప్రభుత్వ కుట్రను బట్టబయలు చేసింది.

సుప్రీం కొరడా.. సిట్ క్లోజ్

ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు కీలకమైన వ్యాఖ్యలు చేసింది. సీఎం హోదాలో ఉండి లడ్డూ ప్రసాదంపై నిరాధార ఆరోపణలు చేయడం ఏమిటని చంద్రబాబును ప్రశ్నించింది. కనీసం దేవుడిని అయినా రాజకీయాలకు దూరంగా ఉంచండని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. లడ్డూ ప్రసాదం అంశంపై సిట్ దర్యాప్తు సరిపోతుందా.. స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలా.. అన్నది ఆలోచిస్తామని తన ఉద్దేశాన్ని స్పష్టం చేసింది. దాంతో బెంబేలెత్తిన చంద్రబాబు ప్రభుత్వం తిరుపతిలో దర్యాప్తు నిర్వహిస్తున్న సిట్ కార్యకలాపాలను తక్షణం నిలిపి వేసింది. అనంతరం సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర బృందం దర్యాప్తు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశం చంద్రబాబు ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిదని పరిశీలకులు స్పష్టం చేశారు.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు కోరిన వైవీ సుబ్బారెడ్డి

తిరుమల లడ్డూ ప్రసాదంపై టీడీపీ కూటమి ప్రభుత్వ దుష్ప్రచారంపై వైవీ సుబ్బారెడ్డి సత్వరం స్పందించారు. టీడీపీ వీర విధేయ పోలీసు అధికారులతో సిట్ ఏర్పాటు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థించారు. బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. నిష్పక్షపాత దర్యాప్తు కోరినందునే వైవీ సుబ్బారెడ్డిపై కూటమి ప్రభుత్వం కుట్రలకు తెగబడుతోంది. అందుకే ఆయనకు వ్యతిరేకంగా ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తోంది.

టీటీడీలో నెయ్యి కొనుగోలుకు పటిష్ట వ్యవస్థ

- రాజకీయ ప్రయోజనాల కోసం లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేయాలన్నదే చంద్రబాబు ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారింది. కానీ నెయ్యి, ఇతర సరుకులు కొనుగోలు చేసేందుకు టీటీడీలో దశాబ్దాలుగా పటిష్ట వ్యవస్థ ఉందనే వాస్తవాన్ని ఉద్దేశ పూర్వకంగా విస్మరిస్తోంది. నాణ్యమైన నెయ్యి కొనుగోలు చేసేందుకు టీటీడీ పటిష్ట విధానం అనుసరిస్తోంది.
- లడ్డూ ప్రసాదం, ఇతర అవసరాల కోసం టీటీడీ ప్రతి ఆరు నెలలకోసారి టెండర్లు పిలుస్తుంది. టెండర్లు కోట్ చేసిన వాటిలో ఎల్1గా వచ్చిన డెయిరీని టీటీడీ బోర్డు ఆమోదిస్తుంది. దశాబ్దాలుగా అమలులో ఉన్న ఈ నియమ నిబంధనలను ఎవరూ మార్చేందుకు ఏమాత్రం అవకాశమే లేదు.
- లడ్డూ తయారీకి నెయ్యి ఎవరు సరఫరా చేసినా.. వారు పంపించిన నెయ్యి ట్యాంకర్‌తో పాటు, నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబరేటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తించిన ల్యాబ్ నుంచి క్వాలిటీ సర్టిఫికెట్‌ను కూడా సమర్పించాలి.
- అలా ట్యాంకర్ నుంచి తిరుపతిలోనే మూడు శాంపిల్స్ తీసి మూడు టెస్టులు చేస్తారు. అవన్నీ పాస్ అయితేనే ఆ నెయ్యిని టీటీడీ లడ్డూ ప్రసాదం, ఇతర అవసరాల కోసం వినియోగించేందుకు అనుమతిస్తారు. శాంపిల్స్ పరీక్షల్లో నాణ్యత లేదని తేలితే వెంటనే ఆ ట్యాంకర్లను తిరుపతిలోని అలిపిరి నుంచే వెనక్కు పంపుతారు. తిరుమల కొండ కూడా ఎక్కనివ్వరు.
- తగిన నాణ్యతతో లేని నెయ్యిని చాలాసార్లు వెనక్కి పంపారు. 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో 15 సార్లు, 2019–24లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలో 18 సార్లు నెయ్యి ట్యాంకర్లను వెనక్కు పంపారని టీటీడీ రికార్డులే వెల్లడిస్తున్న వాస్తవం.

ప్రస్తుత నెయ్యి వివాదం టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలోనిదే

ప్రస్తుతం కల్తీ అంటూ చేస్తున్న రాద్ధాంతానికి కేంద్ర బిందువుగా ఉన్న నెయ్యి శాంపిల్స్ ఎప్పుడు తీసుకున్నవో తెలుసా..? 2024 జూన్ 12న తీసిన శాంపిల్స్ అవి. 2024 జూన్ 4నే ఎన్నికల ఫలితాలు వచ్చాయి. టీడీపీ కూటమి గెలిచిందన్నది తేలి పోయింది. జూన్ 12నే చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. మూడు టెస్టుల నివేదికల్లో నెయ్యి తగిన నాణ్యతతో లేదని తేలడంతో ఆ శాంపిల్స్‌ను జులై 17న ఎన్డీడీబీ బోర్డుకు పంపారు. ఎన్డీడీబీ బోర్డు 2024 జులై 23న నివేదిక ఇచ్చింది. అంటే మొత్తం వ్యవహారం అంతా టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలోనే సాగిందన్నది సుస్పష్టం.

జంతువుల కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ చెప్పనే లేదు

నెయ్యి కల్తీ జరిగిందని మాత్రమే ఎన్‌డీడీబీ నివేదిక వెల్లడించగలదు. కానీ, ఆ కల్తీ జంతువుల కొవ్వు కలపడంతో జరిగిందని నిరూపించే అవకాశమే లేదని ఆహార శాస్త్రవేత్త నేహా దీపక్ షా స్పష్టం చేశారు. సోయాబీన్, పొద్దు తిరుగుడు పువ్వు, రేపీడ్స్, గోధుమ జెర్మ్, మొక్కజొన్న జెర్మ్, పత్తి విత్తనాలు, కొబ్బరి, పామ్ ఆయిల్ ద్వారా కూడా కల్తీ చేసే అవకాశాలున్నాయి. సాధారణంగా నెయ్యిలో కల్తీ చేయాలంటే వ్యాపారులు పామాయిల్, హైడ్రోజనేటెడ్ కూరగాయల కొవ్వును కలుపుతూ ఉంటారని ఆహార శాస్త్రవేత్తలు చెప్పారు. ఎందుకంటే అవి అయితేనే తక్కువ వ్యయంతో కల్తీ చేయవచ్చన్నారు. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో ఎటువంటి కల్తీ చేశారన్నది ఎన్‌డీడీబీ నివేదికలో స్పష్టం చేయనే లేదు. కానీ చంద్రబాబు, ఆయన ముఠా సభ్యులు మాత్రం టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో జంతవుల కొవ్వు కలిపారని రాద్ధాంతం చేయడం కేవలం రాజకీయ కుట్రేనన్నది సుస్పష్టం.

క్లుప్తంగా...

ముగిసిన పెద్ద దర్గా ఉరుసు మహోత్సవాలు

ప్రార్థనలు చేస్తున్న నటులు సుమన్, అలీ

కడప సెవెన్‌రోడ్స్: ప్రముఖ సూఫీ పుణ్యక్షేత్రమైన పెద్ద దర్గా ఉరుసు మహోత్సవాలు ముగిశాయి. చివరిరోజు ఆదివారం రాత్రి దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీపుల్లా హుసేనీ సాహెబ్ నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు కడపలోని అన్ని కూడళ్లలో భక్తులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. దర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రముఖ సినీ నటుడు సుమన్, హాస్యనటుడు ఆలీ ఆదివారం కడపకు వచ్చారు. దర్గాను దర్శించుకుని గురువుల మజార్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారికి దర్గా ముజావర్ అమీర్ గురువుల చరిత్ర, విశిష్టతలను తెలియజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నరసరావుపేటలో భారీ చోరీ

100 సవర్ల బంగారం, కేజీ వెండి, రూ.45వేలు నగదు అపహరణ

చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ ఫిరోజ్

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో భారీ చోరీ జరిగింది. ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని 100 సవర్ల బంగారం, కిలో వెండి, రూ.45వేల నగదు దోచుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... గాడిపర్తి సుబ్బారావు, భారతీదేవి దంపతులు ప్రకాష్‌నగర్‌లో నివసిస్తున్నారు. నాదెండ్ల మండలం గణపవరంలోని కుమార్తె వద్దకు ఈనెల 4న వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులకొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి ఉంది. బీరువాలోని బంగారం, వెండి వస్తువులు, నగదు కనిపించలేదు. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఫిరోజ్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ నమూనాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి

గండేపల్లి: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు..పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన గెడ్డం సందీప్ (17), కరిపెట్టి సింహాద్రి అప్పన్న (57) ఆదివారం గండేపల్లి, రామయ్యపాలెం మీదుగా వరి కోత యంత్రాన్ని వ్యాన్‌పై తీసుకువెళుతున్నారు. రామయ్యపాలెం శివారులో 11 కేవీ విద్యుత్ తీగలు వరి కోత యంత్రం పైపునకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై సందీప్, అప్పన్న అక్కడికక్కడే మృతి చెందారు. అప్పన్నకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గోదావరి రెడ్డి జన సాంస్కృతిక కార్తీక వనసమారాధన

హాజరైన వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం అధ్యక్షులు వైఈపీ రెడ్డి

హైదరాబాద్ (మలక్‌పేట): మూసారంబాగ్‌లోని మేడపాటి సత్యనారాయణరెడ్డి గోదావరి రెడ్డి జన సాంస్కృతిక సంఘంలో ఆదివారం కార్తీక సమారాధనోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం 5 గంటలకు ఉసిరి, తులసి చెట్టు వద్ద కార్తీక దామోదర పూజలు, ప్రార్థన, దీపారాధన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం అధ్యక్షులు వైఈపీ రెడ్డి హాజరై సంఘ నూతన భవన నిర్మాణ బ్రోచర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో ఐక్యమత్యంగా ముందుకు సాగాలన్నారు. సంఘ సలహాదారులు మేడపాటి సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, ప్రపంచ మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి, డాక్టర్లు ఉదయ్ శేఖర్‌రెడ్డి, ద్వారంపూడి ప్రణీత, హర్షవర్ధన్‌రెడ్డి, అంజనీ ద్వారంపూడి, ఇతరులను సన్మానించారు.

నేత్రాలయ, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లకు జీఆర్టీ జ్యువెల్లర్స్ మద్దతు

చెన్నై: సమాజ శ్రేయస్సుకోసం తనవంతు ప్రయత్నం చేయాలనే నిబద్ధతలో భాగంగా జీఆర్టీ జ్యువెల్లర్స్ రెండు ప్రతిష్టాత్మక ఆరోగ్య సంస్థలకు మద్దతుగా నిలిచింది. చెన్నైలోని నుంగంబాక్కంలో ఉన్న శంకర నేత్రాలయ మెడికల్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు వైద్య పరికరాల నిమిత్తం రూ.25 లక్షలు, అడయార్‌లోని క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.25 లక్షలు అందించినట్టు జీఆర్టీ జ్యువెల్లర్స్ యాజమాన్యం తెలిపింది. ఈ నిధులు నిరుపేద క్యాన్సర్ రోగుల చికిత్స, పరిశోధన, నివారణ, అవగాహన, విద్యా కార్యక్రమాల కోసం వినియోగిస్తారని పేర్కొంది.

మీ కళ్లు చెబుతాయిక... మీ జబ్బులేమిటో!



నయనాలు చూసి గుండె ఆరోగ్యం చెప్పేయొచ్చు

- వృద్ధాప్యాన్ని, వయసు వేగాన్ని లెక్కకట్టొచ్చు
- రోగ నిర్ధారణలో కీలకం కానున్న సమాచారం

ముఖం చూసి ఆ మనిషి మూడ్ ఏంటో చెప్పేస్తాం. అలాగే కళ్లు కూడా మన గురించి ఎన్నో విషయాలు చెబుతాయి. కళ్లు నవ రసాలను పలికించటమే కాదు.. మన దేహంలో సూక్ష్మ స్థాయిలో దాగున్న జబ్బుల జాడల్ని కూడా సూక్ష్మంగా అందించగలవట. మన కళ్లలోకి చూసి మన గుండె ఆరోగ్యాన్ని చెప్పేయొచ్చు. అలాగే మన వయసు ఎంత వేగంగా అయిపోతోంది లేదా వృద్ధాప్యంలోకి ఎంత వేగంగా వెళ్లిపోతున్నాం అనేది కూడా కచ్చితంగా చెప్పవచ్చని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. కంటిలోని చిన్న రక్తనాళాలను లోతుగా పరిశీలిస్తే.. ఆ వ్యక్తికి హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదం ఎంత మేరకు ఉందో తెలిసిపోతుంది. అంతేకాదు.. ఒకరి హృదయ నాళాల ఆరోగ్యం, జీవసంబంధమైన వృద్ధాప్య స్థితిని కూడా కళ్లు చెప్పేస్తాయని ఓ తాజా పరిశోధనలో వెల్లడైంది.

ఎంతమందిపై చేశారు?

కెనడాలోని మెక్‌మాస్టర్ విశ్వవిద్యాలయం, పాపులేషన్ హెల్త్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు 74 వేల మందిపై సంయుక్త పరిశోధనలు చేశారు. వీరి రెటీనా స్కాన్లు, జన్యు డేటా, రక్త నమూనా విశ్లేషణలను నాలుగు వేర్వేరు సంస్థల నుంచి సేకరించి పరిశోధించారు. కళ్ల ద్వారా తెలుసుకోగలిగే ఆరోగ్య స్థితిగతులపై అత్యంత ఆసక్తికర విషయాలు తెలిశాయి. సైన్సెస్ అడ్వాన్సెస్ జర్నల్‌లో ఇటీవల ఈ పరిశోధన ఫలితాలు ప్రచురితమయ్యాయి.

ఎలా చేశారు?

'కంటిలో ముఖ్యమైన భాగం రెటీనా. రెటీనా స్కాన్ నివేదికల సమాచారంతో జన్యుశాస్త్రం, రక్తపు బయోమార్కర్లను అనుసంధానం చేయటం ద్వారా వృద్ధాప్యం హృదృయనాళ వ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తోందో కనుక్కోవటంలో విజయం సాధించాం. రెటీనా రక్తనాళాల్లో మార్పులు తరచుగా శరీరంలోని చిన్న నాళాల్లో జరిగే మార్పులకు అద్దం పడతాయి' అన్నారు ఈ అధ్యయన రచయిత ప్రొఫెసర్ మేరీ పిగేయ్రే.

ఏంటి ప్రాధాన్యత?

గుండెకు రక్తాన్ని అందించే నాళాలకు ఎన్ని తక్కువ ఉప నాళాలు ఉంటే గుండె జబ్బుల ముప్పు అంత ఎక్కువగా ఉందని గుర్తించారు. శరీరంలో అధిక వాపు, తక్కువ ఆయుర్దాయం వంటి జీవసంబంధమైన వృద్ధాప్య సంకేతాలను కూడా రెటీనా స్కాన్లు చూపగలుగుతున్నాయని కనుగొన్నారు. రోగ నిర్ధారణ, చికిత్సల్లో దీని ప్రాధాన్యం ఏమిటంటే.. శరీరం లోపలికి ఏ పరికరాన్నీ చొప్పించకుండానే వ్యాధులను ముందుగానే సూక్ష్మంగా గుర్తించడానికి, చికిత్స చెయ్యటానికి రెటీనా స్కాన్ల సమాచారం కీలకం కాబోతోంది.

ఏంటా ప్రోటీన్లు?

ఈ అధ్యయనంలో మరో ముఖ్యమైన అంశం రక్తపు బయోమార్కర్లు, జన్యు డేటాను సమీక్షించటం. దీని ద్వారా, పరిశోధకులు కంటి రక్త నాళాల్లో మార్పుల వెనుక గల జీవసంబంధమైన కారణాలు కనుగొనగలిగారు. రక్తనాళాలలో వచ్చే మార్పులకు కారణమవుతున్న రెండు ముఖ్యమైన ప్రోటీన్లను ఈ పరిశోధనలో కనిపెట్టారు. వృద్ధాప్యం వేగాన్ని నెమ్మదింపజేయటానికి, గుండె జబ్బుల భారాన్ని తగ్గించడానికి.. భవిష్యత్తులో ఔషధాల తయారీకి, చివరికి జీవితకాలం మెరుగుపరచడానికి.. ఈ ప్రొటీన్లు ఉపయోగపడతాయని ప్రొఫెసర్ మేరీ పిగేయ్రే వివరించారు.

\- సాక్షి, స్పెషల్ డెస్క్

పీఎస్ హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

- ప్రత్యేక జాబ్‌చార్ట్ ప్రకటించాలి
- తమ సబ్జెక్టుల్లో మాత్రమే విద్యాబోధనకు అవకాశం ఇవ్వాలి
- ఎంపీఎస్‌లలో ఖాళీలు భర్తీ చేయాలి
- గ్రేడ్–3 హెచ్‌ఎంలుగా గుర్తించాలి
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఏపీ పీఎస్‌హెచ్‌ఎంల ఫోరం
- 27 డిమాండ్ల కరపత్రం విడుదల
- 12 నుంచి 18 వరకు వినతి పత్రాల సమర్పణ

సమస్యల కరపత్రాన్ని విడుదల చేస్తున్న పీఎస్ హెచ్‌ఎంల ఫోరం ప్రతినిధులు

సాక్షి, అమరావతి: తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీ పీఎస్‌హెచ్‌ఎంలు గళమెత్తారు. పీఎస్ హెచ్‌ఎంలకు ప్రత్యేక జాబ్ చార్ట్ ప్రకటించాలని, వారివారి సబ్జెక్టుల్లో మాత్రమే విద్యా బోధనకు వీలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలో ఏపీపీఎస్‌హెచ్‌ఎం ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించి తమ సమస్యలను ప్రభుత్వం ముందుంచారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. కొత్తగా రూపొందించిన ఈ పోస్టులకు ఎలాంటి జాబ్‌చార్ట్ లేదని, తమ పరిధి ఏంటో తమకే తెలియడం లేదని వాపోయారు. హైస్కూళ్లలో నడుస్తున్న ప్రాథమిక తరగతులకు ప్రత్యేక డైస్ కోడ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీఎస్‌లలో ఉన్న ఖాళీలు అన్నింటినీ భర్తీ చేయాలని, తమను గ్రేడ్–3 హెచ్‌ఎంలుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ టీచర్ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. అసెస్‌మెంట్ పుస్తకాలపై ప్రభుత్వం, విద్యాశాఖ పునఃసమీక్ష చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీఎస్ హెచ్‌ఎంల సమస్యలను విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. సమావేశంలో భాగంగా పీఎస్ హెచ్‌ఎంల ఫోరం 27 సమస్యలతో కూడిన డిమాండ్ల కరపత్రాన్ని విడుదల చేశారు. సమస్యలపై ఈనెల 12 నుంచి 18 వరకు రాష్ట్ర స్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించాలని ఫోరం నిర్ణయించినట్టు అధ్యక్షుడు తెలిపారు. పరిష్కారం కాకపోతే ఉద్యమానికి సంసిద్ధంగా ఉండాలని తీర్మానించినట్టు వివరించారు. కార్యక్రమంలో 13 ఉమ్మడి జిల్లాల ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో హైకోర్టు జడ్జి

స్వామివారి చిత్రపటాన్ని అందుకుంటున్న న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి

మోపిదేవి(అవనిగడ్డ): కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆమె పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

వినాయకుని సన్నిధిలో ఉప లోకాయుక్త

ఉప లోకాయుక్త జస్టిస్ రజనీకి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారిని పలువురు ఆదివారం దర్శించుకున్నారు. ఇందులో రాష్ట్ర ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే పది మంది రష్యన్ దేశస్తులు కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గం ఎన్నిక

సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కొమ్మాది (భీమిలి): విశాఖలోని భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ రాడిసన్‌బ్లూలో జరుగుతున్న కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ 20వ త్రైమాసిక సదస్సు ఆదివారం రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా పలు విస్తృత చర్చలు, తీర్మానాలు చేపట్టారు. 2022లో జరిగిన 19వ సదస్సు నుంచి ఇప్పటివరకు జరిగిన జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక అంశాలను ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ వివరించారు. సోమవారం జాతీయ కార్యవర్గం ఎన్నిక జరగనున్నట్లు తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులు ఈ విస్తృత సమావేశంలో పాల్గొనగా బ్యాంక్ అధికారులు పలు సమస్యలపై చర్చించి 100 తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ తీర్మానాలను బ్యాంకు యాజమాన్యంతో చర్చించి సఫలీకృతం చేయడానికి కృషి చేస్తామని చెప్పారు.

నమ్మించి ముంచేస్తారా?

- ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిందేంటి? ఇప్పుడు చేస్తోందేంటి?
- బకాయిపడ్డ నాలుగు డీఏల్లో ఒక్కటిచ్చి పండగ చేసుకోమంటారా?
- ఐఆర్ ఇవ్వాల్సి వస్తుందనే కుట్రతో పీఆర్సీ ఇప్పట్లో వేయలేనంటారా?
- సీఎం చంద్రబాబుకు మాజీమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రశ్న



సాక్షి, అమరావతి: 'ఉద్యోగులను నమ్మించి నట్టేట ముంచేస్తారా?.. ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు మీరు చెప్పిందేంటి? ఇప్పుడు చేస్తోందేంటి?'.. అంటూ సీఎం చంద్రబాబు ను మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నేత బుగ్గన రాజేంద్రనాథ్ సూటిగా ప్రశ్నించారు. బకాయిపడ్డ నాలుగు డీఏల్లో ఒక డీఏను ప్రకటించి.. బకాయిలు (అరియర్స్) రిటైరైన తర్వాత ఇస్తామని, పెన్షనర్లకు డీఆర్ బకాయిలను రెండేళ్ల తర్వాత 2027–28లో 12 విడతల్లో చెల్లిస్తామంటూ జీఓ ఇచ్చి చరిత్ర సృష్టించిన ఘనత మీదేనంటూ ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ఇస్తామని.. మెరుగైన పీఆర్సీ ఇస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చి.. వైఎస్ జగన్ సర్కారు నియమించిన పీఆర్సీని రద్దుచేసి, ఇప్పుడు ఐఆర్ ఇవ్వాల్సి వస్తుందనే కుట్రతో పీఆర్సీని నియమించలేనంటారా? అంటూ ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. తక్షణమే ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని.. ఐఆర్ ఇవ్వాలని.. పీఆర్సీని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బుగ్గన మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి సుపరిపాలన చేయకుండా నిత్యం అబద్ధాలు చెబుతూ ప్రజలను దగా చేయడం మీకే చెల్లిందంటూ సీఎం చంద్రబాబును కడిగిపారేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

ఉద్యోగులను దగా చేస్తున్నారు..

ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమల్లో డకౌటైతే.. ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమల్లో రనౌట్ అయ్యారు. 2019, మే 30న సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణస్వీకారం చేస్తే.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2019, జూన్ 8న ఉద్యోగులకు 27 శాతం ఐఆర్ ప్రకటించి, జూలై 1 నుంచి పెంచిన వేతనం ఇచ్చారు. అలాగే, ఉద్యోగులకు హామీ ఇచ్చిన మేరకు 12వ పీఆర్సీని వైఎస్ జగన్ నియమించారు. కానీ, అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు.. వైఎస్ జగన్ నియమించిన పీఆర్సీని రద్దుచేసి.. ఐఆర్ ఇవ్వాల్సి వస్తుందనే కుట్రతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని పచ్చి అబద్ధాలు చెబుతూ ఇప్పట్లో పీఆర్సీని నియమించలేనంటూ ఉద్యోగులను దగా చేస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలిస్తానని నమ్మబలికిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రెండునెలలు మాత్రమే అలా ఇచ్చారు.

కూటమి పాలనలో అన్నీ పెండింగే..

ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి జీపీఎఫ్ వంద శాతం రూ.1,350 కోట్లు, ఏపీజీఎల్ఐసీ రూ.312 కోట్లు, మెడికల్ రీయింబర్స్ బిల్లులు రూ.115 కోట్లు చెల్లించాం. 2023, జూలై వరకూ 11 డీఏలు ఇచ్చాం. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక సరెండర్ లీవులు మూడు పెండింగ్.. 2024 నుంచి రిటైరైన వారికి గ్రాట్యుటీ, మెడికల్ బిల్లులు పెండింగ్.. పోలీసులకు ఏఎస్ఎల్ నాలుగు పెండింగ్.. 2025, జనవరి నుంచి టీఏ బిల్లులు పెండింగ్ పెట్టారు. పోలీసులకు నాలుగు సరెండర్ లీవుల బకాయిలు ఉంటే.. అందులో ఒక సరెండర్ లీవు బకాయి రూ.210 కోట్లు రెండు విడతల్లో చెల్లిస్తామంటూ మెలికపెట్టారు. టీఏలు చెల్లించకుండా వారిని వేధిస్తున్నారు. సరెండర్ లీవు డబ్బులు ఇవ్వకున్నా జనవరి, జూలై, నవంబరు వేతనాల్లో ఇచ్చినట్లు పే స్లిప్‌లు ఇస్తూ ఆదాయ పన్ను కట్ చేస్తున్నారు.

ఓపీఎస్.. సీపీఎస్.. జీపీఎస్.. నోపీఎస్..

ఎన్నికల్లో సీపీఎస్, జీపీఎస్‌ను సమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషిచేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు నిపుణులతో చర్చించి ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ అందించేలా జీపీఎస్ తెచ్చారు. ఇదే విధానాన్ని ఇప్పుడు కేంద్రం అమలుచేస్తోంది. కానీ.. చంద్రబాబు జీపీఎస్‌ను పక్కన పెట్టారు. ఓపీఎస్‌ను కూడా అమలుచేయకుండా నోపీఎస్ అంటున్నారు. అలాగే, వలంటీర్లను రోడ్డున పడేశారు. కాంట్రాక్టు ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోంది. 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని.. అప్పటివరకు నెలకు రూ.3 వేలను నిరుద్యోగ భృతిగా ఇస్తామని హామీ ఇచ్చారు.. ఒక్కరికైనా భృతి ఇచ్చారా? ఇక ఉద్యోగులపై దాడులు చేస్తూ వారిని అవమానిస్తున్నారు' అని బుగ్గన అన్నారు.

ప్రైవేటీకరణే చంద్రబాబు విధానం..

ఆది నుంచి ప్రైవేటీకరణే చంద్రబాబు విధానం. వైఎస్ జగన్ సర్కారు 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటుచేస్తే.. ఇప్పుడు వాటిని చంద్రబాబు ప్రైవేటుపరం చేస్తున్నారు. ఇక చంద్రబాబు నోరుతెరిస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదంటున్నారు. 2019లో బాబు సర్కారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అప్పగించిన దానికంటే మెరుగైన ఆర్థిక పరిస్థితిలో మేం 2024లో టీడీపీ కూటమి సర్కారుకు అప్పగించాం. సంపద సృష్టిస్తానని ప్రగల్భాలు పలికిన బాబు.. 2025–26 తొలి ఆర్నెల్లల్లోనే దేశంలో అప్పుల్లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపారు. 2019–24 మధ్య ఆయన రాష్ట్ర అప్పులపై పచ్చి అబద్ధాలు చెప్పారు. నిజానికి.. 2019–24 మధ్య రూ.3,32,670 కోట్లు అప్పుచేస్తే.. టీడీపీ కూటమి సర్కారు ఈ 17 నెలల్లోనే రూ.2,49,350 కోట్లు అప్పుచేసింది. అప్పట్లో ఏపీ శ్రీలంక అయిపోతోందంటూ విషప్రచారం చేసిన ఎల్లో మీడియాకు ఇప్పుడు రాష్ట్రం అమెరికా అయినట్లుగా కన్పిస్తోందా!?

జైలు నుంచే జడ్జికి బెదిరింపు

లక్నో: సుమారు రూ.3,700 కోట్ల సైబర్ నేరానికి పాల్పడిన ఆరోపణలపై జైలులో ఉన్న ఓ వ్యక్తి..పోలీస్ కానిస్టేబుల్ ఫోన్ నుంచి అలహాబాద్ హైకోర్టు జడ్జికి బెదిరింపు మెయిల్ పంపించడం సంచలనం రేపింది. అనుభవ్ మిట్టల్ అనే వ్యక్తి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో దాదాపు 7 లక్షల మందిని మోసం చేశాడు. ప్రస్తుతం లక్నో జైలులో ఉన్న ఇతడిపై ఈ మేరకు కేసు నమోదైంది. ఇతడు అజయ్ అనే పోలీస్ కానిస్టేబుల్ సెల్ ఫోన్ ద్వారా అలహాబాద్ హైకోర్టు జడ్జికి బెదిరింపు మెయిల్ పంపాడు. మరో ఖైదీని ఇరికించేందుకు మారుపేరుతో ఇతడు.. 'లక్నో బెంచ్‌లోని ఓ జడ్జిని చంపేస్తాం'అంటూ మెసేజీ పంపాడు. దీనిపై శుక్రవారం కేసు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కానిస్టేబుల్ అజయ్‌ని ప్రశ్నించారు. ఈ నెల 4వ తేదీన కోర్టు విచారణకు వచ్చిన మిట్టల్ వెంట కానిస్టేబుల్ అజయ్ ఉన్నాడు. తన కేస్ స్టేటస్ చూస్తానంటూ ఫోన్‌ను తీసుకున్న మిట్టల్ కొత్త మెయిల్ ఐడీ సృష్టించి బెదిరిస్తూ మెయిల్ పంపించాడు. హత్య కేసులో అదే జైలులో 2023 నుంచి ఉంటున్న తన విరోధి ఆనందేశ్వర్ అగ్రహారిని ఈ కేసులో ఇరికించేందుకు మిట్టల్ కుట్ర పన్నినట్లు తెలిందని అధికారులు తెలిపారు.

రాజ్యాంగ సవరణపై పాక్‌లో ఆందోళనలు

ఇస్లామాబాద్: ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు విశేషాధికారాలు కట్టబెట్టడంతోపాటు సమూల మార్పులకు ఉద్దేశించిన 27వ రాజ్యాంగ సవరణకు షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేయగా, ప్రతిపక్ష పార్టీలు ఆదివారం దేశవ్యాప్త ఆందోళనలకు దిగాయి. రాజ్యాంగ పునాదులనే కదిలించే సవరణలను ఆపివేయాలని డిమాండ్ చేశాయి. 27వ రాజ్యాంగ సవరణతో మిలటరీ అధికారం మరింత బలపడనుంది. ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌కు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల చీఫ్‌గా రాజ్యాంగ గుర్తింపు లభించనుంది. ఫీల్డ్ మార్షల్‌గా ఆయన జీవిత కాలం కొనసాగుతారు. దీనివల్ల జీవించి ఉన్నంతకాలం ఆయనపై కేసులు పెట్టకూడదు. సుప్రీంకోర్టు అధికారాలకు సైతం కోత పడనుంది. ఈ బిల్లుపై సోమవారం సెనేట్‌లో ఓటింగ్ జరగనుంది. అవసరమైన మూడింట రెండొంతుల మంది సభ్యుల ఆమోదం లభిస్తుందని ప్రభుత్వం ధీమాతో ఉంది. దీనిపై ఇమ్రాన్ సారథ్యంలోని పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ సహా ఐదు పార్టీల కూటమి నిరసనలను కొనసాగించాలని నిర్ణయించింది.

వాయుకాలుష్యంతో బతకలేకపోతున్నామంటూ ఆదివారం ఢిల్లీలో నిరసన చేపట్టిన స్థానికులు

బిహార్ ప్రచారానికి తెర

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల సమరం తుది దశకు చేరుకుంది. ప్రచార పర్వం ఆదివారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఇన్నాళ్లూ రాజకీయ పార్టీల నినాదాలు, ప్రసంగాలతో హోరెత్తిపోయిన గ్రామాలు, పట్టణాలు నిశ్శబ్దంగా మారిపోయాయి. చివరిదైన రెండో దశ పోలింగ్ ఈ నెల 11వ తేదీన 122 నియోజకవర్గాల్లో జరుగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ నెల 6వ తేదీన 121 స్థానాల్లో జరిగిన తొలి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 65 శాతం ఓటింగ్ నమోదైంది. రెండో దశలో కీలక నేతలు పోటీపడుతున్నారు. బిహార్ ఎన్నికల చరిత్రలో 5 శాతానికి మించి ఓటింగ్ పెరిగిన ప్రతిసారీ.. అది అధికార మార్పిడికే దారితీసిందని రాజకీయ విశ్లేషకులు చెప్పారు. ఈసారి భారీ ఓటింగ్ నమోదు కావడం తమకే అనుకూలమని ఇరుపక్షాలూ ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

ఆదివారం జెహానాబాద్‌లో జరిగిన తేజస్వీ యాదవ్ ర్యాలీకి హాజరైన జనం

సమీకరణాల చదరంగం

రెండో దశలో పోలింగ్ జరగనున్న 122 నియోజకవర్గాలు అత్యంత సంక్లిష్టమైనవి. ఇక్కడ ప్రచారం మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో కుల సమీకరణాలు, ఓట్ల చీలిక వంటి అంశాలే అభ్యర్థుల గెలుపోటములను శాసించనున్నాయి. రెండో దశలో సీమాంచల్ అత్యంత కీలకం. కిషన్‌గంజ్, అరారియా, పూర్ణియా, కతిహార్ వంటి జిల్లాలున్న ఈ ప్రాంతంలో ముస్లిం మైనారిటీల జనాభా ఎక్కువ. ఇది దశాబ్దాలుగా ఆర్జేడీ–కాంగ్రెస్ కూటమికి కంచుకోట. అయితే, 2020 నాటి ఎన్నికల్లో అసదుద్దీన్ ఓవైసీ నేతృత్వంలోని ఎంఐఎం ఇక్కడ 5 స్థానాలు గెలుచుకొని మహాగఠ్‌బంధన్ ఓట్లను చీల్చింది. మైనారిటీల ఓట్లను ఆకర్షించేందుకు ఆర్జేడీ, కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డుతుండగా.. ఎంఐఎం సైతం అదే ఓటు బ్యాంకుకు గాలం వేస్తోంది. ఈ 'ఓట్ల చీలిక'అంతిమంగా ఎన్డీఏకు లాభం చేకూరుస్తుందనడంలో సందేహం లేదు. రెండో దశలోనూ కులమే ప్రధాన పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా ముస్లిం–యాదవ్ సమ్మేళనం మహాగఠ్‌బంధన్‌కు ప్రాణవాయువు లాంటిది. ఆర్జేడీ అభ్యర్థులు పూర్తిగా ఈ ఓటు బ్యాంకును నమ్ముకుంటున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బలం ఈబీసీలు, మహాదళితులే. ఈ నిశ్శబ్ద ఓటు బ్యాంకు గత రెండు దశాబ్దాలుగా జేడీయూ వెంటే నడుస్తోంది. భూమిహార్, రాజ్‌పుత్, బ్రాహ్మణ వర్గాలు ఆనవాయితీగా బీజేపీకి మద్దతుగా నిలుస్తున్నాయి.

ఓట్ల చీలికలతో తంటాలు

ఈ ఎన్నికల్లో 'ఓట్లను చీల్చే'పార్టీల ప్రభావం ఎక్కువగా కన్పిస్తోంది. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ చాలా నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థులను నిలబెట్టింది. ఇది సంప్రదాయ రాజకీయాలకు అలవాటుపడని ఓటర్లను ఆకర్షిస్తోంది. ఈ పార్టీతో జేడీ(యూ), ఆర్జేడీలకు కొంత నష్టం జరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 'సన్ ఆఫ్ మల్లా'గా పిలుచుకునే ముకేశ్ సహానీ.. బిహార్ నిషాద్ (మత్స్యకార) వర్గంలో గట్టి పట్టున్న నాయకుడు. ఈయన మహాగఠ్‌బంధన్‌లో భాగస్వామిగా ఉండటం ఆర్జేడీకి కలిసొచ్చే అంశం.

సమస్యాత్మక ప్రాంతాలు

రెండో దశలో పోలింగ్ జరగనున్న పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామఢీ వంటి జిల్లాలు నేపాల్ సరిహద్దును ఆనుకొని ఉన్నాయి. ఇక్కడ ఎన్నికల నిర్వహణ భద్రతా బలగాలకు పెద్ద సవాల్. ఎన్నికలకు 72 గంటల ముందే నేపాల్ సరిహద్దును మూసివేశారు. అసాంఘిక శక్తులు సరిహద్దులు దాటకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మరోవైపు సీమాంచల్ ప్రాంతం మతపరంగా అత్యంత సున్నితమైనది. దీన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రాంతాల్లో భారీగా సాయుధ బలగాలను మోహరించింది. ప్రజలు స్వేచ్ఛగా, శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. 14న ఫలితాల కోసం దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

న్యాయ సహాయం నైతిక బాధ్యత

- కక్షిదారుల పట్ల సేవా దృక్పథంతో మెలగాలి
- ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలి
- సీజేఐ జస్టిస్ గవాయ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ప్రజలకు న్యాయ సహాయం అందించడం అనేది కేవలం దాతృత్వ చర్య మాత్రమే కాదని.. అదొక నైతిక బాధ్యత అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టంచేశారు. న్యాయ సహాయ ఉద్యమంలో పాల్గొనేవారు చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని, కక్షిదారుల పట్ల సేవాదృక్పథంలో మెలగాలని సూచించారు. ఆదివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో 'న్యాయ సహాయ యంత్రాంగాల బలోపేతం'అనే అంశంపై జాతీయ సదస్సు ముగింపుతో పాటు 'లీగల్ సర్వీసెస్ డే'కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ మాట్లాడారు. తదుపరి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌తోపాటు సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన న్యాయమూర్తులు పాల్గొన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా), స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(ఎస్ఎల్ఎస్ఏ)ల్లో సలహా కమిటీని ఏర్పాటు చేయాలని జస్టిస్ గవాయ్ సూచించారు. విధానపరమైన ప్రణాళికలు సజావుగా కొనసాగేలా చూడడానికి ఈ కమిటీలు అవసరమని చెప్పారు. న్యాయ సహాయం అనేది ప్రభుత్వ పరిపాలనలో ఒక భాగమని వివరించారు. ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. న్యాయ సహాయకులు న్యాయ పాలకులుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మనం చేసే ప్రతి ప్రయత్నం ప్రజలకు మేలు చేసేదిగా ఉండాలన్నారు. తాను 'నల్సా'లో ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సేవలందించానని జస్టిస్ గవాయ్ వెల్లడించారు. అప్పట్లో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌తో కలిసి పనిచేశానని చెప్పారు. విధి నిర్వహణలో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు కలిసి వెళ్లేవాళ్లమని గుర్తుచేసుకున్నారు. మన రాజ్యాంగ ఆత్మ వ్యక్తీకరణకు న్యాయ సహాయ ఉద్యమం ఒక చక్కటి ఉదాహరణ అని అభివర్ణించారు.

ఉత్సాహంగా లాయర్ల వాకథాన్

ఢిల్లీలో ఆదివారం లాయర్ల వాకథాన్ ఉత్సాహంగా జరిగింది. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ చీఫ్ వికాస్ సింగ్ జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించారు. సుప్రీంకోర్టు ప్రాంగణం నుంచి 8 కిలోమీటర్ల దూరంలోని ఇండియా గేట్ దాకా లాయర్ల నడక కొనసాగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ గవాయ్‌తోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ సంజయ్ కరోల్ సహా 2,000 మంది న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే వాకథాన్ సందర్భంగా న్యాయమూర్తులు మొక్కలు నాటారు.

లాయర్లతో కలిసి వాకథాన్‌లో పాల్గొన్న జస్టిస్ బీఆర్ గవాయ్

మానవ మేధకు టెక్నాలజీ ప్రత్యామ్నాయం కాదు

తదుపరి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వెల్లడి

న్యూఢిల్లీ: భారత న్యాయ రంగంలో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత టెక్నాలజీ వినియోగం ప్రారంభమైందని సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. పరిశోధన, డేటా విశ్లేషణ కోసం ఏఐని వాడుతున్నట్లు తెలిపారు. ఏ సాంకేతిక పరిజ్ఞానమైనా సరే మానవ మేధస్సును ప్రత్యామ్నాయం కాదని అన్నారు. ఆధునిక యుగంలో టెక్నాలజీ అవసరమే అయినప్పటికీ మానవ వివేచనను అది భర్తీ చేయలేదని స్పష్టంచేశారు. ఆదివారం ఢిల్లీలో స్టాండింగ్ ఇంటర్నేషనల్ ఫోరమ్ ఆఫ్ కమర్షియల్ కోర్ట్స్(ఎస్ఐఎఫ్‌ఓసీసీ) సమావేశంలో జస్టిస్ సూర్యకాంత్ ప్రసంగించారు. న్యాయాన్ని వేగంగా, సమర్థవంతంగా ప్రజల వద్దకు చేర్చడానికి కృత్రిమ మేధ దోహదపడుతుందని తెలిపారు. న్యాయస్థానాల్లో ఐఏని బాధ్యతాయుతంగా వాడుకోవాలని, ఇందుకోసం నియమ నిబంధనలు అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ–కోర్టుల మూడో దశ కార్యక్రమంలో భాగంగా ఏకీకృత, క్లౌడ్ ఆధారిత, ఆధునిక న్యాయ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు జస్టిస్ సూర్యకాంత్ స్పష్టంచేశారు.

ఉద్ధవ్ ఠాక్రే ఇంటిపై డ్రోన్ కలకలం

ముంబై: మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన(ఉద్ధవ్) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే నివసిస్తున్న ముంబైలోని 'మాతోశ్రీ' భవనంపై ఆదివారం ఒక డ్రోన్ చక్కర్లు కొట్టి కలకలం సృష్టించింది. డ్రోన్ ఘటన భద్రతా వైఫల్యమని, ఠాక్రే భద్రతకు ముప్పు వాటిల్లిందని ఎమ్మెల్సీ అనిల్ పరబ్ అన్నారు. ఘటనపై డీసీపీ మనీశ్ కుల్వానియా స్పందించారు. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతితో జరుగుతున్న సర్వేలో భాగంగానే ఆ డ్రోన్‌ను ప్రభుత్వ సిబ్బంది ఎగురవేసినట్లు వివరణ ఇచ్చారు.

ఒక్కో అమెరికన్‌కు 2వేల డాలర్లు ఇస్తా

ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్: విదేశాలపై సుంకాల భారం మోపడం వల్లే దేశాదాయం విపరీతంగా పెరిగిందని, తద్వారా సమకూరిన ఆదాయం నుంచి అర్హులైన అమెరికన్లకు సుంకాల డివిడెండ్‌గా 2,000 డాలర్లు పంపిణీ చేస్తానని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ఆదివారం ప్రకటించారు. విదేశాలపై సుంకాలను ఇష్టారీతిగా పెంచే విచక్షణాధికారం అమెరికా అధ్యక్షుడికి ఉంటుందా? అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాలు అధ్యక్షుడికి వర్తిస్తాయా? అనే అంశాలపై సుప్రీంకోర్టు లోతైన సమీక్ష జరపనున్న నేపథ్యంలో ట్రంప్ ఆదివారం ఈ మేరకు తనదైన రీతిలో స్పందించారు. సొంత సామాజిక మాధ్యమ 'ట్రూత్ సోషల్' ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. ''సుంకాలను వ్యతిరేకించే వాళ్లంతా మూర్ఖులు. అధిక సుంకాలతో రెవిన్యూ వసూళ్ల వరద మొదలయ్యాక మనం అత్యంత ధనిక, గౌరవప్రద దేశంగా మారాం. మన దగ్గర ద్రవ్యోల్బణం దాదాపు లేదు. స్టాక్‌మార్కెట్ దూసుకుపోతోంది. ట్రిలియన్ల డాలర్లు వచ్చిపడుతున్నాయి. త్వరలోనే 37 ట్రిలియన్ డాలర్ల అప్పులను తీర్చే ప్రక్రియ మొదలెడతా. అమెరికాలోకి పెట్టుబడులు పోటెత్తుతున్నాయి. దాదాపు మిగతా వాళ్లందరికీ సుంకాల డివిడెండ్‌గా 2,000 డాలర్లు నేరుగా బదిలీచేస్తా'' అని ట్రంప్ అన్నారు.

ఉత్తరాఖండ్ మార్గంలో నడవాలి

- ఇతర రాష్ట్రాలకు మోదీ సూచన
- యూసీసీని అమలు చేస్తోందని, మత మార్పిడులు అడ్డుకుంటోందని ప్రశంసలు
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్న మోదీ

శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని మోదీ, సీఎం ధామి

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ ప్రభుత్వంపై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రంలో జనాభా స్థితిగతుల్లో మార్పులు రాకుండా ధైర్యంగా చర్యలు చేపట్టిందని, ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తోందని, చట్టవిరుద్ధమైన మత మార్పిడులను సమర్థంగా అడ్డుకుంటోందని చెప్పారు. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలు సైతం ఉత్తరాఖండ్ మార్గంలో నడవాలని సూచించారు. యూసీసీ అమలుపై ఉత్తరాఖండ్ చర్యలను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. మత మార్పిడుల నియంత్రణ చట్టం, అల్లర్ల నియంత్రణ చట్టాన్ని నిక్కచ్చిగా అమలు చేస్తోందని తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం అవతరించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం డెహ్రాడూన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. రూ.8,260.72 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల భూములు కబ్జా కాకుండా, జనాభాలో అవాంఛనీయ మార్పులు రాకుండా ఇక్కడి బీజేపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలకు శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. అభివృద్ధి ప్రయాణంలో అడ్డంకులను తొలగించుకుంటూ ఉత్తరాఖండ్ శరవేగంగా ముందుకు సాగుతోందని హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రం ప్రపంచ ఆధ్యాత్మిక రాజధానిగా మారనుందని అన్నారు.

రాష్ట్ర ప్రజలే నాకు స్ఫూర్తి

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించారు. ఉత్తరాఖండ్‌తో తనకు గొప్ప అనుబంధం ఉందన్నారు. కొండలపై ప్రతికూల వాతావరణంలో జీవిస్తూ కష్టపడి పనిచేసే ఇక్కడి ప్రజలు తనకు నిత్యం స్ఫూర్తినిస్తుంటారని చెప్పారు. ఈ దశాబ్దం ఉత్తరాఖండ్‌దేనని తేల్చిచెప్పారు. రాష్ట్రం బలం ఆధ్యాత్మిక శక్తిలోనే ఉందన్నారు. గత 25 ఏళ్లలో అనూహ్యమైన ప్రగతి సాధించిందని కొనియాడారు. విద్య, పర్యాటకం, ఆరోగ్యం, ఇంధనం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తోందని తెలిపారు. 25 ఏళ్ల క్రితం రాష్ట్రం బడ్జెట్ రూ.4,000 కోట్లు మాత్రమేనని, ఇప్పుడు రూ.లక్ష కోట్లకు చేరిందని స్పష్టంచేశారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలని, అందుకోసం ప్రజలంతా ఉమ్మడిగా కృషి చేయాలని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని ఆలయాలు, ఆశ్రమాలు, ధ్యాన కేంద్రాలు, యోగా కేంద్రాలను గ్లోబల్ నెట్‌వర్క్‌తో అనుసంధానిస్తామని చెప్పారు.

ఆన్‌లైన్ ఉగ్ర నెట్‌వర్క్‌లపై కొరడా

కశ్మీర్ లోయవ్యాప్తంగా దాడులు, 9 మంది అరెస్ట్

శ్రీనగర్: ఆన్‌లైన్ ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై ఉక్కుపాదం మోపుతూ.. కౌంటర్–ఇంటెలిజెన్స్ కశ్మీర్ ఆదివారం లోయవ్యాప్తంగా దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా ఒక మహిళతో సహా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుంది. ఉగ్రవాదాన్ని ఆన్‌లైన్‌లో కీర్తించడం, యువకులను ప్రభావితం చేయడంపై అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, కౌంటర్–ఇంటెలిజెన్స్ కశ్మీర్ బృందాలు శ్రీనగర్, కుల్గామ్, బారాముల్లా, షోపియాన్, పుల్వామాలోని 10 ప్రత్యేక ప్రాంతాలపై దాడులు చేశాయని అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. 'ఆన్‌లైన్ ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టడంలో భాగంగా కశ్మీర్ లోయవ్యాప్తంగా సమన్వయంతో దాడులు నిర్వహించాం.. ఇది తీవ్రవాదం, సైబర్ దుర్వినియోగానికి వ్యతిరేకంగా నిర్ణయాత్మక సందేశాన్ని పంపింది'.. అని ఆ ప్రతినిధి స్పష్టం చేశారు. అదుపులోకి తీసుకున్న తొమ్మిది మంది అనుమానితుల్లో ఒక మహిళ కూడా ఉన్నారని అధికారి తెలిపారు. ఈ సందర్భంగా సిమ్ కార్డులు, మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లెట్‌లు, పలు రకాల డిజిటల్ పరికరాలు మొదలుకొని నేరారోపణకు సంబంధించిన కీలక సాక్ష్యాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

తండ్రి పిస్టల్‌తో సహ విద్యార్థిపై కాల్పులు

మైనర్ అఘాయిత్యం

గురుగ్రామ్: తండ్రికి చెందిన లైసెన్స్‌డ్ పిస్టల్‌తో.. పదకొండో తరగతి విద్యార్థి సహ విద్యార్థిపై కాల్పులు జరిపాడు. ప్రస్తుతం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థి పరిస్థితి విషమంగా ఉంది. గురుగ్రామ్‌లోని సెక్టార్ 48లోని ఓ ఫ్లాట్‌లో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. శనివారం రాత్రి సుమారు 9.30 గంటల ప్రాంతంలో.. నిందితుడి అద్దె ఫ్లాట్‌లో ముగ్గురు విద్యార్థులు ఉన్నప్పుడు వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత వారిలో ఒకరు మరొకరిపై కాల్పులు జరిపారు. సమాచారం అందుకున్న వెంటనే, పోలీసు బృందం సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన విద్యార్థిని ఆసుపత్రికి తరలించి, మిగిలిన ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలం నుంచి ఒక పిస్టల్, రెండు మ్యాగజైన్లు, 70 కాట్రిడ్జ్‌లు, ఒక బుల్లెట్ షెల్‌ను స్వాధీనం చేసుకున్నారు. షూటర్ అయిన నిందితుడికి.. రెండు నెలల క్రితం బాధిత విద్యార్థితో గొడవ జరిగిందని, అప్పటి నుంచి కక్ష పెంచుకున్నాడని పోలీసులు వెల్లడించారు.

ఐసిస్ ఉగ్ర కుట్ర భగ్నం

అహ్మదాబాద్/సాక్షి,హైదరాబాద్: గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) ఉగ్ర కుట్రను ఛేదించింది. అత్యంత ప్రమాదకరమైన రసాయన విషం 'రైసిన్' తయారీకి ప్రయత్నిస్తున్న చైనాలో ఎంబీబీఎస్ చేసిన వైద్యుడిని, మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది. ప్రధాన నిందితుడైన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయీద్‌తోపాటు ఆజాద్ సులేమాన్ షేక్, మహ్మద్ సుహైల్ మొహమ్మద్ సలీంలు లక్నో, ఢిల్లీ, అహ్మదాబాద్‌లోని పలు సున్నిత ప్రదేశాలలో రెక్కీ నిర్వహించారని గుజరాత్ ఏటీఎస్ డీఐజీ సునీల్ జోషి తెలిపారు. డాక్టర్ సయీద్ నిధుల సేకరణ, నియామకాలకు ప్రణాళిక రూపొందించాడు. గుజరాత్‌లో ఒక కీలకమైన ఉగ్ర దాడిని అమలు చేయడానికి ప్రాణాంతకమైన 'రైసిన్' అనే విషాన్ని సయీద్ తయారు చేస్తున్నాడు. ఇతడికి ఆయుధాలను సరఫరా చేసినట్లు ఆరోపణలున్న యూపీకి చెందిన షేక్, సలీమ్‌లను బనస్కాంత జిల్లాలో ఏటీఎస్ అదుపులోకి తీసుకుంది. వీరి నుంచి మూడు ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుంది. ఈ ముగ్గురిపై యూఏపీఏ (చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం) సహా కేసులు నమోదయ్యాయి. సయీద్‌ను నవంబర్ 17 వరకు ఏటీఎస్ కస్టడీకి అప్పగించగా, మిగిలిన ఇద్దరిని ఆదివారం కోర్టులో హాజరు పరిచారు. ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సయీద్ యునానీ వైద్యుడని కొందరు చెబుతుండగా, మరికొందరు ఇతడు చైనాలో వైద్య విద్యనభ్యసించాడంటున్నారు.

సుహైల్

కార్వాన్‌లో హోటల్ నడిపి..

గుజరాత్‌లోని అహ్మదాబాద్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు ఆదివారం అరెస్టు చేసిన సయీద్ ఖమ్మం నుంచి వచ్చి హైదరాబాద్‌లోని టోలిచౌకిలో స్థిరపడ్డాడు. ఇతడు యునాని వైద్యవిద్య అభ్యసించాడు. కార్వాన్ సమీపంలో ఓ హోటల్, షవర్మా సెంటర్ నడిపాడు. రాజేంద్రనగర్ ప్రాంతంలో రియల్ వ్యాపారం చేస్తున్నాడు. ఇన్‌స్టాలో ఇతడి పేరుతో ఖాతా ఉంది. దీనిద్వారానే ఉగ్రవాదం వైపు ఆకర్షితుడైన ఇతడు ఐసిస్ అనుబంధ ఐఎస్‌కేపీలో చేరాడు. పాక్–అఫ్గాన్ సరిహద్దుల్లో ఉన్న హ్యాండ్లర్ అబూ ఖదీజా ఆదేశాల మేరకు ఉత్తరప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆజాద్ సులేమాన్ షేక్, మహ్మద్ సోహైల్ అహ్మద్‌లతో కలిసి ఓ మాడ్యుల్ ఏర్పాటు చేశాడు. హ్యాండ్లర్ ఆదేశాల మేరకు ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నో నగరాలను తమ టార్గెట్‌గా మార్చుకొని రెక్కీలు నిర్వహించారు. పీడీఎఫ్ ఫార్మాట్‌లో హ్యాండ్లర్ పంపిన పుస్తకాలను అధ్యయనం చేసిన సయీద్ ఆముదం నూనెను వినియోగించి రైసిన్ అనే అత్యంత శక్తివంతమైన విషాన్ని తయారు చేయడం ప్రారంభించాడు. దీన్ని వినియోగించి భారీ విద్రోహక చర్య చేపట్టాలని పథకం వేశాడు. శనివారం రాత్రి అహ్మదాబాద్–మెహసానా హైవేపై అదాలాజ్ టోల్‌ప్లాజా వద్ద వీళ్ల కారును ఆపి, అందులో ఉన్న సయీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. కారులోని డబ్బాలో 4 లీటర్ల ఆముదం ఏటీఎస్‌కు లభించింది.

బహు భార్యత్వంపై నిషేధం

బిల్లుకు అస్సాం మంత్రివర్గం ఆమోదం

గౌహతి: అస్సాం మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. బహుభార్యత్వ నిషేధం బిల్లుకు ఆమోదం తెలిపారు. ఈ బిల్లు ప్రకారం.. ఒక్కరి కంటే ఎక్కువ మందిని పెళ్లి చేసుకుంటే దోషులకు ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించవచ్చు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ విషయం మీడియా సమావేశంలో వెల్లడించారు. అయితే, ఆరో షెడ్యూల్ ప్రాంతాల్లో కొన్ని మినహాయింపులు ఉంటాయని చెప్పారు. బహుభార్యత్వం కారణంగా బాధితులుగా మారిన మహిళలకు పరిహారం ఇవ్వడానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవనం కొనసాగించడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. 'ద అస్సాం ప్రొహిబిషన్ ఆఫ్ పాలిగామీ బిల్లు–2025'కు కేబినెట్ ఆదివారం ఆమోదం తెలిపినట్లు స్పష్టంచేశారు. ఈ నెల 25వ తేదీన ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడతామని తెలిపారు.

స్థానికులకు ఆయుధ లైసెన్స్‌లు

అస్సాంలో మారుమూల కొండ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే స్థానిక ప్రజలకు ఆయుధ లైసెన్స్‌లు ఇవ్వబోతున్నామని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రకటించారు. మొదటి బ్యాచ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు. అస్సాంలో వచ్చే ఏడాది మార్చి–ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈ నేపథ్యంలో అంతకంటే ముందే ప్రజలకు ఆయుధాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. ఆయుధ లైసెన్స్‌ల కోసం ప్రజల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయని, అధికారులు వాటిని క్షుణ్నంగా పరిశీలిస్తున్నారని సీఎం హిమంత బిశ్వ శర్మ తెలియజేశారు. ఆయన ఆదివారం కేబినెట్ భేటీ తర్వాత మీడియాతో మాట్లాడారు. స్థానికులకు మాత్రమే లైసెన్స్‌లు లభిస్తాయని తేల్చిచెప్పారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ లైసెన్స్ లభించే అవకాశం లేదన్నారు. ఈ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తామని వెల్లడించారు. అస్సాంలోని మొత్తంగా 126 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు ఇప్పటినుంచే సిద్ధమవుతున్నాయి. అస్సాంలో చొరబాటుదారుల నుంచి స్థానికులకు ముప్పు ఎదురవుతున్నట్లు చాలా సంవత్సరాలుగా వాదనలు వినిపిస్తున్నాయి.

అద్వానీ సుదీర్ఘ సేవలందించిన నేత

కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: బీజేపీ దిగ్గజ నేత ఎల్‌కే అద్వానీకి శనివారం 98వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేత శశి థరూర్.. సంచలన వ్యాఖ్యలు చేశారు. సుదీర్ఘకాలం దేశానికి సేవలందించిన అద్వానీ వంటి నేత గుణగణాలను కేవలం ఒకే ఒక్క ఘటనతో నిర్ధారించడం సరికాదంటూ అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, చైనాతో జరిగిన యుద్ధంలో ఓటమి కారణంగా అప్పటి ప్రధాని నెహ్రూను, దేశంలో అత్యవసర పరిస్థితి విధించినందుకు ఇందిరాగాంధీ వ్యక్తిత్వాన్ని లెక్కగట్టలేమని ఆయన పేర్కొన్నారు. ఇదే విషయం, లాల్ కృష్ణ అద్వానీకి వర్తిస్తుందని తెలిపారు. అదెంత ప్రాముఖ్యం కలిగినదైనప్పటికీ కేవలం ఒకే ఒక్క పరిణామాన్ని ప్రాతిపదికగా తీసుకుని, వారి సుదీర్ఘ సేవలను బేరీజు వేయడం అన్యాయమన్నారు. అద్వానీ నిరాడంబరత, యోగ్యత, ఆధునిక భారత దేశ పథాన్ని నిర్ణయించడంలో ఆయన పాత్ర ఎవరూ కాదన లేనిదన్నారు. 1990లో రామ జన్మభూమి ఉద్యమాన్ని దేశ వ్యాప్త రథయాత్రతో ముందుండి నడిపిన అద్వానీ, బీజేపీని జాతీయ రాజకీయాల్లో ప్రబల శక్తిగా తీర్చిదిద్దిన నేతగా ఖ్యాతి గడించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి యలవర్తి శశిధర్ రూ.1,01,116 విరాళం అందజేశారు.

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 33,110 క్యూసెక్కులొచ్చి చేరుతోంది. దిగువకు 17వేల క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 45.7183 టీఎంసీలు.

ఆరుద్ర నక్షత్ర వేడుకలు

చేబ్రోలు: నాగేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఆరుద్ర నక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకారం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు.

గొప్పల డప్పు.. రియల్‌కు ముప్పు

- విపరీతంగా పెరిగిపోయిన భూముల రేట్లు
- హైవేల విస్తరణ పేరుతో హంగామా.. రైతుల్లో ఆందోళన
- ప్రతిపాదనలు లేకుండానే హడావుడితో రియల్ వ్యాపారం కుదేలు
- విజయవాడ – మచిలీపట్నం హైవేను 6 లైన్లకు విస్తరిస్తామని ప్రచారం
- చినకాకాని సర్వీస్ రోడ్డు విస్తరణ హడావుడితో నిండా మునిగిన రియల్టర్లు

కొత్త ప్రాజెక్టులు రాకుండానే వచ్చేసినట్లు ప్రభుత్వ హడావుడి

గూడూరు సమీపంలో విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి (ఫైల్)

సాక్షి, అమరావతి: వీసమెత్తు అభివృద్ధి కనిపించక పోయినా ఎంతో జరిగిపోయినట్లు కూటమి ప్రభుత్వం యథేచ్ఛగా గొప్పల డప్పు మోగిస్తోం ది. ప్రభుత్వ హడావుడితో రైతులు అల్లాడుతుం డగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతోంది. హైవేలు, పోర్టులు, రింగ్ రోడ్లు వచ్చేస్తున్నాయని హడావుడి చేయడమే తప్ప వాస్తవంలో అవేమీ ఆచరణకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం మాత్రం అవి వచ్చేసినట్లు, ఆ ప్రాంతాల రూపు రేఖలు సమూలంగా మారిపోయినట్లు ప్రచారం చేస్తూ ప్రజలను మాయ చేస్తోంది. ఈ ప్రచారం తో రైతులు తమ భూములు విక్రయించాలో, వద్దో తేల్చుకోలేక సతమతం అవుతున్నారు. భవిష్యత్‌లో భూములకు మంచి ధర వస్తుందని, ప్రస్తుతం ఉన్న రేట్లకు విక్రయిస్తే నష్టపో తామేమోననే భయం వారిని వెంటాడుతోంది. కొనుగోలుదారులు కూడా ఇప్పుడు భూములను కొంటే భూసేకరణ ఉచ్చులో చిక్కుకుంటామనే భయంతో వెనుకడుగు వేస్తున్నారు. మరో వైపు ఆ ప్రాంతాల్లో అప్పటికే ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్లలో ప్లాట్ల విక్రయాలు జరగక వెలవెలబో తున్నాయి. ప్రభుత్వ తీరుతో అటు రైతులు, ఇటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిండా మునిగిపోయి ఆందోళన చెందుతున్నారు.

ప్రచారంతో రియల్ ఎస్టేట్ దివాలా

కూటమి నేతలు అత్యుత్సాహంతో చేస్తున్న ప్రకట నలు రియల్ ఎస్టేట్ రంగం కొంప ముంచుతు న్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం చెప్పేవన్నీ అమలు జరగడం సంగతి అటు ఉంచి, ఇప్పుడు ఎకరం భూమి ధర కోట్ల రూపాయలకు చేరడం, చదరపు గజం రూ.లక్షలు పలకడంతో అయోమయం నెలకొంది. మచిలీ పట్నం పోర్టు నిర్మాణం వచ్చే రెండు, మూడేళ్లలో పూర్తవుతుందని, దానికి ప్రధాన కనెక్టివిటీగా ఉన్న మచిలీపట్నం – విజయవాడ హైవేను ఆరు లైన్లుగా విస్తరిస్తారనే ప్రచారం జోరుగా జరుగు తోంది. పోర్టు పూర్తయితే ఎంత ట్రాఫిక్ పెరుగు తుంది, దానికి ఎన్ని లైన్ల రోడ్డు కావాలి, ఎక్కడి నుంచి ఎక్కడికి విస్తరించాలనే అంశాలపై స్పష్టత లేదు. అయినా ఆరు లైన్లుగా విస్తరిస్తారనే ప్రచా రంతో ఆ ప్రాంతాల్లో భూముల రేట్లు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కానూరు, పెనమలూరు, కం కిపాడు తదితర ప్రాంతాల్లో కొద్దో గొప్పో జరిగే లావాదేవీలు కూడా భారీగా రేట్లు కారణంగా తగ్గి పోయాయి. ఎన్నికలకు ముందు గజం రూ.25 వేలు కాగా, ఇప్పుడు రూ.50 వేలకు పెరిగింది. ఈడుపుగల్లు, గోసాల, వణుకూరు వంటి ప్రాం తాల్లో గతంలో గజం రూ.10 వేలు కాగా, ప్రస్తుతం రూ.30 వేలకు పెరిగిపోయింది. దీంతో సామాన్యులు అటు వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేకుండాపోయింది. ఉయ్యూరు, పామర్రు, నిమ్మ కూరు తదితర ప్రాంతాల్లో రహదారి వెంబడి వెంచర్లు మొదలుపెట్టిన రియల్టర్లు కూడా ప్రస్తుతం జరుగుతున్న ప్రభుత్వ హడావుడితో ముందుకు వెళ్లలేక ఆగిపోయారు.

తలనొప్పిగా వెస్ట్ బైపాస్ సర్వీస్ రోడ్డు విస్తరణ ప్రచారం

గుంటూరు జిల్లాలోని చినకాకాని వద్ద వెస్ట్ బైపాస్ సర్వీస్ రోడ్డు విస్తరణ ప్రచారం రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పెద్ద దెబ్బ కొట్టింది. కాజ నుంచి విజయవాడ సమీపంలోని గొల్లపూడి వద్ద హైదరాబాద్ – మచిలీపట్నం హైవేకు అనుసంధానం చేస్తూ నిర్మించిన పశ్చిమ బైపాస్ రోడ్డుతో వాహనాల రద్దీ తగ్గుతుందని ప్రజలు భావించారు. అయితే సర్వీస్ రోడ్డు ప్రతిపాదన ఒక రూపు దాల్చకపోయినా రోడ్డు విస్తరణ ప్రచారం విపరీతంగా జరిగింది. అదిగో పులి అంటే, ఇదిగో తోక అన్న చందం గా ఇన్ని మీటర్లు, కాదు అన్ని మీటర్ల భూమిని ప్రభుత్వం సేకరిస్తుందంటూ లెక్కలు కట్టి మరీ కొందరు ప్రచారం చేస్తున్నారు. వాస్తవంగా సంబంధిత శాఖల్లో రోడ్డు విస్తరణ ప్రస్తావనే లేదు. అధికారులు సైతం ఈ విషయంలో అధికారికంగా ఎటువంటి సమాచారం లేదని స్పష్టం చేస్తున్నారు. అయితే భూ సేకరణపై దుష్ప్రచారం మాత్రం ఆగడం లేదు. అంతేకా కుండా మరి కొందరు ఫలానా సర్వే నంబర్లలో భూ రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం నిలిపి వేసిందని సరికొత్త ప్రచారానికి తెరతీశారు. దీని పర్యవ సానంగా మంచి ధరకు భూములు అమ్ముకుం దామనుకుంటున్న రైతులు, ఇప్పటికే ఈ ప్రాం తంలో వెంచర్లు వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. సర్వీస్ రోడ్డు విస్తరణ ప్రతిపాదనకు ముందు రైతుల నుంచి కొందరు రియల్టర్లు భూములు కొను గోలు చేసి వెంచర్లు వేశారు. కొన్ని అమ్ముడైన తర్వాత రింగ్ రోడ్డు వస్తోందన్న ప్రచారం మొదలవడంతో మిగతా ప్లాట్ల విక్రయాలు నిలి చిపోయాయి. కొంత కాలంగా ఈ ప్రాంతంలో ఒక్క ప్లాట్ కూడా అమ్మకం జరగలేదని స్థాని కులు చెబుతున్నారు. భూసేకరణ ఎక్కడ జరు గుతుందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం వలన వ్యాపారాలు స్తంభించిపోతున్నాయి.

రచయిత నసీర్ అహమ్మద్‌కు జీవిత సాఫల్య పురస్కారం

లక్ష్మీపురం: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరిం చుకుని జరిగే విద్యా దినోత్సవం సందర్భం గా రాష్ట్ర ప్రభుత్వ ఉర్దూ అకాడమీ జీవిత సాఫల్య పురస్కారానికి ప్రముఖ చరిత్రకారుడు, రచయిత సయ్యద్ నసీర్ అహమ్మద్ ఎంపికయ్యారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహ మ్మద్ గౌస్ పీర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జనసముదాయాలు నిర్వహించిన పాత్రను వివరిస్తూ మూడు దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్న నసీర్ 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను వెలువరించారు. ఈ గ్రంథాలు ఉర్దూతోపాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, గుజరాతీ భాషలలో వెలువడ్డాయి. నసీర్ అహమ్మద్ కేవలం చరిత్ర గ్రంథ రచన, ప్రచురణతో కాకుండా సమరయోధుల త్యాగ మయ, సాహసోపేత పోరాటాలను యువత, విద్యార్థులకు తెలియజేస్తూ పలు ప్రచార కార్య క్రమాలను దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా అవిశ్రాంతంగా నిర్వహిస్తున్నారు. చరిత్ర గ్రంథాల రచన, ప్రచురణను వ్యాపార దృష్టితో కాకుండా సేవా దృష్టితో నిర్వహిస్తున్న నసీర్ అహమ్మద్ తన కుటుంబం, సన్నిహితుల ఆర్థిక సహకారంతో ప్రచురించిన గ్రంథాలను ఎంపిక చేసిన వందల గ్రంథాలయాలకు, చరిత్రకారులకు, జర్నలిస్టులకు అందిస్తు న్నారు. ఈ గ్రంథాల పీడీఎఫ్ ఫైళ్లను ప్రత్యేకం గా తయారు చేయించి కోరిన వారికి అంద జేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పాఠ కుల సౌకర్యార్థం తన గ్రంథాలన్నింటినీ అం దుబాటులో ఉంచారు. మూడు దశాబ్దాలుగా సయ్యద్ నసీర్ అహమ్మద్ అవిశ్రాంతంగా సాగిస్తున్న కృషికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉర్దూ అకాడమీ ఈ ఏడాదికి గాను ప్రతిష్ఠాత్మక 'జీవిత సాఫల్య' పుర స్కారం ప్రకటించింది. ఈ పురస్కారం కింద రూ.25 వేల నగదు, జ్ఞాపికతో నసీర్ అహ మ్మద్‌ను విజయవాడలో మంగళవారం జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు తదితర ప్రముఖులు సత్కరించనున్నారు.

న్యూస్‌రీల్

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 589.30 అడుగులకు చేరింది. 309.9534 టీఎంసీలకు ఇది సమానం. జలాశయం నుంచి కుడి కాలువకు 10వేలు, ఎడమ కాలువకు 5,438, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 34,901, ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల అవుతోంది. ఔట్‌ఫ్లో 51,139 క్యూసెక్కులు కాగా, శ్రీశైలం నుంచి 51,139 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పశ్చిమ డెల్టాకు 5,009 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 5,009 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారు దల శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. బ్యారేజి వద్ద 12 అడు గుల నీటిమట్టం స్థిరంగా ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవల్ కి 268, బ్యాంక్ కెనాల్ 893, తూర్పు కాలువకు 307, పశ్చిమ కాలువకు 131, నిజాంపట్నం కాలువకు 235, కొమ్మూరు కాలువకు 2,240 క్యూసెక్కులు విడుదల చేశారు. సముద్రంలోనికి 60,150 క్యూసెక్కులు వదులుతున్నారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో రెండు చోట్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని శలపాడు గ్రామంలో రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి సేకరించి వాహనంలో తెనాలి తరలిస్తున్నట్లు ఫిర్యాదు అందటంతో తనిఖీ నిర్వహించారు. ఐదున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. గుంటూరు నుంచి చుం డూరు వెళ్తున్న ఆటోను ఎస్‌ఐ పి.వీరనారా యణ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేయగా 30 మూటల్లో రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. సుమారు పది క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని, ఆటో డ్రైవర్ శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ రహదారిపై రెండు లారీ ఢీ

– ఓ డ్రైవరుకు తీవ్రగాయాలు

వేటపాలెం: జాతీయ రహదారిపై ముందు వెళు తున్న లారీని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టిన సంఘటనలో డ్రైవర్ తీవ్రగాయాల పాలయ్యాడు. 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో అక్కాయిపాలెం వద్ద అఖిల ట్రేడర్స్ గోడౌన్ వద్ద సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఒంగోలు వైపు నుంచి లోడుతో చీరాల వైపునకు ఓ లారీ వెళుతోంది. ఖాళీగా ఉన్న మరో లారీ మొదటి లారీ వెనుక వైపున వేగంగా వస్తోంది. కాగా ముందు లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వైపు వస్తున్న లారీ బలంగా ఢీకొంది. ఈ లారీ నడుపుతున్న డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపో యాడు. విషయం తెలుసుకున్న వేటపాలెం ఎస్సై జనార్దన్ సంఘటనా స్థలానికి చేరుకొని క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మురళిని బయటకు తీయించారు. చీరాల ఏరియా వైద్య శాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

పండ్ల అలంకరణలో తిరుపతమ్మవారు



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో కార్తిక మాస ప్రత్యేక అలంకరణల్లో భాగం గా ఆదివారం అమ్మ వారిని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విశేష అలం కరణలోని అమ్మవారిని దర్శించుకున్నారు. పాలు, పొంగళ్లతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పండ్ల అలంకరణకు వత్సవాయి మండల గోపినేనిపాలెం గ్రామానికి చెందిన కామినేని రాంబాబు, అనిల్, గన్నవరం పట్టణానికి చెందిన చిలకపాటి లక్ష్మీగణేష్ సహ కారం అందజేశారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఈవో భూపతిరాజు వెంకట సత్య నాగకిషోర్‌కుమార్, ఈఈ ఎల్ రమ, ఏఈఓ జంగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

ముడుపుల కోసమే పీపీపీ విధానం

- రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి
- మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

బాపట్ల: రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మాణం లో ఉన్న మెడికల్ కళాశాలలను పీపీపీ విధానం పేరుతో ప్రైవేటుపరం చేయటం కేవలం ముడుపుల కోసమేనని మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ఆరోపిం చారు. మెడికల్ కళాశాలను కాపాడుకోవాలంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో బాపట్లలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను సందర్శించి ఎన్జీవో హోం లో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. వైద్యరంగాన్ని ప్రభుత్వ ఆధీనంలో కాకుండా ప్రైవే టుపరం చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోం దని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి బాపట్ల వైద్య కళాశాలను నిర్మిం చాలన్నారు. 56 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణంలో ఉన్న ఈ కళాశాలను కాపాడుకోవాలని, పీపీపీ విధా నంలో పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీక రణ చేసేందుకు ఇచ్చిన 590 జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. వైద్య విద్యను, అను బంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవే టుపరం చెయ్యాలనే ఆలోచనలకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలకాలని సూచించారు. కుల, మత రాజకీ యాలకు అతీతంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో అం దరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రైవేటీకర ణతో కోటీశ్వరుల పిల్లలకే మెడికల్ సీట్లు దక్కుతా యన్నారు. అర్హత గల పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అంత దుస్థితిలో ప్రభుత్వం ఉందా?

రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డి. రమాదేవి డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాకి ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండాలనే నినాదంతో బాపట్లలో మొదలుపెట్టిన కళాశాల నిర్మాణం కొనసాగించలేని దౌర్భాగ్య పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తు ల్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలనే ఉద్దేశంతోనే డబ్బులు లేవని ప్రభుత్వం చెబుతోందన్నారు. కళా శాల నిర్మాణాలను ప్రారంభిస్తే ఎంతో మందికి ఉపాధి అవకాశాలతోపాటు డాక్టర్లు, నర్సులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు మెరుగుపడతాయన్నారు.

అమ్మకానికి పెట్టిన కూటమి సర్కారు

సదస్సులో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెం ట్ షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ మెడికల్ మాఫియాను ప్రోత్సహిస్తోంద న్నారు. రాష్ట్రంలో 500 ఎకరాల్లో నిర్మాణంలో ఉన్న పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను, ప్రభుత్వ ఆసు పత్రులను కార్పొరేట్ మెడికల్ మాఫియాకు కట్టబె ట్టాలనే కుట్రలో భాగమే పీపీపీ విధానమన్నారు. కూటమి ప్రభుత్వం ఏకంగా మెడికల్ కళాశాలలను అమ్మకానికి పెట్టిందని మండిపడ్డారు.

ప్రభుత్వ నిర్ణయం దారుణం

జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ కార్పొరేట్ వైద్య సంస్థలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కట్టబెట్టడం దారు ణమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రూ.5 వేల కోట్లు ఖర్చు పెడితే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, ఆసుపత్రులు పూర్తి చేసి పేదలకు ఉచిత వైద్యాన్ని, పేదవిద్యార్థులు వైద్యవిద్యను అందించగలమని తెలిపారు. రాష్ట్రంలో 50 శాతం మంది ప్రభుత్వ వైద్యాన్ని పొందుతారన్నారు. దళిత బహుజన ఫ్రం ట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్ మాట్లా డుతూ వైద్య విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో కొన సాగితేనే దళిత, గిరిజన, బలహీన వర్గాల, మైనా ర్టీల జీవితాల్లో మార్పులు వస్తాయన్నారు. పది ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులు ప్రత్యక్షం గా పరోక్షంగా 20 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిస్తాయన్నారు. రిజర్వేషన్లు అమలై సామాజిక న్యాయాన్ని శక్తిమంతం చేస్తాయని తెలిపారు.

మెడికల్ కళాశాల సందర్శన

తొలుత బాపట్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రాంగణాన్ని వివిధ పార్టీల రాష్ట్ర నేతలు, పరి రక్షణ కమిటీ బృందం, ప్రజా, పౌర సంస్థల నేతలు పరిశీలించారు. గత 17 నెలలుగా బాప ట్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అదనంగా ఎలాంటి నిర్మాణం జరగలేదని, ఇక్కడి నుంచి కొంత ఇనుమును పిడుగురాళ్ల మెడికల్ కళాశా లకు తరలించినట్లు గుర్తించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట అంజి బాబు, సీపీఐ కార్యవర్గ సభ్యుడు పరుచూరి రాజేంద్ర బాబు, బాపట్ల జిల్లా కార్యదర్శి సింగరకొండ, ప్రభుత్వ మెడికల్ కళాశాలల కో కన్వీనర్ కె. వసుంధర, వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. జె. విద్యాసాగర్, సమాజ్‌వాదీ పార్టీ జిల్లా అధ్య క్షుడు మేధ శ్రీనివాసరావు, వ్యవసాయ విశ్వవి ద్యాలయ ప్రొఫెసర్ దర్శి విష్ణు శంకర్, జనవి జ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే బాలోత్సవ్

సంప్రదాయ నృత్యాలు చేస్తున్న బాలికలు

మట్టితో ప్రతిమలు చేస్తున్న విద్యార్థులు

- ఘనంగా ముగిసిన వీవీఐటీయూ బాలోత్సవ్- 2025
- విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసిన అతిథులు

పెదకాకాని: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనా త్మకతను గుర్తించి ప్రోత్సహించేందుకే బాలోత్సవ్ వేడుకలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలి పారు. మండలంలోని నంబూరు వీవీఐటీయూలో మూడు రోజులపాటు వైభవంగా జరిగిన బాలో త్సవ్ 2025 వేడుకలు చిన్నారుల తీపి గుర్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధురానుభూ తుల మధ్య ఘనంగా ముగిశాయి. వాసిరెడ్డి వెంక టాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సి టీలో మూడు రోజులపాటు జరిగిన ఈ వేడుకలకు దేశవ్యాప్తంగా వందల పాఠశాలల నుంచి వేల మంది తరలి వచ్చారు. 25 వేల మంది ప్రేక్షకులు హాజరయ్యారు. 20 అంశాలు, 61 విభాగాలుగా జరిగిన పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమానాలతోపాటుగా రెండు ప్రత్యేక బహుమ తులను విజేతలకు అందించారు. బాలల వికాసం తోపాటు వారికి సంస్కృతి, సంప్రదాయాలను కూడా పరిచయం చేశారు. విద్యార్థుల ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. ఆదివారం విచిత్ర వేష ధారణ, శాస్త్రీయ, జానపద బృంద నృత్యాల

నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని

నడుమ ప్రాంగణం కోలాహలంగా మారింది. 52 జానపద బృందాలు మూడు వేదికల వద్ద జాతర వాతావరణాన్ని సృష్టించాయి. 36 శాస్త్రీయ నృత్య బృందాలు 2 వేదికలపై ఉత్సాహంగా ప్రదర్శన చేశాయి. మట్టితో ప్రతిమలు తయారు చేసి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాపినేని శివశంకర్, వాసిరెడ్డి విద్యాసాగర్

ఆకట్టుకున్నారు. వర్సిటీ శాక్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థుల కృషి అభినందనీయమని ప్రో చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ అన్నారు. విజేతలకు చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ కె. గిరిబాబు బహుమతులు ప్రదానం చేశారు.

జీవితంలో కళలు భాగం కావాలి

జీవితంలో కళలు భాగం కావాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు సృజనాత్మక విషయాలు అలవాటు చేసుకొని ఏదో ఒక రంగంలో రాణించాలన్నారు.

శివయ్య సన్నిధికి కార్తిక శోభ

- కార్తిక దీపాల వెలుగుల్లో ఆలయం
- భక్తుల శివనామస్మరణతో మార్మోగిన క్షేత్రం
- ఒక్కరోజులో స్వామి వారి ఆదాయం రూ.8 లక్షలు

పెదకాకాని: పెదకాకానిలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం కార్తిక దీపాల వెలు గుల్లో కళకళలాడింది. కార్తిక మాసం మూడో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివ చ్చారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారిం ది. భక్తులు తెల్లవారుజామున ఆలయ ప్రాంగ ణంలోని యజ్ఞాల బావి నీటితో స్నానాలు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం భ్రమరాంబ మల్లేశ్వ రస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకు

శివాలయంలో కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

న్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. త్వరితగతిన స్వామివారి దర్శనం, అభిషేకాలు జరిగేలా చర్యలు చేపట్టారు. ఆలయ అధికారులు క్యూలై న్లలో ఉన్న భక్తులకు పాలు, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. ఆలయంలో తలనీలాలు, వాహనపూజలు, అన్నప్రాశనలు, అంతరాలయ

క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

దర్శనాలు, అభిషేకాలు, రాహుకేతు పూజలు, నవగ్రహ పూజలు జరిగాయి. ఆదివారం ఒక్క రోజే రూ.8 లక్షల ఆదాయం సమకూరినట్లు డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని పోలీసులు ట్రాఫిక్ ఇబ్బం ది లేకుండా బందోబస్తు నిర్వహించారు. అగ్ని మాపక శాఖ, పంచాయతీరాజ్ శాఖ, వైద్య శాఖల అధికారులు సహకారం అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

క్లుప్తంగా

మాజీ ఎంపీ శివాజీకి పరామర్శ

నగరంపాలెం: మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీని ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఆయన నివాసంలో స్వాతంత్య్ర సమరయోధుడు గౌతు లచ్చన్న తనయుడు, మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర శివాజీ పరామర్శించారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం ఇరువురిని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ సత్కరించారు. శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల పాలకవర్గం కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్, పలువురు పాల్గొన్నారు.

నేడు పెదకాకాని ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

పెదకాకాని: పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్ష పదవిపై అవిశ్వాస తీర్మాన సమావేశం సోమవారం జరగనుంది. నాలుగు సంవత్సరాలు పూర్తయిన ఎంపీపీ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలని అక్కసుతో రెండు నెలలుగా కూటమి నాయకులు రాయబేరాలు చేశారు. 2021లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో పెదకాకాని మండలానికి సంబంధించి 12 గ్రామాల నుంచి 21 మంది ఎంపీటీసీ సభ్యులుగా పోటీ చేశారు. వారిలో 15 మంది ఎంపీటీసీ వైఎస్సార్ సీపీ నుంచి గెలుపొందారు. ఆరుగురు టీడీపీ నుంచి విజయం సాధించారు. నాలుగేళ్లు పూర్తి కావడంతో ఎంపీపీ పదవిని దక్కించుకునేందుకు ఇప్పటికే పలువురు ఎంపీటీసీ సభ్యులను శనివారం అర్ధరాత్రి రాజమండ్రి తరలించినట్లు విశ్వసనీయ సమాచారం.

రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయుల సాంస్కృతిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి దాదాపు 550 మంది ఉపాధ్యాయులు పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. శాస్త్రీయ నృత్యం, నాటికలు, దేశభక్తి గేయాలు, బుర్రకథలు, జానపద నృత్యం, ఏకపాత్రాభినయం, పద్యాలు, కోలాటం తదితర అంశాలలో పోటీలను నిర్వహించారు. ప్రస్తుత విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రదర్శించారు.

కార్తిక వనసమారాధనల సందడి

జై గౌడ్, గౌడ సంఘీయుల ఆధ్వర్యంలో ఐటీఐ ప్రాంగణంలో నిర్వహించిన కార్తిక వనసమారాధనలో తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు సన్మానం

తెనాలి: కార్తిక వనసమారాధనలు సందడిగా నిర్వహించారు. మూడో ఆదివారం పట్టణంలోని వివిధ ప్రదేశాల్లో వన సమారాధనలు ఘనంగా నిర్వహించారు. వివిధ కుల సంఘాలు పెద్ద సంఖ్యలో హాజరుకాగా, రాజకీయ ప్రముఖులు పాలుపంచుకున్నారు. శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘీయుల విజ్ఞాపనలకు సహకరిస్తామని హామీనిచ్చారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి..

యాదవులు ఐకమత్యంగా పయనించాలని ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం చంద్ర వంశీయ క్షత్రియ యాదవ రాజుల 14వ కార్తిక వన సమారాధన వైభవంగా నిర్వహించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని యాదవ వర్గీయుడైన తోట దుర్గాప్రసాద్‌కు కేటాయించినట్లు గుర్తు చేశారు. యాదవ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సహకరిస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ బీసీల ఎదుగుదలకు నాడు ఎన్టీఆర్, ఇటీవల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే తోడ్పాటునిచ్చినట్లు పేర్కొన్నారు. బీసీ వర్గాల్లో యాదవులు పెద్దన్న పాత్రను పోషిస్తున్నారని, ఆ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ అంతా ఐకమత్యంగా, ధర్మం కోసం పనిచేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట దుర్గాప్రసాద్, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, మాగంటి సుధాకర్ యాదవ్, తాళ్ల వెంకటేష్ యాదవ్ సహా పలువురు యాదవ సామాజిక వర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. వన సమారాధనకు దాదాపు పదివేల మంది హాజరయ్యారు. దానబోయిన ప్రసాద్, మేడిపోయిన గంగ యాదవ్, తట్టుకూళ్ల అశోక్ యాదవ్,

యాదవ వనసమారాధనలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ రాధికను గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

కోటి యాదవ్, ఆరాధ్యుల శివాయాదవ్ తదితరులు రామచంద్ర యాదవ్‌ను భారీ గజమాలతో సత్కరించి, శ్రీకృష్ణుని ప్రతిమను అందజేశారు. కార్యక్రమంలో తాడిబోయిన శ్రీనివాసరావు, తాడిబోయిన రమేష్, బచ్చనబోయిన శ్రీనివాసరావు, కుక్కల వాసు, తుపాకుల రామకృష్ణ, దానబోయిన నరసయ్య, బొంత సాంబయ్య, కరేటి లక్ష్మీనారాయణ, జీవీ నారాయణ, గంపల శివ నాగేశ్వరరావు, మల్లెబోయిన రాము, హరికృష్ణ, కుక్కల రాజా, సమాధి మహేష్, మునగా శివ పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల సంఘం ఆధ్వర్యంలో..

సమాజంలో అందరినీ ముందుకు తీసుకెళ్లాలనేది తమ ఉద్దేశమని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అగ్నికుల క్షత్రియులంతా కలసికట్టుగా వ్యవహరించాలని, తన వంతు సాయం చేస్తానని చెప్పారు. తెనాలి అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ 6వ కార్తిక వనసమారాధన ఆదివారం స్థానిక బోసురోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ కళా సదనంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అగ్నికుల క్షత్రియ సంఘీయులను అభినందించారు. వనసమారాధనలు నేడు కుల సమారాధనలుగా మారాయని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ నేటి తరానికి బంధుమిత్రులు ఎవరో తెలుసుకునేందుకు, అనుబంధాలను పెంచుకునేందుకు ఇవి తోడ్పడతాయని చెప్పారు. కార్యక్రమంలో సైకం లక్ష్మణరావు, కొక్కిలిగడ్డ అజయ్, సైకం పార్థసారథి, మైలా చెన్నకేశవరావు, రేవు రమణ పాల్గొన్నారు.

జై గౌడ, గౌడ సంఘీయుల ఆధ్వర్యంలో..

గౌడ సంఘీయుల కార్యక్రమాలను ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లటం అభినందనీయమని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఐటీఐ ప్రాంగణంలో ఆదివారం జరిగిన జై గౌడ్ ఉద్యమ జాతీయ కమిటీ, గౌడ సంఘీయుల ఆధ్వర్యంలో కంఠమహేశ్వర స్వామి కాటమయ్య 10వ కార్తిక వనసమారాధన, కౌండిన్య జయంతి ఉత్సవాల్లో మనోహర్ పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ వైకుంఠపురం దేవస్థానం నిర్మాత గౌడ అయినప్పటికీ ఆ వర్గీయులకు ఇంతకాలమైనా ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవి దక్కకపోవడం తనను ఆలోచింపజేసిందని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక వైకుంఠపురం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవిని వారికే ఇచ్చినట్టు గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ తనను వెన్నంటి ఉంటున్న గౌడలంటే తనకెంతో అభిమానమని చెప్పారు. జైగౌడ్ ఉద్యమ కమిటీ నేతలు చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్, కాటం రవికుమార్ గౌడ్, వాకా అర్జున్ గౌడ్, వీరమల్లు కార్తిక్ గౌడ్, వట్టికూటి రామారావు గౌడ్ పర్యవేక్షించారు.

పద్మశాలీయ బహూత్తమ ఆధ్వర్యంలో..

స్థానిక తెనాలి వైకుంఠపురం దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం శ్రీపద్మశాలి బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన వైభవంగా నిర్వహించారు. మార్కండేయ మహా యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పద్మశాలీయ సంఘాల సభ్యులు, సంఘీయులు పాల్గొన్నారు. తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు సంఘ అధ్యక్షులు తిరువీధుల సాంబశివరావు, పంచుమర్తి భాస్కర్, గట్టు బాల శ్రీనివాసరావు, జొన్నాదుల మహేష్, దివి హేమంత్, కొడాలి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

12న ప్రజా ఉద్యమ ర్యాలీని జయప్రదం చేయండి

మాట్లాడుతున్న పిచ్చిరెడ్డి

పట్నంబజారు: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న జరగనున్న ప్రజా ఉద్యమ ర్యాలీని జయప్రదం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బూత్ కమిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉడుముల పిచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. మల్లికార్జునరావుపేటలోని కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పేదలకు వైద్య విద్యను, వైద్యాన్ని దూరం చేసే దిశగా దిక్కుమాలిన నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు. దీనిపై కుల, మత, ప్రాంత, పార్టీలకతీతంగా ప్రజా ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. భావితరాల భవిష్యత్తుకు దిక్సూచీగా మారనున్న వైద్య కళాశాలలు ప్రైవేటు పరం కాకుండా జరుగుతున్న కోటి సంతకాల కార్యక్రమంలో మన సంతకం మన బాధ్యత అనే విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో బూత్ కమిటీ జిల్లా నేతలు, ఆయా నియోజకవర్గాలు, మండల నేతలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

పర్చూరు(చినగంజాం): మృతి చెంది ఆస్పత్రిలో దిక్కులేకుండా పడి ఉన్న వ్యక్తి శవాన్ని వారి బంధువులకు అప్పగించి దహన సంస్కారాలకు పర్చూరు ఎస్ఐ జీవీ చౌదరి సాయమందించారు. నూతలపాడుకు చెందిన చీరాల శ్రీనివాసరావు జ్వరంతో బాధపడుతుంటే అతని కుమారుడు సురేష్‌బాబు చికిత్స కోసమై పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి కనిపించకుండా వెళ్లిపోయాడు. అటు తరువాత ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు చనిపోయాడు. దహన సంస్కారాలు కూడా చేయలేని స్థితిలో ఉన్నారని తెలుసుకున్న ఎస్ఐ అవసరమైన సహాయ సహకారాలు అందించారు.

రక్తనాళాలపై అవగాహన పెంచుకోవాలి

వాస్కులర్ వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నందకిషోర్, డాక్టర్ విజయ్‌కుమార్

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నందకిషోర్

గుంటూరు వెస్ట్: రక్తనాళాలపై అవగాహన కలిగి ఉంటే ఎన్నో అనర్థాలను ముందుగానే గుర్తించి సరిచేసే అవకాశముంటుందని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నందకిషోర్ పేర్కొన్నారు. వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి వాస్కులర్ వాక్‌థాన్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తనాళాలు మనిషికి ఎంతో కీలకమన్నారు. నిత్యం వ్యాయామం, చక్కని ఆహార అలవాట్లతోపాటు క్రమం తప్పని మెడికల్ టెస్ట్‌లు చేయించుకుంటే ముందుగానే అరికట్టవచ్చని తెలిపారు. నేటి ఆధునిక యువత, అవగాహన లేక అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటిని నిర్మూలించడానికి ఎన్నో పద్ధతులు సమాజంలో ఉన్నాయని తెలిపారు. వాస్కులర్ సర్జన్ డాక్టర్ వి.విజయకుమార్ మాట్లాడుతూ వాస్కులర్ వాక్‌థాన్‌ను దేశ వ్యాప్తంగా 25 ప్రాంతాల్లో నిర్వహించారన్నారు. ఊబకాయం, మధుమేహ రోగుల్లో రక్తనాళాల సమస్యల కారణంగా కాళ్లు, చేతులు శాశ్వతంగా తొలగిస్తున్నారన్నారు. ముఖ్యంగా మధుమేహ రోగులు కొద్దిపాటి జాగ్రత్తలతోపాటు అవగాహన కలిగి ఉంటే చాలా ఇబ్బందులను తొలగించే అవకాశముంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రక్తనాళాల సమస్యలకు ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అనంతరం వాక్ స్టేడియం నుంచి మదర్‌థెరిస్సా విగ్రహం వద్దకు కొనసాగింది. కార్యక్రమంలో వాస్కులర్ సర్జన్స్ సురేష్‌రెడ్డి, సురేంద్ర, రత్నశ్రీ , ఐఎంఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ బి.సాయికృష్ణ, ఉపాధ్యక్షులు ఎం.శివప్రసాద్ పాల్గొన్నారు.

పులిచింతలకు 31,101 క్యూసెక్కులు విడుదల

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నాలుగు క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్లు ద్వారా విద్యుత్ ఉత్పాదన అనంతరం మొత్తం 31,101 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెయిల్ పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ రెండు క్రస్ట్‌గేట్లు 1.5 మీటర్లు, మరో రెండు క్రస్ట్‌గేట్లు మీటర్ ఎత్తు ఎత్తి 22,640 క్యూసెక్కులు, రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పాదన అనంతరం 8,461 క్యూసెక్కులు మొత్తం 31,101 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటి మట్టం 75.50 మీటర్లకుగాను 75.50 మీటర్లకు చేరిందన్నారు. రిజర్వాయర్ గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం రిజర్వాయర్‌లో 7.080 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. టీఆర్‌సీ లెవల్ 55.62 మీటర్లకు చేరుకుందన్నారు. ఎగువనున్న నాగార్జునసాగర్ నుంచి ప్రస్తుతం 34,185 క్యూసెక్కులు వస్తుందని పై నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేసిన కూటమి ప్రభుత్వం

- సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు
- 'చలో ఖమ్మం' విజయవంతం చేయాలని పిలుపు

మాట్లాడుతున నాగేశ్వరరావు

లక్ష్మీపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలల పాలనలోనే రూ.2.5 లక్షల కోట్లు అప్పులు తెచ్చి ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేసిందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం కార్పొరేట్ వర్గాల కోసమే పనిచేస్తోందని అ న్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం ప్రజలను తీవ్ర కష్టాల్లోకి నెట్టా యని అన్నారు. సీపీఐ శతవార్షికోత్సవాల సందర్భంగా డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే మహాసభలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు, అభిమానులు విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాల ని పిలుపునిచ్చారు. నవంబరు 18న సామాజిక న్యాయంపై అన్ని పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబరు 20 నుంచి డిసెంబరు 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా శతవార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించిందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా విభజన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి ందన్నారు. సమావేశంలో వేదికపై సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 35 ఏళ్ల వ్యక్తి తెనాలి నుంచి చుండూరు వెళ్లే రైలు మార్గంలో కొత్తగా ఏర్పాటు చేసిన మూడో లైనులో పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కాఫీ రంగు చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలన్నారు.

రాష్ట్ర సాఫ్ట్ బాల్ పోటీల విజేత గుంటూరు

సత్తెనపల్లి: 12వ రాష్ట్ర సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ 2025 విజేతగా గుంటూరు నిలిచింది. సత్తెనపల్లి మండలం లయోలా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో నిర్వహించిన 12వ రాష్ట్ర సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ 2025 పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన గుంటూరు టీమ్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానాన్ని విజయనగరం టీమ్, తృతీయ స్థానం అనంతపురం టీమ్ కైవసం చేసుకున్నాయి. బహుమతి ప్రదానోత్సవంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.జగ్గారావు హాజరై మాట్లాడారు. క్రీడలతోపాటు విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలో 415 పోస్టుల్లో 49 పోస్టులు సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు దక్కడం అభినందనీయమన్నారు. సభకు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ గుంటూరు జిల్లా ప్రెసిడెంట్ వంశీకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ రమణ, స్కాలర్స్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, కె.సత్యం, లయోలా కళాశాల అడ్మిషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ గుంటూరు జిల్లా సామంత్‌రెడ్డి, ట్రెజరర్ జనార్ధన్ యాదవ్ ఆవుల, నరసింహారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భట్టిప్రోలు: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వేగంగా లారీ ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఎన్‌హెచ్–216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. భట్టిప్రోలు ఎస్ఐ ఎం. శివయ్య కథనం ప్రకారం గుంటూరుకు చెందిన ఎస్కే అహ్మద్ వలి(27) చెరుకుపల్లి మండలంలోని గూడవల్లికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గుంటూరు నుంచి గూడవల్లికి బైక్‌పై వచ్చాడు. అక్కడి నుంచి రేపల్లెకు వ్యక్తిగత పనులపై వెళ్లి తిరిగి వస్తుండగా భట్టిప్రోలు సమీపంలో సూరేపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగుతుండగా వెనుక నుంచి వేగంగా లారీ వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో అహ్మద్ వలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివయ్య తెలిపారు.

క్షతగాత్రుడికి సత్వర చికిత్స

మానవత్వం చాటుకున్న వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జెల

రోడ్డు ప్రమాదంలో దెబ్బలు తగిలిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేస్తున్న సమన్వయకర్త డాక్టర్ గజ్జెల

రాజుపాలెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడికి వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జెల సుధీర్ భార్గవరెడ్డి ప్రథమ చికిత్స అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. అద్దంకి – నార్కెట్‌పల్లి రహదారిపై పెదనెమలిపురి వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోయాడు. అదేసమయంలో పిడుగురాళ్ల నుంచి నరసరావుపేట వెళుతున్న డాక్టర్ గజ్జెల సుధీర్ భార్గవ రెడ్డి తీవ్ర గాయాలతో పడిఉన్న యువకుడిని గమనించి, వెంటనే అతని వద్దకు చేరి, ప్రథమ చికిత్స చేసి, క్షతగాత్రుడిని స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించారు. ఆపద సమయంలో మానవత్వంతో సత్వరం స్పందించిన డాక్టర్ గజ్జెల సుధీర్ భార్గవరెడ్డిని స్థానికులు అభినందించారు.

పెద్దపులి దాడిలో గేదె మృతి

వెల్దుర్తి: నల్లమల అటవీ ప్రాంత సమీపంలోని వజ్రాలపాడు తండా సమీపంలో మేత మేస్తున్న గేదెపై పెద్దపులి దాడి చేయగా, గేదె అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. మండలంలోని వజ్రాలపాడు తండాకు చెందిన మూడావత్ తులశ్యానాయక్‌కు చెందిన గేదె అడవిలో మేత మేస్తుంటే పెద్దపులి దాడి చేసి చంపింది. విషయం తెలుసుకున్న తులశ్యానాయక్, సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. గేదె మెడ కొరికి తాగిన ఆనవాళ్లు ఉండడంతో పెద్దపులి దాడిచేసినట్లు స్థానికులు చెబుతున్నారు. రూ.50వేల విలువైన గేదె పెద్దపులి దాడిలో చనిపోయిందని అటవీశాఖాధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ ప్రాంతంలో అప్పుడప్పుడు పెద్దపులి సంచరిస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అటవీశాఖాధికారులు మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రజా ఉద్యమంపై విస్తృత ప్రచారం చేయండి

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్

పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ప్రేమ్‌కుమార్, సోషల్ మీడియా సభ్యులు

పట్నంబజారు: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12వ తేదీన జరగనున్న ప్రజా ఉద్యమాన్ని జయప్రదం చేసే దిశగా, విస్తృతమైన ప్రచారం చేయాల్సిన బాధ్యత సోషల్ మీడియా సభ్యులపై ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షులు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లాలోని సోషల్ మీడియా నియోజకవర్గాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం జరుగుతున్న ఈ ఉద్యమాన్ని భుజాన వేసుకుని ముందుకు తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముఖ్యంగా మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ అయితే జరిగే నష్టం ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ కుట్రలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రతి సోషల్ మీడియా సభ్యులు కచ్చితంగా 12న జరిగే ర్యాలీలో పాల్గొనాలని కోరారు. అనంతరం పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శి మేకా వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జావీద్, గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల అధ్యక్షులు, రమేష్, సాగర్, ఉపాధ్యక్షుడు కర్రి భాస్కర్, కార్యదర్శి నంద కిషోర్, జిల్లా కమిటీ సభ్యులు, మండల విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించడం సాధ్యం కాదు

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- మిర్చియార్డు, శంకర్ విలాస్ బ్రిడ్జి పనుల పరిశీలన

శంకర్‌విలాస్ బ్రిడ్జి పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

నెహ్రూనగర్: శంకర్ విలాస్ బ్రిడ్జి వద్ద ఉన్న షాపుల నిర్వాహకులు అడుగుతున్న నష్ట పరిహారం చెల్లించడం సాధ్యం కాదని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఆదివారం మిర్చి యార్డు, శంకర్ విలాస్ వంతెన నిర్మాణ పనులను నగర మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు, నగర కమిషనర్ పులి శ్రీనివాసులతో కలసి పనులను పరిశీలించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ మిర్చి యార్డు వద్దపై వంతెన పనులు చాలా వేగంగా జరుగుతున్న నేపథ్యంలో యార్డు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం అడ్డంకి కాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. శంకర్ విలాస్ బ్రిడ్జి జీజీహెచ్ వైపు డిసెంబర్ 15 తేదీలోగా 7 పిల్లర్లు పూర్తయ్యేలా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శంకర్ విలాస్ వైపు ఉన్న షాపులు తొలగించడంలో కొంత జాప్యం చోటు చేసుకుందని, వ్యాపారులు, ప్రజలు అర్థం చేసుకుని అభివృద్ధికి సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణలో కోల్పోయే షాపులకు యాజమానులు అడుగుతున్న నష్టపరిహారం సాధ్యం కాదని...సదరు సమస్య పరిష్కారానికి నగరపాలక సంస్థ మేయర్, కమిషనర్ చర్చలు జరుపుతున్నారని వీలైనంత త్వరలో పరిష్కారమవుతుందన్నారు.

పరమ శివుడు, పోలేరమ్మకు సూర్యాభిషేకం

వేటపాలెం: నాయినపల్లిలోని గంగా భవానీ సమేత భోగలింగేశ్వరస్వామి దేవస్థానంలో పరమ శివుడ్ని ఆదివారం భానుడి కిరణాలు అభిషేకించాయి. శివుడికి ప్రీతిపాత్రమైన కార్తిక మాసంలో శివలింగాన్ని తాకడాన్ని భక్తులు అధిక సంఖ్యలో వీక్షించారు. అర్చకులు స్వామికి పలు పూజలు చేశారు.

పోలేరమ్మ ఆలయంలో..

చీరాల: పట్టణంలోని పాపరాజుతోటలో గల శ్రీ పోలేరమ్మ అమ్మవారి అర్ధ ముఖాన్ని ఆదివారం సూర్య కిరణాలు తాకాయి. ఈ అద్భుత దృశ్యం అమ్మవారి దివ్య చైతన్యానికి సంకేతమంటు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది కార్తిక మాసంలో సూర్య కిరణాలు అమ్మవారిని తాకుతుంటాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ ప్రముఖ బ్యాంకుల నందు గల హౌసింగ్ లోన్‌లు మా యొక్క బ్యాంకుకు టేక్ ఓవర్ చేయబడును & కొత్త లోనులు చేయబడును కమీషన్ అవసరం లేదు. & DSAలు కావలెను. కమిషన్ వెంటనే ఇవ్వబడును. సంప్ర: 8121847536, 9966617161

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED

■ అమరావతిలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను. వెంటనే సంప్రదించండి. శ్రీ రాజరాజేశ్వరి సెక్యూరిటీ సర్వీసెస్. 9346138743, 8008202789

■ గుంటూరులో బస్టాండ్ ఎదురు మా సంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qual: 10th-డిగ్రీ, టైం: 9 AM - 5-30 PM, Sal: 9000 ✆ 99893 98775

■ గుంటూరు జిల్లా "వన్ లైఫ్ - వన్ కార్డ్" హెల్త్ కేర్ కంపెనీలో 1. హెల్త్ కార్డ్ ప్రమోషన్ కొరకు (కనోపిటెంట్ / Canopy Tent), 2.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, 3.ప్రొక్యూర్మెంట్ మేనేజర్లుగా పని చేయుటకొరకు (స్త్రీలు/ పురుషులు) ఉద్యోగులు కావలెను. అర్హత : 10th/ ఇంటర్ / డిగ్రీ. సంప్రదించగలరు : 9030150481, 9494022442

■ కేర్ టేకర్స్ (మెడికల్) జీతం 18వేలు, ఇంటిపంట 18 వేలు, వార్డెన్స్ డిగ్రీ పి.జి. జీతం 18వేలు, రిసెప్షనిస్ట్ జీ. 18 వేలు, భోజనం వసతి కలదు. 98854 26486

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీ నందు Computer Operator గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Any Degree, 55 Wpm Typing Speed, MS Office Skills. వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీ నందు Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35000/- నుండి 45000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

■ గుంటూరులోని రెస్టారెంట్‌లో పని చేయుటకు అనుభవం గల కెప్టెన్స్, వెయిటర్స్ కావలెను. మంచిజీతం రూమ్ + భోజనం ఫ్రీ. సంప్ర: 94936 80998

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్
రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు వచ్చిన వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే దానితో ఈ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

రౌడీషీటర్లలో మార్పు రాకపోతే పీడీ యాక్ట్

మంగళగిరి టౌన్: రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోకున్నా, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని మంగళగిరి పట్టణ ఎస్ఐ హరిబాబు హెచ్చరించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు నేరాలకు పాల్పడినా తప్పించుకోలేరని, సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తుతో ప్రతి నేరస్తుడు చట్టానికి దొరుకుతాడన్నారు. రౌడీషీటర్లు గొడవల్లో తలదూర్చినా, ఎవరినైనా బెదిరించినా ఉపేక్షించేది లేదని, అలాంటివారు జైలు జీవితం గడపాల్సి వస్తుందన్నారు. ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎవరు చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా సహించబోమన్నారు.

విద్యార్థులకు స్కిల్ పోటీలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఒకేషనల్ విద్యార్థులకు ఒకేషనల్ ఉపాధ్యాయుడు గొల్లపల్లి రాఘవేంద్రసాయిదేవ్ స్కిల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. అనంత శివ మాట్లాడుతూ స్మార్ట్‌హౌస్, సోలార్ పవర్ ప్రొడక్షన్, థర్మల్ పవర్ ప్రొడక్షన్‌లో వర్కింగ్ మోడల్స్‌ను తయారు చేసి ప్రదర్శించామన్నారు. వీటిలో ఆరు మోడల్స్‌ను తెనాలిలోని జేఎంజే కాలేజీలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలకు పంపామని పేర్కొన్నారు. మోడల్స్‌లను పరిశీలించిన న్యాయనిర్ణేతలు వారికి ప్రశంసా పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఒకేషనల్ ఉపాధ్యాయుడు సాయిదేవ్‌ను, విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సీతారామలక్ష్మణుల విగ్రహాల ప్రతిష్ఠ

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు శివారులో గరువు కొండ వద్ద వేంచేసియున్న శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో సీతారామలక్ష్మణుల నూతన విగ్రహ వాయు ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, పుణ్యాహవాచనం, క్షీరాధి, జలాధివాసం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వాయుప్రతిష్ఠ చేశారు. యాగశాలలో మన్యుసూక్త హవనంతో హోమం నిర్వహించారు. వేములూరిపాడు, అమీనాబాద్, పుట్టకోట గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నదానం చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

మేడికొండూరు: ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టడంతో పలువురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కొరప్రాడు వద్ద ఆదివారం జరిగింది. పిడుగురాళ్ల నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీస బస్సును, ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసరావు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు మేడికొండూరు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

ఇప్పటంలో లక్ష దీపోత్సవం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటంలో శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం లక్షదీపోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ ట్రస్టీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మహిళలు లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శంకరశెట్టి రమేష్, మున్నంగి వివేకానందరెడ్డి, విప్పల రామిరెడ్డి, గాజుల నగేష్‌బాబు, వీరంకి శివయ్య, ఆలయ అర్చకులు బాజీకృష్ణ అప్పారావు శర్మ, వడ్లమూడి శివప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహారుద్రహోమం

ఫిరంగిపురం: వేమవరం గ్రామంలో పోతులూరివీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం మహాన్యాస పూర్వక మహారుద్రహోమం నిర్వహించారు. ముందుగా వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబలకు అర్చకులు గడియారం అయ్యన్నశాస్త్రి పంచామృతాలతో పూజలు చేసి విశేష అర్చనలు నిర్వహించారు.

విద్య, వైద్యం ప్రజల హక్కు

- ప్రభుత్వాలు కాలరాస్తే సహించేది లేదు
- ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణ విధానాన్ని మానుకోవాలి
- వైఎస్సార్ సీపీ మంగళగిరి, తాడికొండ సమన్వయకర్తలు డీవీఆర్, వజ్రబాబు

పెనుమాక బొడ్డురాయి సెంటర్‌లో మెడికల్ విద్యార్థి నుంచి సంతకాలు సేకరిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు

తుళ్ళూరులో కోటి సంతకాల సేకరణలో వనమా బాల వజ్రబాబు

మంగళగిరిలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: విద్య, వైద్యం అనేవి ప్రజల ప్రాథమిక హక్కు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సంక్షేమాన్ని వదిలివేసి కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతూ ప్రజా శ్రేయస్సును కాలరాస్తోందని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. ఆదివారం రాత్రి తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో పెనుమాక, ఉండవల్లి పార్టీ అధ్యక్షులు మేకా శివారెడ్డి, మున్నంగి వీర శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీవీఆర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతూ వారి అనుయాయులను మరింత సంపన్నులను చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేద ప్రజలకు ఉచిత వైద్యం, వైద్యవిద్య అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారు. అందులో 5 మెడికల్ కాలేజీలను ప్రారంభించారన్నారు. పెనుమాకలో సంతకాలు సేకరిస్తున్న సమయంలో ఓ మెడికల్ విద్యార్థి తన ఆవేదనను తెలియజేసింది. ఏపీలో ఆనాడు వైఎస్సార్ పేద కుటుంబాలు చదువుకుంటే వారి కుటుంబ ఆర్థిక స్థితిగతులు మారతాయని ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏర్పాటు చేసి ఎంతోమంది విద్యార్థులు ఉన్నత విద్య

కు చర్యలు తీసుకున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని బలోపేతం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పులి భుజంగరావు, మేకా అంజిరెడ్డి, షేక్ బషీర్, ఎన్. రవీంద్రబాబు, మేకా ప్రభాకర్ రెడ్డి, మేకా దామేశ్వరరెడ్డి, ఎన్. పుల్లారావు, బొక్క వంశీ, షేక్ మహబూబ్ సుభాని, కట్టిపోగు దానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో..

ఉండవల్లిలో జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో కళ్ళం పిచ్చిరెడ్డి, తమ్మా వీరారెడ్డి, అశోక్‌రెడ్డి, డి. అనీల్, మన్నెం సుబ్బారావు, సిగిరిశెట్టి శ్రీకాంత్, వల్లభాపురం శివశంకర్, ప్రదీప్, బుర్రముక్కు హేమంత్ రెడ్డి, మర్రిబోయిన వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై కుట్ర

తాడికొండ: పేదవాడికి మెరుగైన వైద్యం అందడం ఇష్టం లేకే బాబు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. తుళ్ళూరులో ఆదివారం నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన ఇంటింటికీ తిరిగి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్‌లకు రెడ్‌కార్పెట్ పరుస్తూ పేదలను అణగదొక్కడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దీనిలో భాగమే పీపీపీ విధానమని ధ్వజమెత్తారు. కరోనా కష్టకాలంలోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేస్తే బాబు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేక చేతులెత్తేశాడని మండిపడ్డారు. కార్యక్రమంలో తుళ్ళూరు మండల పార్టీ అధ్యక్షుడు మైనేని నాగ మల్లేశ్వరరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు కంతేటి చిన్న వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల నాయకులు కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, చుండు వెంకటరెడ్డి, షేక్ జానీభాషా, బెజ్జం రాంబాబు, పుట్టా నాగరాజు, కొయ్యగూర వినోద్, డీజే శ్రీనివాసరావు, కంతేటి అశోక్, ఆలోకం సురేష్, గడ్డం జయరావు, సన్నెకంటి ప్రశాంత్, ఇందుర్తి అప్పారావు, యాదల వసంతరావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో తీరని నష్టం

మంగళగిరి టౌన్: ప్రభుత్వ వైద్యకళాశాల ప్రైవేటీకరణతో ప్రజారోగ్యానికి భరోసా లేకుండా పోతోందని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళగిరి పట్టణ పరిధిలోని 23వ వార్డులో వార్డు అధ్యక్షులు దేశమాల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైద్యకళాశాలలు ప్రైవేటీకరణ అయితే జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, ఎస్సీ విభాగ అధ్యక్షులు మాతంగి బాబు, పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు సంకె సునీత, యువజన విభాగ అధ్యక్షులు గోపీకృష్ణ, విద్యార్థి విభాగ అధ్యక్షులు ప్రదీప్, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి సుధారాణి, నాయకులు ఎలీషా, జోజి, ఉదయ్ కుమార్, ఇస్సాకు, చక్రవర్తి, దావీదు, రవి, దేవసహాయం, సామ్రాజ్యం, ఏసుమణమ్మ, అన్నపూర్ణ, గౌతమి, ఆంజనేయులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు గ్రామంలో గ్రామ అధ్యక్షుడు శ్యామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయ్‌కుమార్, సాంబశివరావు, కిషోర్ రెడ్డి, అలేఖ్య, రాజ్యలక్ష్మి, వెంకటేష్, దుర్గాప్రసాద్, నరసింహ, సాయి, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చినకాకానిలో..

చినకాకాని గ్రామంలో జరిగిన సంతకాల సేకరణలో గ్రామ అధ్యక్షులు మల్లవరపు కాంతారావు, నాయకులు నూతక్కి జోష్, రామకృష్ణారెడ్డి, రామనాగు, చిన్న, గోపి, చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: పట్టణ పరిధిలోని 10,12,22 వార్డుల్లో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు చిలుకూరి శివ, షేక్ నాగూర్ వలి, నూర్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆత్మకూరులో..

10వ వార్డులో..

12వ వార్డులో..

22వ వార్డులో..

‘ప్రైవేటీకరణ’పై ప్రజా ఉద్యమం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త డీవీఆర్, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి తదితరులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమాబాలవజ్రబాబు, నాయకులు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్తలు డీవీర్, వజ్రబాబు

మంగళగిరి టౌన్: పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని, వైద్యవిద్యను అందించాలని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మెడికల్‌కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుడితే వాటిని ప్రైవేటీకరణతో కూటమి ప్రభుత్వం పేదలకు దూరం చేస్తోందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్), మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు మండిపడ్డారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమం చేపట్టనున్నామన్నారు. ఆత్మకూరు బైపాస్ వెంట ఉన్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న తలపెట్టిన నిరసన ర్యాలీకి కలసి వచ్చే అన్నిపార్టీలను కలుపుకొని పోదామని, అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీ నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి గాలిగోపురం మీదుగా మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వరకు ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేయనున్నామన్నారు. కూటమి ప్రభుత్వం కుట్రలతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

జగన్ పాలనలో విప్లవాత్మక మార్పులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని, పేద విద్యార్థుల వైద్యవిద్య కలను సాకారం చేసే దిశగా అడుగులు వేశారని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, మండల అధ్యక్షులు నాలి వెంకట కృష్ణ, దుగ్గిరాల మండల అధ్యక్షులు శివగోపయ్య, రాష్ట్ర పంచాయితీరాజ్ విభాగ కార్యదర్శి ఫిరోజ్, సంయుక్త కార్యదర్శి ఈపూరి ఆదాము, నియోజకవర్గ ఇంటలెక్చువల్ అధ్యక్షులు నాగిరెడ్డి, బీసీ విభాగ అధ్యక్షులు సుబ్బారావు, మున్సిపల్ విభాగ అధ్యక్షులు సుబ్బారావు, డాక్టర్స్ విభాగ అధ్యక్షులు బాలమురళీకృష్ణ, ప్రచార విభాగ అధ్యక్షులు సురేంద్ర, మహిళా విభాగ అధ్యక్షురాలు చిలువూరి ఫిలోమినా, జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు పాల శ్రీనివాసరావు, జిల్లా దివ్యాంగుల విభాగ అధ్యక్షులు అగస్టీన్, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి సుధారాణి, జిల్లా మైనార్టీ విభాగ కార్యదర్శి సుభాని, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి బాషా, మండల ప్రధాన కార్యదర్శి విజయబాబు, పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు సునీత, యువజన విభాగ అధ్యక్షులు గోపీకృష్ణ, పట్టణ మైనార్టీ విభాగ అధ్యక్షులు మాలక్‌బాబు, నాయకులు సుంకర రఘుపతిరావు, బోళ్ళ సుబ్బారెడ్డి, తుమ్మా రాంబాబు, సురేష్, రజనీకాంత్, డోగిపర్తి శ్రీనివాసరావు, నిర్మల, తమ్మిశెట్టి గౌతమి, బియ్యపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సు కోసం వైఎస్సార్ సీపీ పోరాటం

తాడికొండ: ప్రజా శ్రేయస్సు కోసం వైఎస్సార్ సీపీ ఎందాకైనా పోరాటం చేస్తుందని వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. ఆదివారం గుంటూరు మల్లికార్జునపేటలోని పార్టీ కార్యాలయంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న జరగబోయే ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పేదలకు వెన్ను దన్నుగా వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన ఆరోగ్య శ్రీ పథకాన్ని కూడా చంద్రబాబు నిర్వీర్యం చేశారన్నారు. నాలుగు మండలాల అధ్యక్షులు వంగా పోలారెడ్డి, మార్పుల శివరామిరెడ్డి, మైనేని నాగ మల్లేశ్వరరావు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు ఉడుముల పిచ్చిరెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు చావలి రంజిత్, జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షుడు దాసరి రాజు, ముప్పాళ్ళ మనోహర్, కల్లం హరికృష్ణారెడ్డి, వివిధ విభాగాల నాయకులు చుండు వెంకటరెడ్డి, బేతపూడి రాజేంద్ర, ఆరేపల్లి జోజి, కొప్పుల శేషగిరిరావు, ఐనవోలు సుధీర్, డీజే శ్రీనివాసరావు, కంచర్ల రాజు, కాకి శ్రీకాంత్, యశ్వంత్, కుర్రా హరి బాబు, షేక్ నాసర్ వలి (అబ్బాస్), ముత్యాల బాలస్వామి, కొరివి కిషోర్, రసూల్, సుభానీ, కొరివి చెన్నయ్య, రబ్బాని, శివరామకృష్ణ, బుడే, వెంకటేశ్వరరావు, కాకి శ్రీకాంత్, కొమ్మారెడ్డి ప్రవీణ్ రెడ్డి, బిళ్ళా లూర్థయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పాలకులు స్పందించాలి

కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: ఏసీసీ కార్మికుల సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను యూనియన్ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, సుబ్బారావు, సూర్యప్రకాష్‌తో కలసి సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. సుభాని, నాగేశ్వరరావు, నవనీతమ్మ, శారద, రమణమ్మ, ఏడుకొండలు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ కార్మికులకు అండగా వైఎస్సార్‌టీయూసీ

నిరసనకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో పనిచేస్తున్న కార్మికులకు వైఎస్సార్‌టీయూసీ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీకి చెందిన సంఘ నేత ఆర్. శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఆరు రోజులుగా ఎయిమ్స్ వైద్యశాలలోని కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి ఆదివారం మద్దతు పలికారు. ఈ సందర్భంగా దీక్షలను ప్రారంభించిన అనంతరం శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఎయిమ్స్ యాజమాన్యం గతంలో పనిచేసిన కార్మికులకు ఎరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కోర్టు తీర్పు వెలువరించినా యాజమాన్యం అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బుజ్జిబాబు, రవి, జి. శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వన సమారాధన

కోలాటమాడుతున్న మహిళలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాకలో ఆదివారం రాజధాని పారిశుద్ధ్య కార్మికుల వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు ఎం. రవి అధ్యక్షత నిర్వహించగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడితో సతమతమవుతున్న పారిశుద్ధ్య కార్మికులు కుటుంబ సభ్యులతో కలసి వనభోజనాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడపటం జరిగిందన్నారు. కార్మిక కుటుంబ సభ్యులు ఉత్సాహంగా ఆటలు, పాటలు, కోలాటం, డ్యాన్స్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు పద్మ, సీఐటీయూ గుంటూరు జిల్లా కార్యదర్శి నేతాజీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు లక్ష్మణరావు, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మ, అరుణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ముత్యాలరావు, ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెంగయ్య, సీఐటీయూ రాజధాని డివిజన్ కార్యదర్శి భాగ్యరాజు, ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా అధ్యక్షులు పద్మ, నాయకులు రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ మార్కెట్ యార్డు పాలక వర్గం ప్రమాణస్వీకారం

తాడికొండ: తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకవర్గం ఆదివారం కొలువు దీరింది. తాడికొండ మండలం ముక్కామల గ్రామానికి చెందిన నీలాల ధనలక్ష్మిని యార్డు చైర్మన్‌గా గతంలోనే ప్రకటించగా ఇటీవల వైస్ చైర్మన్‌గా తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామానికి చెందిన చిలుకూరి వెంకటరెడ్డి, పాలకవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆదివారం తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ హాజరై పాలకవర్గ సభ్యుల ప్రమాణీ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. మార్కెటింగ్ డీడీ సుధాకర్, యార్డు సెక్రటరీ రజని తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా రక్తపోటును పరీక్షించుకోవాలి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ విజయ

మంగళగిరి టౌన్ : క్రమం తప్పకుండా 18 ఏళ్లు దాటిన వారు రక్తపోటును పరీక్షించుకుని నియంత్రణలో ఉంచుకోవాలని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) ప్రెసిడెంట్ డాక్టర్ విజయ సూచించారు. మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో ఐఎస్ఏ, ఎయిమ్స్ మంగళగిరి న్యూరాలజీ విభాగం సంయుక్తంగా స్ట్రోక్ అకాడమి సింపోసియం ద్వారా ఆదివారం పక్షవాతంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ పక్షవాతం ఎవరికైనా, ఎప్పుడైనా రావచ్చని సుమారు 30 శాతం మంది 50 సంవత్సరాలలోపే పక్షవాతానికి గురవుతున్నారన్నారు. పక్షవాతం మొదలైన నాలుగున్నర గంటల్లోపు (గోల్డెన్ హవర్) ఆసుపత్రికి చేరుకుంటే రక్షించవచ్చని తద్వారా దీర్ఘకాలిక వైకల్యాన్ని నిరోధించడానికి అవకాశముంటుందన్నారు. పక్షవాత నివారణపై చెక్ బీపీ - స్టాప్ స్ట్రోక్ క్యాంపైన్‌ను నిర్వహించారు. సదస్సులో గౌరవ అతిథులు ప్రొఫెసర్ సుశీల్ శర్మ (ఎగ్జామినేషన్ డీన్), స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ దీప్తి, అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ కల్నల్ శశికాంత్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ డాక్టర్ వెంకటాచలం, ఐఎస్ఏ సెక్రటరీ డాక్టర్ అరవింద్ శర్మ, డాక్టర్ అలెక్స్ రెబెల్లో, డాక్టర్ అశోక్‌వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దుగ్గిరాల: పెదపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1976–81 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామంలో సందడిగా జరిగింది. పూర్వ విద్యార్థులు గత స్మృతులు, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చారు. ఆర్గనైజర్స్ కొల్లి శ్రీనివాసరెడ్డి, చకిరాల శ్రీనివాస్, పసుపులేటి రామ్మోహన్, దేశబోయిన రాధాకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేగంగా విస్తరిస్తున్న సాంకేతికలు తమ వ్యాపారాలపై ప్రభావం చూపుతాయని చాలా మంది ఎంప్లాయర్స్ భావిస్తున్నారు. ది ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ సర్వే ప్రకారం కృత్రిమమేధస్సు(ఏఐ), సమాచార ప్రాసెసింగ్, రోబోటిక్స్ తదితర సాంకేతికతలు అత్యధిక ప్రభావాన్ని చూపుతాయని అంచనా. 2030 నాటికి 86% మంది ఎంప్లాయర్స్ తమ వ్యాపారం వీటి ద్వారా రూపుదిద్దుకుంటుందని ఆశిస్తున్నారు.



లాంగ్ టర్మ్ గోల్స్ ఉంటేనే.. సార్థకత

డిజిటల్ యుగంలో ఈ దృక్పథం ఎంతో ముఖ్యం

ఇన్‌స్టిట్యూట్స్ స్థాయిలో జాయింట్ కొలాబరేషన్ అవసరం

ఐఐఎం లక్నో డైరెక్టర్ ప్రొఫెసర్. ఎం.పి.గుప్తా

'అకడమిక్‌గానైనా.. కెరీర్ కోణంలోనైనా.. లాంగ్ టర్మ్ గోల్స్ పెట్టుకుని.. వాటిని చేరుకునేలా కృషి చేస్తేనే భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుంది. విద్యార్థులు అకడమిక్స్‌తో పాటు.. నేటి డిజిటల్ యుగంలో మరెన్నో అంశాల్లో రాణించాల్సిన ఆవశ్యకత పెరుగుతోంది. దీనికి అకడమిక్ వర్గాలు, ఇండస్ట్రీ వర్గాలు చేయూతనివ్వాలి' అని అంటున్నారు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-లక్నో(ఐఐఎం-లక్నో) డైరెక్టర్ ప్రొఫెసర్. మన్మోహన్ ప్రసాద్ గుప్తా. ఐఐటీ ఢిల్లీలో పీహెచ్‌డీ పూర్తి చేసి అక్కడే ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తూ.. ఇటీవలే ఐఐఎం-లక్నో డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతేకాకుండా ఈ-గవర్నెన్స్, డిజిటల్ ఇండియా, స్మార్ట్ సిటీ ప్రోగ్రామ్స్‌పై పలు పరిశోధనలు చేసి.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఐసీటీ పాలసీ రూపకల్పనలోనూ కీలకంగా నిలిచిన ప్రొఫెసర్. ఎం.పి. గుప్తాతో ఇంటర్వ్యూ

ప్రొఫెసర్. ఎం.పి. గుప్తా

ప్రస్తుతం మన దేశంలోని ఆర్అండ్‌డీ యాక్టివిటీస్, వాటికి సంబంధించి విద్యార్థుల దృక్పథంపై మీ అభిప్రాయం?

భారత దేశం ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోటీ పడుతోంది. ఇటీవల కాలంలో ఇక్కడ జరుగుతున్న ఆవిష్కరణలు, ఉత్పత్తులకు అమెరికా సహా పలు అభివృద్ధి చెందిన దేశాల్లో ఆదరణ లభిస్తోంది. వికసిత్ భారత్ దిశగా శరవేగంగా అడుగులు పడుతున్నాయి. దీంతో విద్యార్థులకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు లక్ష్య నిర్దేశనకు ఇదే సరైన సమయం. వీరు దీర్ఘకాలిక లక్ష్యాలు నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా ఇన్నోవేషన్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై దృష్టి సారించాలి.

మేనేజ్‌మెంట్ విద్యార్థుల ఆలోచన సరళి ఎలా ఉండాలి?

మేనేజ్‌మెంట్ డిగ్రీతో కార్పొరేట్ కొలువు సొంతం చేసుకుందాం అనే మూస విధానానికి స్వస్తి పలకాలి. 'ఇన్నోవేటివ్'గా ఆలోచించాలి. ఇన్నోవేషన్స్ దిశగా కదలాలి. ఒకప్పుడు ఎంతో వ్యయ ప్రయాసలు పడాల్సిన సేవలు కూడా ఇప్పుడు డోర్‌స్టెప్ వద్ద లభిస్తున్నాయి. ముఖ్యంగా సర్వీస్ సెక్టార్‌లో ఇది ఎక్కువగా ఉంది. వీటిని అందిపుచ్చుకునేలా వ్యవహరించాలి. ఇక కోర్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ పరంగా రిమోట్ ఆధారిత రోబోటిక్ సేవలు, ఏఐ ఆధారిత సేవలు ఎన్నో అందుబాటులోకి వస్తున్నాయి. దీంతో ఇన్నోవేషన్ అంటే ఒక రంగంలో ఒక కొత్త ఉత్పత్తి రూపకల్పనతో అయిపోయింది అనే పరిస్థితులు మారాయి. ఒక కొత్త ఉత్పత్తి రూపకల్పన జరిగితే భవిష్యత్తులో ఆ ఉత్పత్తిని రూపొందించిన సంస్థ సుస్థిరత కోణంలో డెవలప్‌మెంట్స్ చేస్తుంది. ఇందుకు ఇన్నోవేషన్స్ ఉపకరిస్తున్నాయి. విద్యార్థులు వీటిపై దృష్టి పెట్టాలి.

ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా విఫలమవడానికి ముఖ్య కారణాలు వివరిస్తారా?

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో కొందరు విజయం సాధించి అందనంత ఎత్తులకు వెళుతుంటే.. మరికొందరు ప్రారంభంలోనే షట్‌డౌన్ చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం.. సదరు వ్యక్తుల్లో భవిష్యత్తు సుస్థిరత గురించి సరైన ఆలోచన లేకపోవడం. దీనికి పరిష్కారం మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ సాగాలి. స్టార్టప్ పరంగా అప్పటికే నిర్దేశిత రంగంలో ఉత్పత్తులు, సేవలు అందించే సంస్థలు ఉంటే.. వాటికంటే తాము మరింత మేలైన ఉత్పత్తులు, సేవలు అందించేలా కృషి చేయాలి. ఇందుకు క్రిటికల్ అప్రోచ్ ఎంతో మేలు చేస్తుంది. ప్రస్తుతం సదరు రంగంలో సేవలు, ఉత్పత్తుల పరంగా ఉన్న లోపాలపై దృష్టి పెట్టాలి. వాటిని తమ స్టార్టప్స్‌లో లేకుండా చూసుకునే విధంగా ఆలోచనలకు పదును పెట్టాలి. అప్పుడు ఆటోమేటిక్‌గా ఎండ్ యూజర్స్ ఆదరణ కచ్చితంగా లభిస్తుంది.

విద్యార్థులు.. వాస్తవ పరిస్థితులపై నైపుణ్యాలు పొందడానికి పెంచుకోవాల్సిన లక్షణాలు?

ప్రస్తుత పోటీ పరిస్థితుల్లో క్లాస్ రూం బోధనకే పరిమితం కావడం అనే ఆలోచన తమ అభివృద్ధికి తామే అడ్డంకులు సృష్టించుకోవడంగా చెప్పొచ్చు. తరగతి గది నుంచి బయటకు రావాలి. రియల్ టైం అనాలిసిస్ చేయాలి. కేస్ రీసెర్చ్‌లు చేయాలి. అప్పుడే సరైన సార్థకత. లేదంటే ఎంత ప్రతిష్టాత్మక బిజినెస్ స్కూల్‌లో చదివినా.. అంతర్జాతీయ స్థాయి పేరున్న ప్రొఫెసర్ల విజిటింగ్ లెక్చర్స్, గెస్ట్ లెక్చర్స్ విన్నా.. ఆ డిగ్రీ సార్థకత ప్రశ్నార్థకం. లెక్చర్స్ ద్వారా తెలుసుకున్న అంశాల ప్రాక్టికాలిటీపై దృష్టి పెట్టాలి. ఈ విధానమే నేటి పరిస్థితుల్లో అసలైన విజయాలను, సుస్థిర భవిష్యత్తును అందించే సాధనం. దీన్ని నిత్యం జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉంటే సక్సెస్‌కు మార్గం ఏర్పడుతుంది.

విద్యార్థులు ఎలాంటి సవాళ్లకు రెడీగా ఉండాలి?

మేనేజ్‌మెంట్ డిగ్రీలు చదువుతున్న విద్యార్థులు ముఖ్యంగా రెండు సవాళ్లు స్వీకరించేలా తమను తాము తీర్చిదిద్దుకోవాలి. అవి.. ఎంటర్‌ప్రెన్యూర్ ఆసక్తి ఉంటే కొత్త వ్యాపారాన్ని ఎలా రూపొందించాలనే విషయంలో సరైన వ్యూహం ఉండాలి. ఇక ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకుంటే.. అప్పటికే తాము అడుగు పెట్టనున్న పరిశ్రమ లేదా సంస్థ సుస్థిర కాలం కార్యకలాపాలు నిర్వహించే విధంగా తాము భాగస్వాములు కావాలి. సమర్థమైన నిర్వహణ నైపుణ్యాలు క్లాస్ రూంలోనే నేర్చుకోవాలి.

అకడమిక్స్ కోణంలో ఒప్పందాలపై మీ అభిప్రాయం?

ఇవి కచ్చితంగా ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా ఇంటర్‌డిసిప్లినరీ కోర్సుల విషయంలో కోర్ అకడమిక్ ఇన్‌స్టిట్యూట్స్‌తో కలిసి ప్రోగ్రామ్‌లు రూపొందించడం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుంది. ఇదే ఉద్దేశంతో ఐఐఎం-లక్నో, ఐఐటీ-కాన్పూర్ భాగస్వామ్యంలో హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లో జాయింట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నాం. ఈ ప్రోగ్రామ్‌లో మేనేజ్‌మెంట్ మాడ్యూల్స్‌ను లక్నో ప్రొఫెసర్లు, టెక్నికల్ మాడ్యూల్స్ రూపకల్పన, బోధన ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో జరిగింది. ఇలా చేయడం వల్ల విద్యార్థులకు కోర్ నైపుణ్యాలు కూడా సొంతమవుతాయి.

జాబ్ స్కిల్స్

కొలువుల క్లౌడ్ ఇదిగో!

ఆధునిక యుగం.. డిజిటల్ ప్రపంచం.. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ కార్యకలాపాలు. ముఖ్యంగా ఏఐ రాకతో.. సంస్థల నుంచి వ్యక్తుల వరకు సర్వత్రా ఆన్‌లైన్ విప్లవం కనిపిస్తోంది. ఇందుకు దోహదం చేస్తున్న టెక్నాలజీ.. క్లౌడ్ కంప్యూటింగ్!! అన్ని రంగాల్లో క్లౌడ్ సర్వీసెస్‌కు డిమాండ్ రోజురోజుకీ పెరుగుతోంది. దీంతో ఈ విభాగంలో నిపుణులకు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ నెలకొంది. ఈ నేపథ్యంలో.. క్లౌడ్ కంప్యూటింగ్ అంటే ఏమిటి... ప్రాధాన్యానికి కారణాలు.. జాబ్ మార్కెట్ ట్రెండ్స్.. నైపుణ్యాలు అందుకోవడానికి మార్గాలపై ప్రత్యేక కథనం..



క్లౌడ్ కంప్యూటింగ్ అంటే.. సర్వర్‌లు, స్టోరేజ్, డేటాబేసెస్, నెట్‌వర్కింగ్, సాఫ్ట్‌వేర్, అనలిటిక్స్, ఏఐ వంటి కంప్యూటింగ్ సేవలను ఇంటర్నెట్ ద్వారా(క్లౌడ్) అందించడం! కరెంట్, తాగునీటి సరఫరా మాదిరిగా వినియోగించనంతమేరకు చెల్లిస్తే సరిపోతుంది. దీనివల్ల సంస్థలు, వ్యక్తులకు కంప్యూటింగ్ సేవల వ్యయం గణనీయంగా తగ్గుతుంది. ఆవిష్కరణలకు, సంస్థల ఉత్పత్తులు, సేవల విస్తరణకు దోహదపడుతుంది. ఇటీవల ఐటీ కంపెనీలు క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా ఇంటర్నెట్ ఆధారంగానే క్లయింట్‌కు అవసరమైన సాఫ్ట్‌వేర్స్‌ను, అప్లికేషన్స్‌ను అందిస్తున్నాయి.

ఆటోమేషన్‌కు ఊతం

క్లౌడ్ కంప్యూటింగ్ దశాబ్ద కాలం క్రితమే మార్కెట్లో ప్రవేశించింది. అప్పటి నుంచే సాఫ్ట్‌వేర్ సంస్థలు క్లౌడ్ కంప్యూటింగ్ విధానంలో తమ క్లయింట్లకు సేవలందించడం ప్రారంభించాయి. ప్రస్తుత ఆటోమేషన్ యుగంలో వీటిని మరింత విస్తృతం చేస్తున్నాయి. ఫలితంగా గత నాలుగేళ్లుగా క్లౌడ్ కంప్యూటింగ్ శరవేగంగా విస్తరిస్తోంది.

అన్ని రంగాల్లోనూ..

ప్రస్తుతం క్లౌడ్ ఆధారిత సేవలు అన్ని రంగాల్లోనూ అందుబాటులోకి వస్తున్నాయి. హెల్త్‌కేర్, బీఎఫ్ఎస్ఐ, ఐటీ సెక్టార్, ఫిన్‌టెక్ ఇలా.. ప్రతి రంగంలోనూ క్లౌడ్ సర్వీసెస్ కనిపిస్తున్నాయి. క్లౌడ్ కంప్యూటింగ్ విధానంలో సేవలు పొందే సంస్థలకు వ్యయం ఎంతో ఆదా అవుతుంది. కారణం.. వారికి అవసరమైన సాఫ్ట్‌వేర్స్, నెట్ వర్కింగ్, హార్డ్ వేర్ వంటి విభాగాల్లో నిర్దిష్ట వ్యవధి ప్రాతిపదికగా ఆన్‌లైన్‌లో వీటిని పొందే అవకాశమే. వాస్తవానికి వీటన్నింటినీ నిర్వహించాలంటే సంస్థలో సగటున 30 నుంచి 40 మంది ఉద్యోగుల అవసరం ఏర్పడుతుంది. సదరు ఉద్యోగులకు వేతనాలు, సంబంధిత విభాగం నిర్వహణ వ్యయం వంటివి భారీగా ఉంటాయి. కానీ.. క్లౌడ్ కంప్యూటింగ్ విధానంలో వాటన్నింటినీ చాలా తక్కువ వ్యయంతో ఎలాంటి నిర్వహణ భారం లేకుండా పొందొచ్చు.

అకడమిక్ మార్గాలివే

అకడమిక్‌గా బీటెక్, ఎంటెక్ స్థాయిలో ఎలక్టివ్, మేజర్ సబ్జెక్ట్‌గా పలు ఇన్‌స్టిట్యూట్‌లు క్లౌడ్ టెక్నాలజీస్‌ను అందిస్తున్నాయి. వీటితోపాటు.. మరెన్నో ప్రముఖ సంస్థలు.. క్లౌడ్ నైపుణ్యాలకు సంబంధించి ప్రత్యేకంగా సర్టిఫికేషన్ కోర్సులను కూడా అందిస్తున్నాయి. అవి.. ఐబీఎం సర్టిఫైడ్ క్లౌడ్ సెక్యూరిటీ నాలెడ్జ్, హెచ్‌పీ ఎక్స్‌పర్ట్ వన్ క్లౌడ్ సర్టిఫికేషన్, వీఎం వేర్ క్లౌడ్ సర్టిఫికేషన్, ఈఎంసీ క్లౌడ్ ఆర్కిటెక్ట్, ఈఎంసీ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సర్వీసెస్ సర్టిఫికేషన్, ఈఎంసీ వర్చువలైజ్డ్ డేటా సెంటర్ అండ్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్టిఫికేషన్.

ప్రధానంగా మూడు రకాలు

క్లౌడ్‌లో ఐఏఏఎస్(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యాజ్ ఏ సర్వీస్), పీఏఏఎస్(ప్లాట్‌ఫామ్ యాజ్ ఏ సర్వీస్), ఎస్ఏఏఎస్(సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్) అనే మూడు కీలక మోడల్స్ ఉన్నాయి.

సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్: క్లౌడ్ టెక్నాలజీ పరంగా అత్యంత ప్రాచుర్యం పొందుతున్న విధానం.. సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్. ఈ విధానం ప్రకారం.. వినియోగదారులు, వ్యక్తులు నేరుగా.. ఒక సంస్థ అందించే ఆన్‌లైన్ సేవలు పొందే అవకాశం లభిస్తుంది. గూగుల్ యాప్స్, ఇతర యాప్స్‌నే వీటికి ఉదాహరణగా పేర్కొనొచ్చు. ఈ విధానంలో ఒక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే సదరు సంస్థ అందించే సదుపాయాలను వినియోగదారులు నేరుగా ఉపయోగించుకునే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం యాప్ ప్రపంచం రాజ్యమేలుతున్న తరుణంలో అన్ని రంగాల్లోని సంస్థలు.. వినియోగదారులకు ఆకర్షణీయమైన సేవలు అందిస్తూ.. ఇందుకోసం క్లౌడ్ టెక్నాలజీస్ కోసం సాఫ్ట్‌వేర్ సంస్థలను సంప్రదిస్తున్నాయి.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యాజ్ ఎ సర్వీస్: క్లౌడ్ కంప్యూటింగ్ విధానాల్లో మరో కీలకమైన విధానం.. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యాజ్ ఏ సర్వీస్. ఈ విధానంలో వినియోగదారులకు అవసరమైన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సదుపాయాలను, సర్వర్స్‌ను, స్టోరేజ్ తదితర మౌలిక సదుపాయాలను ఒక సంస్థ పొందుపరుస్తుంది. వినియోగదారులు కోరిన సందర్భంలో సంబంధిత సేవలను ఇంటర్నెట్ ఆధారంగా అందిస్తుంది.

ప్లాట్‌ఫామ్ యాజ్ ఎ సర్వీస్: క్లౌడ్ కంప్యూటింగ్ టెక్నాలజీస్‌లో మరో ముఖ్యమైన విధానం..ప్లాట్‌ఫామ్ యాజ్ ఏ సర్వీస్. ఈ విధానంలో క్లౌడ్ టెక్నాలజీ సేవలను అందించే సంస్థలు.. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సంబంధిత టూల్స్‌ను వినియోగదారులకు ఇంటర్నెట్ ఆధారంగా చేరవేస్తారు. ఫలితంగా వారికి వాటిని వాస్తవ పరిస్థితుల్లో తమ అవసరాలకు వినియోగించడం సులభంగా మారుతుంది. గూగుల్ యాప్ ఇంజిన్, విండోస్ అజ్యూర్ వంటి వాటిని ఈ విధానానికి ఉదాహరణగా పేర్కొనొచ్చు.

క్లౌడ్ ఆర్కిటెక్ట్స్.. కీలకంగా

క్లౌడ్ టెక్నాలజీస్, కొలువుల కోణంలో క్లౌడ్ ఆర్కిటెక్ట్స్ కీలకంగా నిలుస్తున్నారు. ఈ విభాగంలో నైపుణ్యాలున్న వారికి లక్షల్లో వేతనం అందించడానికి సాఫ్ట్‌వేర్ సంస్థలు ముందుకొస్తున్నట్లు సమాచారం. క్లౌడ్ ఆర్కిటెక్ట్ విధుల కోణంలో నిర్దిష్టంగా ఒక ప్రొడక్ట్‌ను డిజైన్ చేయడం మొదలు, దాన్ని డెవలప్ చేయడం, ఆ తర్వాత నిర్వహణ నైపుణ్యాలు సొంతం చేసుకోవాల్సి ఉంటుంది. అందుకే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా క్లౌడ్ ఆర్కిటెక్ట్స్‌కు ప్రాధాన్యం పెరుగుతుతోంది.

జాబ్ ప్రొఫైల్స్ ఇలా

క్లౌడ్ కంప్యూటింగ్ విభాగంలో.. క్లౌడ్ ఆర్కిటెక్ట్, క్లౌడ్ బిజినెస్ అనలిస్ట్, క్లౌడ్ నెట్‌వర్క్ ఆర్కిటెక్ట్, క్లౌడ్ ప్రాజెక్ట్ మేనేజర్, క్లౌడ్ ప్రొడక్ట్ మేనేజర్, క్లౌడ్ కన్సల్టెంట్, క్లౌడ్ సిస్టమ్స్ ఇంజనీర్, క్లౌడ్ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్, క్లౌడ్ నెట్‌వర్క్ ఇంజనీర్ వంటి జాబ్ ప్రొఫైల్స్ లభిస్తున్నాయి. ఐటీ విభాగంలోనే కాకుండా.. నాన్-ఐటీ విభాగంలోనూ క్లౌడ్ కొలువులు లభించనున్నాయి. ప్రధానంగా క్లౌడ్ సర్వీసెస్ అప్లికేషన్ స్పెషలిస్ట్, బీపీఓ, క్లౌడ్ మార్కెటింగ్ విభాగాల్లో ఉద్యోగాలు లభించనున్నాయి.

ఈ స్కిల్స్ కీలకంగా

- క్లౌడ్ కంప్యూటింగ్ టెక్నాలజీస్‌లో కెరీర్ కోరుకునే వారికి కొన్ని టెక్నికల్ స్కిల్స్ అత్యంత కీలకంగా మారనున్నాయి. అవి.. డెవఆప్స్, ప్రోగ్రామింగ్, డేటా బేస్ మేనేజ్‌మెంట్, లినక్స్, సిస్టమ్ ఆటోమేషన్, క్వాలిటీ అష్యూరెన్స్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్.
- టెక్నికల్ నైపుణ్యాలే కాకుండా వ్యక్తిగతంగానూ కొన్ని నైపుణ్యాలు ఆవశ్యకత సంతరించుకున్నాయి. అవి.. ప్రాసెస్ స్కిల్, కాంప్లెక్స్ ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, కాగ్నిటివ్ ఎబిలిటీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ స్కిల్స్.

ఉద్యోగ సమాచారం

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టులు

పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) దేశవ్యాప్తంగా వివిధ శాఖల్లో లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 750.
- **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-05, గుజరాత్-95, కర్ణాటక-85, మహారాష్ట్ర-135, తెలంగాణ-88, తమిళనాడు-85, పశ్చిమ బెంగాల్-90, జమ్మూ-కశ్మీర్-20, లడాఖ్-03, అరుణాచల్‌ప్రదేశ్-05, అస్సాం-86, మణిపూర్-08, మేఘాలయ-08, మిజోరాం-05, నాగాలాండ్-05, సిక్కిం-05, త్రిపుర-22.
- **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం ఏడాది బ్యాంకింగ్ అనుభవం అవసరం. అభ్యర్థులు సంబంధిత రాష్ట్ర స్థానిక భాష చదవడం, రాయడం, మాట్లాడడంలో ప్రావీణ్యం కలిగి ఉండాలి.
- **వయసు:** 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.48,480 నుంచి రూ.85,920.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, స్థానిక భాష పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.11.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.11.2025.
- **ఆన్‌లైన్ పరీక్ష తేది:** డిసెంబర్ 2025/జనవరి 2026.
- **వెబ్‌సైట్:** https://pnb.bank.in

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్)

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉన్నత ఉద్యోగాల భర్తీకి ఎయిర్ ఫోర్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్-01/2026) నోటిఫికేషన్ విడుదలైంది.

కోర్సుల వివరాలు:

ఏఎఫ్ క్యాట్ ఎంట్రీ: ఫ్లయింగ్/గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్)/గ్రౌండ్ డ్యూటీ(నాన్-టెక్నికల్), ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ: ఫ్లయింగ్.

- **అర్హత:** ఇంటర్(ఫిజిక్స్, మ్యాథ్స్), సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ/బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- **వయసు:** ఫ్లయింగ్ బ్రాంచ్‌కు 20 నుంచి 24 ఏళ్లు ఉండాలి. గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్/నాన్ టెక్నికల్) బ్రాంచ్‌కు 20 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** ఫ్లయింగ్ ఆఫీసర్‌కు రూ.56,100 నుంచి రూ.1,77,500.
- **దరఖాస్తు విదానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.11.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.12.2025.
- **వెబ్‌సైట్:** https://afcat.cdac.in/

పీజీఐఎంఈఆర్, చండీగఢ్‌లో 13 పోస్టులు

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(పీజీఐఎంఈఆర్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్1(మెడికల్/నాన్ మెడికల్)-12, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్2-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, బీఎస్సీ, ఎంబీబీఎస్/బీడీఎస్, బీటెక్, ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-1కు రూ.56,000 నుంచి రూ.67,000, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-2కు రూ.20,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2025.
- **వెబ్‌సైట్:** https://pgimer.edu.in/

ఎయిమ్స్ న్యూఢిల్లీలో 10 పోస్టులు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్1(నాన్ మెడికల్)-01, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ 3-03, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్1(ల్యాబొరేటరీ)-02, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్1-03, డేటా ఎంట్రీ ఆపరేటర్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఎంఎల్‌టీ/డీఎంఎల్‌టీ/ఐటీఐ, డిగ్రీ/పీజీ/పీహెచ్‌డీలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** 28 ఏళ్ల నుంచి 35 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్‌కు రూ.56,000, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్‌కు రూ.28,000, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్1(ల్యాబొరేటరీ)కు రూ.18,000, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.29,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 17.11.2025.
- **వెబ్‌సైట్:** https://www.aiims.edu/

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారా..?

సాక్షి ఎడ్యుకేషన్‌లో సమగ్ర కరెంట్ అఫైర్స్ ఇప్పుడే చూడండి..!

యూపీఎస్సీ, టీజీపీఎస్సీ, ఏపీపీఎస్సీ, ఆర్ఆర్‌బీ, ఎస్సెస్సీ, పోలీస్ ఉద్యోగాల వంటి అన్ని రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు శుభవార్త! మీ విజయానికి కీలకమైన డైలీ, వీక్లీ, నెలవారీ కరెంట్ అఫైర్స్‌తో పాటు, కరెంట్ అఫైర్స్‌పై బిట్ బ్యాంక్‌ను సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్ (Sakshieducation.com) సమగ్రంగా అందిస్తోంది. ప్రతి పరీక్షకు అనుగుణంగా, నిపుణులు రూపొందించిన ఈ కరెంట్ అఫైర్స్ విభాగం... జాతీయ, అంతర్జాతీయ, ఆర్థిక, క్రీడా - ప్రాంతీయ అంశాలను కచ్చితమైన, సులభంగా అర్థమయ్యే రీతిలో అందిస్తోంది. ముఖ్యంగా యూపీఎస్సీ స్థాయి అభ్యర్థులకు లోతైన విశ్లేషణతో కూడిన కరెంట్ అఫైర్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పూర్తి కరెంట్ అఫైర్స్‌ను ఉచితంగా పొందండి.

సన్నిధి

అలవాట్లు ఆయుధాలాంటివి మంచివైతే జీవితాన్ని పైకి లేపుతాయి. చెడ్డవైతే పైకి లేచిన జీవితాన్ని కూడా కింద పడేస్తాయి.

మంచిమాట

ప్రసన్న వదనం

ప్రపంచం లోని అత్యంత విలువైన ఆస్తి ఏదంటే, అది అపారమైన ధనరాశులు కాదు, తిరుగు లేని అధికార పీఠం కాదు; అది మన ముఖంలో నిరంతరం వెలిగే ప్రసన్నత. 'ముఖంలో ప్రసన్నతతో కీర్తి లభిస్తుంది. కీర్తి వృద్ధి చెందడం వల్ల సుఖాలు అనుభవిస్తారు. ప్రసన్నత లేని వారిని సజ్జనులు ఇష్టపడరు. కాబట్టి, ముఖ ప్రసన్నతే గొప్ప సంపద'.

నేటి ఆధునిక, ఒత్తిడితో కూడిన జీవనశైలిలో, అంతరంగిక ఆనందం కొరవడుతున్న ఈ తరుణంలో, ఈ ప్రసన్న వదనం ఒక దివ్యౌషధంగా పనిచేస్తూ, అంతరాత్మ అపురూపమైన ప్రతిబింబంగా ప్రకాశిస్తుంది. ఇది కేవలం పెదవుల వంపు మాత్రమే కాదు, మన అంతర్గత శాంతికి, ఎదుటివారి పట్ల మనకున్న నిష్కల్మషమైన ఆదరణకు, మన అజేయమైన స్థితప్రజ్ఞతకు దేదీప్యమానమైన ప్రతీక.

మానవ సంబంధాలలో అత్యంత శక్తిమంతమైన, అత్యంత సులభమైన సామరస్య సాధనం ఏదైనా ఉందంటే అది చిరునవ్వే. మాటలు లేకున్నా, భాష తెలియకున్నా, ఒక నిర్మలమైన చిరునవ్వు వేల భావాలను పలకగలదు. ఇది మౌనంగా వినిపించే మధుర గీతం లాంటిది. ఈ చిరునవ్వు మనస్సులోని మంచితనాన్ని, స్వచ్ఛమైన అంగీకారాన్ని నిస్సందేహంగా వ్యక్తీకరిస్తుంది. అది హృదయాలను అద్భుతంగా కలుపుతుంది, అపరిచితులను ఆత్మీయులుగా మారుస్తుంది,

బంధాలను పటిష్టంగా దృఢపరుస్తుంది. చిరునవ్వు అనేది సార్వత్రిక భాషకు తిరుగులేని తాళం చెవి. దానికి సంస్కృతి, భౌగోళిక, ఆర్థిక భేదాలు ఏవీ అడ్డుకావు. చరిత్రను పరిశీలిస్తే, ప్రపంచాన్ని ప్రభావితం చేసిన గొప్ప నాయకులు తమ ప్రశాంతమైన ప్రసన్న వదనంతోనే కోట్లాదిమందిలో నమ్మకాన్ని, భరోసాను నింపారు. ఉదాహరణకు, మహాత్మా గాంధీ తన మౌనంలో సైతం చిరునవ్వుతో పలికే స్థితప్రజ్ఞత, లక్షలాది మందికి స్వాతంత్ర్య పోరాటంలో అపారమైన ధైర్యాన్నిచ్చింది. అలాగే, మదర్ థెరిసా అందించిన నిస్వార్థ, నిర్మలమైన చిరునవ్వు, నిరాశ్రయులలో సైతం ఆశావాదాన్ని, జీవితేచ్ఛను ఉత్తేజపరిచింది. ఈ ఉదాహరణలు చిరునవ్వుకు ఉండే అంతర్గత శక్తిని, అది సంక్షోభ సమయాల్లోనూ ఎలా స్థైర్యాన్ని, భరోసాను ఇస్తుందో విశదీకరిస్తాయి.

చిరునవ్వు మన శారీరక, మానసిక ఆరోగ్యంపై సానుకూల విప్లవాన్ని సృష్టిస్తుంది. ఇది మెదడులో ఎండార్ఫిన్ల విడుదలను ప్రేరేపించడం ద్వారా సహజమైన నొప్పి నివారిణిగా పనిచేస్తుంది. అలాగే, ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ స్థాయులను నియంత్రించి, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. వత్తిడి జీవితంలోనూ, వ్యక్తిగత సంబంధాలలోనూ చిరునవ్వు ఒక అద్భుతమైన మానసిక ఆయుధం. ఆధునిక కార్పొరేట్ ప్రపంచంలో, అత్యంత క్లిష్టమైన చర్చల్లో చిరునవ్వుతో పలకరించే నాయకుడు కేవలం నమ్మకాన్ని పొందడమే కాక, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను, విజయవంతమైన సహకారాలను నిర్మించగలరు. మనస్పర్థలు వచ్చినప్పుడు, కోపానికి బదులు చిరునవ్వుతో కూడిన సున్నిత సంభాషణ, బంధాలను తెగిపోకుండా అత్యంత సమర్థంగా నిలుపుతుంది. ఆనందంలో చిరునవ్వు సహజం, కానీ కష్టాల్లోనూ, సవాళ్లలోనూ చిరునవ్వును దాల్చడం మన అజేయమైన అంతర్గత స్థైర్యానికి పరాకాష్ఠ.

చిరునవ్వు కేవలం పెదవుల యాంత్రిక కదలిక కాదు, అది హృదయం నుండి వచ్చే ఒక సుమధుర స్పర్శ. అది అహంకారాన్ని తగ్గిస్తుంది, సహానుభూతిని పరిపూర్ణం చేస్తుంది. చిరునవ్వు లేని జీవితం, రంగులు లేని నిస్తేజమైన చిత్రం లాంటిది. ప్రతి మనిషిలో దాగి ఉన్న దైవిక సంపద ఈ చిరునవ్వు. ప్రతి రోజూ మన ఈ చిరునవ్వును ఇతరులతో దాతత్వంతో పంచుకోవడం ద్వారా మనం కేవలం మన బంధాలనే కాదు, సమాజాన్ని కూడా ప్రేమ, సామరస్యపు వారధిగా రూపుదిద్దగలం. చిరునవ్వును మీ ఆదర్శ జీవన శైలికి మార్గదర్శక దీపంగా మార్చుకుందాం. ఇది ద్వేషాన్ని, అపనమ్మకాన్ని సమర్థంగా దూరం చేసి, స్నేహాన్ని, విశ్వాసాన్ని సుస్థిరం చేస్తుంది. చిరునవ్వుతో కూడిన సజీవనం, ప్రతి మనిషిని ఈ లోకంలో ఒక తేజోవంతమైన ఆశా కిరణంగా మారుస్తుంది. ప్రసన్న వదనం ఈ జగత్తుపై చెరగని సంతకం, తరాలు దాటి పలికే దివ్య సందేశం.

– కె. భాస్కర్ గుప్తా (వ్యక్తిత్వ వికాస నిపుణులు)

ఆధ్యాత్మికథ

అదిగదిగో భద్రాద్రి!

ఒక ఊర్లో ఒక ముసలవ్వ ఉండేది. ఆమెకు చిన్నప్పటినుంచీ భద్రాచలం వెళ్లాలని, గోదావరిలో మునిగి శ్రీసీతారామచంద్రమూర్తిని దర్శనం చేసుకోవాలని బలమైన కోరిక. అయితే సంసార సాగరంలో మునిగి తేరుకునేలోగా ఆమెకు వయసు అరవై దాటింది.ఒకరోజు తన మనవడితో అదే విషయం చెప్పింది. ''రాముణ్ణి చూడటానికి అంతదూరం పోవాలా? మన ఊరి గుడిలో రాములవారి పటం ఉంది కదా, రోజూ దాన్ని చూస్తూ పూజ చేసుకుంటే పోలేదా?'' అని ఎదురు ప్రశ్న వేశాడు. అతడికి ఎలా సర్ది చెప్పాలో ముసలవ్వకు అర్థం కాలేదు. నెలలు గడిచాయి. ఆమె వయసు అరవై ఆరుకు చేరుకుంది.కోరిక తీరకుండానే ఫోటోకి పూల మాల వేయించుకోవాల్సి వస్తుందేమోనని అవ్వకు అనుమానం వేసింది. గట్టిగా మాట్లాడి మనవడిని ఒప్పించాలనుకుంది.

ఒక నిండు పౌర్ణమినాడు మనవడు ఇంటికి వచ్చాడు. భద్రాచలం విషయం అడిగింది. 'నువ్వు ఇప్పుడు భద్రాచలం వెళ్ళి రాముణ్ణి చూడకపోతే ఏమీ కాదు, ఇదిగో... రామకోటి రాసుకో. రాముణ్ణి చూసిన పుణ్యం కలుగుతుంది'' అని చెప్పి పుస్తకం ఆమె చేతికి ఇచ్చాడు. పెరట్లోకి వెళ్ళి కాళ్ళు చేతులు కడుక్కున్నాడు. భోజనం చేద్దామని వంటగదిలోకి వచ్చాడు.

''ఆకలిగా ఉంది, అన్నం పెట్టు'' అని అడిగాడు. గడసరి అయిన అవ్వ ''అన్నం, అని వందసార్లు ఈ తెల్ల కాగితం మీద రాయి, ఆకలి పోతుంది'' అని చెప్పి తెల్లకాగితం, పేనా ఇచ్చింది. ''అన్నం తింటే ఆకలి తీరుతుంది కానీ లక్షసార్లు రాస్తే కడుపు నిండదు, అన్నం తినాల్సిందే'' అన్నాడు.''మరి శ్రీరాముణ్ణి చూడాలని నేను ఎన్నో ఏండ్లుగా ప్రాధేయపడుతూ ఉంటే రామకోటి రాయమని చెబుతావేమి?'' అని నిలదీసింది. తప్పు తెలుసుకున్నాడు. వీలు చూసుకుని పోదామన్నాడు. అవ్వ మురిసిపోయింది. అభిమానంగా పప్పూ నెయ్యి కలిపిన బువ్వ కడుపు నిండా పెట్టింది. తృప్తిగా తిన్నాడు.

ఆరు నెలల తర్వాత ఇద్దరూ భద్రాచలం బస్సు ఎక్కారు. అప్పటికే ఆ ముసలవ్వ రాత్రింబగుళ్ళూ మేలుకుని రామకోటి పుస్తకం పూర్తి చేసింది. 'రామ నామము రామ నామము రమ్యమైనది రామనామము' పాట పాడుకుంటూ ఇద్దరూ శ్రీ సీతారాములవారి దర్శనం చేసుకున్నారు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

● తాత్త్వికం

ధర్మం అంటే..?

''నా ధర్మం నేను చేశాను. ఇంతకు మించి చెయ్యగలిగింది లేదు. ఇంక నన్నేమీ అనద్దు.'' అని పెద్దవాళ్లు ఎన్నో క్లిష్టపరిస్థితులని ఎదుర్కొన్న సందర్భంలో అంటుంటారు. అసలు తరచుగా ఏ చిన్న అనుమానం వచ్చినా '' ధర్మ సందేహం'' అని ప్రచార, ప్రసార సాధనాలు కూడా అంటుంటాయి. యాచకులు కూడా ధర్మం చెయ్యండి బాబయ్యా అనే అడుక్కునేవాళ్లు ఇంతకు ముందు. ఇంతకీ ధర్మ మంటే ఏమిటి?

దీనికి ఇదీ అంటూ కచ్చితంగా చెప్పదగ్గ అర్థం అంటూ ఏదీ లేకపోయినా, ఎవరి కర్తవ్యం వారు నిర్వర్తించటం, తమకు విహితమైన పనులను ఆచరించటం ధర్మమనిపించుకుంటుంది! తూర్పున మాత్రమే ఉదయించటం సూర్యుని ధర్మం, గుణం, లక్షణం, సహజ స్వభావం. మరొక విధంగా ఉండటం వీలు కాదు. గ్రహాలు, నక్షత్రాలు, తారకలు, తమ తమ కక్ష్యలలో మాత్రమే తిరుగుతాయి. కాస్త కూడా వాటి కక్ష్యలో కాని, సమయంలో కాని తేడా రాదు. అది వాటి సహజ స్వభావం. అదే వాటి ధర్మం. భౌతిక, రసాయనిక శాస్త్రాలలో వస్తువుల లక్షణాలు చెప్పేప్పుడు కూడా ధర్మం అనే పదమే వాడతారు. మరి, మానవులకి సంబంధించి ధర్మం ఏమిటి? ధర్మం అంటే సహజ సిద్ధమైన గుణం, ప్రవర్తన అన్నప్పుడు మనిషి మనిషిగా పరిగణించబడటానికి ఎలా ఉండాలో ఆ విధంగా ఉండటమే. దీనికి నిఘంటు అర్థం ఏమిటంటే – ''ధర్మమంటే ధరించేది, ధరించబడేది.'' అని. ఈ సృష్టి మొత్తం దేనివల్ల ఈ స్థితిలో నిలిచి ఉన్నదో అదే ధర్మం. సూర్యుడు తన చుట్టూ తాను తిరుగుతూ ఉండటం వల్ల ఉత్పన్నమయ్యే శక్తి, మిగిలిన గ్రహాలు తమ చుట్టూ తాము తిరగటంతో పాటు సూర్యుని చుట్టూ తిరగటం వల్ల కలుగుతున్న ఆకర్షణ శక్తుల వల్ల సౌరకుటుంబం అంతరిక్షంలో అలా నిలిచి ఉంది. ఏ ఒక్కటి కొద్దిగా గతి తప్పినా అంతా అస్తవ్యస్తం, అయోమయం. అవి తమ గుణాలని లేదా సహజ స్వభావాలని అనుసరించి విధించబడిన కర్తవ్యాలని యథాతథంగా అమలు చెయ్యటం వల్లనే సృష్టి నిలిచి ఉంది. అందుకేనేమో ''ధర్మో రక్షతి రక్షితః'' అనటం.



పుట్టగానే శిశువు ఏడవటం ధర్మం. అది ఎవరు చెప్పనవసరం లేకుండానే సహజంగా చేసేస్తాడు. లేకపోతే ప్రాణం ఉందో, లేదో అని గిల్లి అయినా ఏడిపించటం చూస్తాం. పాలు తాగటం, పాకటం, నడవటం మాట్లాడటం మొదలైనవన్నీ సహజంగానే చేస్తాడు. కాని, ఆ తరువాత ప్రవర్తనలో అసహజత చోటు చేసుకుంటుంది. తనది కాని తీరులో ప్రవర్తిస్తూ ఉంటాడు. ఏ విధంగా ఉంటే సహజత్వానికి దూరం కాడో అది మనిషి ధర్మం అవుతుంది. మానవధర్మం అనే దాన్ని ప్రతిపాదించటమే కాక ఆచరించి చూపటానికి వచ్చిన అవతారమే శ్రీరామచంద్రుడు. కొడుకుగా, శిష్యుడుగా, సోదరుడుగా, భర్తగా, అల్లుడుగా, స్నేహితుడుగా, శత్రువుగా, రాజుగా, తండ్రిగా, పెదతండ్రిగా ... ఒక మానవుడు ఎన్ని పాత్రలను పోషిస్తాడో అన్నింటిని సమర్థవంతంగా పోషించి ఆదర్శ మానవుడయ్యాడు. ఇవన్నీ ఆచరించటానికి శరీరం ఉండాలి కనుక '' శరీర మాద్యం ఖలు ధర్మసాధనం'' అనటం. ఎన్నో సందర్భాల్లో వాడిన ధర్మ శబ్దం ధర్మాని కున్న ఒక్కొక్క కోణాన్ని మాత్రమే తెలుపుతుంది. ధర్మం అనేది సంక్లిష్టమైనది. సనాతనమైనది. విశ్వస్థితికి, మానవ అస్తిత్వానికి ఆధార భూతమైనది. మానవులుగా మనం మన ధర్మాన్ని ఆచరించడం మానవ ధర్మం.

– డి.వి.ఆర్.

సాక్షి సినిమా

నష్టాన్నీ పంచుకోవాల్సిందే

● స్టార్ హీరోలను కోరనున్న తమిళ నిర్మాతల మండలి

తమిళ చిత్రపరిశ్రమలో ఇక స్టార్ హీరోలు పూర్తి పారితోషికం తీసుకోవడానికి కుదరదా? అనే చర్చ చెన్నై కోడంబాక్కమ్ ఫిల్మ్ సర్కిల్‌లో జరుగుతోంది. దానికి కారణం తమిళ చిత్రనిర్మాతల మండలి సమావేశం. ఆదివారం జరిగిన ఈ సమావేశంలో నిర్మాతలు తీసుకున్న నిర్ణయాల్లోకి వెళితే...

● చిత్రపరిశ్రమ అభివృద్ధి, సంక్షేమం కోసం ఇక పెద్ద బడ్జెట్ సినిమాలన్నీ 'రెవెన్యూ షేరింగ్' పద్ధతిలో ఉండాలన్నది నిర్మాతల అభిప్రాయం. ఈ నేపథ్యంలో ఇక స్టార్ హీరోలు నష్టాలనూ పంచుకునేలా కోరాలని నిర్మాతలు నిర్ణయం తీసుకున్నారు. పూర్తి పారితోషికం కాకుండా సినిమా విడుదలయ్యాక వచ్చే లాభ నష్టాలను షేర్ చేసుకునేలా రజనీకాంత్, కమల్‌హాసన్, విజయ్, అజిత్, సూర్య, విక్రమ్, ధనుష్, విశాల్ వంటి స్టార్ హీరోలను కోరనున్నారట. ● థియేటర్లలో విడుదలైన 8 వారాల తర్వాత పెద్ద బడ్జెట్ సినిమాలను, 6 వారాల తర్వాత మీడియమ్ బడ్జెట్ చిత్రాలను, 4 వారాల తర్వాత చిన్న బడ్జెట్ చిత్రాలను ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమ్ చేయాలన్నది ఓ నిబంధన.

● ప్రభుత్వం తరపున ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌ని ఏర్పాటు చేసి, సర్వీస్ చార్జ్ తక్కువ వసూలు చేసేలా తమిళనాడు ప్రభుత్వాన్ని కోరాలన్నది ఓ నిర్ణయం. సర్వీస్ చార్జ్ తగ్గించడం వల్ల ఎక్కువ సంఖ్యలో ప్రేక్షకులు థియేటర్లకు వచ్చే చాన్స్ ఉందని నిర్మాతలు భావిస్తున్నారు. ● థియేటర్స్ ఓనర్, డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ నుంచి కొందరితో ఓ కమిటీ ఏర్పాటు చేయాలన్నది ఓ నిర్ణయం. ప్రతి ఏడాది విడుదలయ్యే దాదాపు 250 స్మాల్, మీడియమ్ బడ్జెట్ చిత్రాలకు థియేటర్లు సమకూరేలా ఈ కమిటీ చర్యలు తీసుకునేలా నిర్మాతల మండలి కోరనుంది.

ఇలా ఆదివారం జరిగిన సమావేశంలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో ముఖ్యంగా స్టార్ హీరోల 'లాస్ షేరింగ్' గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ ప్రతిపాదనను సదరు హీరోలు అంగీకరిస్తారా? లేదా అన్నది వేచి చూడాలి.

● జాన్వీ, రామ్‌చరణ్, రెహమాన్

ఆ కల పెద్దితో నెరవేరింది

''ఏఆర్ రెహమాన్‌గారి సంగీతంలో భాగమవ్వాలనేది నా చిన్నప్పటి కల. అది 'పెద్ది' సినిమాతో నెరవేరినందుకు ఆనందంగా ఉంది'' అని హీరో రామ్‌చరణ్ చెప్పారు. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకి ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరాలు అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే... ఏఆర్ రెహమాన్ హైదరాబాద్‌లో నిర్వహించిన 'లైవ్ కాన్సర్ట్' వేడుకకి 'పెద్ది' టీమ్ నుంచి రామ్‌చరణ్, జాన్వీ కపూర్, డైరెక్టర్ బుచ్చిబాబు సానా పాల్గొని.. ఆడియన్స్‌లో మరింత జోష్ నింపారు. అదే విధంగా 'పెద్ది' సినిమాలోని 'చికిరి చికిరి...' పాట లైవ్ పెర్ఫార్మెన్స్‌కి ఆడియన్స్ నుంచి అద్భుతమై స్పందన వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. జాన్వీ కపూర్ మాట్లాడుతూ– ''పెద్ది' మూవీతో మీకు ఒక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడానికి చాలా కష్ట పడుతున్నాం'' అని పేర్కొన్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న 'పెద్ది' 2026 మార్చి 27న విడుదల కానుంది.

- రామ్‌చరణ్

నవ్వులే నవ్వులు

● ఐశ్వర్య, తిరువీర్

తిరువీర్, ఐశ్వర్యా రాజేశ్ జంటగా కొత్త సినిమా షురూ అయింది. ఈ చిత్రం ద్వారా భరత్ దర్శన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. తొలి సినిమా 'శివమ్ భజే'తో ప్రేక్షకులని అలరించిన గంగా ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్న ద్వితీయ చిత్రం ఇది. ''హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న చిత్రమిది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాని ఒకేసారి రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సీహెచ్ కుషేందర్, సంగీతం: భరత్ మంచిరాజు.

ఘట్టమనేని జయకృష్ణ ఎంట్రీ

సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, దివంగత నటుడు రమేశ్‌బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా పరిచయం కానున్నారు. ఈ సినిమాకి 'ఆర్‌ఎక్స్ 100, మంగళవారం' చిత్రాల ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహించనున్నారు. అశ్వినీ దత్ సమర్పణలో పి. కిరణ్ ఈ సినిమా నిర్మించనున్నారు. ''అద్భుతమైన కొండల మధ్య సాగే ఈ సినిమా మనసుకు హత్తుకునే ప్రేమకథగా ఉంటుంది. భావోద్వేగాలు, నిజాయితీ కలగలిపిన ఈ చిత్రం కొత్త తరహా ప్రేమకథగా నిలవనుంది. జయకృష్ణ ప్రస్తుతం నటన, ఫైట్స్, డ్యాన్స్, డైలాగ్ డెలివరీల్లో శిక్షణ పొందుతున్నారు. ఈ నెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

ఇరువురు భామల...



● మలినా, త్రినాథ్ వర్మ, వైష్ణవి

'కమిటీ కుర్రోళ్లు' మూవీ ఫేమ్ త్రినాథ్ వర్మ హీరోగా, వైష్ణవి కొల్లూరు, మలినా హీరోయిన్లుగా అక్షర గౌడ కీలక పాత్రలో 'ఇరువురు భామల కౌగిలిలో' అనే సినిమా ప్రారంభం అయింది. దర్శకుడు కె. రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో అచ్యుత్ చౌదరి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని శ్రీనివాస గౌడ్ నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం స్క్రిప్ట్‌ను నటీనటులు, దర్శక–నిర్మాతలకు అందజేశారు కె. రాఘవేంద్రరావు. తొలి సన్నివేశానికి దర్శకుడు బి. గోపాల్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నటి, నిర్మాత నిహారిక కొణిదెల క్లాప్ ఇచ్చారు. దర్శకుడు ఎ. కోదండ రామిరెడ్డి, కెమెరామేన్ ఎస్. గోపాల్‌రెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సంగీతం: శీను బీట్స్, కెమెరా: శశాంక్ శ్రీరామ్.

క్రైమ్ థ్రిల్లర్

వజ్రయోగి, శ్రేయ భర్తీ జంటగా నటించిన చిత్రం 'సీమంతం'. సుధాకర్ పాణి దర్శకత్వంలో ప్రశాంత్ టాటా నిర్మించారు. గాయత్రి సౌమ్య గుడిసేవ సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వజ్రయోగి మాట్లాడుతూ– ''గర్భిణులపై దాడుల నేపథ్యంలో క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన చిత్రమిది'' అన్నారు. ''మా సినిమాను థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను'' అని చెప్పారు సుధాకర్. ''మా సినిమాకు అందరి సపోర్ట్ కావాలి'' అని మ్యూజిక్ డైరెక్టర్ సుహాస్, కెమెరామేన్ శ్రీనివాస్ కోరారు.

● వజ్ర యోగి, శ్రేయ



ప్రియదర్శి, ఆనంది జంటగా సుమ కనకాల కీలక పాత్రలో నటించిన చిత్రం 'ప్రేమంటే'. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహించారు. రానా దగ్గుబాటి సమర్పణలో పుస్కూర్ రామ్మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'పెళ్లి షురూ...' అంటూ సాగే పాటని హీరోయిన్ శ్రీలీల లాంచ్ చేశారు. ఈ పాటకి శ్రీమణి సాహిత్యం అందించగా, శ్రేయా ఘోషల్, దీపక్ బ్లూ పాడారు.

వినోదాలు పంచే జిగ్రీస్



● మణి, కృష్ణ వోడపల్లి, కృష్ణ, ధీరజ్

కృష్ణ బూరుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగ్రీస్'. హరీష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వంలో కృష్ణ వోడపల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ఇది. ప్రతి సన్నివేశంలో ఫుల్లుగా నవ్వుకుంటారు. ఈ సినిమాకి ఫ్యామిలీతో కలిసి వెళ్లండి.. కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు'' అని తెలిపారు. ''ఈ చిత్రం ఎంత వినోదంగా ఉంటుందో అంత భావోద్వేగంగానూ ఉంటుంది'' అని కృష్ణ వోడపల్లి పేర్కొన్నారు. ''సినిమా అద్భుతంగా వచ్చింది'' అని కృష్ణ బూరుగుల, మణి వక్కా, ధీరజ్ ఆత్రేయ, సహ నిర్మాత చిట్టెం వినయ్ తెలిపారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఆమె ఉన్నట్టా... లేనట్టా?

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం ది ఉమన్ ఇన్ కేబిన్ 10 ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



'థ్రిల్లర్ జోనర్లందు సైకలాజికల్ థ్రిల్లింగే వేరయా... నిజానికి సినిమాల్లో ఉన్న అన్ని జోనర్లలో థ్రిల్లర్ జోనర్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంది. అందులోనూ సైకలాజికల్ థ్రిల్లర్ మరింత ప్రత్యేకమైనది. ఎందుకంటే చూసే ప్రేక్షకుడిని ఆద్యంతం కట్టిపడేసేది ఈ సైకలాజికల్ థ్రిల్లరే. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ఇటీవలే విడుదలైన హాలీవుడ్ చిత్రం 'ది ఉమన్ ఇన్ కేబిన్ 10' ఈ కోవకు చెందినదే. ప్రముఖ నవలా రచయిత్రి రూత్ వేర్ రాసిన పుస్తకం ఆధారంగా ఈ సినిమాను దర్శకులు సైమన్ స్టోన్ తెరకెక్కించారు. ఈ సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా లభ్యమవుతోంది. విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రం కూడా. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ అయిన లారాకు ధనవంతురాలైన అనీ బల్మర్ నుండి ఓ ఆహ్వానం అందుతుంది. క్యాన్సర్ బాధితురాలిగా ఆఖరి దశలో ఉన్న అనీ బల్మర్ తన యావదాస్తిని తన భర్త అయిన రిచర్డ్ పేరిట రాయడానికి, అలాగే తాను నిర్వహించే స్వచ్ఛంధ సంస్థకు ఫండ్ రైజింగ్ కోసం ప్రపంచంలో ఉన్న ధనవంతులతో పాటు లారాని కూడా ఓ షిప్ ప్రయాణానికి ఆహ్వానిస్తుంది. వీరంతా కలిసి ఓ విలాసవంతమైన షిప్‌లో నార్వేకి వెళుతుంటారు. లారాకి ఆ షిప్‌లో 8వ నెంబరు గదిని కేటాయిస్తారు. రెండు రోజుల ఈ ప్రయాణంలో ప్రతి క్షణం విందులు, వినోదాలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అనూహ్యంగా ఓ రోజు రాత్రి 10వ నెంబరు గది నుండి ఓ అమ్మాయి సముద్రంలోకి పడిపోవడం లారా గమనిస్తుంది. ఇదే విషయం నిర్వాహకులకు చెబితే... ఆ గదిని ఎప్పుడూ తెరవలేదని, దాంట్లో ఎవరూ లేరని లారాకు చెబుతారు. వాళ్ళ మాటలను లారా నమ్మదు. ఇంతలో లారాపై కూడా ఓ హత్యా ప్రయత్నం జరుగుతుంది. ఆ 10వ నెంబరులో ఉన్న అమ్మాయి ఎవరో, ఎందుకు పడిపోయిందో తెలుసుకోవడానికి లారా శత విధాలా ప్రయత్నిస్తుంటుంది. ఇంతకీ ఆ గదిలో ఆమె ఉన్నట్టా? లేనట్టా. అలాగే లారా పై హత్యాయత్నం చేసిందెవరు? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానాలు కావాలంటే 'ది ఉమెన్ ఇన్ కేబిన్ 10' సినిమాని చూడాల్సిందే. అక్కడక్కడా కాస్త స్లోగా అనిపించినా వర్త్ టు వాచ్ దిస్ సైకలాజికల్ థ్రిల్లర్.

– హరికృష్ణ ఇంటూరు

రజతం నెగ్గిన షూటర్ అనీశ్

కైరో: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో ఐదో పతకం చేరింది. ఆదివారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ అనీశ్ భన్వాలా రజత పతకం సొంతం చేసుకున్నాడు. ఆరుగురు షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో హరియాణాకు చెందిన 23 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఫ్రాన్స్ షూటర్ క్లెమెంట్ బెసెగెట్ (31 పాయింట్లు) స్వర్ణం దక్కించుకోగా... 25 పాయింట్లతో మాక్సిమ్ హోరోడినెట్స్ (ఉక్రెయిన్) కాంస్య పతకాన్ని సాధించాడు. మొత్తం 60 షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో అనీశ్ 585 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకున్నాడు. టాప్–6లో నిలిచిన వారికి మాత్రమే ఫైనల్లో పోటీపడే అవకాశం లభిస్తుంది. క్వాలిఫయింగ్‌లో పోటీపడ్డ భారత ఇతర షూటర్లు ఆదర్శ్ (575 పాయింట్లు) 22వ స్థానంలో, సమీర్ (571 పాయింట్లు) 35వ స్థానంలో నిలిచారు. అంతకుముందు ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అర్జున్–ఇలవేనిల్ జోడీ ఎనిమిదో స్థానంలో... రుద్రాంక్ష్–శ్రేయ జోడీ 21వ స్థానంలో నిలిచాయి. రెండో రోజు పోటీలు ముగిశాక భారత్ ఒక స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలతో కలిపి ఐదు పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.

నాలుగో రౌండ్‌లో కార్తీక్ వెంకటరామన్

- విదిత్, నారాయణన్ అవుట్

పనాజీ: ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ నాలుగో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. రొమేనియా గ్రాండ్‌మాస్టర్ డేనియల్ బొగ్డాన్‌తో జరిగిన మూడో రౌండ్‌లో కార్తీక్ ‘టైబ్రేక్’లో 1.5–0.5తో విజయం సాధించి ముందంజ వేశాడు. కార్తీక్, బొగ్డాన్ నిర్ణీత రెండు క్లాసికల్ గేమ్‌ల తర్వాత 1–1తో సమంగా నిలువడంతో ఆదివారం ‘టైబ్రేక్’ నిర్వహించారు. వీరిద్దరి మధ్య టైబ్రేక్ తొలి గేమ్ 68 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగిసింది. రెండో గేమ్‌లో కార్తీక్ 43 ఎత్తుల్లో గెలుపొంది విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. మూడో రౌండ్ టైబ్రేక్‌లో పోటీపడ్డ మరో ఇద్దరు భారత గ్రాండ్‌మాస్టర్లు విదిత్ సంతోష్ గుజరాతి, ఎస్ఎల్ నారాయణన్‌లకు నిరాశ ఎదురైంది. విదిత్ 1.5–2.5తో స్యామ్ షాంక్‌లాండ్ (అమెరికా) చేతిలో, నారాయణన్ 0.5–1.5తో యు యాంగీ (చైనా) చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించారు. మూడో రౌండ్ తర్వాత భారత్ నుంచి ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, పెంటేల హరికృష్ణ, ప్రణవ్, కార్తీక్ వెంకటరామన్ మాత్రమే ఈ టోర్నీ బరిలో మిగిలారు. సోమవారం విశ్రాంతి దినం. మంగళవారం మొదలయ్యే నాలుగో రౌండ్‌లో నిల్స్ గ్రాండెలియస్ (స్వీడన్)తో హరికృష్ణ; నొదిర్‌బెక్ యాకుబొయెవ్ (ఉజ్బెకిస్తాన్)తో ప్రణవ్; లె క్వాంగ్ లియెమ్ (వియత్నాం)తో కార్తీక్ వెంకటరామన్; డానిల్ డుబోవ్ (రష్యా)తో ప్రజ్ఞానంద; పీటర్ లెకో (హంగేరి)తో అర్జున్ తలపడతారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ–పేపర్‌లో

6,6,6,6,6,6,6,6

ఆకాశ్ కుమార్ అద్భుతం • 8 వరుస బంతుల్లో 8 సిక్స్‌లు

- ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా రికార్డు
- ఒకే ఓవర్లో 6 బంతుల్లో 6 సిక్స్‌లు
- రవిశాస్త్రి, గ్యారీ సోబర్స్ సరసన మేఘాలయ బ్యాటర్
- ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీతో మరో రికార్డు

సూరత్: దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో ఆదివారం అత్యద్భుతం చోటు చేసుకుంది. ఒకటి కాదు... రెండు కాదు... మూడు కాదు... ఎవరూ ఊహించని విధంగా మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ కుమార్ చౌధరీ వరుసగా 8 బంతుల్లో 8 సిక్స్‌లతో చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. ఈ క్రమంలో ఫస్ట్‌క్లాస్ (మూడు లేదా అంతకంటే ఎక్కువ రోజులు జరిగే మ్యాచ్‌లు) క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా రంజీ ట్రోఫీ చరిత్రలో, ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తక్కువ బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన ప్లేయర్‌గానూ రికార్డు సృష్టించాడు. అరుణాచల్ ప్రదేశ్‌తో ఇక్కడి సీకే పీతావాలా గ్రౌండ్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో రెండో రోజు ఆటలో ఆకాశ్ ఈ ఘనత సాధించాడు. మొత్తం 14 బంతులు ఆడిన 25 ఏళ్ల ఆకాశ్ 8 సిక్స్‌లు, రెండు సింగిల్స్‌తో కలిపి 50 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మేఘాలయ స్కోరు 576/6 వద్ద ఆకాశ్ క్రీజులోకి అడుగు పెట్టాడు. ఎనిమిదో స్థానంలో క్రీజులోకి వచ్చిన ఆకాశ్... తొలి మూడు బంతుల్లో 0,1,1 పరుగులు చేశాడు. అనంతరం ఆకాశ్ అరుణాచల్ ప్రదేశ్ బౌలర్ లిమార్ దాబి వేసిన ఇన్నింగ్స్ 126వ ఓవర్లో 6 బంతుల్లో 6 సిక్స్‌లు కొట్టాడు. ఆ తర్వాత మోహిత్ వేసిన ఇన్నింగ్స్ 127వ ఓవర్లోని తొలి రెండు బంతులను కూడా ఆకాశ్ సిక్స్‌లుగా మలిచి 11 బంతుల్లోనే అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆకాశ్ ఆడిన చివరి మూడు బంతుల్లో పరుగులేమీ చేయలేదు. ఓవర్‌నైట్ స్కోరు 386/2తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన మేఘాలయ 127 ఓవర్లలో 6 వికెట్లకు 628 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అరుణాచల్ ప్రదేశ్ 27.4 ఓవర్లలో 73 పరుగులకే కుప్పకూలింది. మేఘాలయ బౌలర్లలో ఆర్యన్ బోరా 4 వికెట్లు తీయగా... ఆరోన్, దీపూ సాంగ్మా 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. ఆకాశ్ కుమార్ చౌధరీ, స్వస్తిక్ ఛత్రిలకు ఒక్కో వికెట్ దక్కింది. 555 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన మేఘాలయ ప్రత్యర్థి జట్టుకు ఫాలోఆన్ ఇన్నింగ్స్ ఆడించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి అరుణాచల్ ప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 29 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఆకాశ్ కుమార్‌కు రెండు వికెట్లు లభించాయి. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే అరుణాచల్ ప్రదేశ్ 526 పరుగులు చేయాలి. స్వతహాగా బౌలర్‌గా అయిన ఆకాశ్ 2019లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు 30 మ్యాచ్‌లు ఆడి 503 పరుగులు చేయడంతోపాటు 87 వికెట్లు పడగొట్టాడు.

ఆకాశ్ ఘనతలు

- ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో వేగవంతమైన అర్ధ సెంచరీ చేసిన ప్లేయర్‌గా లెస్టర్‌షైర్ ఆటగాడు వేన్ వైట్ (2012లో ఎసెక్స్ జట్టుపై 12 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును ఆకాశ్ బద్దలు కొట్టాడు.
- రంజీ ట్రోఫీలో వేగవంతమైన అర్ధ సెంచరీ చేసిన ప్లేయర్‌గా జమ్మూ కశ్మీర్ ఆటగాడు బందీప్ సింగ్ (15 బంతుల్లో త్రిపుర జట్టుపై 2015లో) పేరిట ఉన్న రికార్డును ఆకాశ్ సవరించాడు.
- ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రవిశాస్త్రి, గ్యారీ సోబర్స్ తర్వాత ఒకే ఓవర్లోని 6 బంతుల్లో 6 సిక్స్‌లు కొట్టిన మూడో బ్యాటర్‌గా ఆకాశ్ కుమార్ గుర్తింపు పొందాడు. బరోడా జట్టుతో 1985లో జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో తిలక్ రాజ్ వేసిన ఓవర్లో రవిశాస్త్రి... గ్లామోర్గాన్ జట్టుతో 1968లో జరిగిన కౌంటీ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో మాల్కం నాష్ వేసిన ఓవర్లో నాటింగ్‌హామ్‌షైర్ జట్టుకు ఆడుతూ వెస్టిండీస్ ప్లేయర్‌గ్యారీ సోబర్స్ ఈ ఘనత సాధించారు.



అల్‌కరాజ్ శుభారంభం

ట్యూరిన్ (ఇటలీ): పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నమెంట్ ఏటీపీ ఫైనల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) శుభారంభం చేశాడు. టాప్–8 ర్యాంకర్ల మధ్య ఆదివారం ఈ మెగా టోర్నీ మొదలైంది. ‘జిమీకానర్స్ గ్రూప్’ తొలి లీగ్ మ్యాచ్‌లో అల్‌కరాజ్ 7–6 (7/5), 6–2తో ఏడో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు. 1 గంట 40 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఐదు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. ‘జిమ్మీ కానర్స్ గ్రూప్’లోనే టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా), ముసెట్టి (ఇటలీ) కూడా ఉన్నారు. ‘జాన్ బోర్గ్ గ్రూప్’లో ప్రపంచ రెండో ర్యాంకర్ సినెర్ (ఇటలీ), జ్వెరెవ్ (జర్మనీ), బెన్ షెల్టన్ (అమెరికా), ఫెలిక్స్ (కెనడా) ఉన్నారు.

417 ఛేదించింది

దక్షిణాఫ్రికా ‘ఎ’ జట్టు సంచలనం

- భారత్ ‘ఎ’తో రెండో అనధికారిక టెస్టులో ఐదు వికెట్లతో విజయం
- 1-1తో సమంగా ముగిసిన సిరీస్

బెంగళూరు: దక్షిణాఫ్రికా ‘ఎ’ జట్టు 400 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించింది. భారత్ ‘ఎ’తో జరిగిన రెండో అనధికారిక టెస్టులో 5 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. 2 మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. భారత్‌లాంటి స్పిన్ వేదికలపై నాలుగో ఇన్నింగ్స్ (ఛేదించే జట్టు రెండో ఇన్నింగ్స్) అది కూడా చివరి రోజు చాలా కష్టం. అయినాసరే సఫారీ ‘ఎ’ జట్టు భారత రెగ్యులర్ టెస్టు బౌలర్లు సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్‌లను ఎదుర్కొని మరీ భారీ లక్ష్యాన్ని ఛేదించడమే ఈ మ్యాచ్‌లో పెద్ద హైలైట్! ఓవరాల్‌గా ‘ఎ’ జట్ల అనధికారిక నాలుగు రోజుల మ్యాచ్‌ల్లోనే ఇది అత్యధిక పరుగుల ఛేదనగా ఘనతకెక్కింది. ఆఖరి రోజు దక్షిణాఫ్రికా ‘ఎ’ రెండో ఇన్నింగ్స్‌లో 98 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 417 పరుగులు చేసి గెలిచింది. క్రీజులోకి దిగిన ఏడు మంది బ్యాటర్లంతా ఆడటం మరో విశేషం. ఇంత పెద్ద లక్ష్యఛేదనలో ఒక్క సెంచరీ కూడా లేదు. అయినా కూడా కొండంత లక్ష్యం సమష్టి బ్యాటింగ్ ప్రదర్శనతో ఇంకో మూడు ఓవర్ల (90 ఓవర్ల కోటా)కు ముందే కరిగింది.

ఆఖరి రోజు... 392 పరుగులు...

తొలి మ్యాచ్ నెగ్గి ఊపుమీదున్న భారత్ ‘ఎ’ మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌ను 382/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. 417 లక్ష్యం కావడంతో విజయం మీదా 2–0తో సిరీస్ కైవసం మీదా గంపెడాశలు పెట్టుకుంది. 25/0 ఓవర్‌నైట్ స్కోరుతో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సఫారీ ‘ఎ’ గెలవాలంటే ఇంకా 392 పరుగులు చేయాలి. ఇలాంటి తరుణంలో ఓపెనర్లు జోర్డాన్ హెర్మన్ (123 బంతుల్లో 91; 13 ఫోర్లు, 1 సిక్స్), లెసెగొ సెనొక్వానె (174 బంతుల్లో 77; 11 ఫోర్లు) భారీ శుభారంభాన్నిచ్చారు. ఇద్దరు కలిసి తొలిసెషన్‌లో 150 పరుగులు జోడించడంతోనే విజయానికి బాటపడింది. రెండో సెషన్‌లో వీరిద్దరు అవుటైనప్పటికీ జుబేర్ హమ్జా (88 బంతుల్లో 77; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), తెంబా బవుమా (101 బంతుల్లో 59; 7 ఫోర్లు) మరో శతక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అర్ధశతకాలు బాదిన వీరిద్దరు మూడో వికెట్‌కు 107 పరుగులు జోడించడం, స్కోరు 300 పైచిలుకు దాటడంతోనే సఫారీ గెలుపు ఖాయమైపోయింది. ఎస్తర్‌హ్యూజెన్ (54 బంతుల్లో 52 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ అకెర్మన్ (24; 4 ఫోర్లు), వాన్ వురెన్ (20 నాటౌట్; 1 సిక్స్) వన్డేను తలపించే ఆట ఆడటంతో దక్షిణాఫ్రికా విజయంపై ఏ దశలోనూ సందేహాలే తలెత్తలేదు. భారత్ ‘ఎ’ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులు చేయగా... దక్షిణాఫ్రికా ‘ఎ’ తొలి ఇన్నింగ్స్‌లో 221 పరుగులకు ఆలౌటైంది. భారత్ ‘ఎ’ రెండో ఇన్నింగ్స్‌ను 382 పరుగులకు డిక్లేర్ చేసి దక్షిణాఫ్రికా ‘ఎ’ జట్టుకు 417 పరగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

సింపుల్‌గా జాబ్ మారుతున్నారు!

అసలే కుర్రకారు. వారి ఆలోచనలూ ఉడుకు రక్తంలా పరుగెడుతుంటాయి. ఉద్యోగం విషయంలోనూ అంతే. ఏళ్లకేళ్లు ఒకే కంపెనీలో ఉద్యోగం చేస్తూ కూర్చోవడానికి తాము ఒకప్పటి తరం కాదని తేల్చిచెబుతోంది జనరేషన్–జీ. మంచి వేతనం దొరికితే ఏడాదిలోపే జంప్ చేస్తామని నిర్మొహమాటంగా కుండబద్దలు కొడుతున్నారీ తరం. విశ్వసనీయత, ఉద్యోగ స్థిరత్వం, కెరీర్ వృద్ధి.. ఇదంతా గతం. జీతం, పని సౌలభ్యం, వర్క్–లైఫ్ బ్యాలెన్స్ ఈ అంశాలే జెన్–జీ తరానికి ఇప్పుడు కీలకంగా మారాయని రాండ్‌స్టాడ్ ఇండియా తాజా నివేదిక చెబుతోంది. పనికి తగ్గ వేతనం జెన్–జీ నిపుణులకు ఒక ప్రాథమిక డిమాండ్‌గా ఉన్నప్పటికీ.. ఎప్పుడు, ఎక్కడ, ఎలా పని చేయాలన్న అంశాలకూ విలువ ఇస్తున్నారని ‘ద జెన్–జీ వర్క్‌ప్లేస్ బ్లూప్రింట్’ పేరుతో రూపొందిన ఈ నివేదిక తెలిపింది. 1997–2007 మధ్య జన్మించిన జెన్–జీ బ్యాచ్‌లో 35 కోట్ల మందికిపైగా ఉన్నారు. భారత జనాభాలో వీరి వాటా దాదాపు 27%.

వృద్ధిని కోరుకుంటున్నారు

అదనపు సెలవు, పదవీ విరమణ ప్రయోజనాలు వంటి సంప్రదాయ ప్రోత్సాహకాలు జెన్ జీని పెద్దగా ఆకర్షించడం లేదు. వీటికి బదులుగా అర్థవంతమైన పని, అభ్యాస అవకాశాలను ఈ తరం కోరుకుంటోంది. చాలామంది ప్రయాణ అవకాశాలు, రిమోట్‌గా పని చేసే సౌకర్యాలు ఉన్న కంపెనీల్లో కొనసాగేందుకు మొగ్గు చూపుతున్నారు. తరచూ కంపెనీలు మారడం తప్పుకాదనీ, సుదీర్ఘ ప్రయాణంలో భాగంగా వారు వ్యక్తిగత, వృత్తిపరమైన వృద్ధిని మాత్రమే కోరుకుంటున్నారని నివేదిక స్పష్టం చేసింది. ఎదగడానికి అవకాశాల కోసం చూస్తున్నందున తరచూ ఉద్యోగం మారుతున్నారని తెలిపింది.

మారాల్సింది కంపెనీలే!

కంపెనీలు ఈ మార్పులకు అనుగుణంగా మారాలని నివేదిక సూచించింది. ఉద్యోగుల పనితీరు మెరుగుపరిచే అవకాశాలు కల్పించడం, మార్గదర్శకత్వం, వారితో మమేకం కావడం, సౌకర్యవంతమైన పని వాతావరణం వంటివి అమలు చేసే కంపెనీలు జెన్–జీ ప్రతిభను ఆకర్షించడమే కాకుండా.. దీర్ఘకాలం పాటు వీరిని తమ సంస్థల్లో ఉద్యోగులుగా నిలుపుకోగలుగుతాయని వివరించింది. అవకాశాలు బోలెడున్నాయని వారు దృఢ నిశ్చయంతో ఉన్నారని నివేదిక తెలిపింది. ఈ తరుణంలో ఉద్యోగావకాశాలు, అభివృద్ధి మార్గాలను ఈ జనరేషన్ కోసం ఎలా రూపొందించాలో కంపెనీలు పునరాలోచించుకోవాలని సూచించింది.

బేరీజు వేసుకుని మరీ..

మెరుగైన అవకాశాలపై దృష్టి సారించినప్పటికీ తమ ఉద్యోగం / పాత్రలో తాము సమర్థులుగా భావిస్తున్నామని 81% మంది చెబుతున్నారు. 93% మిలీనియల్స్, 89% జెన్–ఎక్స్‌తో పోలిస్తే 82% జెన్–జీ తరం మాత్రమే తమ కంపెనీలో తమకు విలువ ఉందని భావిస్తున్నారు. 94% కంటే ఎక్కువ మంది కొత్త కంపెనీని ఎంచుకునే ముందు తమ దీర్ఘకాలిక ఆకాంక్షలకు తగ్గట్టుగా నూతన ఉద్యోగం ఉందా లేదా అని బేరీజు వేసుకుంటున్నారట. ప్రపంచవ్యాప్తంగా జెన్–జీ తరంలో ఇలా ఆలోచించేవారి శాతం సగటు 79%.

ఎంత కాలం చేస్తారంటే?

ఒక కంపెనీలో గరిష్ఠంగా 5 ఏళ్ల వరకు పనిచేసేందుకు ఇష్టపడుతున్నారు జెన్ జీ తరం వాళ్లు. గుర్తింపు లేకపోవడంతో ఉద్యోగం మానేసేవాళ్లు కేవలం 13 శాతం మందే ఉండటం గమనార్హం.

కంపెనీలో 15 ఏళ్లు మాత్రమే పనిచేసేందుకు సిద్ధం	49%
చేరిన ఏడాదిలోపే కంపెనీ మారేందుకు రెడీ	38%
తక్కువ వేతనం వల్లే జాబ్ మారుతున్నారు	50%
గుర్తింపు లేకపోవడంతో కంపెనీకి గుడ్‌బై	13%
వృద్ధి నిలిచిపోవడం వల్లే మరో కంపెనీవైపు చూపు	12%
ప్రస్తుత కంపెనీలో దీర్ఘకాలం పనిచేసేందుకు సంసిద్ధం	8%

ప్రాధాన్యతలు ఇలా..

జెన్ జీకి ఉద్యోగానికి సంబంధించి మొదటి ప్రాధానత్య జీతమే.

వేతనం	పని సౌలభ్యం	వర్క్–లైఫ్ బ్యాలెన్స్
37%	25%	22%

కురుబలను చంపుతూ శ్రీభక్త కనకదాసకి దండలా!

- కూటమి ప్రభుత్వంలో కురుబలకు రక్షణ లేదు
- కురుబలను టీడీపీ నేతలు వరుసపెట్టి నరికి చంపుతున్నారు
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

సాక్షి, అమరావతి: కురుబ కులస్తులను టీడీపీ నాయకులు దారుణంగా నరికి చంపుతూ మరోవైపు శ్రీభక్త కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి ప్రేమ ఉన్నట్టు నటిస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కురుబ కులస్తులను వైఎస్ జగన్ భుజాన మోస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకులు కాలికింద వేసి తొక్కుతున్నారన్నారు. కురబలపై కక్ష సాధింపులు ఇప్పటికైనా ఆపి తమ మానాన తమను బతికేలా వదిలేస్తే చాలని నారా లోకేశ్‌ను ఉద్దేశించి అన్నారు.

దారుణంగా నరికి చంపుతున్నారు

‘కురబలను మీరే హత్యచేసి ఓదార్చడానికి కూడా మీరే రావడం కురుబలకు వెన్నుపోటు పొడవడమే’ అని మాధవ్ మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాప్తాడులో కురుబ లింగమయ్యను, ఆలూరులో బండారు వీరన్నను, కనగానపల్లిలో మురళి అనే యువకుడిని టీడీపీ నాయకులు దారుణంగా నరికి చంపారని వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బండారు వీరన్నను రాజీనామా చేయాలని టీడీపీ నాయకులు బెదిరించారని, 10 రోజుల్లో రాజీనామా చేస్తానని చెప్పినా వినకుండా బైక్‌పై వెళ్తుంటే కొడవళ్లతో దారుణాతి దారుణంగా నరికి చంపేశారని వాపోయారు. టీడీపీ అరాచకాలను ఎదిరించినందుకు కురుబ లింగమయ్యను కర్రలతో కొట్టి చంపేశారన్నారు. వారి కుటుంబాన్ని పరామర్శించడానికి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ వెళితే కూడా కూటమి ప్రభుత్వం ఓర్చుకోలేకపోయిందని ధ్వజమెత్తారు. దాదాపు 50 మంది కురుబ కులస్తులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని, కనగానపల్లిలో మురళి అనే యువకుడిని టీడీపీ నాయకులే దారుణంగా నరికి చంపితే.. అతడి తల్లిదండ్రులు కూడా పుత్రశోకంతో కన్నుమూశారని చెప్పారు. కురుబ కులస్తులను టీడీపీ నాయకులు వరుసపెట్టి దారుణంగా నరికి చంపేస్తుంటే.. మంత్రి నారా లోకేశ్ ఏమీ ఎరగనట్టు, కురుబలపై తనకు ప్రేమ ఉన్నట్టు శ్రీభక్త కనకదాస జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి దండలేసి నివాళులర్పించడం కురుబలను అవమానించడమే అన్నారు. ఇదే నారా లోకేశ్ కురుబ లింగమయ్య వర్ధంతికి కూడా వచ్చి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు వారి కుటుంబానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 50 మంది కురుబలపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని మాధవ్ డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి

అవే చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తిరిగి పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

దళిత ఎమ్మెల్యేకి టీడీపీ నేతల అవమానం

- తిరువూరులో వివక్షాపూరిత రాజకీయం
- ఎమ్మెల్యే పంపిణీ చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వెనక్కి తీసుకున్న టీడీపీ నేతలు
- తమవల్లే వచ్చాయంటూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మళ్లీ పంపిణీ చేసిన నేతలు

సాక్షి, అమరావతి: తిరువూరు టీడీపీలో కోల్డ్‌వార్ ముదిరిపోతోంది. తనకు వ్యతిరేకంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మరో వర్గాన్ని పెంచి పోషిస్తున్నారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. వీరి మధ్య రాజీ కోసం చంద్రబాబు సూచనల మేరకు పార్టీ క్రమశిక్షణా సంఘం నేతలు ప్రయత్నిస్తున్నారు. కానీ.. నియోజకవర్గంలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహారాలు నడుస్తున్నాయి. తాజాగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కొలికపూడి పంపిణీ చేయగా.. ఆ వ్యవహారం ఎమ్మెల్యే, ఎంపీ వర్గాల మధ్య చిచ్చు రాజేశాయి. ఎమ్మెల్యే పంపిణీ చేసిన చెక్కులను టీడీపీ నేతలు వెనక్కి తీసుకుని.. తిరిగి పంపిణీ చేయడం చర్చనీయాంశమైంది.

ఎమ్మెల్యే పిలిచినా రాకుండా..

విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి, వెంకటరావమ్మ, మహ్మద్ గుల్జార్‌బేగం, తెర్ల వెంకటేశ్వరరావులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.3.54 లక్షల చెక్కులు మంజూరయ్యాయి. వాటిని ఈ నెల 8న టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి తన కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పుట్రేల గ్రామానికి చెందిన పార్టీ నాయకులందరినీ ఈ కార్యక్రమానికి పిలిచినా కొందరు రాలేదు. అయితే.. వారు ఎమ్మెల్యే పంపిణీ చేసిన చెక్కులను లబ్ధిదారుల నుంచి వెనక్కి తీసుకున్నారు. ఆదివారం లబ్ధిదారుల ఇళ్లకు ప్రత్యేకంగా వెళ్లి తమ వల్లే చెక్కులు వచ్చాయని చెబుతూ తిరిగి వారికి చెక్కులు అందించారు. ఎమ్మెల్యే ఇచ్చిన చెక్కులను మళ్లీ ఇవ్వడం ఏమిటని స్థానిక పార్టీ నేతలు ప్రశ్నించి ఆ విషయాన్ని బయటపెట్టారు. ఎమ్మెల్యేపై వివక్షతోనే కొందరు నేతలు చెక్కులను మళ్లీ పంపిణీ చేశారని ఆయన అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెక్కుల పంపిణీ చేయడానికి ఒకరోజు ముందే ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నేతలకు ఎమ్మెల్యే ఆఫీస్ నుంచి సమాచారమిస్తారని, అప్పుడు రాకుండా మళ్లీ గ్రామంలోని చెక్కులు ఇచ్చిన వారి ఇళ్లకు వెళ్లి ఆ చెక్కులను తీసుకుని తాము చెక్కులు ఇచ్చినట్టు ఫొటోలు దిగడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

కంచి కామకోటి పీఠం సేవలు ప్రశంసనీయం

పెదకాకాని శంకర కంటి ఆస్పత్రిలో నూతన భవనం ప్రారంభించిన సీఎం

పెదకాకాని: శంకర కంచి కామకోటి పీఠం సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుర్గం నాగమనోహర్ బి బ్లాక్ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి హాజరయ్యారు. సీఎం మాట్లాడుతూ.. పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రిలో 4లక్షల మందికి శస్త్రచికిత్సలు చేయడం గొప్ప విషయమన్నారు. శంకర కంటి ఆస్పత్రులు 14 రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్నాయన్నారు. ఏపీలో ఉన్న పేదలందరికీ ప్రభుత్వం రూ.2.50 లక్షల పరిమితితో యూనివర్సల్ హెల్త్ ఇన్స్యూరెన్స్ కార్డులు అందించనున్నట్లు చెప్పారు.

శంకర కంటి ఆస్పత్రిలో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు తదితరులు

ప్రజలను కాపాడిన వారికి భగవంతుడు శాంతి కలిగిస్తాడు: శంకర విజయేంద్ర సరస్వతి

కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ ప్రజలను, ధర్మాన్ని కాపాడి ప్రజానీకానికి భగవంతుడు శాంతి చేకూరుస్తాడని చెప్పారు. విద్య, సంస్కృతి కలిపి శంకర స్కూల్స్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైద్యం కోసం హిందూ మిషన్ హాస్పిటల్స్ ద్వారా ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు.

కళత్తూరు బాధితులను ఆదుకోవాలి

సీఎం చంద్రబాబుకు సీపీఎం లేఖ

సాక్షి, అమరావతి: తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం ఓళ్లూరు రాయల్ చెరువు కట్టకు గండి పడి కళత్తూరు దళితవాడ, పాతపాలెం అరుంధతివాడ పూర్తిగా వరద ప్రవాహానికి గురై తీవ్ర నష్టం వాటిల్లిందని, సర్వస్వం కోల్పోయిన వారికి పునరావాసం ఏర్పాటు చేసి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను శ్రీనివాసరావు ఆదివారం మీడియాకు విడుదల చేశారు. దాదాపు 700 కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయన్నారు. 900 ఆవులు, గేదెలు, 23 పూరిళ్లు కొట్టుకుపోయాయన్నారు. రెండు వేల ఎకరాలకుపైగా పొలాల్లో ఇసుక మేటలు వేసి సాగుకు పనికిరాకుండా పోయాయని, తీవ్రంగా నష్టపోయిన రైతులు, ప్రజలకు ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
95	17
83,216	25,492

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	23,005	▽	49
డోజోన్స్	46,978	△	66
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,682	▽	53
డాక్స్	23,570	▽	164
షాంఘై	3,998	▽	10
నికాయ్	50,276	▽	607

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.25	89.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.97	117.92
€	యూరో	ఎస్‌బీఐ	101.01	103.79
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.11	58.54
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.54	59.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.59	69.31
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.71	24.29
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.19	24.48
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.56	13.39

రిటర్నులకు ఇంకా చాన్సుంది..!

బిలేటెడ్ ఐటీఆర్ సమర్పించొచ్చు
వేసిన రిటర్నుల్లో తప్పుల సవరణకూ అవకాశం
డిసెంబర్ 31 వరకు గడువు
ఆలస్యం చేసిన కొద్దీ పెరిగే వడ్డీ భారం
అదనపు పన్ను కూడా చెల్లించాల్సి రావచ్చు

ఆదాయ పన్ను రిటర్నుల దాఖలు (ఐటీఆర్) గడువు సెప్టెంబర్ 16తో ముగిసింది. ఏదైనా కారణాలతో గడువు లోపు రిటర్నులు సమర్పించలేకపోతే.. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. కొంత పెనాల్టీ చెల్లించడం ద్వారా ఆదాయపన్ను చట్టం నిబంధనల కింద రిటర్నులు దాఖలు చేయొచ్చు. ఇందుకు డిసెంబర్ 31 వరకూ గడువు ఉంది. ఇక గడువు ముగియడానికి చివరి గడియల్లో హడావుడిగా రిటర్నులు దాఖలు చేసిన వారు సైతం, అందులో ఏవైనా తప్పులు దొర్లి ఉంటే వాటిని సరిచేసుకునేందుకు వెసులుబాటు ఉంది. ఈ విషయంలో పన్ను చెల్లింపుదారులు ఏం చేయాలన్నది చూద్దాం.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఈ ఏడాది రిటర్నుల దాఖలుకు ఆదాయపన్ను శాఖ అదనపు సమయం ఇచ్చింది. జూలై 31గా ఉన్న గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించింది. చివరి రోజుల్లో ఈ–ఫైలింగ్ పోర్టల్‌పై సాంకేతిక సమస్యలు రావడంతో సెప్టెంబర్ 16 వరకు రిటర్నులు సమర్పించేందుకు అవకాశం ఇచ్చింది. అయినా సరే సకాలంలో రిటర్నులు సమర్పించని వారు ఇప్పుడు బిలేటెడ్(ఆలస్యంగా) ఐటీఆర్‌ను సెక్షన్ 139(1) కింద సమర్పించొచ్చు. ఇందుకు డిసెంబర్ 31 వరకు అవకాశం ఉంటుంది. కాకపోతే పెనాల్టీ కట్టాలి. అంతేకాదు, ఒకవేళ పన్ను చెల్లించాల్సి ఉంటే, వడ్డీతోపాటు కట్టేయాలి. సెక్షన్ 234ఎఫ్ కింద.. ఆదాయం రూ.5 లక్షలకు మించని వారు రూ.1,000 బిలేటెడ్ రిటర్నుల ఫీజు కింద చెల్లించాలి. ఆదాయం రూ.5 లక్షలు మించితే రూ.5,000 చెల్లించాల్సి వస్తుంది. అంతేకాదు.. సెక్షన్ 234ఏ కింద నికరంగా చెల్లించాల్సిన పన్నుపై, గడువు ముగిసిన నాటి నుంచి నెలవారీ ఒక శాతం చొప్పున వడ్డీని చెల్లించాలి. అప్పటికే సంబంధిత పన్ను చెల్లింపుదారు పాన్‌పై నమోదైన టీడీఎస్, ముందస్తు పన్ను చెల్లింపులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత నికరంగా చెల్లించాల్సిన మొత్తంపైనే వడ్డీ పడుతుందని బీడీవో ఇండియా ఎల్‌ఎల్‌పీ ట్యాక్స్ పార్టనర్ ప్రీతి శర్మ తెలిపారు.

అసలు చెల్లించాల్సిన తేదీ నుంచి, రిటర్నులు సమర్పించే తేదీ వరకు ఈ వడ్డీని పరిగణనలోకి తీసుకుంటారు. ఒక ఆర్థిక సంవత్సరం మొత్తం మీద పన్ను బాధ్యత రూ.10,000కు మించి ఉంటే అందులో 90 శాతాన్ని సంబంధిత ఆర్థిక సంవత్సరం ముగియక ముందే చెల్లించాలని (ముందస్తు పన్ను) నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రకారం.. 2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి నికర పన్ను మొత్తంలో 90 శాతాన్ని ముందుగా చెల్లించడంలో విఫలమైతే అప్పుడు సెక్షన్ 234బీ కింద నిబంధనలు అమలవుతాయి. వీటి కింద ఆర్థిక సంవత్సరం ముగిసిన మర్నాటి నుంచి (ఏప్రిల్ 1) పన్ను మొత్తంపై వడ్డీ రేటు అమల్లోకి వస్తుంది. ఇక సెక్షన్ 234సీ కింద సంబంధిత త్రైమాసికం చివరి తేదీ నాటికి ముందస్తు పన్ను చెల్లించడంలో విఫలమైనా, లేదా తక్కువ చెల్లించినా.. అప్పుడు క్వార్టర్ వారీ పరిశీలన తర్వాత వడ్డీ రేటు అమలు చేస్తారు. ఒకవేళ త్రైమాసికం వారీ ముందస్తు పన్ను చెల్లింపుల్లో విఫలమై, ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత కూడా గడువులోపు రిటర్నులు సమర్పించి, పన్ను బకాయిని వడ్డీ సహా చెల్లించలేకపోతే.. అలాంటి సందర్భాల్లో ఈ మూడు సెక్షన్ల (234ఏ, బీ, సీ) కింద మూడు రెట్లు వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని ప్రీతి శర్మ వివరించారు. దీంతో చెల్లించాల్సిన మొత్తం గణనీయంగా పెరిగిపోతుంది. ఈ భారం వద్దనుకుంటే నిబంధనల ప్రకారం సకాలంలో చెల్లించడమే చక్కని మార్గం.

జాప్యం చేస్తే నష్టమే..

గడువులోపు రిటర్నులు దాఖలు చేసినట్టయితే పాత, కొత్త పన్ను విధానాల్లో తమకు అనుకూలమైన దాన్ని (తక్కువ పన్ను భారం పడే) ఎంపిక చేసుకోవచ్చు. కానీ, గడువు దాటితే విధిగా కొత్త పన్ను విధానం కిందే సమర్పించగలరు. అంతేకాదు సెక్షన్ 10ఏ, 10బీ, 80–1ఏ, 80–ఐబీ, 80–ఐసీ, 80–ఐడీ, 80–ఐఈ కింద వ్యాపార, మూలధన నష్టాలను తదుపరి ఆర్థిక సంవత్సరాలకు బదిలీ చేసుకోవడం కుదరదు. గడువులోపు రిటర్నులు సమర్పించిన వారికే ఈ నష్టాలను తదుపరి ఆర్థిక సంవత్సరాలకు బదిలీ చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. ''గడువు తర్వాత కొత్త పన్ను విధానం కింద రిటర్నులు వేసేట్టు అయితే స్వీయ నివాసానికి సంబంధించి నష్టాలను లాభాలతో సర్దుబాటు చేసుకునేందుకు లేదా తదుపరి ఆర్థిక సంవత్సరాలకు బదిలీ చేసుకునేందుకు అనుమతి ఉండదు. అద్దెకు ఇచ్చిన నివాసం రూపంలో నష్టం ఏర్పడితే, కేవలం క్యారీ ఫార్వార్డ్ (తదుపరి ఆర్థిక సంవత్సరాలకు) చేసుకునేందుకే అవకాశం ఉంటుంది'' అని ప్రీతి శర్మ తెలిపారు. అలస్యంగా డిసెంబర్ 31లోపు దాఖలు చేసినప్పటికీ, సాధారణ ఐటీఆర్ మాదిరే మదింపు చేస్తారు. నికరంగా పన్ను చెల్లించాల్సిన వారే రిటర్నులు వేయాలని లేదు. పన్ను చెల్లించేంత ఆదాయం లేని వారు సైతం బిలేటెడ్ రిటర్నుల పత్రాన్ని సమర్పించడం ద్వారా నిబంధనలను పాటించొచ్చు. దీనివల్ల టీడీఎస్ లేదా టీసీఎస్‌లు ఉంటే నిబంధనల కింద పెనాల్టీ చెల్లించి, వాటి రిఫండ్ కోసం క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఇలా సమర్పించొచ్చు..

ఈ–ఫైలింగ్ పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలి. 'ఈ–ఫైల్' విభాగంలో 'ఫైల్ ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్' అన్న దగ్గర క్లిక్ చేయాలి. అక్కడ అసెస్‌మెంట్ సంవత్సరాన్ని ఎంపిక చేసుకుని, 'రివైజ్డ్ రిటర్న్ అండ్ సెక్షన్ 139(5)'పై క్లిక్ చేయాలి. తొలుత సమర్పించిన ఐటీఆర్ అక్నాలెడ్జ్‌మెంట్ నంబర్‌ను పేర్కొనడం మర్చిపోవద్దు. ఆఫ్‌లైన్‌లో పేపర్ రూపంలో (80 ఏళ్లకు పైబడిన వారు) రిటర్నులు దాఖలు చేసిన వారు ఆన్‌లైన్‌లో సవరణ రిటర్నులకు అవకాశం ఉండదు. తిరిగి భౌతిక రూపంలోనే సమర్పించాల్సి ఉంటుంది. సవరణ రిటర్నులను డిసెంబర్ 31 (2024–25 సంవత్సరానికి సంబంధించి) వరకు ఎన్ని పర్యాయాలు అయినా సమర్పించొచ్చు. ఇందుకు ఎలాంటి పెనాల్టీ చెల్లించక్కర్లేదు. రిఫండ్ ప్రాసెస్ అయిన తర్వాత కూడా సవరణ రిటర్నులు దాఖలు చేసుకోవచ్చు. సాధారణ రిటర్నుల మాదిరే సవరణ రిటర్నులు వేసిన తర్వాత 30 రోజుల్లోపు ధ్రువీకరించడం తప్పనిసరి. అప్పుడే అది మదింపునకు వెళుతుంది.

డిసెంబర్ 31నాటికి దాఖలు చేయకపోతే..?

డిసెంబర్ 31లోపు ఆలస్యపు రిటర్నులు సమర్పించడంలోనూ విఫలమైతే ఏమవుతుంది? అన్న సందేహం ఏర్పడొచ్చు. అలాంటి కేసుల్లో ఆదాయపన్ను శాఖ నుంచి నోటీసు జారీ కావొచ్చు. సకాలంలో రిటర్నులు వేయడం ద్వారానే చట్టపరిధిలో ఎన్నో మినహాయింపులు, ప్రయోజనాలకు అర్హత ఉంటుంది. లేదంటే వీటిని కోల్పోయినట్టే. రుణాలకు, ఆదాయ ధ్రువీకరణకు, వీసా ప్రాసెసింగ్‌కు ఐటీ రిటర్నులు రుజువుగా పనికొస్తాయన్నది గుర్తు పెట్టుకోవాలి.

వివిధ వర్గాల వారికి రిటర్నుల గడువు

- వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఆడిటింగ్ అవసరం లేని అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్ (ఏవోపీ), బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్ (బీవోఐ) రిటర్నులు దాఖలు చేయాల్సిన గడువు సెప్టెంబర్ 16తో ముగిసింది.
- ఆడిట్ అవసరమైన వ్యాపార సంస్థలు రిటర్నుల సమర్పణ గడువు అక్టోబర్ 31.
- సవరణ, బిలేటెడ్ రిటర్నుల సమర్పణ గడువు డిసెంబర్ 31.
- 2024–25 అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి అప్‌డేటెడ్ రిటర్నుల దాఖలు గడువు 2030 మార్చి 31.

డిసెంబర్ 31 తర్వాత కూడా..

గడిచిన ఆర్థిక సంవత్సరానికి తర్వాతి ఆర్థిక సంవత్సరం అసెస్‌మెంట్ ఇయర్ అవుతుంది. 2024–25కు 2025–26 అసెస్‌మెంట్ సంవత్సరం అవుతుంది. అసెస్‌మెంట్ సంవత్సరం డిసెంబర్ 31 వరకు బిలేటెడ్ రిటర్నులు లేదా సవరణ రిటర్నులు సమర్పించుకోవచ్చు. అప్పటికీ అది చేయలేకపోతే, ఆ తర్వాత ఉన్న ఏకైక మార్గం అప్‌డేటెడ్ రిటర్నులు (ఐటీఆర్–యూ) సమర్పించడం. అసెస్‌మెంట్ సంవత్సరం ముగిసిన నాటి నుంచి 48 నెలల వరకు (నాలుగేళ్లు) ఇందుకు అవకాశం ఉంటుంది. అసలు టర్నులు దాఖలు చేయకపోయినా లేక సమర్పించిన రిటర్నుల్లో తప్పులను గుర్తించినా లేదా ఏవైనా ఆదాయ, ఆస్తుల వివరాలు వెల్లడించడం మర్చిపోయినా లేదా సవరణ రిటర్నుల్లోనూ తప్పులను గుర్తించిన సందర్భాల్లో.. ఐటీఆర్–యూ దాఖలు చేసుకోవచ్చు. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 139(8ఏ) ఇందుకు అవకాశం కల్పిస్తోంది. ముఖ్యంగా ఆదాయపన్ను చెల్లించాల్సిన బాధ్యత కలిగి, రిటర్నులు సమర్పించని వారు లేదా సమర్పించినా సమగ్ర వివరాలు వెల్లడించని వారు తప్పకుండా ఐటీఆర్–యూ దాఖలు చేసి, పెనాల్టీ, వడ్డీ సహా పన్నును చెల్లించడం మంచి నిర్ణయం అవుతుంది. రిటర్నులను ఎంత ఆలస్యంగా దాఖలు చేశారు, చెల్లించాల్సిన పన్ను ఎంతన్నదాని ఆధారంగా.. అసలుకి 25 శాతం, 50 శాతం, 60 శాతం లేదా 70 శాతం వరకు అదనపు పన్నును చెల్లించాల్సి ఉంటుంది. దీనికి అదనంగా అంతకాలానికి వడ్డీ, పెనాల్టీలను కూడా సమర్పించుకోవాలి.



రిటర్నుల్లో సవరణలు..

ఆదాయపన్ను రిటర్నుల దాఖలు ఇటీవలి కాలంలో కొంత సులభంగా మారినప్పటికీ, ఇంకా కొంత సంక్లిష్టమనే చెప్పుకోవాలి. అన్ని ఆర్థిక లావాదేవీలు, ఆదాయం, పెట్టుబడులు, మూలధన లాభాలు/నష్టాలు, డిపాజిట్లపై వడ్డీ ఆదాయం, అద్దె ఆదాయం, విదేశీ పెట్టుబడులు ఇలా ఎన్నో వివరాలను పేర్కొనాల్సి ఉంటుంది. టీడీఎస్, టీసీఎస్ ఏవైనా ఉంటే సరిచూసుకోవాలి. వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)ను చూసుకున్న తర్వాత అందులో ఏవైనా తప్పులుంటే ఆదాయపన్ను శాఖకు రెక్టిఫికేషన్ (దిద్దుబాటు) అభ్యర్థన నమోదు చేయాలి. ఇంత సుదీర్ఘ ప్రక్రియలో కొన్ని తప్పులు దొర్లే అవకాశం లేకపోలేదు. లేదా ఫలానా ఆదాయం లేదా ఆర్థిక లావాదేవీల వివరాలను వెల్లడించడం మర్చిపోవచ్చు. అలాంటి సందర్భాల్లో సవరణ రిటర్నులు దాఖలు చేసుకోవచ్చు. కనుక రిటర్నులు సమర్పించిన అనంతరం ప్రతి ఒక్కరూ ఒక్కసారి సమగ్రంగా పరిశీలించుకోవడం మంచిది. ఏవైనా తప్పులుంటే, వాటిని సవరించుకునేందుకు అవకాశం ఉంటుంది. డిసెంబర్ 31లోపు ఈ పనిచేయొచ్చు. ఐటీఆర్ పత్రం సరైనది ఎంపిక చేసుకోకపోవడం, వ్యక్తిగత వివరాల్లో తప్పులు, బ్యాంక్ ఖాతా వివరాల్లో తప్పులు, కొన్ని ఆదాయాలను వెల్లడించకపోవడం, మినహాయింపులు ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకోకుండా పన్ను రిటర్నులు వేసి, అధిక పన్ను చెల్లించడం .. విదేశీ పెట్టుబడులు, ఆదాయాలు, ఇ–సాప్‌లు.. ఎలాంటి ఆధారాల్లేకుండా మినహాయింపులను క్లెయిమ్ చేసుకున్న సందర్భాల్లో సవరణ రిటర్నులు సమర్పించొచ్చు. ముఖ్యంగా విదేశీ ఆస్తులు, ఆదాయాలను వెల్లడించకపోతే 'బ్లాక్‌మనీ అండ్ ఇంపోజిషన్ ఆఫ్ ట్యాక్స్ యాక్ట్, 2015' కింద పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, అప్పటికే సమర్పించిన రిటర్నులను ఆదాయపన్ను శాఖ మదింపు చేయడం ముగిసిపోతే సవరణ రిటర్నులకు అవకాశం ఉండదు.

- సెక్షన్ 143 (1) కింద ఐటీఆర్ ప్రాసెస్ (ఇనీషియల్/ప్రాథమిక) అయినప్పుడే సవరణ రిటర్నులను డిసెంబర్ 31లోపు లేదా తుది ప్రాసెసింగ్‌కు ముందు సమర్పించుకునేందుకు అనుమతి ఉంటుంది.
- ఒకవేళ డిసెంబర్ 31 కంటే ముందుగానే సెక్షన్ 143 (3) కింద ఐటీఆర్ తుది మదింపు ముగిసినట్టయితే సవరణ రిటర్నులకు అవకాశం ఉండదు. ఇటువంటి సందర్భంలో సెక్షన్ 139(8ఏ) కింద ఐటీఆర్–అప్‌డేటెడ్ సమర్పించుకోవచ్చు.

భారత్ డైనమిక్స్ | బ్రోకరేజ్: ఎస్‌బీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,447 **టార్గెట్:** రూ. 1,817

ఎందుకంటే: రక్షణ శాఖ ఆధ్వర్యంలో కార్యకలాపాలు కొనసాగించే ప్రభుత్వ రంగ(పీఎస్‌యూ) దిగ్గజం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ రక్షణ రంగ ఎక్విప్‌మెంట్ తయారీలో సుప్రసిద్ధమైంది. ప్రధానంగా భూమి నుంచి నింగిలోకి(సర్ఫేస్ టు ఎయిర్), నింగిలోనే(ఎయిర్ టు ఎయిర్) ప్రయోగించే మిస్సైల్స్, యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్స్, టోర్పడోస్ తోపాటు.. సంబంధిత రక్షణ రంగ పరికరాలను రూపొందిస్తోంది. 2025 మార్చి31కల్లా కంపెనీ మొత్తం ఆర్డర్ బుక్ విలువ రూ. 22,700 కోట్లను తాకింది. గత ఆర్థిక సంవత్సరం(2024–25) కన్సాలిడేటెడ్ ఆదాయంతో చూస్తే ఇది దాదాపు 7 రెట్లు అధికం. గత రెండేళ్లలో నిర్వహణ పనితీరు రక్షణ రంగంలో కంపెనీకి లభిస్తున్న అవకాశాలకు తగ్గ స్థాయిలో నమోదుకాకపోవడం గమనార్హం! ఇందుకు కంపెనీకి ఎదురైన సరఫరా చైన్ సవాళ్లు ప్రతిబంధకంగా నిలిచాయి. అయితే సరఫరా సవాళ్లు క్రమంగా తగ్గుముఖం పట్టడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) నుంచి ఆర్డర్ల ఎగ్జిక్యూషన్ మెరుగుపడనుంది. సుమారు రూ. 50,000 కోట్ల విలువైన మార్కెట్ పరిమాణాన్ని కంపెనీ సొమ్ము చేసుకునేందుకు వీలుంది. మరోవైపు రూ. 40,000 కోట్ల విలువైన అత్యవసర ప్రొక్యూర్‌మెంట్ కార్యక్రమం సైతం మరిన్ని అవకాశాలకు వీలు కల్పించనుంది. అంతే కాకుండా కొత్త నావికాదళంసహా.. వైమానిక, సైనిక విభాగాలకు అవసరమయ్యే విభిన్న మిస్సైళ్లను సమకూర్చుకునే రక్షణ రంగ కార్యక్రమాల్లో భాగమయ్యేందుకు కంపెనీకి అవకాశముంది. రూ. 20,000–30,000 కోట్ల విలువైన ఆర్డర్లు సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో కంపెనీ అమ్మకాలు 30 శాతం ఎగసి రూ. 248 కోట్లను తాకాయి. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 2.7 శాతం మెరుగుపడి 18 శాతానికి చేరాయి. నికర లాభం 157 శాతం జంప్‌చేసి రూ. 18 కోట్లను తాకింది.

వేదాంత్ ఫ్యాషన్స్ | బ్రోకరేజ్: జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 640 **టార్గెట్:** రూ. 890

ఎందుకంటే: దేశీయంగా పెళ్లిళ్లు, పండుగలు, ఉత్సవాల సంబంధిత(సెలబ్రేషన్) దుస్తుల మార్కెట్‌లో వేదాంత్ ఫ్యాషన్స్ కార్యకలాపాలు విస్తరించింది. ప్రధానంగా మాన్యవర్‌సహా ఐదు సుప్రసిద్ధ బ్రాండ్లను కలిగి ఉంది. వీటిలో మోహే, త్వమేవ్, మంథన్, మేబాజ్ ఉన్నాయి. వెరసి పురుషులు, మహిళలు, పిల్లలకు సంస్కృతి, సంప్రదాయ సంబంధ దుస్తులను రూపొందిస్తోంది. ఇందుకు అనుగుణంగా మొత్తం 662 ప్రత్యేక బ్రాండ్ ఔట్‌లెట్ల(ఈబీవోలు)ను దేశవ్యాప్తంగా నిర్వహిస్తోంది. అంతేకాకుండా 12 ప్రపంచ నగరాల(యూఎస్, కెనడా, యూకే, యూఏఈ)లో సైతం ఈబీవోలను ఏర్పాటు చేసింది. మొత్తం 17.9 లక్షల చదరపు అడుగులలో వీటిని విస్తరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో కంపెనీ ఆదాయం వార్షికంగా 17 శాతం ఎగసి రూ. 281 కోట్లను తాకింది. ఇందుకు ప్రధానంగా పండుగులు, పెళ్ళిళ్లసీజన్ దుస్తులకు పెరిగిన డిమాండ్ దోహదపడింది. కంపెనీ చేపట్టిన స్టోర్ల విస్తరణ, 23 శాతం పెరిగిన కస్టమర్ల సంఖ్య, గ్రూప్ స్టోర్ల అమ్మకాల్లో నమోదైన 18 శాతం వృద్ధి సైతం ఇందుకు జత కలిసింది. తద్వారా పరిశ్రమలోనే అత్యుత్తమ పనితీరు ప్రదర్శిస్తూ 66.9 శాతం స్థూల మార్జిన్లు కొనసాగిస్తోంది. పటిష్ట నికర లాభదాయకతను సైతం సాధిస్తోంది. వెరసి 25 శాతం నికర లాభ మార్జిన్లతో రూ. 70 కోట్ల నికర లాభం ఆర్జించింది. వార్షికంగా ఇది 12.4 శాతం వృద్ధి. వేగంగా ఏర్పాటు చేస్తున్న స్టోర్లకు దన్నుగా నాణ్యమైన పోర్ట్‌ఫోలియోకు ప్రాధాన్యమిస్తోంది. బలహీన స్టోర్ల కన్సాలిడేషన్, ఎంపిక చేసిన స్టోర్ల అద్దె వ్యయాలపై దృష్టి, వార్షికంగా 8–10 స్టోర్ల జత వంటి వ్యూహాలను అమలు చేస్తోంది. కంపెనీ షేరు 40 పీఈకంటే దిగువస్థాయిలో కదులుతుండటంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. గత మూడేళ్ల సగటు పీఈ 51కుపైగా నమోదుకావడం గమనార్హం!

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పెట్టుబడి వెనక్కి తీసుకుంటే పెనాల్టీ కట్టాలా?

Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వద్ద రూ.30 లక్షలు ఉన్నాయి. మెరుగైన రాబడుల కోసం ఈక్విటీల్లో ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?
– జయ్‌దేవ్

ముందుగా సరైన పెట్టుబడి సాధనాన్ని ఎంపిక చేసుకోవాలి. రాబడితోపాటు పెట్టుబడి రక్షణకూ ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. కనుక ప్రతీ పెట్టుబడి ఆప్షన్‌లో ఉండే సానుకూల, ప్రతికూలతలను చూడాలి. ఈక్విటీ పథకాలు స్వల్పకాలంలో రాబడులు ఇస్తాయని కచ్చితంగా చెప్పలేం. రాబడులు ఇవ్వొచ్చు. నష్టాలూ ఇవ్వొచ్చు. అస్థిరతలు ఎక్కువ. మార్కెట్ ఏ సమయంలో అయినా దిద్దుబాటుకు గురికావచ్చు. పెట్టుబడి అవసరమైన సమయంలో మార్కెట్లు దిద్దుబాటును చూస్తే రాబడిని నష్టపోవాల్సి రావచ్చు. కనుక స్వల్పకాలం కోసం అయితే అస్థిరతల రిస్క్‌ను అధిగమించేందుకు డెట్ సాధనాలను ఎంపిక చేసుకోవాలి. ఐదేళ్లు, అంతకు మించిన కాలం కోసం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇక మీ పెట్టుబడులను వివిధ రకాల మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుకోవడం ద్వారా వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ ఏదైనా ఫండ్ బలహీన పనితీరు చూపిస్తే, మరో ఫండ్ మంచి పనితీరుతో రాబడుల్లో స్థిరత్వం ఉంటుంది. క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసుకోవడం మరో మార్గం. ఇందుకు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను ఎంపిక చేసుకోవచ్చు. దీనివల్ల అస్థిరతల ప్రభావాన్ని అధిగమించొచ్చు. మీ లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యం, రాబడుల అంచనాల ఆధారంగా డెట్, ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం సరైన నిర్ణయం అవుతుంది.

నేను సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్)లో రూ.4 లక్షలు ఇన్వెస్ట్ చేశాను. మూడేళ్లు అయింది. ఇప్పుడు నా పెట్టుబడిని వెనక్కి తీసుకుంటే పెనాల్టీ చెల్లించాలా?
– శ్యామ్ ముఖర్జీ

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ కాల వ్యవధి ఐదేళ్లు. 8.2 శాతం వార్షిక రాబడిని మూడు నెలలకు ఒకసారి చొప్పున చెల్లిస్తారు. ఈ పథకం వడ్డీ రేటును ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ఆర్థిక శాఖ సమీక్షిస్తుంటుంది. అయినప్పటికీ డిపాజిట్ చేసే రోజు ఉన్న రేటు ఐదేళ్ల కాలానికి అమలవుతుంది. అంటే కొత్తగా ప్రారంభించే ఖాతాలకే సవరించిన రేటు అమల్లో ఉంటుంది. ఈ పథకం కాలవ్యవధి ఐదేళ్లకు ముందుగానే వైదొలగాలంటే అందుకు ఫారమ్–2 సమర్పించాల్సి ఉంటుంది. ఇన్వెస్ట్ చేసిన కాలవ్యవధి ఆధారంగా కొంత పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. డిపాజిట్ చేసిన ఏడాది లోపు వెనక్కి తీసుకుంటే ఎలాంటి వడ్డీ చెల్లించరు. అప్పటి వరకు మూడు నెలలకు ఒకసారి చెల్లించిన వడ్డీ మొత్తాన్ని అసలు నుంచి మినహాయించుకుంటారు. ఏడాది నుంచి రెండేళ్ల మధ్య డిపాజిట్‌ను రద్దు చేసుకుంటే పెట్టుబడిలో 1.5 శాతాన్ని జరిమానా కింద మినహాయించి, మిగిలినది చెల్లిస్తారు. ఇక రెండు నుంచి ఐదేళ్ల మధ్యలో డిపాజిట్ రద్దు చేసుకుంటే అప్పుడు పెట్టుబడిపై 1 శాతం జరిమానా పడుతుంది. మీరు మూడేళ్ల తర్వాత డిపాజిట్‌ను వెనక్కి తీసుకోవాలని అనుకుంటున్నారు. కనుక మీరు మీ పెట్టుబడి మొత్తం రూ.4 లక్షలపై ఒక శాతం చొప్పున రూ.4,000 పెనాల్టీ మినహాయించుకుని, మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తారు. మొదటి ఐదేళ్ల కాలానికే ఈ నిబంధనలు అమలవుతాయి. ఎస్‌సీఎస్‌ఎస్ పథకాన్ని ఐదేళ్ల తర్వాత మరో మూడేళ్లు పొడిగించుకోవచ్చు. ఇలా పొడిగించిన కాలంలో ఏడాది నిండిన తర్వాత, అంటే మొత్తంగా ఆరేళ్ల తర్వాత ఎప్పుడు ముందస్తుగా రద్దు చేసుకున్నా, ఎలాంటి పెనాల్టీ పడదు.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
గణాంకాలు, ఫలితాలే దిక్సూచి
పన్ను ఆదాతో రాబడి
డీఎస్‌పీ ఈఎల్‌ఎస్‌ఎస్ ట్యాక్స్ సేవర్ ఫండ్

క్లుప్తంగా...

ఖాళీ ప్లేట్లతో సినర్జీస్ కార్మిక కుటుంబాల నిరసన

అగనంపూడి: దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ కార్మికులు తమ జీతాల బకాయిలు చెల్లించాలని కోరుతూ నెలన్నర నుంచి ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం ఖాళీ ప్లేట్లతో కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి నిరసన చేపట్టారు. రెండున్నర దశాబ్దాలుగా సంస్థను నమ్ముకొని కష్టపడి పనిచేస్తున్న కార్మికులను వంచించడం న్యాయం కాదని, సంస్థ వేరే చోట్ల పెట్టుబడులు పెడుతూ ఇక్కడ కార్మికులను అలమటించేలా చేయడం సరికాదన్నారు. రెండేళ్లుగా పీఎఫ్ కూడా చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో కలెక్టర్ తక్షణమే స్పందించాలని కోరారు. అనంతరం వంటా వార్పు చేసి సామూహిక భోజనాలు చేశారు. వీరికి ఏఐటీయూసీ నేత బూసి వెంకటరావు సంఘీభావం తెలిపారు.

నిర్వహణ సంస్థకు షోకాజ్ నోటీసు

సాక్షి, అమరావతి: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులపై ఎలుకల దాడి ఘటనకు బాధ్యులైన హాస్టల్ వార్డెన్, పెస్ట్ అండ్ రోడెంట్ కంట్రోల్ సర్వీసెస్ నిర్వహణ సంస్థకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు ఆదివారం మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలి: పీఆర్టీయూ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ తక్షణమే అమలు చేయాలని, ఆలస్యం జరిగే పక్షంలో మున్సిపల్, జిల్లా పరిషత్ పాఠశాలలను ఎయిడెడ్ మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలలుగా మార్చాలని ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు డిమాండ్ చేశారు. పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడలో నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య మాట్లాడుతూ.. విద్యాశాఖలో కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఏపీసెట్ ఎప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

కొత్త నోటిఫికేషన్‌పై కూటమి సర్కార్ ఇప్పటివరకు నోరుమెదపట్లేదు. ఉన్నత విద్యా కోర్సుల ప్రవేశాలకు సంబంధించి 2025–26 విద్యా సంవత్సరంలో మునుపెన్నడూ లేని విధంగా తీవ్ర జాప్యం చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిన కూటమి ప్రభుత్వం ఏపీసెట్ నిర్వహణ విషయంలోనూ ఇదేతీరును అవలంబిస్తుండటంపై విద్యార్థులు, విద్యావేత్తల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నోటిఫికేషన్‌ను తాత్సారం చేయడంతో అభ్యర్థులు నిరాశకు గురవుతున్నారు.

ఎవరు అర్హులు..

ఏపీ సెట్‌కు పీజీ, తత్సమాన డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు, పీజీ చివరి ఏడాది చదువుతున్నవారు అర్హులు. ఏటా వేలాది మంది రాసే ఈ పరీక్షల్లో అప్పుడే ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల నుంచి వివిధ వృత్తుల్లో ఉద్యోగాలు చేస్తూ ఏపీ సెట్‌కు పోటీపడే అభ్యర్థులు కూడా ఉంటున్నారు.

పరీక్ష కఠినం.. అర్హుల సంఖ్యా తక్కువే..

ఏపీ సెట్‌ను ప్రభుత్వం ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏడాదికి ఒకసారి మాత్రమే నిర్వహిస్తుంది. ఈ పరీక్షకు దాదాపు 30 వేల మంది దరఖాస్తు చేసుకుంటారు. యూజీసీ నెట్, సీఎస్ఐఆర్ నెట్ తరహాలో అత్యంత కఠినంగా పరీక్ష ఉంటుండటంతో ఏపీసెట్‌లో అర్హత పొందేవారి శాతం తక్కువగానే ఉంటోంది. గతేడాది ఏప్రిల్‌లో ఏపీ సెట్‌కు 30,448 మంది హాజరుకాగా కేవలం 8.03 శాతం అంటే 2,444 మంది మాత్రమే అర్హత సాధించారు. గత కొన్నేళ్లుగా ఏపీసెట్‌లో అర్హత సాధించేవారిని పరిశీలిస్తే అర్హత శాతం సగటున 6–7 శాతం మధ్యే ఉంటోంది. అయితే ఏపీసెట్‌లో అర్హత సాధిస్తేనే యూనివర్సిటీల్లో, కళాశాలల్లో అధ్యాపక పోస్టుల నియామక పరీక్షలకు అర్హత లభిస్తుంది. అలాగే పీహెచ్‌డీ ప్రవేశాలకు సైతం ఏపీసెట్‌లో క్వాలిఫై కావాల్సిందే. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ఏపీసెట్‌లో విజయం సాధించడానికి తమ సర్వశక్తులూ ఒడ్డుతున్నారు.

డిసెంబర్‌లో యూజీసీ నెట్!

కాగా, రాష్ట్రంలో స్టేట్ ఎలిజిబిలిటీ టెస్టు తరహాలోనే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నేషనల్ ఎలిజిబిలిటీ టెస్టు (యూజీసీ నెట్)ను నిర్వహిస్తుంది. యూజీసీ ఏడాదిలో రెండు సార్లు.. జూన్, డిసెంబర్‌లలో క్రమం తప్పకుండా పరీక్షలు చేపడుతుంది. ఈ ఏడాది డిసెంబర్‌కు రిజిస్ట్రేషన్లు ప్రారంభించింది. యూజీసీ నెట్‌ను దేశవ్యాప్తంగా ఏటా 5 నుంచి 7 లక్షల మంది అభ్యర్థులు రాస్తున్నారు. గత కొన్నేళ్ల గణాంకాలను పరిశీలిస్తే, అర్హత పొందేవారి శాతం కేవలం 7 నుంచి 14 శాతం మధ్యలోనే ఉంటుంది. మొత్తం 85 సబ్జెక్టుల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో యూజీసీ నెట్‌ను నిర్వహిస్తారు. దీని ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)తో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలు జరుగుతాయి. పీహెచ్‌డీ ప్రవేశానికి కూడా యూజీసీ నెట్ ఫలితం దోహదపడుతుంది.

యూజీసీ నెట్ డిసెంబర్ నోటిఫికేషన్ ఇలా..

దరఖాస్తులో సవరణలు: నవంబర్ 10 –12 వరకు

పరీక్ష కేంద్రాలు, అడ్మిట్‌కార్డు, పరీక్ష తేదీలను త్వరలో ప్రకటించనున్నారు

మూడో విడత ఎంబీబీఎస్ కన్వీనర్ సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: 2025–26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా మూడో విడత సీట్లను ఆదివారం హెల్త్ వర్సిటీ కేటాయించింది. సీట్లు దక్కించుకున్న విద్యార్థులు ఈ నెల 11న మధ్యాహ్నం 3 గంటల్లోపు కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఇప్పటివరకు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 4,255 ఎంబీబీఎస్ సీట్లను కన్వీనర్ కోటాలో కేటాయించగా..మూడో విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లను స్ట్రే వెకెన్సీ రౌండ్ కౌన్సెలింగ్ ద్వారా వర్సిటీ భర్తీ చేయనుంది.

గందరగోళంగా ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆరోపణ

సాక్షి, అమరావతి :2025–26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు ప్రక్రియ గందరగోళంగా మారిందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మూడో దశ కన్వీనర్ కోటా సీట్ల కేటాయింపులో మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరిగిందని విమర్శిస్తున్నారు. ఆదివారం మూడో విడత కన్వీనర్ కోటా సీట్లను హెల్త్ వర్సిటీ విద్యార్థులకు కేటాయించింది. అంతకుముందు ప్రకటించిన సీట్ మ్యాట్రిక్స్‌లో ఎస్వీయూ రీజియన్ బీసీ–డీ కేటగిరీలో మూడు సీట్లు జనరల్, ఒక సీటు ఉమెన్‌కు రిజర్వ్ చేసినట్టు స్పష్టం చేసింది. అయితే కేటాయింపులో మాత్రం రెండు సీట్లు జనరల్, రెండు సీట్లు అమ్మాయిలకు కేటాయించింది. బీసీ–డీలో ఒక సీటే అమ్మాయిలకు రిజర్వ్ చేసినట్టు ప్రకటించి, ఇద్దరికి కేటాయించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. బీసీ–డీ జనరల్‌లో చూపించిన సీట్‌ను ఉమెన్‌కు కేటాయించడంతో అదే బీసీ–డీ రిజర్వేషన్‌లోనే ముందున్న తాను సీట్ కోల్పోతున్నట్టు ఎ.శ్రీహర్ష అనే విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వ్యవహారంపై వర్సిటీ అధికారులను వివరణ కోరగా.. సోమవారం సమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. పరిశీలించాకే అలాట్‌మెంట్ లెటర్‌లు జారీ చేస్తామన్నారు.

ఎంబీబీఎస్ మెడికల్ పీజీ తాత్కాలిక ఫీజుల ఖరారు

సాక్షి, అమరావతి: 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ కోర్సులకు తాత్కాలిక ఫీజులను ఖరారు చేస్తూ ఆదివారం వైద్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ ఉత్తర్వులిచ్చారు.2020–23 బ్లాక్ పీరియడ్ ఫీజులపై ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో 10%, పీజీ కోర్సుల్లో 15% చొప్పున పెంపుతో తాత్కాలిక ఫీజులను నిర్ణయించారు. కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో తీర్పులకు అనుగుణంగా తుది ఫీజులను నిర్ణయిస్తామని పేర్కొన్నారు. అదే విధంగా, సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో 2020–23 బ్లాక్ పిరియడ్ ఫీజుల మీద 15% వృద్ధితో పలు వైద్య కళాశాలల్లో సూపర్ స్పెషాలిటీ కోర్సులకు ఫీజులపైనా వేరుగా జీవో ఇచ్చారు.

తాత్కాలిక ఫీజుల వివరాలు ఇలా...

కోర్సు	కన్వీనర్	బీ కేటగిరీ	సీ కేటగిరీ (ఎన్ఆర్ఐ)
ఎంబీబీఎస్	రూ. 16,500	రూ.13.20 లక్షలు	రూ.39.60 లక్షలు
బీడీఎస్	రూ.14,300	రూ.4.40 లక్షలు	రూ.13.20 లక్షలు
మెడికల్			
క్లినికల్ డిగ్రీ	రూ.4,96,800	రూ.9,93,600	రూ.57.50 లక్షలు
పారా–క్లినికల్			
డిగ్రీ, డిప్లొమా	రూ.1,55,250	రూ.3,10,500	రూ.17.25 లక్షలు
ప్రీ–క్లినికల్ డిగ్రీ	రూ.70,380	రూ.1,40,760	రూ.9.20 లక్షలు
డెంటల్			
క్లినికల్ డిగ్రీ	రూ.3,41,550	రూ.6,83,100	రూ.13.80 లక్షలు
పారా–క్లినికల్			
డిగ్రీ	రూ.3,07,395	రూ.4,99,790	రూ.8,05,000

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

న్యూజెర్సీలో నిరసన తెలియజేస్తున్న ప్రవాసాంధ్రులు

అద్దంకి: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించే కూటమి విధానాన్ని నిరసిస్తూ ఆదివారం అమెరికా సంయుక్త రాష్ట్రంలోని న్యూజెర్సీలో ప్రవాసాంధ్రులు నిరసన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు డాక్టర్లు కావాలనే వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాన్ని నిజం చేయడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయన తనయుడు వైఎస్ జగన్ 17 మెడికల్ కళాశాలలను నిర్మించారన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా పీపీపీ విధాన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

చెన్నైలో కోటి సంతకాల సేకరణ

సంతకాలు చేస్తున్న మహిళా కార్యకర్త

సాక్షి, చెన్నై: ఏపీలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చెన్నైలో వైఎస్సార్ సేవాదళ్ నేతృత్వంలో సంతకాల సేకరణ ఆదివారం ప్రారంభమైంది. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపునకు చెన్నైలోని తెలుగు వారు కదిలారు. వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు ఏకే జహీర్ హుస్సేన్ నేతృత్వంలో ఆదివారం చెన్నై షోలింగనల్లూరులోని గంగమ్మ కోయిల్ వీధిలో సంతకాల సేకరణ జరిగింది. పెద్ద సంఖ్యలో తెలుగు వారు తరలి వచ్చి తాము సైతం అని ముందడుగు వేస్తూ సంతకాలు చేశారు. పేదల విద్యాహక్కును కాలరాయవద్దు అని నినదించారు. ఆదివారాల్లో తెలుగువారు అధికంగా ఉండే ప్రాంతాల్లో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు జహీర్ హుస్సేన్ తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

బాల్యానికి మూడుముళ్లు

- కర్నూలు జిల్లాలో అధికంగా బాల్య వివాహాలు
- పత్తికొండ, ఆదోని డివిజన్‌లలో అధికం
- దగ్గరి బంధువులకు ఇచ్చుకోవడం, పేదరికం, నిరక్షరాస్యత కారణం
- బాల్యవివాహాలతో అనారోగ్యం
- చిన్నతనంలో గర్భం దాల్చితే తల్లీబిడ్డకు ప్రమాదం

కర్నూలు(హాస్పిటల్): పేదరికం, నిరక్షరాస్యత, బాలికల ఎదుగుదలపై ఆందోళన, అభద్రతాభావం వంటి కారణాలతో కర్నూలు జిల్లాలో బాల్యవివాహాలు అధికమవుతున్నాయి. ఇందులో అధికారులు కొన్ని మాత్రమే అడ్డుకుంటుండగా అధిక శాతం గుట్టు చప్పుడు కాకుండా, ఆధార్‌కార్డులో వయస్సు మార్చి వివాహ తంతు జరిపించేస్తున్నారు. వీటిలో అధిక శాతం గ్రామ పెద్దల సహకారంతోనే జరుగుతున్నా అడిగే నాథుడు కరువయ్యారు. బిడ్డల ముద్దుముచ్చట పడితే భారం తగ్గించుకుందామన్న భావనతో గ్రామాల్లో కూతురు పుష్పవతి అయితే చాలు ఏ అయ్యకు కట్టబెడదామా అని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. ఈ కారణంగా బాలికల చదువు మధ్యలోనే ఆగిపోతూ వారి భవిష్యత్ నాశనమవుతోంది. మరోవైపు చిన్న వయస్సులో గర్భవతి కావడంతో ఆమె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

4,754 మంది బాలికలు తల్లులు

జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో జనవరి వరకు 38,779 మంది గర్భం దాల్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. అందులో 19 ఏళ్లలోపు బాలికలు 4,754 మంది ఉన్నారు. వీరిలో కర్నూలు డివిజన్‌లో 10.27శాతం, ఆదోని డివిజన్‌లో 12.75శాతం, పత్తికొండ డివిజన్‌లో అధికంగా 15.04శాతం మంది గర్భం దాల్చారు. జిల్లాలో 10 నెలల కాలంలో జరిగిన మొత్తం వివాహాల్లో 16 ఏళ్లకు 814 (21.5శాతం), 17 ఏళ్లకు 888(23.6శాతం), 18 ఏళ్లకు 1,237(32.8శాతం), 19 ఏళ్లకు 595(15.8శాతం) వివాహం చేసుకున్నారు. 19 ఏళ్లకు పైగా కేవలం 236 మంది అమ్మాయిలు మాత్రమే వివాహం చేసుకున్నారు. అది కూడా కర్నూలు నగరంలాంటి చోట్ల మాత్రమే వివాహ వయస్సు వచ్చిన తర్వాత పెళ్లి చేస్తున్నారు. గ్రామాల్లో వివాహ వయస్సు చూపించేందుకు అధిక శాతం ఆధార్‌కార్డుల్లో 63.4 శాతం మంది వయస్సును తప్పుగా నమోదు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

ఆదోని, పత్తికొండ డివిజన్‌లలో అధికం

గర్భం దాల్చే వారిలో నిరక్షరాస్యులైన బాలికలే అధికంగా ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. 10 నెలల్లో నమోదైన గర్భిణుల్లో ఐదవ తరగతి వరకు చదివిన వారు 23.5శాతం, పది ఫెయిలైన వారు 18.8శాతం, 6 లేదా 7వ తరగతి చదివిన వారు 14.7శాతం, 8 లేదా 9వ తరగతి చదివిన వారు 13.8శాతం మంది ఉన్నారు. ఆదోని, పత్తికొండ డివిజన్‌లలో అధికంగా అక్షరాస్యత తక్కువగా ఉంటోంది. దీనికి తోడు పేదరికం, వర్షపాతం తక్కువగా ఉండటం, ఫలితంగా పంటలు సరిగ్గా పండకపోవడం, ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడం, అమ్మాయిల భద్రత గురించి ఆందోళన, సామాజికపరమైన అంశాలు వంటి కారణాలతో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయి. పుష్పవతి అయిన బాలికలను ఒకరికిచ్చి పెళ్లి జరిపిస్తే తమ బాధ్యత తీరిపోతుందని నమ్మే వారు అధికంగా ఉన్నారు. చెడు వ్యసనాల కారణంగా భార్య లేదా భర్త మరణించడంతో ఒంటరివారైన పిల్లల వివాహాలు కూడా త్వరగా జరిపించేస్తున్నారు. ఇందులో అమ్మాయిల అవ్వాతాతలు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు.

చదువుకూ అమ్మాయి దూరం

ఆదోని, పత్తికొండ డివిజన్‌లలో ఆడపిల్లలు ఎక్కువగా చదువుకునేందుకు ఇష్టపడటం లేదు. అమ్మాయిని చదువుకోసం దూరంగా పంపించేందుకు భయపడటం, అభద్రతభావం, సామాజిక పరిస్థితులతో మధ్యలోనే చదువు మాన్పించేస్తున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లేక 1,614(44.4శాతం) మంది, ఆర్థిక కారణాలతో 1,473(36.6శాతం) మంది, మిగిలిన వారు కుటుంబసమస్యలతో ఏడుగురు, సామాజిక రుగ్మతలతో 105 మంది, తల్లిదండ్రుల ఒత్తిడితో 388 మంది, మరికొందరు ప్రేమవివాహాల కారణంగా బాలికలు మధ్యలోనే చదువు మానేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కాగా జరిగిన వివాహాల్లో అధికంగా 89.1శాతం పెద్దలు కుదుర్చిన వివాహాలు కాగా దాని తర్వాతి స్థానంలో 8.4శాతం మంది తమకు నచ్చిన వారిని ప్రేమవివాహాలు చేసుకున్నారు.

వయస్సుల వారీగా వివాహాల నమోదు



కమిటీలు ఉన్నా చర్యలు నామమాత్రమే!

జిల్లాలో బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీని అరికట్టేందుకు జిల్లా స్థాయి, డివిజన్ స్థాయిలో కమిటీలు ఉన్నాయి. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ చైర్మన్/చైర్‌పర్సన్ కాగా, కన్వీనర్‌గా జిల్లా ఎస్పీ, డీఎంహెచ్‌ఓ, సభ్యులుగా గైనకాలజీ హెచ్‌ఓడీ, ఐసీడీఎస్ అధికారి, డీఈఓ, ఆర్‌ఐఓ, డివిజన్ స్థాయిలో చైర్మన్/చైర్‌పర్సన్‌గా ఆర్‌డీఓ, కన్వీనర్‌గా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సభ్యులుగా స్థానిక డీఎస్పీ ఉంటారు. ఈ కమిటిలు బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాలలకు కౌమారదశ బాలికలకు పునరుత్పత్తి ఆరోగ్యం, న్యాయపరమైన హక్కులు, లైఫ్ స్కిల్స్ గురించి వివరించారు. బాల్యవివాహాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. కౌమార దశ బాలికలకు వచ్చే సమస్యలపై ఆరోగ్యశిబిరాలు నిర్వహించాలి. కానీ అధికారులు మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నా చర్యలు కరువయ్యాయి.

సెప్టెంబర్ 15వ తేదీ...

ఆదోని పట్టణంలోని పట్టణంలోని ఇందిరానగర్‌లో బాల్య వివాహాన్ని టూటౌన్ పోలీసులు అడ్డగించారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఆ ప్రాంతానికి వెళ్లి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్యవివాహాలతో జరిగే నష్టాలను వివరించారు. కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఏం చేయాలి..

అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండే వరకు ఎట్టి పరిస్థితుల్లో వివాహం చేయరాదు. బాల్య వివాహాలు చేసే వారి గురించి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు హెల్ప్‌లైన్ 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రమాదం

చిన్న వయస్సులో గర్భం దాలిస్తే బాలికకు రక్తహీనత ఏర్పడటం, కడుపులో బిడ్డ సరిగ్గా ఎదగకపోవడం, అబార్షన్లు జరుగుతాయి. అమ్మాయికి పెల్విస్‌బోరాన్ వృద్ధి చెందక ముందే వివాహం చేయడం వల్ల వారికి ప్రసవం కష్టమై సిజేరియన్ చేయాల్సి వస్తుంది. బీపీ, ఫిట్స్, నెలలు నిండకముందే బిడ్డ జన్మించడం వంటి సమస్యలు వస్తాయి. కొన్నిసార్లు అబార్షన్ అయ్యే అవకాశం ఉంటుంది. మరికొన్నిసార్లు అవిటితనం ఉన్న పిల్లలు జన్మించే అవకాశం ఉంది.

–డాక్టర్ ఎస్.సావిత్రి, గైనకాలజీ హెచ్‌ఓడీ, కర్నూలు పెద్దాసుపత్రి

అనారోగ్య సమస్యలు

బాల్య వివాహాలతో చాలా మంది కౌమార దశ పూర్తి గాకుండానే గర్భం దాలుస్తున్నారు. ఈ కారణంగా వారికి నెలలు నిండకుండా శిశువు జన్మించడం, సరైన సమయంలో జన్మించినా బరువు తక్కువగా ఉండటం జరుగుతుంది. ఇలాంటి పిల్లలకు బుద్ధిమాంద్యం, చురుకుగా లేకపోవడం, గుండె, ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయి. తల్లులకు ప్రసవం తర్వాత తల్లిపాలు సరిగ్గా పడవు. దీంతో శిశువులు పలుమార్లు ఇన్‌ఫెక్షన్లకు గురై అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది.

– డాక్టర్ అమరనాథరెడ్డి, చిన్నపిల్లల వైద్యుడు, కర్నూలు

టీనేజీ ప్రెగ్నెన్సీపై అవగాహన కార్యక్రమాలు

జిల్లాలో బాల్యవివాహాలు జరగకుండా ఐసీడీఎస్ శాఖతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఒకవేళ ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే స్థానిక పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి వెళ్లి పెళ్లి జరగకుండా చూస్తున్నాం. అప్పటికే వివాహం జరిగి ఉంటే ఆమె టీనేజీలో గర్భం దాల్చకుండా ఆరోగ్య సిబ్బందిచే అవగాహన కల్పిస్తున్నాం. టీనేజీలో గర్భం దాల్చడం వల్ల వచ్చే దుష్పరిణాల గురించి బాలికలకు, వారి తల్లిదండ్రులకు వివరిస్తున్నాం.

–డాక్టర్ ఎల్.భాస్కర్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

వైఎస్సార్‌సీపీ నేత తాతీలుకు బెయిల్ మంజూరు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): బల్క్ డ్రగ్ వ్యతిరేక ఉద్యమ నేత, వైఎస్సార్‌సీపీకి చెందిన రాజయ్యపేట మాజీ ఎంపీటీసీ పిక్కితాతీలుకు యలమంచిలి కోర్టు శనివారం బెయిల్ మంజూరు చేసింది. మొంథా తుపాను సమయంలో గ్రామస్తులందరికీ భోజన సదుపాయం కల్పించకపోవడంపై పంచాయతీ కార్యదర్శిని పిక్కితాతీలు నిలదీశారు. దీంతో పిక్కి తాతీలు,12 మంది తనపై దౌర్జన్యానికి పాల్పడ్డారని, కులం పేరుతో దూషించారని పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పిక్కితాతీలు, తదితరులపై అక్రమంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శనివారం అరెస్ట్ చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచగా వెంటనే న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. కాగా, బల్క్ డ్రగ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఉద్యమానికి నాయకత్వం వహిస్తోన్న నేతలపై అక్రమ కేసులు బనాయించి ఆందోళనను అణగదొక్కాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం మత్స్యకారులపై అక్రమ కేసులు బనాయిస్తోందని గ్రామంలో ప్రచారం జరుగుతోంది.

నేడు డయల్ యువర్ సీఎండీ

తిరుపతి రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977 716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తేవాలని ఆయన కోరారు.

ముగిసిన రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలు

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభమైన 79వ రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన అండర్ 14,17,19 విభాగాల బాలబాలికలు ఉత్సాహంగా ప్రతిభ కనబరిచారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఇండియన్ రౌండ్‌కు సంబంధించి అండర్ 14 బాలుర విభాగంలో చిత్తూరుకు చెందిన ఏఎస్‌వీఎంఎస్ వైభవ్‌రామ్ ప్రతిభ కనబరిచాడు. బంగారుపతకంతో పాటు రెండు వెండిపతకాలు సాధించాడు.

ప్రకృతి అందాలకు నెలవైన పొల్లూరు జలపాతం అభివృద్ధిపై అటవీశాఖ దృష్టి సారించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్న అటవీశాఖ మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. అప్పటి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏపీ జెన్‌కో కేటాయించిన రూ.50 లక్షల సీఎస్సార్ నిధులతో పనులు చేపట్టింది.

ఆహ్లాదం పంచేలా..

పిక్నిక్ స్పాట్

పొల్లూరు పరవళ్లు

- జలపాతం వద్ద మౌలిక వసతుల కల్పనపై అటవీశాఖ దృష్టి
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే బీజం
- జలవిద్యుత్ కేంద్రం నుంచి రూ.50 లక్షల సీఎస్సార్ నిధులు కేటాయించిన ఏపీ జెన్‌కో
- అంచెలంచెలుగా అందుబాటులోకి వస్తున్న సౌకర్యాలు

పొల్లూరు జలపాత ముఖద్వారం

మోతుగూడెం: అల్లూరి జిల్లా పొల్లూరు జలపాతానికి మంచి రోజులు వచ్చాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మౌలిక వసతుల కల్పనకు బీజం పడటంతో పర్యాటకులకు సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ జలపాతం వర్షాకాలంలో, ముఖ్యంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఉప్పొంగి ప్రవహిస్తూ చూసేందుకు అందంగా కనిపిస్తుంది. కొండల మధ్య సుమారు 50 అడుగుల ఎత్తునుంచి జాలువారుతూ ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తుంది.

అతిథి గృహం నిర్మించనున్న మెట్ట ప్రాంతం

- పొల్లూరు నుంచి డొంకరాయి వెళ్లే మార్గంలో రోడ్డుకు అరకిలోమీటరు దూరంలో ఉంది. ఫోర్‌బే, డొంకరాయి అటవీప్రాంతంలోని కొండలమధ్య నుంచి జాలువారుతూ పొల్లూరు వద్ద సీలేరు నదిలో కలుస్తుంది.
- పర్యాటకంగా ప్రాచుర్యం పొందిన ఈ జలసోయగం అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంకురార్పణ జరిగింది. దీనిలో భాగంగానే ఈ ప్రాంతాన్ని అటవీశాఖ స్వాధీనం చేసుకుంది. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలోని 5,6 యూనిట్ల నిర్మాణ నేపథ్యంలో వీటికి సంబంధించి సుమారు రూ.కోటి మేర సీఎస్సార్ నిధులను ఏపీ జెన్‌కో కేటాయించింది. వీటిలో రూ.50 లక్షలు గత ప్రభుత్వంలో విడుదల అయ్యాయి.
- ఏపీ జెన్‌కో విడుదల చేసిన సీఎస్సార్ నిధులతో జలపాతం ప్రవేశద్వారాన్ని పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాటుచేశారు. సుమారు 50 కార్లు పార్కింగ్‌కు అనుకూలంగా స్థలాన్ని చదును చేశారు. పర్యాటకులు సేదతీరేందుకు రెల్లిగడ్డితో పగోడాలు నిర్మించారు. కూర్చునేందుకు వీలుగా సుమారు 8 సిమెంటు బెంచీలు ఏర్పాటుచేశారు. ప్రవేశద్వారం నుంచి జలపాతం వరకు అరకిలోమీటరు పొడవునా గ్రావెల్‌తో మార్గాన్ని అందుబాటులోకి తెచ్చారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా తాత్కాలికంగా షెడ్లు ఏర్పాటుచేశారు.
- జలపాతం వద్ద ప్రమాదకర ప్రాంతంలో పర్యాటకుల రక్షణ నిమిత్తం సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటుచేశారు. ఇక్కడ స్థానిక గిరియువత ఐదుగురితో సొసైటీ ఏర్పాటుచేసి ఉపాధి కల్పించారు. కారు పార్కింగ్‌కు రూ.50, బస్సుకు రూ.100 వసూలు చేస్తున్నారు. జలపాతం సందర్శించే వారికి ఒకొక్కరికి రూ.20 ప్రవేశ రుసుం చెల్లించాలి. వీటికి మరికొంత మొత్తాన్ని జోడించి అటవీశాఖ వీరికి చెల్లిస్తోంది. మంజూరైన సీఎస్సార్ నిధులు రూ.50 లక్షల్లో ఇప్పటివరకు సుమారు రూ.20 లక్షలు ఖర్చుచేసినట్టు అటవీశాఖ అధికారవర్గాలు తెలిపాయి.
- జలపాతాన్ని ఇటీవల ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి సందర్శించారు. లక్కవరం అటవీరేంజి పరిధిలో సుకుమామిడి గ్రామం నుంచి అటవీప్రాంతం గుండా గుడిసె వరకు సుమారు 12 కిలోమీటర్ల పొడవునా ట్రెక్కింగ్ నిర్వహణకు సాధ్యాసాధ్యాలపై సర్వేకు ఆదేశించారు. మోతుగూడెం అటవీశాఖ కార్యాలయం ఎదురుగా గుట్టపై ఉన్న గెస్ట్ హౌస్ పునర్నిర్మాణంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.
- పర్యాటకులకు సౌకర్యంగా ఉండేందుకు ప్రధాన రోడ్డు నుంచి ప్రవేశద్వారం వరకు సిమెంట్ ఫ్లోరింగ్ చేపట్టేందుకు రూ.5లక్షలతో అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇవికాకుండా పర్యాటకులు దుస్తులు మార్చుకునేందుకు పురుషులు, మహిళలకు ఆరు గదులు పూర్తిస్థాయిలో నిర్మాణానికి చర్యలు చేపట్టారు. తిను బండారాల స్టాళ్లు ఏర్పాటుకు పక్కా భవనం నిర్మించి స్థానిక గిరి యువతకు అప్పగించే ఆలోచనలో అటవీశాఖ ఉంది.

వాహనాల పార్కింగ్ కోసం చదును చేసిన ప్రాంతం

మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం

గత ప్రభుత్వంలో మంజూరైన రూ.50 లక్షల్లో ఇప్పటివరకు సుమారు రూ.20 లక్షలు మౌలిక వసతుల కల్పనకు కేటాయించాం. మిగిలిన రూ.30 లక్షలతోపాటు మరో రూ.45 లక్షలు విడుదల అయ్యాయి. వీటిని పొల్లూరు జలపాతంతో పాటు పరిసర పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు సౌకర్యవంతంగా మౌలిక వసతులకు కల్పనకు వెచ్చిస్తాం.

– జి.నానాజి, రేంజ్ అధికారి, లక్కవరం



ప్రమాదాల నివారణకు ఏర్పాటుచేసిన గ్రిల్

బస చేయాలంటే..

పొల్లూరు జలపాత సందర్శనకు వచ్చే పర్యాటకులు బస చేసేందుకు మోతుగూడెంలో ఏపీ జెన్‌కో అతిథి గృహం ఉంది. ఆరు సూట్లు ఉన్నాయి. ఇవి ఖాళీగా ఉంటే అద్దెకు ఇచ్చే అవకాశం ఉంది. ఇవి కాకుండా ప్రైవేట్ రిసార్టులు పొల్లూరులో ఒకటి, మోతుగూడెంలో 7 ఉన్నాయి. రూమ్‌కు రోజుకు (24 గంటలు) రూ.2500 వరకు అద్దె ఉంటుంది. నలుగురు నుంచి ఆరుగురు ఉండేందుకు అనువుగా ఉంటుంది. రిసార్ట్‌ల్లో భోజన సదుపాయం ఉంది.

ఇలా వెళ్లాలి..

పర్యాటకులకోసం ఏర్పాటుచేసిన హట్

పొల్లూరు జలపాతం సందర్శనకు భద్రాచలం, నర్సీపట్నం, రాజమండ్రి నుంచి రావొచ్చు. ఈరోడ్డు మార్గాల్లో బస్సు సౌకర్యం ఉంది. ప్రధాన రోడ్డు నుంచి కాలినడకన జలపాతం వద్దకు వెళ్లొచ్చు. భద్రాచలం, రాజమండ్రి నుంచి వచ్చే రోడ్డు సౌకర్యం మెరుగ్గానే ఉంది. నర్సీపట్నం నుంచి వచ్చే వారు గూడెంకొత్తవీధి నుంచి వై.రామవరం మండలం పాలగెడ్డ వరకు సుమారు 60 కిలోమీటర్ల మేర రోడ్డు బాగులేనందున ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.

శ్రీనివాసా.. గోవిందా..

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో ఆదివారం సైతం భక్తుల రద్దీ కొనసాగింది. కార్తీక మాస పర్వదినాలు, సెలవు రోజు కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో పోటెత్తాయి. దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, కల్యాణకట్ట, వకుళమాత నిత్యాన్నదాన సదనం తదితర విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

మద్దిలో కార్తీక మాస పూజలు

జంగారెడ్డిగూడెం: కార్తీకమాసం ఆదివారం సందర్భంగా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి దేవాలయంలో కార్తీక మాస పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో హనుమద్ హోమం, శ్రీ సువర్చల హనుమద్ కల్యాణం ఆలయ అర్చకులు, వేద పండితులు, రుత్వికుల ఆధ్వర్యంలో చేపట్టారు. స్వామివారికి మధ్యాహ్నం 3 గంటల వరకు వివిధ సేవల రూపేణా రూ.2,68,740 ఆదాయం సమకూరినట్టు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. స్వామి నిత్యాన్నదాన సత్రంలో సుమారు 4,200 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని చెప్పారు.

ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి

పాలకొల్లు సెంట్రల్: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీకమాసం సందర్భంగా ఆదివారం భక్తులు, పంచారామ యాత్రికులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి భక్తులు స్వామికి మహాన్యాస పూర్వక అభిషేకాలు చేయించుకున్నారు. అభిషేకాల అనంతరం వివిధ రకాల పూలతో స్వామివారిని అత్యంత వైభవంగా అలంకరించారు. మధ్యాహ్నం నుంచి పంచారామ యాత్రికులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రాత్రి వరకు భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులు స్వామివారి అలంకరణను తిలకించారు. ఆలయంలో పడమర వైపు ప్రహరీగోడ ప్రమాదకర పరిస్థితుల్లో ఉండడంతో కర్రలు కట్టి ప్రదక్షిణలను నిలుపుదల చేశారు.

తండ్రికి కుమార్తె అంతిమ సంస్కారాలు

తండ్రికి కొరివి పెడుతున్న కుమార్తె శ్రావణి

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గెద్దనపల్లి పంచాయతీ లచ్చిరాజు చెరువు గ్రామంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన తండ్రికి కుమార్తె ఆదివారం దహన సంస్కారాలు నిర్వహించింది. ఈ హృదయ విదారక ఘటన అందరినీ కదిలించింది. లచ్చిరాజు చెరువుకు చెందిన బడుగు వెంకటరమణ (48) బ్రెయిన్ స్ట్రోక్‌కు చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య అనారోగ్యంతో బాధ పడుతోంది. పెద్ద కుమార్తెకు వివాహమైంది. దీంతో, తండ్రికి చిన్న కుమార్తె శ్రావణి తలకొరివి పెట్టి, దహన సంస్కారాలు నిర్వహించింది. తల్లి అనారోగ్యంతో మంచాన పడటం, తండ్రి మృతి చెందడం, ఇంట్లో మగ పిల్లలు లేకపోవడం, చిన్న కుమార్తె శ్రావణి అంత్యక్రియలు నిర్వహించడం చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

నగరాలలో చారిత్రక సౌందర్యం.
కోటలలో నిర్మాణ నైపుణ్యం.
రాజమందిరాల్లో శిల్పచాతుర్యం.
థార్ ఎడారిలో రాజస లాంఛనం.
రాజస్థాన్‌కు మణిమకుటాలు.
చిత్రమైన పిచ్వాయ్ కృష్ణుడు.
నాథ్‌ద్వారా స్టాచ్యూ ఆఫ్ బిలీఫ్.
గోల్డెన్ సాండ్స్ టూర్ ఆకర్షణలు.
పర్యటనలో మెరుపు వీచికలు.





• డెసర్ట్ టూర్

పర్యాటక మెరుపు వీచిక

1 రోజు హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయ్‌పూర్ చేరడం. ఉదయ్‌పూర్‌లో హోటల్ గదిలో చెక్ ఇన్ కావడం. లంచ్ తర్వాత సిటీప్యాలెస్, లేక్ పిచోలా సందర్శనం. బస ఉదయ్‌పూర్‌లో.

లేక్ సిటీ విహారం

ఉదయ్‌పూర్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి నగర చారిత్రక సౌందర్యం మెరుపు వీచికలుగా కనువిందు చేస్తుంటుంది. సిటీ ఆఫ్ లేక్స్ అని ఎందుకంటారో నగరంలో ఓ అరగంట ప్రయాణంలోనే తెలుస్తుంది. ఫతే సాగర్, పిచోలా, స్వరూప్ సాగర్, రంగ్ సాగర్, దూద్ తలాయ్ సరస్సులు ప్రధానమైనవి. ఈ సరస్సుల్లో కనీసం రెండయినా అరగంట ప్రయాణంలో కనిపిస్తాయి. వాటి మెయింటెనెన్స్ కూడా బాగుంటుంది. ఇక చారిత్రక కట్టడాల్లో ఆరు కిలోమీటర్ల సిటీ వాల్, నగరంలో ప్రవేశించడానికి సూర్జాపోల్, చాంద్‌పోల్, ఉదయ్‌పోల్, హాథీపోల్, అంబాపోల్, బ్రహ్మపోల్, దిల్లీ గేట్, కిషన్ పోల్ పేర్లతో ద్వారాలున్నాయి. ఇవి కూడా తారసపడతాయి. ఎయిర్‌పోర్ట్ నుంచి నగరంలో హోటల్ గదికి చేరే లోపే రెండు లేక్‌లు, రెండు ద్వారాలు, చేతక్ సర్కిల్ పర్యాటకులను చరిత్రయుగంలోకి తీసుకెళ్తాయి. పిచోలా సరస్సు ఒడ్డున సిటీప్యాలెస్. సరస్సు మధ్యలో లేక్ ప్యాలెస్, ఒక వైపుగా జగ్‌మందిర్, జగ్‌మోహన్ ప్యాలెస్‌లను పడవలో విహరిస్తూ చుట్టిరావచ్చు. కొంతకాలంగా ట్రెండింగ్‌లో ఉన్న ఫ్యాషన్ ఐకాన్ గోమాత ప్రింట్. ఫ్యాషన్ డిజైనర్‌లు చీరలు, చుడీదార్‌ల మీద గోమాత బొమ్మను డిజిటల్ ప్రింట్ చేస్తున్నారు. ఈ గోమాత చిత్రలేఖనం జగ్‌మందిర్ గోడల మీద కనిపిస్తుంది. లేక్‌కు మరొక ఒడ్డున దర్బార్‌హాల్ ఉంది. బొమ్మలతో కొలువు దీరిన దర్బార్‌హాల్ నాటి రాజకొలువును తలపిస్తుంది.



2 రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత సజ్జన్‌గఢ్ ఫోర్ట్ విజిట్. ఆ తర్వాత హల్దీఘాటీకి ప్రయాణం. మహారాణా ప్రతాప్ మ్యూజియం సందర్శనం తర్వాత నాథ్‌ద్వారాకు ప్రయాణం. స్టాచ్యూ ఆఫ్ బిలీఫ్ విజిట్ తర్వాత హోటల్ గదికి చేరడం. బస ఉదయ్‌పూర్‌లోనే.

సినీ ప్యాలెస్

సజ్జన్‌గఢ్ ప్యాలెస్‌కు ప్రయాణం మొదలైన తరవాత ఉదయ్‌పూర్ నగర శివారు నుంచి మలుపు తిరగ్గానే జనసమ్మర్దం కొరవడుతుంది. దూరంగా కొండ మీద మూడు వేల అడుగుల ఎత్తులో చిన్న నిర్మాణం కనిపిస్తుంది. దగ్గరకు వెళ్తే అక్కడ ఒక సామ్రాజ్యాన్ని విస్తరించడానికి జరిగిన ఏర్పాట్లు అర్థమవుతాయి. అటవీ ప్రదేశం మధ్యలో వాహనం వెళ్లడానికి మార్గం ఉంది. వెకేషన్‌కి వచ్చిన వాళ్లు ఒకరోజు ఈ ట్రెకింగ్‌కు కేటాయించవచ్చు. మేవార్ రాజు సజ్జన్ సింగ్ ఖగోళ పరిశోధన, అధ్యయన కేంద్రం ఏర్పాటు కోసం నిర్మించిన ప్యాలెస్ ఇది. సజ్జన్‌సింగ్ మరణం తర్వాత ఆ ఉద్దేశం నెరవేరలేదు. అటవీ ప్రదేశం నేపథ్యంలో ఒక కోట కేంద్రంగా కథ నడిచే సినిమాల్లో ఈ ప్యాలెస్ కనిపిస్తుంది. జేమ్స్ బాండ్ సినిమా అక్టోపసీ సినిమాలో రోజర్‌మూర్ ఈ కోట నుంచి పారిపోయే సన్నివేశం చిత్రీకరణ ఇక్కడే జరిగింది. ద చీటా గర్ల్స్ వంటి మరికొన్ని సినిమాలకు కూడా ఈ ప్యాలెస్... విజువల్ రిచ్‌నెస్‌నిచ్చింది.

రాణాప్రతాప్ పోరుగడ్డ

మేవార్ రాజ్యానికి మొఘల్ పాలకులకు మధ్య యుద్ధం జరిగిన పోరుగడ్డ హల్దీఘాటీ. మేవార్ రాజ్యం తరపున రాణా ప్రతాప్, మొఘల్ సామ్రాజ్యం తరపున మాన్‌సింగ్ యుద్ధంలో పాల్గొన్నారు. ఉదయ్‌పూర్ నుంచి ఈ ప్రదేశానికి వెళ్లే మార్గం ఒక అడ్వెంచరస్ టూర్‌ని తలపిస్తుంది. కొండల నడుమ కనుమ గుండా దట్టమైన అడవి మధ్యలో సాగుతుంది ప్రయాణం. దాదాపుగా 30 కిలోమీటర్ల ప్రయాణంలో మట్టిలో ఎర్రదనం తగ్గుతూ పసుపు చారలు మొదలవుతాయి. కొంతదూరం వెళ్లేసరికి నేల గోరంత పసుపు రాసుకున్నట్లు ఉంటుంది. యుద్ధభూమికి చేరే లోపు చేతక్ స్మారకం పాలరాతి నిర్మాణం కనిపిస్తుంది. రాణాప్రతాప్‌కు ఇష్టమైన గుర్రం, ఎన్నో విజయాలను సాధించి పెట్టిన గుర్రం ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయింది. అక్కడి నుంచి బరువెక్కిన గుండెతో హల్దీఘాటీకి చేరతాం. యుద్ధక్షేత్రానికి చేరే లోపే ఆకాశమంత ఎత్తులో ఠీవిగా సింహాసనం మీద ఆసీనుడైన రాణాప్రతాప్ కంచు విగ్రహం కనిపిస్తుంది. అక్కడ నిర్మించిన భారీ మ్యూజియాన్ని చూస్తే రాణాప్రతాప్ జీవితం మొత్తం కళ్లకు కడుతుంది. హల్దీఘాటీలో జరిగిన యుద్ధంలో రాణాప్రతాప్ తన రాజ్యాన్ని మొఘలుల ఆధీనంలోకి వెళ్లకుండా కాపాడుకోగలిగాడు.

రాజస్థాన్ కృష్ణుడు

ఇక్కడ శ్రీకృష్ణుడిని శ్రీనాథ్‌గా పిలుచుకుంటారు. వల్లభాచార్యుడి సంప్రదాయం శుద్ధ అద్వైతాన్ని ఆచరిస్తారు. స్థానికులు గోవర్ధన గిరిధారి రూపంలో ఉన్న కృష్ణుడిని కొలవడమే కాదు, ఇక్కడ చిత్రకారులు కూడా ఈ రూపంలో కృష్ణుడి బొమ్మలో వేయడంలో నిష్ణాతులు. వీరిది ప్రత్యేకమైన శైలి. ఈ చిత్రాలను పిచ్వాయ్ పెయింటింగ్స్ అంటారు. మేవార్‌లో విస్తరించిన చిత్రలేఖనాల శైలి ఇది. ఈ టూర్ గుర్తుగా ఒక పెయింటింగ్ కొనుక్కోవడం మరువద్దు. నాథ్‌ద్వారాకు మరొక టూరిస్ట్ అట్రాక్షన్ స్టాచ్యూ ఆఫ్ బిలీఫ్ శివుడి విగ్రహం. విశ్వాస స్వరూపం పేరుతో 369 అడుగుల శివుడి విగ్రహాన్ని 2022లో ప్రతిష్ఠించారు. ప్రపంచంలోని శివుడి విగ్రహాలన్నింటిలోకి ఎత్తైన రూపం ఇదే.

3 రోజు బ్రేక్‌ఫాస్ట్ త్వరగా ముగించుకుని గది చెక్ అవుట్ చేసి జయ్ సల్మేర్‌కు బయలుదేరాలి. జయ్‌సల్మేర్‌లో డెసర్ట్ క్యాంప్‌లో చెక్ ఇన్. రాత్రి భోజనం, బస అక్కడే.

జీవిస్తున్న కోట

జయ్‌సల్మేర్ కోట ఒక ఊరంత... కాదు, పట్టణమూ కాదు, ఓ మోస్తరు నగరమంత ఉంటుంది. ఈ కోటను క్రీ.శ 12వ శతాబ్దంలో రాజపుత్ర పాలకుడు రావల్ జయ్‌సల్ నిర్మించాడు. అందుకే ఈ కోటకు జయ్‌సల్మేర్ అని పేరు. ఇది మన వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి కాలానిది. యునెస్కో ఈ రెండింటినీ వరల్డ్ హెరిటేజ్ సైట్‌లుగా గుర్తించింది. జయ్‌సల్మేర్ కోట లివింగ్ ఫోర్ట్. అంటే ఈ కోటలో జనజీవనం కొనసాగుతోంది. జనజీవితం కొనసాగుతున్న ప్రాచీన కోటలు అరుదుగా ఉంటాయి. జయ్‌సల్మేర్ కోట గోడలు పసుపురంగు రాతితో నిర్మించడంతో దీనిని గోల్డెన్ ఫోర్ట్రెస్ అంటారు. ఈ కోటలోని పాలరాతి ఆలయాలు, రాజమందిరాల గోడలకు చెక్కిన గవాక్షాల డిజైన్‌లను ఎంత సేపు చూసినా ఇంక చాలు అనే సంతృప్తి కలగదు. ఇంకా ఇంకా చూడాలనే ఉంటుంది. కలంకారీ అద్దకాలు, స్క్రీన్ ప్రింటింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో కనిపించే ట్రెండింగ్ డిజైన్‌లు ఈ గోడల మీదవే. బాలీవుడ్ ఇండస్ట్రీకి గొప్ప లొకేషన్ ఇది. హమ్ దిల్ దే చుకే సనమ్, షోలే, ద ఫాల్, భజరంగ్ భాయీ జాన్‌తోపాటు తెలుగు సినిమా కొండపల్లి రాజాలో ఒక పాట చిత్రీకరణ జయ్‌సల్మేర్ కోటలో జరిగింది.

ఎడారిలో ఓ రాత్రి

రాజపుత్రుల రిచ్ లైఫ్‌స్టైల్‌ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలంటే థార్ ఎడారి డెసర్ట్ క్యాంప్‌లో గడపాలి. సాయంత్రం నీరెండలో బంగారు రజను రాశిపోసినట్లున్న ఎడారి ఇసుకలో జీప్ సఫారీ ఒక రకమైన సంతోషం. ఒంటె మీద విహారం లయబద్ధంగా కదులుతూ ముందుకు సాగుతుంటే మరో లెవెల్ ఎంజాయ్‌మెంట్. ఇక ఎడారిలో ఆధునిక సౌకర్యాలతో గుడారాలు, చలిమంట, పాటలు, డాన్సులు, రాజస్థానీ రుచులతో చక్కటి భోజనాలు పూర్తయిన తర్వాత గుడారంలో నిద్ర. తెల్లవారే సరికి అంతా కలలోలాగ గడిచిపోతుంది.

4 రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత డెసర్ట్ క్యాంప్ బస నుంచి చెక్ అవుట్ అయి జయ్ సల్మేర్ కోటకు ప్రయాణమవ్వాలి. కోట తర్వాత పట్వోన్ కీ హవేలీ, గాడిసర్ లేక్ విహారం తర్వాత హోటల్ గదిలో చెక్ ఇన్, డిన్నర్, బస జయ్‌సల్మేర్ సిటీలో.

శిలకు పూచిన పూలు

జయ్ సల్మేర్ కోటలో ఒక ఆర్కిటెక్చురల్ అద్భుతం ఈ హవేలీ. దూరం నుంచి చూస్తే గోడల నిండుగా పెయింటింగ్స్ ఉన్నట్లు కనిపిస్తుంది. దగ్గరకు వెళ్లి చూస్తే అవన్నీ గోడకు పూసిన పూలే. కొన్ని శిలకు చెక్కిన విరిశిల్పాలు, మరికొన్ని కట్టడంలో గోడకు పూలతీగలు, విరిసిన పూలను నిర్మించారు. వాటికి రంగులద్దారు. భవనంలో విరిసిన ఉద్యానవనం విరిసినట్లుంది. ఈ హవేలీ క్రీ.శ 18వ శతాబ్దం నాటి నిర్మాణకౌశలానికి నిలువెత్తు నిదర్శనం.

5 రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత జోధ్‌పూర్‌కు ప్రయాణం. మెహరాన్‌గఢ్ కోట వీక్షణం తర్వాత హోటల్ గదిలో చెక్ ఇన్, డిన్నర్, రాత్రి బస జోధ్‌పూర్‌లో.

విజయద్వారాల కోట

ఉదయ్‌పూర్ నగరంలో ద్వారాలున్నట్లే ఇక్కడ కూడా ద్వారాలున్నాయి. అయితే ఇవి కోట నిర్మాణ సమయంలో కట్టినవి కాదు, ఒక్కొక్కటి ఒక్కొక్క సందర్భంలో నిర్మించినవి. జయ్‌పోల్‌ను జయ్‌పూర్, బికనీర్ రాజ్యాలతో యుద్ధం చేసి గెలిచిన సందర్భంలో మహారాజా మాన్‌సింగ్ కట్టాడు. మొఘలుల మీద గెలిచినప్పుడు ఫతే పోల్ నిర్మాణం జరిగింది. లోహపోల్ దగ్గర గోడ మీద మహిళల చేతి ముద్రలను చూడగానే మనసు బరువెక్కుతుంది, స్త్రీలకు జరిగిన అన్యాయానికి సమాజం మొత్తం సిగ్గుతో తలవంచుకోవాల్సిన నేపథ్యం అది. భర్తను కోల్పోయిన రాణులు, యువరాణులు సతిలో పాల్గొనే ముందు తమ చేతిముద్రలను గోడకు అద్దేవారు. నాటి దురాచానికి నిదర్శనంగా ఆ ఆనవాళ్లు నేటికీ దర్శనమిస్తున్నాయి. మెహరాన్‌గఢ్ కోటలోపల మోతీమహల్, ఫూల్ మహల్, శీష్ మహల్‌లు అందమైన నిర్మాణాలు. ఇక్కడ మ్యూజయంలో బంగారు పల్లకి ఉంది. కోట పై భాగంలో పెద్ద ఫిరంగిని చూడగానే కొద్దిగా భయం వేస్తుంది. మనసు కుదుటపరుచుకున్న తర్వాత అక్కడి నుంచి చూస్తే నగరం వ్యూ అందంగా ఉంటుంది.

6 రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ చెక్ అవుట్ చేసి బయలుదేరాలి. ఉమైద్ భవన్ ప్యాలెస్ మ్యూజయం వీక్షణం తర్వాత మధ్యాహ్నం జోధ్‌పూర్ ఎయిర్‌పోర్టులో డ్రాప్ చేస్తారు. విమానం సాయంత్రం ఐదున్నరకు బయలుదేరి ఏడున్నరకు హైదరబాద్‌కు చేరడంతో టూర్ పూర్తవుతుంది.

ఉపాధి హామీ భవనం

రాజపుత్రుల కోటలు, ప్యాలెస్‌లలో ఉమైద్ భవన్ ప్యాలెస్ కొత్తదనే చెప్పాలి. ఇది 20వ శతాబ్దపు నిర్మాణం. ఇది అత్యంత ఆధునికమైన నిర్మాణం. క్రీ.శ 1929లో మొదలై, 1943లో పూర్తయింది. అప్పటికే దేశంలో బ్రిటిష్ వలస పాలన వేళ్లూనుకుని ఉంది. వలస పాలకులు వద్దంటూ స్వాతంత్ర్యం కోసం పోరాటం కూడా ఊపందుకుని ఉంది. అలాంటి సమయంలో ఇంత పెద్ద నిర్మాణం చేపట్టడానికి కారణం అనావృష్టి. అవును వరుసగా మూడేళ్లుగా వర్షాలు లేక పంటలు వేసే అవకాశం లేక పొలాలు బీళ్లుగా మారాయి. రైతులకు పని లేదు. అలాంటి సమయంలో ఉపాధి కల్పన కోసం మహారాజా ఉమైద్ సింగ్ ఈ నిర్మాణాన్ని తలపెట్టాడు. రోజూ రెండు నుంచి మూడు వేల మంది పని చేసేవారు. మఖరానా మార్బుల్, బర్మా టేకుతో నిర్మాణపరంగా ప్రత్యేకమైనదే. ప్రస్తుతం ఇది తాజ్ హోటల్స్ నిర్వహణలో ఉంది. కోటలో కొంత భాగం, మ్యూజియంలోకి పర్యాటకులను అనుమతిస్తారు.



- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ప్యాకేజ్ పేరు: గోల్డెన్ సాండ్స్ ఆఫ్ రాజస్థాన్.
ప్యాకేజ్ కోడ్: ఎస్‌హెచ్‌ఏ 20. ఇందులో ప్రధానంగా ఉదయ్‌పూర్, జై సల్మీర్, జోధ్‌పూర్ కవర్ అవుతాయి.
టారిఫ్ ఇలా: సింగిల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 49,650 రూపాయలు, డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 38 వేలు, ట్రిపుల్ ఆక్యుపెన్సీలో 36,550 రూపాయలు.

ప్రయాణం ఎప్పుడు?

● ఆరు రోజుల ఈ పర్యటన నవంబర్ 22వ తేదీన మొదలయ్యి 27వ తేదీతో ముగుస్తుంది. ఇదే టూర్ 23 నుంచి మరొక ట్రిప్ మొదలవుతుంది. అది 28వ తేదీ పూర్తవుతుంది. ● 22వ తేదీ ఉదయం 8.45 గంటలకు 6ఈ 846 విమానం హైదరాబాద్‌లో మొదలవుతుంది. 10. 25 గంటలకు ఉదయ్‌పూర్‌కి చేరుతుంది (23వ తేదీ ట్రిప్‌కి కూడా ఇదే నంబరు విమానం, ఇదే టైమ్) ● తిరుగుప్రయాణం 27వ తేదీన జోధ్‌పూర్ నుంచి 6ఈ 6816 విమానం సాయంత్రం 17. 30 గంటలకు బయలుదేరి, 19.25 గంటలకు హైదరాబాద్‌కు చేరుతుంది.

ప్యాకేజ్‌లో ఏమేమి వర్తిస్తాయి?

● విమానం టికెట్‌లు (హైదరాబాద్ నుంచి ఉదయ్‌పూర్, జోధ్‌పూర్ నుంచి హైదరాబాద్) ● హోటల్ బస(4 రోజులు), డెసర్ట్ క్యాంప్ బస (ఒకరోజు) ● బ్రేక్‌ఫాస్ట్‌లు 5, లంచ్ 1, డిన్నర్‌లు 5 ● సైట్ సీయింగ్‌కి (ఐటెనరీలో ప్రకటించిన ప్రదేశాలకు మాత్రమే) ఏసీ బస్సు ● ట్రావెల్ ఇన్సూరెన్స్ ● ఐఆర్‌సీటీసీ టూర్ ఎస్కార్ట్

ప్యాకేజ్‌లో ఇవి వర్తించవు!

● భోజనంలో మెనూలో లేకుండా అదనంగా ఆర్డర్ చేసుకున్న పదార్థాలు, పానీయాలు ● ఫ్లయిట్‌లో ఆర్డర్ చేసుకున్న ఆహారం ● సైట్ సీయింగ్‌లో ఇతర ప్రదేశాల వీక్షణం వంటివి (ఆయా ప్రదేశాల్లో ఉన్న ఆలయాలు, ప్రార్థనమందిరాలు, ఆసక్తి కలిగించే ఇతర ప్రదేశాలకు వెళ్లడానికి రవాణా, ఎంట్రీ టికెట్‌లు, దర్శనం టికెట్‌ల వంటివి ప్యాకేజ్‌లో వర్తించవు) ● టిప్‌లు, గైడ్, లాండ్రీ ఖర్చులు ● హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి మొదలై హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌తో ముగుస్తుంది. కాబట్టి హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్ట్‌కి చేరడానికి, ఎయిర్‌పోర్ట్ నుంచి రవాణా ఇందులో వర్తించవు.



జ్ఞాన సముపార్జనలో చేసే పెట్టుబడికి అత్యుత్తమ వడ్డీ లభిస్తుంది

-బెంజమిన్ ఫ్రాంక్లిన్, అమెరికన్ తత్వవేత్త, రచయిత, పెట్టుబడిదారు

గణాంకాలు, ఫలితాలే దిక్సూచి

ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు ప్రధానంగా ఆర్థిక గణాంకాలు, జూలై-సెప్టెంబర్(క్యూ2) ఫలితాలు దిశా నిర్దేశం చేయనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. వీటికితోడు యూఎస్‌తో చైనా, ఇండియా వాణిజ్య చర్చలకూ ప్రాధన్య మున్నట్లు తెలియజేశారు. వివరాలు చూద్దాం..

- సాక్షి, బిజినెస్ డెస్క్

క్యూ2 జాబితాలో పలు దిగ్గజాలు

- ప్రపంచ మార్కెట్ల ట్రెండ్‌కు ప్రాధాన్యం
- యూఎస్‌తో వాణిజ్య చర్చలపై దృష్టి
- దేశీ స్టాక్ మార్కెట్లపై నిపుణుల విశ్లేషణ

దేశీయంగా ఈ వారం పలు ఆర్థిక గణాంకాలు విడుదలకానున్నాయి. అక్టోబర్ నెలకు బుధవారం (12న) వినియోగ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ), శుక్రవారం(14న) టోకు ధరల ద్రవ్యోల్బణం(డబ్ల్యూపీఐ) గణాంకాలు వెలువడనున్నాయి. అంతకుముందు నెల(సెప్టెంబర్)లో సీపీఐ 2.07 శాతం నుంచి 1.54 శాతానికి దిగివచ్చింది. ఇది 2017 జూన్ తదుపరి కనిష్టంకాగా.. ఆర్‌బీఐ 2 శాతం లక్ష్యానికంటే తక్కువకావడం గమనార్హం! ఇక సెప్టెంబర్‌లో డబ్ల్యూపీఐ 0.52 శాతం నుంచి 0.13 శాతానికి బలహీనపడింది. ద్రవ్యోల్బణ గణాంకాలు ఆర్‌బీఐ పరపతి విధానాలపై ప్రభావం చూపనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు.

క్యూ2 పనితీరు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) రెండో త్రైమాసిక(క్యూ2) ఫలితాల సీజన్ దాదాపు ముగింపు దశకు చేరుకున్నట్లు మార్కెట్ నిపుణులు తెలియజేశారు. ఈ బాటలో ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజాలు ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా, హిందుస్తాన్ ఏరోనాటిక్స్, హిందుస్తాన్ కాపర్‌తో పాటు టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, భారత్ ఫోర్జ్, బయోకాన్, కంకార్, ఫినొలెక్స్ కేబుల్స్, టాటా పవర్, థెర్మాక్స్, ఇమామీ, బజాజ్ ఫిన్‌సర్వ్, గ్రాఫైట్, హడ్కో, కల్పతరు, కేఈసీ ఇంటర్నేషనల్, కేపీఐటీ టెక్, అశోక్ లేలాండ్ తదితరాలు క్యూ2 పనితీరు ప్రకటించనున్నాయి. ద్రవ్యోల్బణ గణాంకాలుసహా క్యూ2 ఫలితాలు మార్కెట్లలో కీలకంగా నిలవనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా తెలియజేశారు.

విదేశీ అంశాలు

కొద్ది రోజులుగా కొనసాగుతున్న యూఎస్ ప్రభుత్వ షట్‌డౌన్ ఆ దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు.. ఇతర దేశాలపైనా ప్రభావం చూపనున్నట్లు నిపుణులు చెబుతున్నారు. మరోపక్క యూఎస్‌తో చైనా, భారత్ నిర్వహిస్తున్న వాణిజ్య చర్చలు సైతం సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు తెలియజేశారు. ఈ వారం అక్టోబర్ నెలకు చైనా పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ), రిటైల్ విక్రయ గణాంకాలు వెలువడనున్నాయి. అక్టోబర్ నెలకు యూఎస్ వినియోగ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ) వెల్లడికానుంది. ఈ అంశాలపైనా ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు ఆన్‌లైన్ ట్రేడింగ్, వెల్త్ టెక్ సంస్థ ఎన్‌రిచ్ మనీ సీఈవో ఆర్.పొన్నుమ్మడి పేర్కొన్నారు.

ఇతర అంశాలకూ ప్రాధాన్యం

ఇటీవల ముడిచమురు ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ పేర్కొన్నారు. వీటితోపాటు డాలరుతో మారకంలో రూపాయి కదలికలు, స్టాక్స్‌లోదేశ, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు లేదా అమ్మకాల తీరు కీలకంగా నిలవనున్నట్లు విశ్లేషించారు. యూఎస్ ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావంసహా.. చైనా, భారత్‌తో ట్రంప్ వాణిజ్య చర్చలు మార్కెట్లలో ట్రెండ్‌కు కీలకంకానున్నట్లు తెలియజేశారు.

గత వారమిలా

గురునానక్ జయంతి సందర్భంగా బుధవారం(5న) సెలవుకావడంతో గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు నాలుగు రోజులే పనిచేశాయి. పలు ఆటోపోట్ల మధ్య బీఎస్ఈ సెన్సెక్స్ 722 పాయింట్లు(0.9 శాతం) నీరసించి 83,216 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 230 పాయింట్లు(0.9 శాతం) క్షీణించి 25,492 వద్ద స్థిరపడింది. అయితే బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.25 శాతం పుంజుకోగా.. స్మాల్ క్యాప్ దాదాపు యథాతథంగా ముగిసింది.

సాంకేతికంగా

గత వారం సాంకేతికంగా మార్కెట్లు దిద్దుబాటు బాటలో సాగాయి. అయితే ఈ వారం క్షీణతకు కొంతమేర అడ్డుకట్టపడే వీలున్నట్లు సాంకేతిక నిపుణులు భావిస్తున్నారు. దీంతో నష్టాలు పరిమితంకావచ్చని పేర్కొన్నారు. నిఫ్టీకి తొలుత 25,350 పాయింట్ల వద్ద, తదుపరి 25,230 వద్ద మద్దతు లభించవచ్చని అంచనా వేశారు. ఈ స్థాయిల నుంచి బలాన్ని పుంజుకుంటే తొలుత 25,700, తదుపరి 25,800 వరకూ బలపడవచ్చని తెలియజేశారు. సెన్సెక్స్ బలహీనపడితే తొలుత 82,500 పాయింట్లవద్ద, ఆపై 82,000 స్థాయిలో సపోర్ట్ కనిపించవచ్చని పేర్కొన్నారు. ఈ స్థాయిలో బలపడితే 84,500- 85,000 పాయింట్ల వరకూ పుంజుకోవచ్చని అంచనా వేశారు.

మళ్లీ ఎఫ్‌పీఐల అమ్మకాలు

రూ. 12,569 కోట్లు వెనక్కి

గత నెల చివరిలో దేశీ స్టాక్స్‌పట్ల ఆసక్తి ప్రదర్శించిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) తిరిగి ఇటీవల అమ్మకాల బాట పట్టారు. వెరసి ఈ నెల(నవంబర్)లో ఇప్పటి వరకూ రూ. 12,569 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. నిజానికి అక్టోబర్‌లో నికరంగా రూ. 14,610 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. అయితే అంతకుముందు మూడు నెలలపాటు వరుసగా అమ్మకాలకే ప్రాధాన్యమిస్తూ వచ్చారు. ఫలితంగా సెప్టెంబర్‌లో రూ. 23,885 కోట్లు, ఆగస్ట్‌లో రూ. 34,900 కోట్లు, జూలైలో రూ. 17,700 కోట్లు చొప్పున పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. డిపాజిటరీల గణాంకాల ప్రకారం ఈ నెలలో ప్రతీ ట్రేడింగ్ రోజున నికరంగా అమ్మకాలకే మొగ్గు చూపడం గమనార్హం! దీంతో ఇతర మార్కెట్లతో పోలిస్తే దేశీ స్టాక్స్ వెనకడుగులో ఉన్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్‌కుమార్ తెలియజేశారు.

టోరెంట్ ఫార్మాకు మెరుగైన లాభాలు

సెప్టెంబర్ క్వార్టర్‌లో 30 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: టోరెంట్ ఫార్మాస్యూటికల్స్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బలమైన పనితీరు నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 30 శాతం పెరిగి రూ.591 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.453 కోట్లుగానే ఉంది. ఇక ఆదాయం ఇదే కాలంలో రూ.2,889 కోట్ల నుంచి రూ.3,302 కోట్లకు వృద్ధి చెందింది. దేశీ ఆదాయం 12 శాతం పెరిగి రూ.1,820 కోట్లుగా నమోదైంది. బ్రెజిల్ నుంచి రూ.318 కోట్లు, అమెరికా నుంచి రూ.337 కోట్ల ఆదాయం వచ్చింది. ఫలితాలకు ముందు శుక్రవారం బీఎస్ఈలో టోరెంట్ ఫార్మా షేరు ధర ఒక శాతం లాభపడి రూ.3,579 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-11-2025	
విశాఖ	585-00
చిత్తూరు	623-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600-00
విజయవాడ	600-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	590-00
వరంగల్	592-00
రిటైల్ ధర	6.50

ఐపీవోలు లాటరీ టికెట్లు కావు..

శ్రీపాల్ షా
ఎండీ, కోటక్ సెక్యూరిటీస్

దేశీ ప్రైమరీ క్యాపిటల్ మార్కెట్లలో ఐపీవోల సందడి నెలకొంది. 2025 తొలి తొమ్మిది నెలల్లో కంపెనీలు 75 మెయిన్‌బోర్డ్ ఐపీవోల ద్వారా సుమారు రూ. 1 లక్ష కోట్లు సమీకరించాయి. ఆఖరు త్రైమాసికంలో మరో రూ. 1 లక్ష కోట్లు సమీకరించనున్నాయి. ఇప్పటికే ఎన్ఎస్‌డీఎల్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ మొదలైనవి రాగా, గ్రో, ఫోన్‌పే, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యుచువల్ ఫండ్‌లాంటి రాబోయే ఇష్యూలపై భారీగా ఆసక్తి నెలకొంది. ఇది ఇన్వెస్టర్లకు మంచి వార్తే ఆయినప్పటికీ, ఐపీవోల మీద ఆసక్తి పెంచుకుంటున్న రిటైల్ ఇన్వెస్టర్లలో మరింత క్రమశిక్షణ, అవగాహన పెరగాల్సిన ఆవశ్యకతను కూడా తెలియజేస్తోంది.

చాలాకాలంగా ఐపీవోలంటే తక్షణ లాభాలందించే లాటరీ టికెట్లనే అభిప్రాయం నెలకొంది. ఇలాంటి మైండ్‌సెట్ చాలా ప్రమాదకరమైనది. వీటిని లాటరీ టికెట్లుగా భావించి, లిస్టింగ్ లాభాల కోసమే అప్లై చేయడం మంచిది కాదు. ఫండమెంటల్, వాస్తవిక విలువనే పరిగణనలోకి తీసుకోవాలే తప్ప ఆఫర్ సమయంలో నిర్ణయించిన మార్కెట్ ధరను కాదు. కంపెనీ దీర్ఘకాలిక వృద్ధి గాథలో పాలుపంచుకునే అవకాశాన్ని కల్పించడంలోనే ఐపీవోకి సంబంధించిన సిసలైన విలువ ఉంటుంది. కాబట్టి తక్షణ లాభాల కోసం ఐపీవోలను లాటరీ టికెట్లుగా భావించకుండా ఉండటం ముఖ్యం.

గ్రే మార్కెట్ ప్రీమియంలతో జాగ్రత్త..

గ్రే మార్కెట్లో ప్రీమియంలపై (జీఎంపీ) అతిగా ఆధారపడటం కూడా మంచిది కాదు. జీఎంపీ అనేది స్వల్పకాలిక స్పెక్యులేషనే తప్ప సిసలైన విలువను ప్రతిబింబించదు. ఈ ప్రీమియం తక్కువగా ఉన్నప్పటికీ లిస్టింగ్‌లో అదరగొట్టిన ఐపీవోలు ఇటీవల ఎన్నో చూశాం. ఉదాహరణకు స్విగ్గీ లిస్టింగ్‌కి ముందు జీఎంపీ ఒక మోస్తరుగా కనిపించింది. కానీ లిస్టింగ్ వేళ బిజినెస్ ఫండమెంటల్స్‌కి తగ్గట్లుగా రాణించింది. ఇక భారీ జీఎంపీ పలికిన ఐపీవోల వెంట పరుగులు తీసి, తీరా ఆ ప్రీమియంలన్నీ మాయమైపోయి, ఇన్వెస్టర్లు చేతులు కాల్చుకున్న ఉదంతాలూ ఉన్నాయి. కాబట్టి జీఎంపీ తక్కువగా ఉన్నంత మాత్రాన ఐపీవో బలహీనమైనదని గానీ, జీఎంపీ ఎక్కువగా ఉంటే కచ్చితంగా లాభాలు వస్తాయని గానీ అనుకోవడానికి ఉండదు.

సముచిత వేల్యుయేషన్స్.. రిటైల్ ఇన్వెస్టర్లకు వరం

ప్రస్తుతం చాలా మటుకు ఐపీవోలు, అన్‌లిస్టెడ్ వేల్యుయేషన్లతో పోలిస్తే చాలా ఆకర్షణీయమైన ధరతో ముందుకొస్తున్నాయి. దీనితో అన్‌లిస్టెడ్ మార్కెట్లో బడా హెచ్ఎన్ఐలు చెల్లించిన దానికంటే తక్కువ రేటుకే షేర్లను సొంతం చేసుకునే అవకాశం రిటైల్ ఇన్వెస్టర్లకు లభిస్తోంది. అన్‌లిస్టెడ్ మార్కెట్లో ఎలా ఉన్నా ఐపీవో విషయంలో సముచిత ధరే నిర్ణయించేలా ఇష్యూయర్లు, మర్చంట్ బ్యాంకర్లు కసరత్తు చేస్తుండటం ఆరోగ్యకరమైన పరిణామం. దేశీ క్యాపిటల్ మార్కెట్లు మెచ్యూర్ అవుతోండటాన్ని ఇది సూచిస్తోంది.

ఆలోచించి ఇన్వెస్ట్ చేయాలి..

ఇన్వెస్టర్లు ఐపీవోలను కూడా దీర్ఘకాలిక ఈక్విటీ పెట్టుబడుల కోణంలోనే చూడాలి. దరఖాస్తు చేయడానికి ముందే కంపెనీ మేనేజ్‌మెంట్, వ్యాపార మోడల్, ప్రమోటర్ల బ్యాగ్రౌండ్, ఆర్థిక పనితీరు మొదలైనవన్నీ అధ్యయనం చేయాలి. కంపెనీలు ఫండమెంటల్‌గా పటిష్టంగా ఉంటే ఐపీవో దశలో పాక్షికంగా కొంత ఇన్వెస్ట్ చేసి, లిస్టింగ్ తర్వాత రేటు గానీ తగ్గితే మరికాస్త ఇన్వెస్ట్ చేయడమనేది ఒక వ్యూహం. ఇలా చేయడం వల్ల ఎక్కువ రిస్కు తీసుకోకుండా నాణ్యమైన వ్యాపారాల్లో సగటున మంచి వేల్యుయేషన్‌తో ఇన్వెస్ట్ చేసినట్లవుతుంది.

అత్యంత నాణ్యమైన ఐపీవోలు పెద్ద సంఖ్యలో రాబోతుండటంతో భారత్ వృద్ధి గాథలో పాలుపంచుకునేందుకు ఇన్వెస్టర్లకి బోలెడన్ని అవకాశాలు లభించబోతున్నాయి. కొత్త తరం టెక్నాలజీ, రిటైల్, ఈ-కామర్స్, క్విక్ కామర్స్ నుంచి ఇన్‌ఫ్రా, హెల్త్-టెక్, ఫిన్‌టెక్ వరకు వివిధ రంగాలకు చెందిన ఇష్యూలు రాబోతున్నాయి. ఇవన్నీ కూడా విస్తరణ దశలోనో లేక లాభదాయకతను వేగవంతం చేసుకునే దశలోనో ఉంటున్నాయి. కాబట్టి దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు ఇవి ఆసక్తికరంగా ఉండవచ్చు. అయితే, ఐపీవోలను స్పెక్యులేషన్ సందర్భాల్లాగా కాకుండా పూర్తి సమాచారం తెలుసుకుని, హేతుబద్ధంగా ఆలోచించి, ఇన్వెస్ట్ చేయడం కీలకంగా ఉంటుంది.

స్మార్ట్ వ్యూహం..

సంస్థాగత ఇన్వెస్టర్లను అనుసరించడం మరో ప్రాక్టికల్ టిప్. బడా దేశీ, గ్లోబల్ ఇన్వెస్టర్లకు అధునాతన రీసెర్చ్, వేల్యుయేషన్ సాధనాలు అందుబాటులో ఉంటాయి. ఐపీవో ముగియడానికి ముందు ఇలాంటి ఇన్వెస్టర్లు ఎంత మేర సబ్‌స్క్రయిబ్ చేశారనే విషయం బహిరంగంగానే తెలుస్తుంది. ఈ సబ్‌స్క్రిప్షన్ని బట్టి వారు సదరు ఇష్యూపై ఎంత ధీమాగా ఉన్నారనేది తెలుసుకోవచ్చు. యాంకర్ ఇన్వెస్ట్‌మెంట్ కేటగిరీలో పెద్ద సంస్థలు భారీగా ఇన్వెస్ట్ చేస్తే కాస్త భరోసా లభించడానికి ఆస్కారం ఉంటుంది.

బజాజ్ లైఫ్ నుంచి పెన్షన్ ఇండెక్స్ ఫండ్

బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా 'బీఎస్ఈ 500 ఎన్హాన్స్‌డ్ వేల్యూ 50 పెన్షన్ ఇండెక్స్ ఫండ్'ను ప్రవేశపెట్టింది. ఇది నవంబర్ 16 వరకు అందుబాటులో ఉంటుంది. దీర్ఘకాలంలో, వేల్యూ ఇన్వెస్టింగ్ ద్వారా మార్కెట్ ఆధారిత రిటైర్మెంట్ నిధిని సమకూర్చుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. బజాజ్ లైఫ్ స్మార్ట్ పెన్షన్ ప్లాన్ (యులిప్) కింద ఇది అందుబాటులో ఉంటుంది. బీఎస్ఈ 500 నుంచి ఫండమెంటల్‌గా పటిష్టంగా ఉండి, ఆకర్షణీయమైన వేల్యుయేషన్లతో లభించే 50 నాణ్యమైన స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధికి ఇది దోహదపడుతుంది. బుక్-టు-ప్రైస్, ఎర్నింగ్స్ టు ప్రైస్‌లాంటి అంశాల ప్రాతిపదికన ఈ స్టాక్స్‌ను ఎంపిక చేస్తారని బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు రావూరి తెలిపారు.

వ్యవసాయ భూములు.. క్యాపిటల్ గెయిన్స్..

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

భూమి, ప్లాటు, జాగా.. ఇలాంటివి అమ్మితే ఏర్పడే క్యాపిటల్ గెయిన్స్ స్వభావరీత్యా పన్నుకి గురి అవుతాయి. అయితే, గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూములు అమ్మితే ఏర్పడే క్యాపిటల్ గెయిన్స్ మీద ఎలాంటి పన్నుభారం ఏర్పడదు.

గ్రామాల్లో వ్యవసాయ భూమి అంటే ఏమిటి..

ఇన్‌కం చట్టంలో గ్రామీణ వ్యవసాయ భూమి అంటే ఏమిటో వివరించారు. ఇలాంటి పొలాన్ని చట్టం ప్రకారం క్యాపిటల్ అసెట్‌గా పరిగణించరు. అసలు అది క్యాపిటల్ అసెట్ కాదు కాబట్టి, క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పడదు. ఒక మున్సిపాలిటీ, అందులో ఉన్న జనాభా 10,000 కన్నా తక్కువ ఉండి, ఈ రెండు కండీషన్లకు అనుగుణంగా ఉన్న ప్రాంతంలోని పొలాన్ని వ్యవసాయ భూమి అంటారు. అలాగే మున్సిపాలిటీ బైట, జనాభా 10,000 దాటినప్పుడు దూరాన్ని బట్టి పరిగణనలోకి తీసుకుంటారు.

జనాభా సంఖ్య

10,000 దాటి	2 కి.మీ. లోపల
1,00,000 దాటి	2కి.మీ.దాటి 6 కి.మీ. లోపల
10,00,000 దాటి	6కి.మీ.దాటి 8 కి.మీ. లోపల

మున్సిపాలిటీ పొలిమేర హద్దుల నుంచి కొలుస్తారు. జనాభా సంఖ్యను బట్టి, దూరాల లోపల ఉంటేనే గ్రామీణ వ్యవసాయ భూమి కింద లెక్కిస్తారు. ఈ రోజు గ్రామంలో ఉన్న జనాభా సంఖ్య తీసుకోరు. తాజా జనాభా లెక్కల గణన ప్రకారం పరిగణిస్తున్నారు. అంటే ప్రస్తుతానికి చివరగా 2011లో జనాభా లెక్కింపు జరిగినది. 2021లో జరగలేదు. 2027లో జరుగుతుంది. దూరం అంటే నడక దూరం కాదు, వైమానిక దూరం.

వ్యవసాయ భూమి అమ్మితే..

పైన చెప్పిన షరతులకు లోబడి భూమి ఉండి, ఆ భూమి అమ్మితే పన్ను భారం ఉండదు. ఆదాయానికి కూడా పన్ను భారం ఉండదు. అయితే, చాలా మంది వ్యవసాయ భూమి మీద బంగారం పండుతుందని చెప్తారు. ఆస్తిపరులు, రాజకీయ నాయకులు, సినిమా ఇండస్ట్రీ వాళ్లు, పారిశ్రామికవేత్తలు, బడా బడా ఆఫీసర్లు ఉన్నారు. మహానగరాల్లో మసలుతూ, వ్యవసాయం మీద ఆదాయం ఉందని, పొంతన లేని లెక్కలు చూపిస్తుంటారు. వరి వంగడంలో నుంచి ''సిరి'' పండిందని, యాపిల్ చెట్టుకి బంగారం పళ్లు కాశాయని చెప్పిన ఎందరో రాజకీయ నాయకులు, తనిఖీలు చేసినప్పుడు, అడ్డంగా బుక్ అయిపోయారు. పెద్ద పెద్ద సినిమా స్టార్లు, తాము చిత్ర రంగాన్ని ఏలుతున్నా, వ్యవసాయదార్లమని చెప్పుకుంటున్నారు. అలాగే కంపెనీలు కూడా. ఒక ఆర్‌టీఐ జవాబు ప్రకారం 2011లో 6,50,000 మంది వ్యక్తులు డిక్లేర్ చేసిన వ్యవసాయ ఆదాయం సుమారు రూ. 2,000 లక్షల కో ట్లు!! అయితే, ఆదాయ పన్ను శాఖ వారు స్క్రూటినీ చేస్తున్నారు. శాటిలైట్ ద్వారా పరీక్ష చేస్తున్నారు. అసలు పొలం ఉందా లేదా.. ఉంటే ఏం పండుతుంది.. అది ఎలా అమ్ముతారు.. ఎక్కడ అమ్ముతారులాంటి విషయాలు తెలుసుకుంటున్నారు.

సరే, ఈ విషయాన్ని పక్కన పెడితే, వ్యవసాయం మీద పన్నుభారం లేదు. వ్యవసాయ భూములు అమ్మితే పన్నుభారం లేదు. వచ్చిన మొత్తం మీద ఏమాత్రం పన్ను కట్టకుండా వైట్ రంగు వేసుకోవచ్చు. అయితే, ఆ ఇన్వెస్ట్‌మెంట్ మీద వచ్చే ఆదాయం, వడ్డీ, డివిడెండ్ల రాబడి మీద పన్నుభారం ఉంటుంది. ఇక రూ. 50,00,000 దాటినా టీడీఎస్ ఉండదు. అయితే, అర్బన్ ల్యాండ్‌ని క్యాపిటల్ అసెట్‌గా పరిగణిస్తారు. అమ్మగా ఏర్పడ్డ క్యాపిటల్ గెయిన్స్ మీద పన్ను వేస్తారు. రూ. 50,00,000 దాటితే టీడీఎస్ 1 శాతం వర్తిస్తుంది.

అర్బన్ ల్యాండ్ స్వల్పకాలికం అయితే, శ్లాబు ప్రకారం పన్ను విధిస్తారు. దీర్ఘకాలికం అయితే, 20 శాతం విధిస్తారు. అర్బన్ ల్యాండ్ అమ్మి వ్యవసాయ భూమి కొంటే పన్నుండదు. అలాగే కంపల్సరీ అక్విజిషన్, పన్ను విధింపు, మినహాయింపు ఉన్నాయి. అర్బన్ ల్యాండ్ అమ్మగా ఏర్పడ్డ క్యాపిటల్ గెయిన్స్ నుంచి మినహాయింపు పొందాలంటే 54ఎఫ్ ప్రకారం ఇల్లు కొనొచ్చు. 54ఈసీ ప్రకారం గుర్తింపు పొందిన బాండ్లలో రీఇన్వెస్ట్ చేయొచ్చు.

లేని ఆదాయాన్ని చూపించకండి. లేని ఆస్తిని చూపించకండి. దొంగ లెక్కలు చూపించకండి. అన్నదాత ముసుగులో అసలు నిజాన్ని దాచి, దోచి అధికారుల దృష్టిలో పడకండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

పన్ను ఆదాతో రాబడి

డీఎస్‌పీ ఈఎల్ఎస్ఎస్ ట్యాక్స్ సేవర్ ఫండ్

ఫండ్ రివ్యూ

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై పన్ను ప్రయోజనం కోరుకునే వారికి ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ ఫండ్స్ (ఈఎల్ఎస్ఎస్) అనుకూలం. ఇతర ఏ సాధనంతో పోల్చి చూసినా దీర్ఘకాలంలో ఈక్విటీలే అధిక రాబడులను ఇచ్చినట్టు గణాంకాలు చెబుతున్నాయి. దీర్ఘకాలంలో మెరుగైన రాబడులతోపాటు, పన్ను ఆదాకు అవకాశం కల్పిస్తున్న ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్‌ను ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియో కోసం పరిగణనలోకి తీసుకోవచ్చు. ముఖ్యంగా, ఇప్పటికీ పాత పన్ను విధానంలో ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేస్తున్న వారికి ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ ప్రయోజనకరం. సెక్షన్ 80సీ కింద గరిష్ట పరిమితి రూ.1.5 లక్షల మేరకు ఈ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఆ మొత్తంపై పన్ను మినహాయింపు పొందొచ్చు. ఈ విభాగంలో డీఎస్‌పీ ఈఎల్ఎస్ఎస్ ట్యాక్స్ సేవర్ ఫండ్ మంచి పనితీరును ప్రదర్శిస్తోంది.

రాబడులు

ఈ పథకం పనితీరును గమనిస్తే అన్ని కాలాల్లోనూ బలమైన రాబడులను ఇచ్చినట్టు తెలుస్తుంది. ముఖ్యంగా గడిచిన ఏడాది కాలంలో ఈ పథకంలో రాబడి 2.43 శాతంగా ఉంది. ఈ కాలంలో మార్కెట్లో ఎలాంటి రాబడులు లేకుండా ఒక శ్రేణి పరిధిలో చలిస్తుండడాన్ని గమనించొచ్చు. మూడేళ్ల కాలాన్ని పరిశీలిస్తే ఏటా 20 శాతం చొప్పున రాబడి ఈ పథకంలో నమోదైంది. ఐదేళ్లలోనూ ఏటా 23.30 శాతం, ఏడేళ్లలో 19.55 శాతం, పదేళ్ల కాలంలో ఏటా 17.18 శాతం చొప్పున ఈ పథకం ఇన్వెస్టర్లకు ప్రతిఫలాన్ని అందించింది. ఈ పథకం పనితీరుకు బీఎస్ఈ 500 టీఆర్ఐ ప్రామాణికం. బీఎస్ఈ 500 టీఆర్ఐ మూడేళ్ల కాలంలో ఏటా 15.56 శాతం చొప్పునే రాబడినిచ్చింది. అంటే ఈ పథకం కంటే సుమారు 5 శాతం తక్కువే వార్షిక రాబడి ఉన్నట్టు తెలుస్తోంది. అంతేకాదు ఐదేళ్లు, ఏడేళ్లు, పదేళ్లలోనూ 3-4 శాతం మేర అదనపు రాబడిని డీఎస్‌పీ ట్యాక్స్ సేవర్ ఫండ్‌లో గమనించొచ్చు.

పెట్టుబడుల విధానం

రోహిత్ సింఘానియా 2015 జూలై నుంచి ఈ ఫండ్‌కు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈక్విటీ పరిశోధన, పోర్ట్‌ఫోలియో నిర్వహణలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఆయనకు ఉంది. ఈ పథకం నిర్దిష్టమైన పెట్టుబడుల విధానానికి కట్టుబడి ఉండదు. మార్కెట్ పరిస్థితులు, స్థూల ఆర్థిక పరిస్థితులు, వివిధ రంగాల్లో చోటుచేసుకునే పరిణామాలు, మార్పుల ఆధారంగా ఆకర్షణీయమైన పెట్టుబడుల అవకాశాలు గుర్తించి ఇన్వెస్ట్ చేయడాన్ని గమనించొచ్చు. వ్యాపారం, నమూనా, యాజమాన్యం నాణ్యత, ఆర్థిక సామర్థ్యం తదితర

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
ఇన్ఫోసిస్	6.48
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.34
ఐసీఐసీఐ బ్యాంక్	5.51
యాక్సిస్ బ్యాంక్	5.38
కోటక్ బ్యాంక్	3.41
భారతీ ఎయిర్‌టెల్	2.95
ఎంఅండ్ఎం	2.87
ఎల్అండ్‌టీ	2.33
భారత్ పెట్రోలియం	2.25
హిందుస్థాన్ యూనిలీవర్	2.24

అంశాలను ఆర్‌వోసీఈ, ఆర్‌వోఈ, పీఈ, ప్రైస్ టు బుక్ వ్యాల్యూ తదితర ఎన్నో అంశాల ఆధారంగా విశ్లేషించి పెట్టుబడులకు కంపెనీలను ఎంపిక చేసుకుంటుంది.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.16,749 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 97.21 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, మిగిలిన మొత్తాన్ని నగదు రూపంలో కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడులను పరిశీలిస్తే 75 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. 22 శాతం మేర మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయగా, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 3.17 శాతం కేటాయించింది. పోర్ట్‌ఫోలియోలో 59 స్టాక్స్ ఉన్నాయి. పెట్టుబడుల్లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ, 36.88 శాతం కేటాయింపులు చేసింది. ఆ తర్వాత టెక్నాలజీ కంపెనీల్లో 12 శాతం, హెల్త్ కేర్, కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీల్లో 10 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది.

జొకోవిచ్ 101

- కెరీర్‌లో 101వ సింగిల్స్ టైటిల్ నెగ్గిన సెర్బియా దిగ్గజం
- ఏథెన్స్ ఓపెన్ టోర్నీలో విజేతగా నిలిచిన మాజీ నంబర్‌వన్
- హార్డ్ కోర్టులపై 72వ టైటిల్‌తో కొత్త రికార్డు

ఏథెన్స్ (గ్రీస్): ఈ ఏడాది రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకోవడంలో సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ విఫలమైనా... సీజన్‌ను మాత్రం సింగిల్స్ టైటిల్‌తో ముగించాడు. ఏథెన్స్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జొకోవిచ్ చాంపియన్‌గా అవతరించాడు. 2 గంటల 59 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో జొకోవిచ్ 4–6, 6–3, 7–5తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై చిరస్మరణీయ విజయం సాధించాడు. తద్వారా తన కెరీర్‌లో 101వ సింగిల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ముసెట్టిపై జొకోవిచ్‌కిది తొమ్మిదో విజయం కావడం విశేషం. నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ ఆరు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. తొలి సర్వీస్‌లో 61 పాయింట్లకుగాను 43 పాయింట్లు... రెండో సర్వీస్‌లో 36 పాయింట్లకుగాను 21 పాయింట్లు గెలిచాడు. టైటిల్ ఖాయమైన వెంటనే ఈ సెర్బియా స్టార్ తన జెర్సీని చించేసి విజయగర్జన చేశాడు. విజేత జొకోవిచ్‌కు 1,16,690 యూరోల (రూ. 1 కోటీ 19 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఏటీపీ ఫైనల్స్ టోర్నీకి దూరం

వరుసగా రెండో ఏడాది సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌కు జొకోవిచ్ దూరమయ్యాడు. ఏథెన్స్ ఓపెన్ టైటిల్ గెలిచిన తర్వాత జొకోవిచ్ ఈ విషయాన్ని వెల్లడించాడు. 'భుజం గాయంతో బాధపడుతున్నాను. అందుకే ఏటీపీ ఫైనల్స్ టోర్నీ నుంచి వైదొలగాలని నిర్ణయం తీసుకున్నా' అని గతంలో ఏడుసార్లు ఏటీపీ ఫైనల్స్ టైటిల్‌ను గెలిచి జొకోవిచ్ తెలిపాడు. జొకోవిచ్ స్థానంలో లొరెంజో ముసెట్టి ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో ఆడనున్నాడు.

72 హార్డ్ కోర్టులపై జొకోవిచ్ సాధించిన టైటిల్స్. 71 టైటిల్స్‌తో రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ బద్దలు కొట్టాడు.

2 పురుషుల టెన్నిస్ చరిత్రలో సింగిల్స్ టైటిల్ నెగ్గిన రెండో అతిపెద్ద వయస్కుడిగా జొకోవిచ్ (38 ఏళ్ల 5 నెలలు) నిలిచాడు. ఈ రికార్డు కెన్ రోజ్‌వెల్ (ఆస్ట్రేలియా) పేరిట ఉన్న ఉంది. 1977లో కెన్ రోజ్‌వెల్ 43 ఏళ్ల వయసులో హాంకాంగ్ ఓపెన్ టోర్నీలో విజేతగా నిలిచాడు.

రాహుల్ రాదేశ్ సెంచరీ

హైదరాబాద్ 364

ఆలౌట్‌రాజస్తాన్ 221/5

సాక్షి, హైదరాబాద్: మిడిలార్డర్ బ్యాటర్ రాహుల్ రాదేశ్ (202 బంతుల్లో 129; 16 ఫోర్లు) సెంచరీతో కదంతొక్కడంతో హైదరాబాద్ 300 పైచిలుకు స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 295/7తో రెండో రోజు ఆదివారం ఆట కొనసాగించిన హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 104.1 ఓవర్లలో 364 పరుగుల వద్ద ఆలౌటైంది. ఆట మొదలైన వెంటనే తనయ్ త్యాగరాజన్ (6) అవుట్ కావడంతో హైదరాబాద్ ఎనిమిదో వికెట్ కోల్పోయింది. ఈ దశలో ఓవర్‌నైట్ బ్యాటర్ రాహుల్... తొమ్మిదో వరుసలో బ్యాటింగ్‌కు దిగిన అనికేత్ రెడ్డి (42 బంతుల్లో 22; 3 ఫోర్లు) అండతో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరి భాగస్వామ్యం బలపడటంతో తొమ్మిదో వికెట్‌కు 64 పరుగులు జతయ్యాయి. జట్టు స్కోరు కూడా 350 పైచిలుకు చేరింది. టెయిలెండర్లతో కలిసి జట్టు స్కోరును పెంచుతున్న రాదేశ్‌ను రాహుల్ చహర్ ఎల్బీగా అవుట్ చేశాడు. మళ్లీ రాహులే తన తర్వాతి ఓవర్లో అనికేత్‌ను కూడా అవుట్ చేయడంతో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌కు తెరపడింది. రాజస్తాన్ బౌలర్లలో రాహుల్ చహర్, అశోక్ శర్మలకు చెరో 3 వికెట్లు దక్కాయి. అనికేత్ చౌదరి 2 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన రాజస్తాన్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 72 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. ఓపెనర్లు సచిన్ యాదవ్ (43; 4 ఫోర్లు, 1 సిక్స్), సల్మాన్ ఖాన్ (37; 1 ఫోర్) చక్కని ఆరంభమే ఇచ్చినప్పటికీ... కెప్టెన్ మహిపాల్ లామ్రోర్ (13) సహా మిడిలార్డర్‌లో దీపక్ హుడా, కార్తీక్ శర్మ (0)లను హైదరాబాద్ బౌలర్లు తేలిగ్గానే పెవిలియన్ పంపారు. కునాల్ సింగ్ (64 బ్యాటింగ్; 7 ఫోర్లు, 1 సిక్స్), అజయ్ సింగ్ (42 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించడంతో రాజస్తాన్ కోలుకుంది. తనయ్, అనికేత్ రెడ్డి చెరో 2 వికెట్లు తీశారు.

సోధి

మెరిసిన సోధి, డఫీ

మూడో టి20లో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ విజయం

నెల్సన్: వెస్టిండీస్‌తో జరిగిన మూడో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 9 పరుగుల తేడాతో గెలుపొందింది. బ్యాటింగ్‌లో డెవాన్ కాన్వే (34 బంతుల్లో 56; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), బౌలింగ్‌లో ఇష్ సోధి (3/34), జాకబ్ డఫీ (3/36) రాణించారు. తాజా విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో కివీస్ 2–1తో పైచేయి సాధించింది. టాస్ నెగ్గిన న్యూజిలాండ్ ముందుగా బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 177 పరుగులు చేసింది. ఓపెనర్ కాన్వే అర్ధసెంచరీ సాధించగా, డారిల్ మిచెల్ (24 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచేశాడు. రాబిన్సన్ (23), రచిన్ రవీంద్ర (26; 4 ఫోర్లు) వేగంగా ఆడే క్రమంలో అవుటయ్యారు. కరీబియన్ బౌలర్లలో హోల్డర్, మాథ్యూ ఫోర్డ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన వెస్టిండీస్ 19.5 ఓవర్లలో 168 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనింగ్‌లో అతానెజ్ (31; 5 ఫోర్లు, 1 సిక్స్), లోయర్ ఆర్డర్‌లో రొమారియో షెఫర్డ్ (34 బంతుల్లో 49; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), టెయిలెండర్లలో షమర్ స్ప్రింజర్ (20 బంతుల్లో 39; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మాత్రమే కాసేపు మెరిపించారు. మిగతా బ్యాటర్లను కివీస్ బౌలర్లు సోధి, జాకబ్ డఫీ (3/36) దెబ్బతీశారు. ఇరు జట్ల మధ్య నేడు నాలుగో టి20 జరుగుతుంది.

వెల్‌డన్ రిబాకినా

- డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీ టైటిల్ హస్తగతం
- ఈ ఘనత సాధించిన తొలి ఆసియా క్రీడాకారిణిగా ఘనత
- ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకాపై విజయం
- రూ. 46 కోట్ల 40 లక్షల ప్రైజ్‌మనీ సొంతం

రియాద్ (సౌదీ అరేబియా): ఆద్యంతం నిలకడగా రాణించిన కజకిస్తాన్ టెన్నిస్ స్టార్ ఎలీనా రిబాకినా కెరీర్‌లో తొలిసారి సీజన్ ముగింపు టోర్నీలో చాంపియన్‌గా నిలిచింది. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) ఫైనల్స్ టోర్నీలో ప్రపంచ ఆరో ర్యాంకర్ రిబాకినాకు టైటిల్ దక్కింది. ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్)తో జరిగిన ఫైనల్లో రిబాకినా 6–3, 7–6 (7/0)తో గెలుపొందింది. 'ఈ వారం ఎంతో గొప్పగా గడిచింది. టైటిల్ సాధిస్తానని అనుకోలేదు. అంతిమ ఫలితం ఎంతో ఆనందాన్నిస్తోంది' అని ఈ మెగా టోర్నీలో ఫైనల్ చేరిన తొలిసారే టైటిల్ నెగ్గిన రిబాకినా వ్యాఖ్యానించింది. టోర్నీ మొత్తంలో అజేయంగా నిలిచిన రిబాకినాకు 52 లక్షల 35 వేల డాలర్ల (రూ. 46 కోట్ల 40 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది. మహిళల క్రీడా చరిత్రలో ఒక ప్లేయర్‌కు దక్కిన అత్యధిక ప్రైజ్‌మనీ ఇదేనని డబ్ల్యూటీఏ తెలిపింది. రన్నరప్‌గా నిలిచిన సబలెంకా ఖాతాలో 27 లక్షల డాలర్లు (రూ. 23 కోట్ల 93 లక్షలు) చేరాయి. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో రన్నరప్‌గా నిలవడం సబలెంకాకిది రెండోసారి. 2022 డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీ తుది పోరులో కరోలినా గార్సియా (ఫ్రాన్స్) చేతిలో సబలెంకా ఓడిపోయింది. ఈసారి డబ్ల్యూటీఏ ఫైనల్స్ ఓడిపోయినప్పటికీ సబలెంకా వరుసగా రెండోసారి సీజన్‌ను నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించనుంది. ఈ ఏడాది సబలెంకా యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో కలిపి మొత్తం నాలుగు టైటిల్స్ సాధించింది. ఫ్రెంచ్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచింది. 2022 వింబుల్డన్ టోర్నీ విజేత అయిన రిబాకినా ఈ సీజన్‌ను ఐదో ర్యాంక్‌తో ముగించనుంది. ఈ సంవత్సరం రిబాకినా 58 మ్యాచ్‌ల్లో గెలిచి, 19 మ్యాచ్‌ల్లో ఓడి మూడు టైటిల్స్‌ను సాధించింది.

సబలెంకా

పారస్ డోగ్రా 33వ సెంచరీ

- జమ్మూ కశ్మీర్ 310 ఆలౌట్
- ఢిల్లీపై 99 పరుగుల ఆధిక్యం
- రంజీ ట్రోఫీ రౌండప్

న్యూఢిల్లీ: ఢిల్లీ గడ్డపై తొలిరోజు ఆటలో ఆతిథ్య జట్టు బ్యాటర్ల పనిపట్టిన జమ్మూ కశ్మీర్ రెండో రోజు బ్యాటింగ్‌లోనూ సత్తా చాటింది. దీంతో రంజీ ట్రోఫీ గ్రూప్ 'డి'లో ఇక్కడ జరుగుతున్న మ్యాచ్‌లో కశ్మీర్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 99 పరుగుల ఆధిక్యం సంపాదించింది. రెండో రోజు తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన జమ్మూ కశ్మీర్ 91.2 ఓవర్లలో 310 పరుగుల వద్ద ఆలౌటైంది. టాప్–4 బ్యాటర్లు ఇక్బాల్ (14), శుభం (4), విబ్రాంత్ శర్మ (14), సునీల్ (1) వరుసగా విఫలమవడంతో జట్టు ఆరంభంలో తడబడింది. దీంతో 46 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయిన జమ్మూ కశ్మీర్‌ను కెప్టెన్ పారస్ డోగ్రా (106; 11 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నాడు. రంజీ ట్రోఫీలో పారస్ డోగ్రా 33వ సెంచరీ సాధించి జమ్మూ కశ్మీర్‌కు కీలకమైన ఆధిక్యాన్ని అందించాడు. సహచరుల్లో అబ్దుల్ సమద్ (85; 12 ఫోర్లు, 1 సిక్స్), కన్హయ్య (47; 4 ఫోర్లు) రాణించారు. ఢిల్లీ బౌలర్ సిమర్‌జీత్ సింగ్‌కు 6 వికెట్లు దక్కాయి. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆడిన ఢిల్లీ ఆట ముగిసే సమయానికి 2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 7 పరుగులు చేసింది. అర్పిత్ (2 బ్యాటింగ్), సనత్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

త్రిపుర 602/7 డిక్లేర్డ్

అగర్తలా: గ్రూప్ 'సి'లో అస్సాంతో జరుగుతున్న మ్యాచ్‌లో త్రిపుర తొలి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు చేసింది. 316/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఆదివారం ఆట ప్రారంభించిన త్రిపుర 602/7 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. సెంచరీ హీరో హనుమ విహారి (156; 18 ఫోర్లు, 2 సిక్స్‌లు) తన క్రితం రోజు స్కోరుకు కేవలం 13 పరుగులు చేసి నిష్క్రమించగా, విజయ్ శంకర్ (150 నాటౌట్; 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) శతక్కొట్టాడు. రాణా దత్త (51; 8 ఫోర్లు), మురాసింగ్ (51; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆడిన అస్సాం 4 వికెట్లకు 67 పరుగులు చేసింది. అభిజిత్ సర్కార్ 2 వికెట్లు తీశాడు.

పారస్ డోగ్రా

షేక్ రషీద్ 87 నాటౌట్

- ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులకు ఆలౌట్
- 107 పరుగుల ఆధిక్యంలో తమిళనాడు

షేక్ రషీద్

సాక్షి, విశాఖపట్నం: తొలి రోజు తమిళనాడును తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసిన ఆంధ్ర జట్టు రెండో రోజు బ్యాటింగ్‌లో తడబడింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని నెలకొల్పాల్సిన చోట అనూహ్యంగా వెనుకబడింది. రంజీ ట్రోఫీ గ్రూప్ 'ఎ'లో తమిళనాడుతో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 20/1తో ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 49 ఓవర్లలో 177 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా తమిళనాడుకు 5 పరుగుల అతి స్వల్ప ఆధిక్యం లభించింది. ఆట మొదటి బంతికే అభిషేక్ (3)ను అవుట్ చేసిన సందీప్ వారియర్ ఆ తర్వాత కూడా ఆంధ్రను వణికించాడు. స్వల్ప వ్యవధిలో మరో ఓవర్‌నైట్ బ్యాటర్ త్రిపురణ విజయ్ (3)ని త్రిలోక్ నాగ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. అలా జట్టు స్కోరు 30 పరుగులకు ముందే టాపార్డర్ వికెట్లను కోల్పోయింది. సందీప్ వారియర్ ధాటికి కెప్టెన్ రికీ భుయ్ (4), సోను యాదవ్ పేస్‌కు కరణ్ షిండే (9) నిలువలేకపోయారు. ఇలాంటి తరుణంలో 63 పరుగులకే సగం (5) వికెట్లను కోల్పోయిన ఆంధ్రను షేక్ రషీద్ (150 బంతుల్లో 87 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒంటరి పోరాటంతో ఆదుకున్నాడు. కానీ అవతలి వైపు అశ్విన్ (13), రాజు (1), పృథ్వీరాజ్ (0), సాయితేజ (2)ల నుంచి సహకారం లభించలేదు. ఒక్క సౌరభ్ కుమార్ (30; 3 ఫోర్లు) అండతోనే రషీద్ ఆమాత్రం స్కోరును చేసిపెట్టాడు. సందీప్ 4, త్రిలోక్ నాగ్, సోను యాదవ్, సాయికిషోర్ తలా 2 వికెట్లు తీశారు. తర్వాత రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన తమిళనాడు ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. ఓపెనర్లు విమల్ (20), జగదీశన్ (0)లను ఆంధ్రబౌలర్లు కట్టడి చేయగా... బాల సుబ్రహ్మణ్యం సచిన్ (51; 8 ఫోర్లు) రాణించాడు. ప్రదోశ్ రంజన్ (26 బ్యాటింగ్; 3 ఫోర్లు), సాయికిషోర్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. పృథ్వీరాజ్, రాజు చెరో వికెట్ తీశారు. ప్రస్తుతం తమిళనాడు 107 పరుగుల ఆధిక్యంలో ఉంది.

భారత చెస్ జట్టు హెచ్‌ఓడీగా కేఎస్ ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: కామన్వెల్త్ చెస్ చాంపియన్‌షిప్‌లో పోటీపడుతున్న భారత జట్టుకు హెడ్ ఆఫ్ ద డెలిగేషన్ (హెచ్‌ఓడీ)గా హైదరాబాద్ జిల్లా చెస్ సంఘం (హెచ్‌డీసీఏ) అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ నియమితులయ్యారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో ఆదివారం మొదలైన ఈ చాంపియన్‌షిప్ ఈనెల 17వ తేదీ వరకు జరుగుతుంది. బాలబాలికల అండర్–8, అండర్–10, అండర్–12, అండర్–14, అండర్–16, అండర్–18, అండర్–20 వయో విభాగాలతోపాటు ఓపెన్, మహిళల కేటగిరీల్లో గేమ్‌లను నిర్వహిస్తారు. ఓపెన్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ లలిత్‌బాబు, అండర్–20 ఓపెన్ విభాగంలో తెలంగాణ ప్లేయర్ ఆదిరెడ్డి అర్జున్, అండర్–18 ఓపెన్ విభాగంలో తెలంగాణ ప్లేయర్ శ్రీరామ్ ఆదర్శ్, అండర్–14 బాలికల విభాగంలో హైదరాబాద్ అమ్మాయి శరణ్య దేవి, అండర్–10 ఓపెన్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ నిధీశ్ శ్యామల్ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

మహారాష్ట్రలోని సాంగ్లీలో ఆదివారం జరిగిన పందేల్లో దౌడు తీస్తున్న ఎడ్ల బండ్లు

భారత వైమానిక దళం 93వ వార్షికోత్సవం సందర్భంగా అసోంలోని గౌహతిలో అపాచీ హెలికాప్టర్ల అద్భుత విన్యాసాలు

ఫిలిప్పీన్స్‌ను సూపర్ తుపాను ఫుంగ్-వాంగ్ వణికిస్తోంది. ఆదివారం కడాండువాన్స్ ప్రావిన్స్‌లోని పండన్ తీరంలో పోటెత్తిన వరద

ఆర్‌ఎస్‌ఎస్ అనేది వ్యక్తుల సంఘం

- నమోదుకాని మా సంస్థను గతంలో ఎలా మూడు సార్లు నిషేధించారు
- విపక్షాల విమర్శలకు భాగవత్ దీటైన జవాబు

బెంగళూరు: నమోదుకాకుండానే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో కార్యకలాపాలు కొనసాగిస్తోందంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ దీటైన జవాబిచ్చారు. ఆదివారం బెంగళూరులో ఆర్‌ఎస్‌ఎస్ అంతర్గతంగా నిర్వహించిన ప్రశ్నావళి కార్యక్రమంలో భాగవత్ పలు ప్రశ్నలకు ఘాటుగా సమాధానమిచ్చారు. ''ఆర్‌ఎస్‌ఎస్‌ను 1925లో స్థాపించాం. ఆనాడు భారతీయ ప్రభుత్వం లేదు. బ్రిటిషర్ల అరాచక పాలన కొనసాగుతోంది. వాళ్ల వద్దకు వెళ్లి మా సంస్థను నమోదుచేయండి అని బతిమాలాలా?. స్వాతంత్ర్యంవచ్చాక సంస్థలను తప్పనిసరిగా నమోదుచేయాలనే నిబంధనను భారత ప్రభుత్వం అమలుచేయలేదు. దీంతో మేం వ్యక్తుల సంఘంగా కొనసాగాం. అలాగే ప్రజల సమ్మతితో సంస్థగా సేవలందిస్తున్నాం. ఆర్‌ఎస్‌ఎస్ అనేది వ్యక్తుల సంస్థ అని ఇది ఆదాయ పన్ను కట్టాల్సిన పనిలేదంటూ మినహాయింపునిస్తూ గతంలోనే ఆదాయ పన్ను శాఖ, కోర్టులుసైతం పేర్కొన్నాయి. నమోదుకాని మా సంస్థపై గతంలో మూడు సార్లు నిషేధం విధించారు. అంటే మమ్మల్ని ప్రభుత్వం నమోదిత సంస్థగా గుర్తించినట్లే లెక్క. ఒకవేళ గుర్తించకపోయి ఉంటే నిషేధం విధించడం ఎలా సాధ్యం?''అని ఆయన ఎదురు ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రాంగణాల్లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యాక్రమాలు, కవాతులను అడ్డుకోవాలని, నిషేధం విధించాలని కర్ణాటక ప్రభుత్వానికి కాంగ్రెస్ మంత్రి ప్రియాంక్ ఖర్గే లేఖ రాసిన నేపథ్యంలో భాగవత్ ఈ మేరకు స్పందించారు.

మేం ఎవరికీ మద్దతివ్వబోం

''దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ అనేది ఏ రాజకీయ పార్టీకి మద్దతు పలకబోదు. మేం కేవలం



విధానాలకు మాత్రమే మద్దతు పలుకుతాం. సరైన ప్రజా విధానాలకు మాత్రమే మేం జైకొడతా. మేం ఏ వ్యక్తి, సంఘం, రాజకీయ పార్టీకి కొమ్ముకాయబోం. అయోధ్యలో రామ మందిరం అంశంలోనూ సంఘ్ కార్యకర్తలు ఏ పార్టీకి మద్దతు పలకలేదు. కేవలం ఆలయ నిర్మాణానికి మాత్రమే సంపూర్ణ మద్దతు పలికారు. అక్కడ బీజేపీ కావొచ్చు కాంగ్రెస్ కావొచ్చు. మరేదైనా పార్టీ ఆలయ నిర్మాణానికి మద్దతిస్తే వాళ్లకే మా మద్దతు ఉంటుంది. మాకు ప్రత్యేకంగా బీజేపీ అంటే మమకారం ఏమీ లేదు. కేవలం ఒక్క పార్టీ కాదు భారతదేశంలోని పార్టీలన్నీ మా పార్టీలే''అని భాగవత్ వ్యాఖ్యానించారు.

దేశంలో కులం లేదు.. గందరగోళమే ఉంది

''దేశంలో కుల వ్యవస్థ లేదు. ఈ అంశంలో ప్రజల్లో కాస్తంత గందరగోళం ఉంది. ఎన్నికల కోసమే రాజకీయ పార్టీలు కులం కార్డ్‌ను పట్టుకొస్తున్నాయి. కులంను నిర్మూలించాల్సిన అవసరం లేదు. కులం అనే భావనను మర్చిపోతే సరిపోతుంది. ఇది చాలా సులభం. వ్యక్తిగతం దేశంలోని ప్రతి ఒక్కరూ కులం అనే భావనను పూర్తిగా తమ ఆలోచనల నుంచి తొలగిస్తే చాలు''అని భాగవత్ వ్యాఖ్యానించారు.

'హద్దు'మీరితే ఓటమి తప్పదు

''మనతో పాకిస్తాన్ ఏనాటికీ శాంతిని కోరుకోదు. అది కూడా మనశ్శాంతిగా ఉండదు. ఎప్పుడూ భారత్‌కు హాని తలపెట్టాలని తలపోస్తూ తలనొప్పులు తెచ్చుకుంటుంది. సరిహద్దు కట్టుబాట్లను అతిక్రమించాలని చూస్తుంది. తర్వాత భంగపాటుకు గురవుతుంది. 1971 యుద్ధం ఇందుకు నిదర్శనం. భారత్‌ను ఇబ్బంది పెట్టాలని చూసి పాకిస్తాన్ తన తూర్పు భూభాగాన్ని కోల్పోయింది. అది చివరకు బంగ్లాదేశ్‌లా అవతరించింది. యుద్ధం చేయడం కంటే సహకారం అందించడం ముఖ్యం. అది వాళ్లకు చేతకాకపోతే వాళ్లకు అర్థమయ్యే భాషలోనే చెప్పాల్సి ఉంటుంది'' అని అన్నారు.

లవ్ జిహాద్‌కు అంత సీన్ లేదు

''లవ్ జిహాద్ గురించి జనం మరీ అంతలా ఆలోచించాల్సిన సీరియస్ అంశం కాదు. లవ్ జిహాద్‌కు ప్రాధాన్యత ఇచ్చేవాళ్లు ఇస్తే ఇవ్వనివ్వండి. అలాంటి దానిని తుద ముట్టించాలంటే మనం మన ఇళ్లలో హిందూ సంస్కారానికి పట్టం కట్టాలి'' అని భాగవత్ పిలుపునిచ్చారు.

నిజ్జర్ హత్యలో భారతీయ కోణాన్ని బయటపెట్టిన బ్రిటన్!

కొందరు వ్యక్తుల ఫోన్‌కాల్స్‌లో చొరబడి కెనడాకు డేటా అందజేత

లండన్: కెనడాలో సిక్కు వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత్‌పై కెనడా అభాండాలు వేయడం వెనుక బ్రిటన్ హస్తముందని తాజాగా తేలింది. బ్లూమ్‌బర్గ్ వార్తాసంస్థ తాజా వీడియో డాక్యుమెంటరీలో 'పశ్చిమదేశాలతో భారత సత్సంబంధాలను దెబ్బతీసిన మరణాలు'పేరిట నివేదిక విడుదలచేసింది. కెనడాలో భారతీయ సంస్థల కోసం పనిచేస్తున్న వ్యక్తుల ఫోన్‌కాల్, ఇతర కమ్యూనికేషన్స్‌లపై బ్రిటన్ నిఘా సంస్థ నిఘా పెట్టి నిజ్జర్ హత్యోదంతంపై వివరాలు సేకరించి కెనడాకి అప్పగించిందని ఈ డాక్యుమెంటరీ సారాంశం.

అసలేం జరిగింది?

2023 జూన్‌లో సర్రే నగరంలో కొందరు దుండగులు నిజ్జర్‌ను గన్‌తో కాల్చి చంపారు. అయితే నిజ్జర్ హత్యకు అంతకు ముందే కొందరు వ్యక్తులు పథక రచన చేసిన విషయాన్ని జీసీహెచ్‌క్యూ గుర్తించింది. కాల్ డేటా, కమ్యూనికేషన్ వివరాలను సేకరించి వాటిని స్వయంగా బ్రిటన్ నిఘా అధికారులు కెనడాకు వచ్చి ఉన్నతాధికారులకు అందజేశారు. నిజ్జర్ హత్య తర్వాత దర్యాప్తు మొదలెట్టిన కెనడా అధికారులకు సైతం దర్యాప్తుకు అనువుగా ఇతర ఆధారాలను అందజేశారు. ఈ కారణంగానే రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్(రా) వంటి భారతీయ నిఘా బృందాలు నిజ్జర్‌ను చంపేశాయని నాటి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సంచలన ఆరోపణలు చేశారు. నిజ్జర్, ఖండా(అవతార్ సింగ్), గురు పత్వంత్ సింగ్ పన్నూలను అంతమొందించాలని భారతీయ సంస్థల కోసం పనిచేసే వ్యక్తులు కుట్ర పన్నారు. వీరిలో నిజ్జర్‌ను మాత్రం ప్రణాళిక ప్రకారం చంపేశారు. అయితే 2023 జూన్‌లో ఖండా ఇంగ్లాండ్‌లో అనారోగ్యంతో కన్నుమూశాడు.

నేడు వైట్ హౌస్‌కు అల్ ఖైదా మాజీ నేత

వాషింగ్టన్: రెండు దశాబ్దాల క్రితం అమెరికా దళాలకు వ్యతిరేకంగా పోరాడిన అల్ ఖైదా మిలిటెంట్ అహ్మద్ అల్-షరా వైట్‌హౌస్‌లో సోమవారం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమవబోతున్నారు. 1946లో స్వాతంత్ర్యం పొందాక ఆధునిక సిరియా అధ్యక్షుడొకరు వాషింగ్టన్ రావడం ఇదే మొదటిసారి. ఈ కీలక భేటీ కోసం ఆయన శనివారమే అమెరికా చేరుకున్నారు. సిరియాపై ఉన్న ఆంక్షల పూర్తిగా తొలగింపు, ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న అమెరికా నాయకత్వంలోని అంతర్జాతీయ కూటమిలో అధికారికంగా చేరడం ఈ పర్యటన ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.

తిరుగుబాటు నేత నుంచి అధ్యక్షుడి దాకా

అల్ షరా నాయకత్వంలోని తిరుగుబాటు దళాలు గత డిసెంబర్‌లో బషర్ అసద్‌ను గద్దెదించాయి. అంతకు మునుపు, అల్ ఖైదా నేతగా ఉన్న అల్ షరా సిరియాలోని అమెరికా బలగాలతో తలపడ్డారు. ఆయన్ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించింది. ఆయన తలపై రివార్డును కూడా ఉంది. కొంతకాలం అమెరికా బలగాల నిర్బంధంలోనూ ఆయన ఉన్నారు. ఇంతలోనే చకచకా అనూహ్య పరిణామాలు సంభవించాయి. అల్ ఖైదాతో సంబంధాలు తెంచుకున్న అల్ షరా, తాజాగా అంతర్యుద్ధం కారణంగా సిరియాను దూరం పెట్టిన ప్రపంచ దేశాలతో సంబంధాలను తిరిగి నెలకొల్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో, మేలో సౌదీ అరేబియాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. దీని తర్వాతే ట్రంప్ దశాబ్దాలుగా సిరియాపై కొనసాగుతున్న ఆంక్షలను ఎత్తివేస్తామని ప్రకటించారు. సోమవారం వాషింగ్టన్‌లో ఆయన ట్రంప్‌తో మళ్లీ భేటీ కానున్నారు. ట్రంప్‌తో జరిగే చర్చల్లో అల్-షరా ప్రధానంగా సీజర్ చట్టం రద్దు కోసం ఒత్తిడి చేయనున్నారు. గత అసద్ ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతోందంటూ అమెరికా ఈ చట్టం కింద తీవ్ర ఆంక్షలను విధించింది.

వీరోచిత పోరాటం విషాదాంతం

రష్యాలోని డాగేస్తాన్ రిపబ్లిక్‌లో, కాస్పియన్ సముద్రం వెంబడి ఉన్న అచి-సు గ్రామం సమీపంలో నవంబర్ 7న జరిగిన కేఏ-226 హెలికాప్టర్ ప్రమాద వీడియో సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది. .

కదిలించిన పైలట్ తపన

దెబ్బతిన్న విమానాన్ని నియంత్రించడానికి ఒక పైలట్ ఎంత ధైర్యంగా, నిస్సత్తువగా పోరాడాడో ఈ ఫుటేజ్ కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది. హెలికాప్టర్ తోక భాగం స్పష్టంగా విరిగిపోయి ఉండటం వీడియోలో కనిపిస్తుంది. ఇంతటి తీవ్ర నష్టం తర్వాత ఏ విమానం కూడా గాలిలో ఉండలేదు.

నియంత్రణకు విఫలయత్నం

దెబ్బతిన్న విమానాన్ని నిస్సార జలాల మీదుగా పైకి లేపడానికి పైలట్ ప్రయత్నించాడు. ఒక్కసారి కిందికి దిగి, మళ్లీ పైకి లాగి సముద్రం మీదుగా కొద్ది దూరం ఎగరడం వీడియోలో కనిపించింది. కొద్దిసేపు హెలికాప్టర్ గాలిలో ఉన్నప్పటికీ, అది అదుపు తప్పబోతోందని, పైలట్ నియంత్రణ కోసం ప్రాణాలొడ్డి పోరాడుతున్నాడని తెలుస్తోంది.

విషాదంగా ముగిసి..

చివరికి, అత్యవసరంగా భూమిపై ల్యాండ్ చేయడానికి ప్రయత్నిస్తూ విమానం ఒడ్డు వైపు మళ్లింది. కానీ సురక్షిత ప్రాంతానికి చేరుకోకముందే, హెలికాప్టర్ నియంత్రణ కోల్పోయి గిరగిరా తిరుగుతూ భీకర శబ్దంతో నేలను ఢీకొట్టి చీలిపోయింది. ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

విషాదం వెనుక..

మరణించిన ఐదుగురిలో నలుగురు కీలకమైన రష్యన్ రక్షణ తయారీ సంస్థ కిజ్ల్యార్ ఎలక్ట్రోమెకానికల్ ప్లాంట్ ఉద్యోగులు కావడం ఈ కథనంలో మరో కీలక మలుపు. మృతుల్లో సంస్థ డిప్యూటీ జనరల్ డైరెక్టర్ (నిర్మాణ, రవాణా విభాగం), హెలికాప్టర్ ఫ్లైట్ మెకానిక్ కూడా ఉన్నారు. కేఈఎంజెడ్ అనేది రష్యా సైన్యం కోసం ఏవియేషన్ వ్యవస్థలను తయారు చేసే సంస్థ. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధానికి ఈ సంస్థ మద్దతు ఇస్తున్న కారణంగా ఇది ప్రస్తుతం అమెరికా ఆంక్షల పరిధిలో ఉంది. ప్రాణాలను కాపాడేందుకు పైలట్ చేసిన వీరోచిత పోరాటం, రష్యా రక్షణ సంస్థ కీలక ఉద్యోగుల మరణం, ఇంకోవైపు ఉక్రెయిన్-రష్యా యుద్ధ నేపథ్యం.. వీటన్నిటినీ విశ్లేషిస్తే.. ఈ విమాన ప్రమాదం కేవలం యాంత్రిక వైఫల్యం కాదా? అనే సందేహాలను రేపుతోంది.

– మాస్కో

పట్నాలో తేజస్వికి కానుకలతో అభిమానులు

గెలిస్తే 'రిటర్న్ గిఫ్ట్' ఇస్తా

బర్త్‌డే శుభాకాంక్షలపై తేజస్వీ యాదవ్

పట్నా: బిహార్‌లో ఇండియా కూటమి సీఎం అభ్యర్థి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆదివారం తన 36వ పుట్టిన రోజు జరుపుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి రోజున ప్రచారంలో పాల్గొన్న ఆయనకు అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రొహతాస్ జిల్లా కరాకట్‌లో అభిమానుల సమక్షంలో కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ 14వ తేదీన ఓట్ల లెక్కింపు అనంతరం అధికారంలోకి వచ్చిన వెంటనే రిటర్ను గిఫ్ట్ అందజేస్తానంటూ ఆయన హామీ ఇచ్చారు.

ఘరానా గ్యాంగ్‌స్టర్లు అమెరికాలో అరెస్ట్

- భారత భద్రతా సంస్థల కీలక విజయం
- పట్టుబడిన వెంకటేశ్ గార్గ్, భాను రాణా
- త్వరలో భారత్‌కు నిందితుల అప్పగింత

న్యూఢిల్లీ: విదేశాల నుండి కార్యకలాపాలను నిర్వహిస్తున్న.. మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్లు ఇద్దరిని అరెస్ట్ చేయడంలో భారత భద్రతా సంస్థలు కీలక విజయాన్ని సాధించాయి. హరియాణా పోలీసులతో సహా భద్రతా ఏజెన్సీల అధికారులు అమెరికాలోని జార్జియాలో వెంకటేశ్ గార్గ్‌ను అరెస్ట్ చేయగా, భాను రాణాను కూడా అమెరికాలోనే అదుపులోకి తీసుకున్నారు. రాణాకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్నాయి. గార్గ్, రాణా ఇద్దరినీ త్వరలో భారత్‌కు అప్పగిస్తారు. ప్రస్తుతం భారతదేశానికి చెందిన రెండు డజన్లకు పైగా ప్రధాన గ్యాంగ్‌స్టర్లు విదేశాల్లో ఉంటున్నారు. వీరు కొత్తవారిని నియమించుకుంటూ.. నేర సిండికేట్‌లను నడుపుతున్నారు.

బీఎస్పీ నేత హత్య కేసులో గార్గ్ ప్రమేయం

గార్గ్, రాణాల అరెస్ట్ ఆపరేషన్‌తో.. ఈ ఇద్దరు గ్యాంగ్‌స్టర్ల నేర ప్రణాళికలకు సంబంధించిన కీలక సమాచారం వెల్లడైంది. గార్గ్ హరియాణాలోని నారాయణగఢ్ నివాసి. ప్రస్తుతం జార్జియాలో ఉంటున్న గార్గ్‌పై భారతదేశంలో 10కి పైగా క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. గురుగ్రామ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ నాయకుడి హత్యలో పాల్గొన్న తర్వాత జార్జియాకు పారిపోయాడు. ప్రస్తుతం విదేశాలలో నివసిస్తున్న గ్యాంగ్‌స్టర్ కపిల్ సాంగ్వాన్‌తో కలిసి గార్గ్ ఒక దోపిడీ సిండికేట్‌ను నడుపుతున్నాడు.

బిష్ణోయ్ గ్యాంగ్‌తో భాను రాణాకు లింకులు

బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్న భాను రాణా కొంతకాలంగా అమెరికాలో నివసిస్తున్నాడు. కర్నాల్ నివాసి అయిన రాణా.. చాలా కాలంగా నేర ప్రపంచంలో చురుగ్గా ఉన్నాడు. అతనిపై అనేక కేసులు నమోదయ్యాయి. రాణా నేర నెట్‌వర్క్ హరియాణా, పంజాబ్, ఢిల్లీ వరకు విస్తరించి ఉంది. పంజాబ్‌లో జరిగిన గ్రెనేడ్ దాడి కేసు దర్యాప్తు సమయంలో ఇతని పేరు తెరపైకి వచ్చింది. గత జూన్‌లో, కర్నాల్‌లోని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసింది. వారి వద్ద హ్యాండ్ గ్రెనేడ్‌లు, పిస్టళ్లు, మందుగుండు సామగ్రి లభించాయి.

బిహార్‌కు ప్రత్యేక బలగాలు

- గుజరాత్, యూపీ సహా 14 రాష్ట్రాల నుంచి రాక
- రాష్ట్రంలో 1,650 కంపెనీల సీఏపీఎఫ్ బలగాల మోహరింపు
- రెండో దశ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నెల 11న జరిగే రెండో దశ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 122 అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. తొలి దశలో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగానే ముగిసింది. రెండో దశ ఎన్నికల నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇందుకోసం ఇప్పటికే బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి ప్రత్యేక బలగాలను రప్పించినట్లు తెలిసింది. గుజరాత్, ఉత్తరప్రదేశ్ సహా మొత్తం 14 ఎన్డీయే పాలిత రాష్ట్రాల నుంచి కేంద్ర సాయుధ పోలీసు దళాన్ని(సీఏపీఎఫ్) రప్పించారు. పోలింగ్ రోజున బూత్‌ల వద్ద మూడు అంచెల భద్రత ఉంటుంది. ఆధునిక ఆయుధాలతో కూడిన సీఏపీఎఫ్ సిబ్బంది ముందు వరుసలో విధులు నిర్వహిస్తారు.

డేగ కళ్లతో పకడ్బందీ నిఘా

బిహార్‌లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు ఇందులో భాగంగా మొత్తం 1,650 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలను మోహరించారు. ఇందులో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ నుంచి 1,332 కంపెనీలు ఉన్నాయి. మిగిలిన 273 కంపెనీలు 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సాయుధ పోలీసు దళాలకు చెందినవి. వీటిలో 208 కంపెనీలను 14 బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల నుంచి బిహార్‌కు తరలించారు. ఇందులో 14,000 మందికి పైగా సిబ్బంది ఉన్నారు. ఈ దళాలు సీఏపీఎఫ్ కమాండ్ కింద పోలింగ్ బూత్‌ల వద్ద భద్రతకు నాయకత్వం వహిస్తాయి. అలాగే.. పోలింగ్ బూత్‌లతో పాటు రెండో దశ ఎన్నికలు జరగనున్న ప్రతి జిల్లాలోని చెక్‌పోస్టుల వద్ద భద్రతా సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. వాహనాలను క్షుణ్నంగా తనిఖీ చేయాలని, అనుమానాస్పద కార్యకలాపాలు, వ్యక్తులపై డేగకళ్లతో నిఘా ఉంచాలని భద్రతా సిబ్బందికి ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్ట భద్రత

బిహార్ పోలీసు అధికారుల సమాచారం ప్రకారం.. పోలింగ్ బూత్‌ల వద్ద రెండు రకాల భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. సీఏపీఎఫ్ సిబ్బందిని రెండు విభాగాలుగా మోహరిస్తారు. పెద్ద బూత్‌లలో పూర్తిస్థాయి విభాగం అంటే.. ఎనిమిది మంది సాయుధ సీఏపీఎఫ్ సిబ్బంది, ఒక అధికారి ఉంటారు. ఇక తక్కువ మంది ఓటర్లు ఉన్న చిన్న బూత్‌లలో సగం విభాగం అంటే.. నలుగురు సిబ్బంది, ఒక అధికారి ఉంటారు. అదనంగా బిహార్ హోంగార్డ్‌లు, దాదాపు 19వేల మంది ట్రైనీ పోలీసు సిబ్బంది, స్థానిక వాచ్‌మెన్‌లను కూడా పోలింగ్ స్టేషన్‌ల వద్ద మోహరించారు. వారిలో ఎవరినీ కూడా వారి సొంత అసెంబ్లీ నియోజకవర్గాల్లో నియమించలేదు.

సీఐఎస్ఎఫ్‌కు స్ట్రాంగ్ రూమ్‌ల బాధ్యత

మొదటి దశ పోలింగ్ తర్వాత జిల్లా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంను భద్రపరిచారు. రెండో దశ పోలింగ్ తర్వాత కూడా ఇదే పద్ధతి ఉంటుంది. ఈ స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించారు. ఓటింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే సమయంలో కూడా సీఐఎస్ఎఫ్ బలగాలే భద్రతను పర్యవేక్షిస్తాయి. బిహార్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని డీజీపీ కంట్రోల్ రూమ్ ఎన్నికలకు ప్రధాన కమాండ్ సెంటర్‌గా పనిచేస్తోంది. ఇక్కడ పర్యవేక్షణ కోసం ఒక ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలను నియమించారు. నవంబర్ 6న జరిగిన మొదటి దశ పోలింగ్ సమయంలో మొత్తం 121 స్థానాల్లో ఓటింగ్‌ను ఇక్కడి నుండే నిశితంగా పరిశీలించారు. నవంబర్ 11న జరిగే రెండో దశకు కూడా ఇదే విధానం కొనసాగుతుంది. మొదటి దశ పోలింగ్ ముగిసిన ప్రాంతాల్లో స్ట్రాంగ్ రూమ్ భద్రత కోసం పెద్ద ఎత్తున భద్రతా దళాలను మోహరించగా, అత్యవసర వినియోగం కోసం ఐదు అదనపు కంపెనీలను రిజర్వ్‌లో ఉంచారు.

తేజ్ ప్రతాప్ యాదవ్‌కు 'వై ప్లస్' భద్రత

సాక్షి, న్యూఢిల్లీ: ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు, కొత్తగా జనశక్తి జనతాదళ్(జేజేడీ) పార్టీని స్థాపించిన తేజ్ ప్రతాప్ యాదవ్‌కు కేంద్ర ప్రభుత్వం 'వై ప్లస్'కేటగిరీ భద్రత కల్పించనుంది. ఈ మేరకు తాజాగా అనుమతులు మంజూరు చేసింది. బిహార్ ఎన్నికల వేళ తేజ్ ప్రతాప్‌కు భద్రతను పెంచడం గమనార్హం. వై ప్లస్ సెక్యూరిటీలో భాగంగా తేజ్ ప్రతాప్‌కు ఇకపై సీఆర్‌పీఎఫ్ బృందం రక్షణ కల్పిస్తుంది. తన ప్రాణాలకు ముప్పు ఉందని తేజ్ ప్రతాప్ గత కొద్ది రోజులుగా ప్రకటనలు చేస్తుండటం తెల్సిందే. ఈ నేపథ్యంలో భద్రతా సంస్థలు ఆయన భద్రతకు సంబంధించి ప్రత్యేక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాయి. దీనిపై సమీక్ష జరిపిన కేంద్ర హోం శాఖ తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. వై ప్లస్ భద్రత కేటాయింపునకు ముందు సైతం ఆదివారం తేజ్ ప్రతాప్ తన రక్షణపై ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం పట్నాలో ఆయన మాట్లాడారు. ''నా భద్రతను పెంచారు. నాకు ప్రాణహాని పొంచి ఉంది. శత్రువులు నన్ను చంపేయొచ్చు. ఇప్పుడు ఎవరికీ చూసినా శత్రువులాగా కనిపిస్తున్నారు''అని అన్నారు. ఒక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే ఆరోపణలపై ఆర్జేడీ ఈయనను మే 25వ తేదీన పార్టీ నుంచి బహిష్కరించడం తెల్సిందే.

అండమాన్ దీవుల్లో భూకంపం

పోర్ట్‌బ్లెయిర్: అండమాన్ సముద్రంలో భూకంపం సంభవించింది. బారెన్ ఐల్యాండ్స్‌కు సమీపంలో 90 కిలోమీటర్ల లోతులో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు సంభవించిన ప్రకంపనల తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.4గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ తెలిపింది. వీటి ప్రభావం అండమాన్ నికోబార్ దీవుల్లోని పలు ప్రాంతాల్లో కనిపించినట్లు తెలిపింది. అయితే, ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన ఎటువంటి సమాచారం లేదని అధికారులు తెలిపారు. అయితే, రిక్టర్ స్కేలుపై 5.7గా నమోదైన భూకంపం ప్రభావం మధ్య అండమాన్‌లోని మయాబందర్, రంగట్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కనిపించిందని చీఫ్ సెక్రటరీ చంద్ర భూషణ్ కుమార్ తెలిపారు. ముందు జాగ్రత్తగా మత్స్యకారులు, పర్యాటకులను సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశామన్నారు. నష్టం వివరాలను యంత్రాంగం సేకరించే పనిలో ఉందని పేర్కొన్నారు.

పడవ మునిగి ఏడుగురు జల సమాధి

కౌలాలంపూర్: మయన్మార్‌కు చెందిన సుమారు 300 మంది వలసదారులతో కూడిన ఓ పడవ హిందూమహా సముద్రంలో మునిగిపోయింది. థాయ్‌లాండ్, మలేసియాల సముద్ర సరిహద్దులకు సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఏడుగురు చనిపోయారు. 13 మందిని మలేసియా నిఘా సిబ్బంది కాపాడారు. మయన్మార్‌కు చెందిన కొందరు రోహింగ్యా ముస్లింలను తాము కాపాడామని మలేసియా అధికారులు తెలిపారు. మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం బుథిడౌంగ్ పట్టణం నుంచి వీరు బయలుదేరినట్లు తెలిసిందన్నారు. మూడు రోజుల క్రితం ఘటన జరిగి ఉంటుందని చెప్పారు. నీళ్లలో తేలియాడుతుండగా ఏడు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, మరో 13 మందిని కాపాడామని తెలిపారు. మిగతా వారి కోసం గాలింపు కొనసాగుతోందని వివరించారు.

11 ఏళ్లకు మృతదేహం అప్పగించిన హమాస్

టెల్‌అవీవ్: 2014లో గాజాలో చనిపోయిన ఇజ్రాయెల్ సైనికుడు హదర్ గోల్డిన్ మృతదేహాన్ని ఆదివారం హమాస్ శ్రేణులు రెడ్ క్రాస్ సొసైటీకి అప్పగించాయి. రఫా నగరంలో భూగర్భ టన్నెల్‌లో ఆ మృతదేహాన్ని శనివారం గుర్తించామని హమాస్ తెలిపింది. 2014లో ఇజ్రాయెల్, హమాస్ మధ్య జరిగిన యుద్ధం అదే ఏడాది ఆగస్ట్ ఒకటో తేదీన కాల్పుల విరమణ ఒప్పందంతో ముగిసింది. అది అమల్లోకి వచ్చిన రెండు గంటల తర్వాత జరిగిన కాల్పుల్లో గోల్డిన్ చనిపోయారు. రెడ్ క్రాస్ నుంచి అందుకున్న మృతదేహానికి ఇజ్రాయెల్ అధికారులు పరీక్షలు జరిపి, అది గోల్డిన్‌దే అని నిర్ధారణ చేసిన పక్షంలో గాజాలో మరో నాలుగు మృతదేహాలున్నట్లు భావించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అదే నిజమైతే, గోల్డిన్ కుటుంబం 11 ఏళ్ల నిరీక్షణకు తెరపడనుంది.

రష్యా నగరాల్లో అంధకారం

కీవ్: ఉక్రెయిన్ దాడుల ఫలితంగా రష్యా సరిహద్దుల్లోని రెండు ప్రధాన నగరాల్లో అంధకారం అలుముకుంది. రెండు దేశాలు పరస్పరం ఇంధన మౌలిక వనరులపై దాడులు ముమ్మరం చేసిన వేళ ఈ ఘటన జరిగింది. శనివారం రాత్రి వొరొనెజ్‌ నగరంపై జరిగిన డ్రోన్ దాడుల వల్ల కరెంటు సరఫరాకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. హీటింగ్ వ్యవస్థ దెబ్బతింది. సుమారు 10 లక్షల మంది ఇబ్బందులకు గురయ్యారు. బెల్గొరోడ్ నగరంపై జరిగిన క్షిపణి దాడిలో కనీసం 20 వేల ఇళ్లకు విద్యుత్, హీటింగ్ వ్యవస్థలు నిలిచిపోయాయి. ఉక్రెయిన్ శనివారం రాత్రి ప్రయోగించిన 44 డ్రోన్లను కూల్చినట్లు రష్యా రక్షణ శాఖ ఆదివారం తెలిపింది. ఇందులో వొరొనెజ్, బెల్గొరోడ్‌లలో దాడుల గురించిన ప్రస్తావన లేదు.

మందుపాతర పేలి జవాన్‌కు గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి సీఆర్‌పీఎఫ్ జవానుకు గాయాలయ్యాయి. ఫుల్‌బగ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోగుండ అటవీ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో బలగాలు కూంబింగ్‌లో ఉండగా ఘటన చోటుచేసుకుంది. కాళ్లకు బలమైన గాయాలైన జవానును ప్రాథమిక చికిత్స అనంతరం హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌లోని ఆస్పత్రికి తరలించామని అధికారులు తెలిపారు. జూన్ 9వ తేదీన సుక్మా జిల్లాలోని ఓ క్వారీ వద్ద అమర్చిన మందుపాతర పేలి కుంట అదనపు ఎస్పీ ఆకాశ్ రావ్ గిరెపుంజె నేలకొరగ్గా, ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి.

బుద్ధుని అవశేషాలకు భూటాన్ స్వాగతం

న్యూఢిల్లీ: భారతదేశం నుండి తీసుకొచ్చిన గౌతమ బుద్ధుడి పవిత్ర అవశేషాలకు భూటాన్ ప్రజలు, నాయకత్వం అపూర్వ స్వాగతం పలకడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. బుద్ధుని బోధనలు.. రెండు దేశాల మధ్య పవిత్ర బంధంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. పవిత్రమైన బుద్ధుని అవశేషాలను.. శనివారం థింపులోని ప్రముఖ మఠం, భూటాన్ అత్యున్నత ఆధ్యాత్మిక, రాజకీయ సంస్థల కేంద్రంగా భావించే తాషిచోడ్జాంగ్‌లో ప్రతిష్ఠించారు. వేడుకలో భూటాన్ ప్రధానమంత్రి త్సెరింగ్ టోబ్‌గే, మంత్రులు, కేంద్ర మఠాల సంస్థకు చెందిన సీనియర్ లోపెన్‌లు పాల్గొన్నారు. భారతదేశం తరపున కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ హాజరైనట్లు థింపులోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. 'భారతదేశం నుండి తరలించిన పరమ పవిత్రమైన బుద్ధుని అవశేషాలకు భూటాన్ ప్రజలు, నాయకత్వం అపూర్వ స్వాగతం పలికినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు'.. అని మంగళవారం భూటాన్‌కు రెండు రోజుల పర్యటనకు వెళ్లనున్న మోదీ, 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ అవశేషాలు శాంతి, కరుణ, సామరస్యం అనే శాశ్వత సందేశానికి ప్రతీక అని ప్రధానమంత్రి అభివర్ణించారు. బుద్ధుని పవిత్ర అవశేషాలను తాషిచోడ్జాంగ్‌లోని గ్రాండ్ క్యూన్రే హాల్లో సంప్రదాయ చిప్‌డ్రెల్ ఊరేగింపు, ప్రత్యేక ప్రార్థనలు, వేడుకలు, గౌరవ వందనంతో ప్రతిష్ఠించినట్లు థింపులోని భారత రాయబార కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఈ అవశేషాలను నవంబర్ 8 నుండి 18 వరకు థింపులోని తాషిచోడ్జాంగ్‌లోని క్యూన్రే హాల్‌లో ప్రజల దర్శనం, పూజల కోసం ఉంచుతారు. కోట, మఠంగా ఉన్న తాషిచోడ్జాంగ్‌లో ఉన్న గ్రాండ్ క్యూన్రే అత్యంత ప్రముఖమైన హాళ్లలో ఒకటి. 'పిప్రాహ్వా బుద్ధుని అవశేషాలు' అని పిలిచే వీటిని.. న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియంలో భద్రపరిచారు.

చొరబాటుదారుల సేవలో విపక్షాలు: షా

పట్నా: చొరబాటుదారుల సేవలో ప్రతిపక్షాలు తరిస్తున్నాయని, ఎన్నికల్లో లబ్ధి కోసం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల కోసం పారిశ్రామిక కారిడార్లు నిర్మిస్తుండగా, ప్రతిపక్షాలు మాత్రం చొరబాటుదారుల కోసం కారిడార్ నిర్మించేందుకు కుట్రలు సాగిస్తున్నాయని ధ్వజమెత్తారు. మన దేశంలోకి అక్రమంగా చొరబడినవారిని కాపాడడానికి విపక్ష నేతలు రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ నిస్సిగ్గుగా యాత్రలు చేశారని విమర్శించారు. అమిత్ షా ఆదివారం బిహార్‌లో ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడారు. దళితులు, బీసీల సంక్షేమం గురించి ఏనాడూ మాట్లాడని కాంగ్రెస్, ఆర్జేడీలు పరాయివాళ్ల కోసం ఆరాటపడుతున్నాయని మండిపడ్డారు. ఓట్ల చోరీ జరుగుతోందంటూ రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలను అమిత్ షా కొట్టిపారేశారు.

కోటలు లేని ఏకైక సింధు నాగరికత పట్టణం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



- క్రీ.పూ.2500 ఏళ్ల కిందట సింధు నాగరికత విలసిల్లింది. సింధు నదీ పరీవాహక ప్రాంతంలో విరాజిల్లడం వల్ల ఈ నాగరికతను సింధు నాగరికత అని, సింధులోయ నాగరికత అని పిలుస్తారు. తొలిసారి హరప్పా ప్రాంతంలో తవ్వకాలు జరపడంతో దీన్ని హరప్పా నాగరికత అని కూడా అంటారు.
- తొలిసారిగా 1921లో భారత సర్వేయర్ జనరల్‌గా ఉన్న సర్ జాన్ మార్షల్ ఆధ్వర్యంలో దయారాం సహాని.. హరప్పా (రావి నది ఒడ్డు)న తవ్వకాలు జరపడంతో ఒక విశిష్ట నాగరికత బయటపడింది.
- సింధు నాగరికత పేరును హరప్పా నాగరికతగా సర్ జాన్‌మార్షల్ మార్చాడు. పురావస్తు ఆధారాల ప్రకారం సింధు నాగరికత కాలం క్రీ.పూ.3,000 నుంచి క్రీ.పూ.1,500. సింధు నాగరికత ఉన్నత దశలో ఉన్న కాలం క్రీ.పూ.2,500 నుంచి క్రీ.పూ.1,750 వరకు.
- సింధు నాగరికతకు లిపి ఉంది. కానీ చదివేందుకు వీలుకాకపోవడం వల్ల దీన్ని 'ప్రోటో హిస్టారిక్' యుగం (సంధి కాలపు చారిత్రక యుగం) అని పిలుస్తారు.
- ఈ యుగంలో ఉపయోగించిన లోహం 'కంచు'. అందుకే సింధు నాగరికతను 'కాంస్య యుగపు' నాగరికత అని కూడా పిలుస్తారు. ఈ నాగరికత శిలాయుగం నుంచి లోహ యుగానికి మార్పు చెందుతున్న కాలంలో అభివృద్ధి చెందింది. సింధు నాగరికతకు సమకాలీన నాగరికతలు.. మెసపటోమియా (ఇరాక్) (యూఫ్రటీస్, టైగ్రిస్); ఈజిప్ట్ (నైలు నది); చైనా (హోయాంగ్ హో) మొదలైనవి. సమకాలీన నాగరికతల కంటే సింధు నాగరికత 6 అంశాల్లో విశిష్టమైందిగా గుర్తింపు పొందింది.
- సింధు నాగరికత మిగిలిన నాగరికతల కంటే వైశాల్యంలో పెద్దది. ఇది 1.3 మి.చ.కి.మీ.లలో విస్తరించి ఉంది. దీని సరిహద్దులు ఉత్తరాన జమ్ముకశ్మీర్‌లోని మండా నుంచి దక్షిణాన మహారాష్ట్రలోని దైమాబాద్ వరకు, తూర్పున ఉత్తరప్రదేశ్‌లోని అలింగీర్ నుంచి పాకిస్తాన్‌లోని (సుక్త-జందార్) వరకు విస్తరించి ఉంది.
- సింధు నాగరికత పట్టణ నాగరికత (ఇది సింధు నాగరికత ముఖ్య లక్షణం).
- ఇక్కడి పట్టణాలు గ్రిడ్ వ్యవస్థలో, ప్రధాన వీధులు ఉత్తర-దక్షిణాలుగా, ఉప వీధులు తూర్పు -పడమరలుగా దీర్ఘ చతురస్రాకారంలో ఉన్నాయి.
- సింధు ప్రజలు ఇళ్ల నిర్మాణంలో కాల్చిన ఇటుకలను ఉపయోగించటాన్ని ప్రత్యేక అంశంగా చెప్పొచ్చు (దీనిలోనే సింధు ప్రజలు పరిపక్వత సాధించారు).
- ఈ నాగరికతలో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. భూగర్భ మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. మురుగు నీటి కోసం ఇంకుడు గుంతలు తవ్వటం ఈ నాగరికతలోని ప్రత్యేకత.
- సాంకేతిక పరిజ్ఞానంలో మిగిలిన నాగరికతల కంటే గొప్పది.
- సింధు ప్రజలు ప్రపంచంలో తొలిసారి పత్తిని పండించారు.

సింధు నాగరికత తవ్వకాల్లో మొత్తం 250 ప్రదేశాలు బయటపడ్డాయి. అందులో ముఖ్యమైనవి..

సింధు నాగరికతకు చెందిన ప్రధాన ప్రదేశాలు - పురావస్తు విశేషాలు

- **హరప్పా:** సింధు నాగరికత తవ్వకాల్లో బయటపడిన మొట్టమొదటి పట్టణం.

పట్టణ నిర్మాణం- ముఖ్య లక్షణాలు

- 2 వరుసల్లో నిర్మించిన 6 ధాన్యాగారాలు, పంటలు నూర్చే వృత్తాకారపు వేదికలు బయటపడ్డాయి.
- రాతితో చెక్కిన నటరాజ విగ్రహం వెలుగుచూసింది.
- చెక్కతో తయారు చేసిన శవపేటికలు.
- కోటకు వెలుపల చిన్నచిన్న గదులతో కూడిన నిర్మాణాలు.
- **మొహంజోదారో:** మొహంజోదారో అంటే సింధు భాషలో మృతుల దిబ్బ (Mound of Dead) అని అర్థం.
- తవ్వకాల్లో బయటపడిన అతి పెద్ద సింధు నాగరికత ప్రాంతం.
- పెద్ద ధాన్యాగారం (Great Granary)
- కాల్చిన ఇటుకలతో నిర్మించిన 39×23×9 అడుగుల విస్తీర్ణం గల మహాస్నానవాటిక బయటపడింది.
- అనేక స్తంభాలతో కూడిన అసెంబ్లీ హాలు నిర్మాణం.
- ఏడుసార్లు వరదలకు గురై, తిరిగి 7 సార్లు పునర్నిర్మితమైన పట్టణం.
- కంచుతో పోత పోసిన నాట్యగత్తె విగ్రహం లభించింది.
- రాతితో తయారుచేసిన పశుపతి మహాదేవుని విగ్రహం దొరికింది.
- **చాన్హుదారో:** కోటలు లేని ఏకైక సింధు నాగరికత పట్టణం.
- సిరాబుడ్డి (Ink pot) దొరికింది.
- పూసలు, ఆభరణాలు తయారుచేసే పరిశ్రమ ఆనవాళ్లు వెలుగుచూశాయి.
- **కాళీభంగన్:** రాజస్థానీ భాషలో కాళీభంగన్ అంటే నల్ల గాజులు అని అర్థం.
- నాగలితో పొలం దున్నిన ఆనవాళ్లు ఇక్కడ కనిపించాయి.
- యజ్ఞ యాగాదులకు గుర్తుగా 2 అగ్నిహోమాలు బయటపడ్డాయి.
- **లోథాల్:** కాల్చిన ఇటుకలతో కూడిన మానవ నిర్మిత నౌకాశ్రయం ఉన్న పట్టణం.
- మొదటిసారిగా వరి పండించిన ఆనవాళ్లు లభించాయి.
- ఎక్కువగా ముద్రికలు దొరికాయి.
- సతి ఆచారానికి సంబంధించిన ఆనవాళ్లు ఉన్నాయి.
- కొలిచే ప్రమాణం (త్రాసు, కొలబద్ద) వంటి పనిముట్లు దొరికాయి.
- కాళీభంగన్‌లా అగ్ని గుండం ఆనవాళ్లు ఇక్కడ బయల్పడ్డాయి.
- చదరంగం లాంటి ఆటకు సంబంధించిన ఆనవాళ్లు దొరికాయి.
- **రంగాపూర్:** ఇక్కడ హరప్పాకు పూర్వం ఉన్న సంస్కృతి వెలుగుచూసింది.
- ధాన్యపు పొట్టుకు సంబంధించిన ఆనవాళ్లు లభించాయి.
- **కోట్-డిజి:** సింధు నాగరికతకు పూర్వమే విలసిల్లిన నాగరికత విశేషాలు ఉన్నాయి.
- ఇక్కడ రాతితో చేసిన బాణాలు బయటపడ్డాయి.
- **రూపార్ :** ఇక్కడ కుండల తయారీ ఆనవాళ్లు లభించాయి.
- **సుర్కటోడా:** గుర్రం అవశేషాలు లభించిన ఏకైక పట్టణం.
- క్షీణ దశలో ఉన్న సింధు నాగరికత ఆనవాళ్లు లభించాయి.
- **బన్వాలి:** మేలు రకపు బార్లీ, ఆవాలను ఉపయోగించిన, పండించిన ఆనవాళ్లు దొరికాయి.
- **అలంగీర్‌పూర్:** ఇది హరప్పా నాగరికత చివరి దశను తెలుపుతుంది.
- **ధోలవీర:** భారతదేశంలో బయల్పడిన సింధు నాగరికతకు చెందిన అతిపెద్ద పట్టణం.

ఆర్థిక పరిస్థితులు

- **వ్యవసాయం:** సింధు ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయం. గోధుమ, బార్లీ ముఖ్య పంటలు. వీటిని రబీ సీజన్‌లో అధికంగా పండించేవారు. ఇతర ముఖ్య పంటలు నువ్వులు, ఆవాలు, బఠాణీలు తదితర లెగ్యుమినేసి కుటుంబానికి చెందిన పంటలను పండించేవారు. నవంబర్‌లో విత్తనాలు చల్లి ఏప్రిల్‌లో కోతలు కోసేవారు. సింధు ప్రాంత ప్రజలు తొలిసారిగా పత్తిని పండించారు. వీరు తొలిసారిగా పత్తిని పండించటం వల్ల గ్రీకులు పత్తిని సిండర్ అని పిలిచేవారు.
- వ్యవసాయ మిగులు ఎక్కువగా ఉండేది. మిగులును ధాన్యాగారాల్లో భద్రపరిచేవారు. వ్యవసాయ మిగులుతో అంతర్గతంగా ఎద్దుల బండి ద్వారా, అంతర్జాతీయంగా పడవల ద్వారా వ్యాపారం చేసేవారు.
- ఆవు, ఎద్దు, బర్రె, మేక, కుక్క, పిల్లి తదితర పెంపుడు జంతువులతో పాటు ఏనుగు, పులి, ఖడ్గ మృగం వంటి అడవి జంతువులు కూడా వీరికి తెలుసు. సింహం గురించి వీరికి తెలియదు.
- **పరిశ్రమలు:** కుండలు, పూసల తయారీ, బొమ్మలు (టెర్రకోట బొమ్మలు) - ముద్రలు, తాయెత్తులు, పడవల తయారీ పరిశ్రమలు ముఖ్యమైనవి.
- **వర్తక వాణిజ్యం:** అంతర్జాతీయ వ్యాపారం మెసపటోమియాలోని సుమేరియన్లతో ఎక్కువగా జరిగేది. మెసపటోమియాలో లభించిన అనేక హరప్పా వ్యాపార ముద్రికలు దీనికి ఉదాహరణ.
- **ఎగుమతులు:** వ్యవసాయ ఉత్పత్తులైన గోధుమ, బార్లీ, పత్తితోపాటు దంతాలతో చేసిన సామగ్రి, కుండలు, బొమ్మలు, పూసలు తదితరాలు.
- **దిగుమతులు:** ఆఫ్గనిస్తాన్ నుంచి తగరం, అఫ్గానిస్తాన్, పర్షియా నుంచి బంగారం, రాజస్థాన్ నుంచి రాగిని, సౌరాష్ట్ర నుంచి కాంబ్‌షల్స్ (విలువైన రాయి)ని దిగుమతి చేసుకొనేవారు. వస్తు మార్పిడి విధానం ద్వారానే వ్యాపారం జరిగేది.

ప్రదేశం	ప్రస్తుత ప్రాంతం	తవ్విన సం.	పురావస్తు శాస్త్రవేత్త	నది
హరప్పా	పశ్చిమ పంజాబ్‌లోని మాంటిగోమరి జిల్లా	1921	దయారాం సహాని	రావి
మొహంజోదారో లార్ఖానా జిల్లా	సింధు రాష్ట్రంలోని (పాక్)	1922	ఆర్.డి. బెనర్జీ	సింధు
చాన్హుదారో	సింధు (పాక్)	1931	ఎన్.జి.మజుందార్	సింధు
కాళీభంగన్	ఉత్తర రాజస్థాన్	1953	ఎ.ఘోష్, బి.బి.లాల్ (1961)	గగ్గర్
లోథాల్	గుజరాత్	1957	ఎస్.ఆర్. రావ్	బోగవ్
రంగాపూర్	అహ్మదాబాద్ (గుజరాత్)	1953	ఎం.ఎస్. వాస్త్	మీడర్
కోట్-డిజి	సింధు (పాక్)	1955-57	ఫజుల్ అహ్మద్‌ఖాన్	సింధు
రూపార్	పంజాబ్ (భారత్)	1955-57	వై.డి. శర్మ	సట్లెజ్
సుర్కటోడా	కచ్ ప్రాంతం (గుజరాత్)	1972	జె.పి.జోషి	బోగవ్
బన్వాలి	హరియాణా	1973	ఆర్.ఎస్.బిస్ట్	సరస్వతి
ధోలవీర	గుజరాత్	1990-91	ఆర్.ఎస్.బిస్ట్	సబర్మతి ఉపనది

హెబియస్ కార్పస్ రిట్ అంటే ఏమిటి?

లౌకికతత్వం - ప్రపంచశాంతి - భారతదేశం

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్ మెథడ్స్

'లౌకిక' అంటే మతంతో సంబంధం లేనిది అని అర్థం. 'లౌకికతత్వం' అంటే మతంతో ప్రమేయం లేని చింతన లేదా తత్వం. లౌకికతత్వాన్ని అనుసరించే దేశం ప్రజల మత సంబంధమైన విషయాల్లో జోక్యం చేసుకోదు. భారతదేశం వివిధ మతాలకు పుట్టినిల్లు. హిందూ, బౌద్ధం, జైనం, ఇస్లాం, క్రైస్తవం, పార్శీ మతాలు మనదేశంలో ఉన్నాయి. భారతదేశం ఒక లౌకిక రాజ్యం. క్రీస్తు పూర్వం నుంచి మతాలను పరిశీలిస్తే అశోకుడు మొదట హిందువు. తర్వాత ఉపగుప్తుడనే బౌద్ధమతాచార్యుని బోధనలతో బౌద్ధాన్ని స్వీకరించాడు. ఆ కాలంలోనే పరమత సహనాన్ని పాటించిన చక్రవర్తి అశోకుడు. హర్షుడు, చంద్రగుప్త విక్రమాదిత్యుడు కూడా లౌకికతత్వాన్ని అనుసరించారు. ఇక మధ్యయుగంలో తొలి లౌకిక చక్రవర్తి అక్బర్. దిన్-ఇ-ఇలాహీ అనే నూతన మతానికి అక్బర్ శ్రీకారం చుట్టాడు. అంతేకాకుండా ఇబాదత్ ఖానా అనే ప్రార్థన మందిరంలో సర్వమతాల వారు ప్రార్థనలు చేసుకొనే అవకాశం కల్పించాడు. ప్రస్తుతం మనదేశంలో హిందువులు, క్రిస్టియన్లు, ముస్లింలు, సిక్కులు, జైనులు, బౌద్ధులు మొదలైనవారు తమ మతాలు నిర్ణయించిన ఆచార వ్యవహారాలను పాటిస్తూ శాంతియుతంగా జీవిస్తున్నారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా లౌకిక అనే పదాన్ని భారత రాజ్యాంగ పీఠికలో ప్రవేశపెట్టారు. భారతీయ లౌకికవాదం ఉదారమైంది. ప్రేమ, సహనం, సర్వమత సమానత్వం అనే సూత్రాలకు ప్రాముఖ్యత ఇస్తుంది. మతవాదానికి బదులు మానవతావాదాన్ని పౌరులు అలవరుచుకోవాలి. మతం పేరుతో ఇతరులపై దాడులు చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుంది. తద్వారా అల్ప సంఖ్యాకుల్లో భయాందోళనలను తొలగిస్తుంది.

ప్రపంచ శాంతి

యుద్ధ భయం మానవాళిని అనాదిగా వేధిస్తోంది. మానవుల శాంతియుత సహజీవనానికి యుద్ధాలు తీవ్రమైన అంతరాయం కలిగిస్తున్నాయి. వీటివల్ల ఎంతో నష్టం కలుగుతుంది. 20వ శతాబ్దంలో సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా పెను విధ్వంసాన్ని సృష్టించాయి. మొదటి ప్రపంచ యుద్ధం 1914-18 మధ్య కాలంలో జరిగింది. రెండో ప్రపంచ యుద్ధ కాలం 1939-45. మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా తటస్థంగా ఉంది. మళ్లీ ప్రపంచ యుద్ధమే సంభవిస్తే ప్రపంచం మొత్తం కొద్ది క్షణాల్లో ధ్వంసం అవుతుందని అంచనా. అందుకే ప్రపంచ శాంతి నెలకొల్పడం ఎంతో అవసరమని వివిధ దేశాలు గుర్తించాయి. ఈ లక్ష్యసాధన కోసం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత నానాజాతి సమితి, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐక్యరాజ్య సమితి ఏర్పడ్డాయి. నానాజాతి సమితి 1920లో జెనీవా ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. 1945, అక్టోబర్ 24న న్యూయార్క్ కేంద్రంగా ఐక్యరాజ్యసమితి ఏర్పడింది.

భారతదేశం పాత్ర

ప్రపంచ శాంతి నెలకొల్పడానికి, కొన్ని దేశాలు గణనీయమైన కృషి చేస్తున్నాయి. వాటిలో భారతదేశం ఒకటి. ప్రపంచ శాంతిని కాపాడటం భారత విదేశాంగ విధాన ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. జాతీయ ప్రయోజనాలను రక్షించుకోవడానికి ఇతర దేశాలతో సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంబంధాల విషయంలో రూపొందించిన విధానాన్ని విదేశాంగ విధానం అంటారు. భారత విదేశాంగ విధానానికి మొదటి ప్రధాని నెహ్రూ రూపకల్పన చేశారు.

పంచశీల సూత్రాలు

టిబెట్ విషయంపై భారతదేశం, చైనా చేసుకున్న ఒడంబడికలో శాంతియుత సహజీవన సూత్రాలను పేర్కొన్నారు. వీటినే పంచశీల సూత్రాలు అంటారు. 1954 జూన్ 28న భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, చైనా ప్రధాని చౌ-ఎన్-లై ఈ ఒప్పందాన్ని ఆమోదించారు.

అలీనోద్యమం (నామ్)

భారత మొదటి ప్రధాని నెహ్రూ, యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో, ఈజిప్టు అధ్యక్షుడు కమాలుద్దీన్ నాజర్ అలీనోద్యమానికి మూల పురుషులు. వీరికి ప్రపంచ శాంతి, సహజీవనం, సామరస్యం, సహకారం వంటి అంశాలపై నమ్మకం అపార నమ్మకం ఉంది. అటు అమెరికా ఆధ్వర్యంలోని పెట్టుబడిదారి దేశాల కూటమి, ఇటు రష్యా నాయకత్వంలోని సామ్యవాద దేశాల కూటమిలో చేరని దేశాలను అలీన దేశాలు అంటారు. నామ్ 1961లో ఏర్పడింది. మొదటి సదస్సులో 25 దేశాలు పాల్గొన్నాయి. ప్రస్తుతం నామ్‌లో సభ్య దేశాల సంఖ్య-107. నామ్ ఏడో సదస్సు 1983లో న్యూఢిల్లీలో జరిగింది. ఈ సమావేశానికి నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ అధ్యక్షత వహించారు. భారత్ నామ్ ద్వారా ప్రపంచ శాంతి పరిరక్షణకు విశేష కృషి చేస్తోంది. క్యూబా సమస్య విషయంలో 1962లో అమెరికా-రష్యాల మధ్య రాజీని కుదర్చడంలో భారతదేశం ముఖ్యపాత్రను పోషించింది. అంతేకాకుండా శాంతిస్థాపన దిశగా 1983, 1985, 1988లలో పాకిస్థాన్‌తో ఒప్పందాలను కుదుర్చుకుంది.

మాదిరి ప్రశ్నలు

1. మనదేశంలో సంపూర్ణ అక్షరాస్యతా సంవత్సరంగా ఎప్పుడు ప్రకటించారు?
   1) 1992 2) 1991
   3) 1990 4) 1989
2. స్త్రీలలో అక్షరాస్యత అతి తక్కువ ఉన్న రాష్ట్రం?
   1) మేఘాలయ 2) రాజస్థాన్
   3) ఒడిశా 4) బీహార్
3. జీవించే హక్కును ఏ నిబంధన ద్వారా ప్రసాదించారు?
   1) 22 2) 20 3) 21 4) 24
4. స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కును ఎప్పుడు చట్టబద్ధం చేశారు?
   1) 1985 2) 1989 3) 1984 4) 1983
5. మొట్టమొదటిసారిగా షెడ్యూల్డ్ కులాలు అనే పదాన్ని ఏ సంవత్సరంలో ఉపయోగించారు?
   1) 1940 2) 1945
   3) 1947 4) 1935
6. అస్పృశ్యతను ఒక పాపంగా అభివర్ణించినవారు?
   1) గౌతమబుద్ధుడు
   2) జవహర్‌లాల్ నెహ్రూ
   3) గాంధీజీ
   4) అంబేద్కర్
7. దేశంలో భాష ప్రాతిపదికగా ఏర్పడిన మొదటి రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) కర్నాటక
   3) కేరళ 4) తమిళనాడు
8. ఒక జాతికి ఉండే లక్షణాలు?
   1) సంఘీభావం
   2) ఐకమత్యం
   3) భాష, మాండలికాలు
   4) సార్వభౌమాధికారం
9. రాజ్యాంగంలోని ఏ విభాగం నిర్బంధ ప్రాథమిక విద్య గురించి వివరిస్తుంది?
   1) ప్రవేశిక 2) ప్రాథమిక విధులు
   3) ఆదేశ సూత్రాలు
   4) పౌరహక్కులు
10. హెబియస్ కార్పస్ రిట్ అంటే ఏమిటి?
    1) ఇది అన్యాయమైన అరెస్ట్‌ను నిరోధిస్తుంది
    2) అధికారిని పనిచేయమని
    3) నీ పని నీవు చేయమని
    4) ప్రతిషేధం
11. Sons of soil (భూమిపుత్రుల) సిద్ధాంతం ఎవరిది?
    1) శివసేన 2) బీహార్
    3) తెలంగాణ 4) విదర్భ
12. భారత రాజ్యాంగ ప్రవేశికలో లౌకిక అనే పదాన్ని ఏ సంవత్సరంలో చేర్చారు?
    1) 1978 2) 1972
    3) 1976 4) 1970
13. ఐక్యరాజ్యసమితి ఏ నగరంలో ఉంది?
    1) చికాగో 2) న్యూయార్క్
    3) జెనీవా 4) శాన్‌ఫ్రాన్సిస్కో
14. దిన్-ఇ- ఇలాహీ అనే మతాన్ని ప్రవేశపెట్టిన వారు ఎవరు?
    1) బాబర్ 2) షాజహాన్
    3) ఔరంగజేబు 4) అక్బర్
15. భారతీయ లౌకికతత్వం ఎలాంటిది?
    1) సామాజికమైంది 2) నైతికమైంది
    3) ఉదారమైంది 4) ఏదీకాదు
16. రెండో ప్రపంచ యుద్ధంలో దారుణంగా ధ్వంసమైన నగరం?
    1) పెకింగ్ 2) నాగసాకి
    3) టోక్యో 4) తైవాన్
17. ఆసియా రాజ్యాల మొదటి మహాసభ జరిగిన నగరం ఏది?
    1) బాగ్దాద్ 2) నాగసాకి
    3) పెకింగ్ 4) ఢిల్లీ
18. భారత్-చైనాల మధ్య శాంతి ఒప్పందం ఏ సంవత్సరంలో జరిగింది?
    1) 1987 2) 1988
    3) 1985 4) 1983
19. అలీనవిధానం పితామహుడు ఎవరు?
    1) చౌ-ఎన్-లై 2) భుట్టో
    3) నెహ్రూ 4) గాంధీజీ
20. బాండుంగ్ సమావేశం జరిగిన సంవత్సరం?
    1) 1947 2) 1949
    3) 1950 4) 1955
21. మొదటి అలీనదేశాల సదస్సుకి హాజరైన సభ్య దేశాల సంఖ్య?
    1) 45 2) 35 3) 25 4) 55
22. పంచశీల ఎవరి ఒప్పందాల ఫలితం?
    1) రాజీవ్‌గాంధీ- బెనజీర్ భుట్టో
    2) ఇందిరాగాంధీ- జుల్ఫికర్ ఆలీభుట్టో
    3) నెహ్రూ-చౌ-ఎన్-లై
    4) సుకర్నో-టిటో
23. మారణాయుధాల సంఖ్య పెరగడానికి కారణం?
    1) మిత్రదేశాలు ఉచితంగా ఇవ్వడం
    2) శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధి
    3) ఖర్చు తగ్గడం
    4) శాస్త్రీయ విజ్ఞాన లోపం
24. వియత్నాం విప్లవాన్ని బలపరిచిన సమావేశం జరిగిన నగరం?
    1) అల్జీర్స్ 2) జకార్తా
    3) హవానా 4) హరారే
25. ఏ లక్ష్యసాధన కోసం ఐక్యరాజ్య సమితిని ఏర్పాటు చేశారు?
    1) ఏకీయత 2) జాతీయత
    3) శాంతి 4) మత సహనం
26. ఏ సంవత్సరంలో చైనా- ఇండియాల మధ్య యుద్ధం జరిగింది?
    1) 1965 2) 1948
    3) 1962 4) 1971
27. ఇండియా తొలిసారిగా అణు విస్ఫోటన పరీక్ష జరిపిన సంవత్సరం?
    1) 1974 2) 1970
    3) 1968 4) 1975
28. సార్క్ ఆవిర్భావం ఎక్కడ జరిగింది?
    1) సిలోన్ 2) ఢాకా
    3) ఢిల్లీ 4) ఖాట్మాండు
29. బ్రిటీషువారు పరిపాలించిన వలస రాజ్యాల కూటమిని ఏమని వ్యవహరిస్తారు?
    1) కామన్‌వెల్త్
    2) బ్రిటీష్ సమాఖ్య
    3) యూరోపియన్ దేశాల కూటమి
    4) నాటో

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 1; 5) 4; 6) 3; 7) 1; 8) 3; 9) 3; 10) 1; 11) 1; 12) 3; 13) 2; 14) 4; 15) 3; 16) 2; 17) 4; 18) 1; 19) 3; 20) 4; 21) 3; 22) 3; 23) 2; 24) 1; 25) 3; 26) 3; 27) 1; 28) 2; 29) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ బీహెచ్‌యూలో జేఆర్ఎఫ్‌లు

వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) బెనారస్ హిందూ యూనివర్శిటీ(బీహెచ్‌యూ).. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోలు(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(మైనింగ్ ఇంజనీరింగ్/సివిల్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్ /జియాలజీ /జియోఫిజిక్స్/ఇన్విరాన్‌మెంటల్ సైన్స్)లో ఉత్తీర్ణులవ్వాలి. నెట్/గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.37,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.11.2025.
» **వెబ్‌సైట్:** www.iitbhu.ac.in

ఎన్‌సీఆర్‌టీసీలో ఎగ్జిక్యూటివ్ పోస్టులు

నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌సీఆర్‌టీసీ) రెగ్యులర్ ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** ఎంబీఏ, పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.1,20,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.11.2025.
» **వెబ్‌సైట్:** https://ncrtc.in

ఐఐటీ ఢిల్లీలో జేఆర్ఎఫ్‌లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఢిల్లీ తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోలు(జేఆర్ఎఫ్) భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి పీజీ(పాలిమర్స్, టెక్స్‌టైల్స్, మెటీరియల్స్ సైన్స్, రబ్బర్ టెక్నాలజీ, నానో టెక్నాలజీ)లో ఉత్తీర్ణతతో పాటు నెట్, గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.37,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** archana@iitd.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 14.11.2025.
» **వెబ్‌సైట్:** https://ird.iitd.ac.in

ఆకాశ మార్గంలో... అద్భుత విజయాలు!

వరుస విజయాలతో భారత్ అంతరిక్ష రంగంలో తన సత్తా చాటుతోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పీఎస్ఎల్వీ-సీ27 వాహక నౌక ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్-1డీ ఉపగ్రహాన్ని దిగ్విజయంగా కక్ష్యలోకి చేర్చింది. దీంతో దేశీయ జీపీఎస్ వ్యవస్థ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. చంద్రుడిపైకి పంపిన చంద్రయాన్, అంగారక గ్రహంపైకి చేపట్టిన మార్స్ ఆర్బిటార్ మిషన్ (MOM) విజయవంతమవడం, పూర్తి దేశీయ పరిజ్ఞానంతో క్రయోజనిక్ ఇంజన్‌ను రూపొందించడం, అధిక బరువున్న ఉపగ్రహాలను మోసుకెళ్లగలిగే జీఎస్ఎల్వీ మార్క్–IIIని రూపొందించడం, పీఎస్ఎల్వీ ద్వారా వరుస ఫలవంతమైన ప్రయోగాలు చేయడం.. తదితరాలన్నీ అంతరిక్ష రంగంలో మనం సాధించిన ప్రగతికి కలికితురాళ్లు. వీటన్నింటినీ భారత శాస్త్రవేత్తలు అతి తక్కువ కాలంలోనే, దాదాపుగా స్వతంత్రంగా సాధించి భారత ప్రతిష్టను ఇనుమడింపజేశారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

భారత అంతరిక్ష కార్యక్రమం

డాక్టర్ విక్రం సారాభాయి నేతృత్వంలో భారత అంతరిక్ష కార్యక్రమం రూపుదిద్దుకుంది. 1962లో అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో మొదటగా ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (INCOSPAR) ఏర్పాటైంది. అదే ఏడాది తిరువనంతపురం వద్ద తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ (TERLS) నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం నుంచి 1963 నవంబర్ 21న మొదటి సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించారు. 1969లో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ISRO) ఏర్పాటైంది. 1972లో అంతరిక్ష సంఘం, అంతరిక్ష విభాగం ఏర్పాటయ్యాయి. భారత అంతరిక్ష కార్యక్రమ విధానాన్ని అంతరిక్ష సంఘం రూపొందిస్తుంది. అంతరిక్ష విభాగం ఆ విధానాన్ని అమలు చేస్తుంది. 1972 ఏప్రిల్ 1 నుంచి ఇస్రో ప్రభుత్వ సంస్థగా మారింది. అదే ఏడాది ఏప్రిల్ 19న భారత్ తన తొలి ఉపగ్రహం ఆర్యభట్టను ప్రయోగించింది. అంతరిక్ష విభాగానికి సంబంధించి సుమారు 20 కేంద్రాలు వివిధ అంతరిక్ష కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నాయి. విక్రం సారాభాయి అంతరిక్ష కేంద్రం వీటిలో ప్రధానమైంది, పెద్దది. ఇది పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్లను నిర్మించడంతో పాటు ఏవియానిక్స్, ఏరోనాటిక్స్, సాలిడ్ ప్రొపెల్లెంట్ టెక్నాలజీ, మెటీరియల్ సైన్స్ లాంటి రంగాల్లో పరిశోధన నిర్వహిస్తుంది. అహ్మదాబాద్ లోని స్పేస్ అప్లికే షన్స్ సెంటర్ ఉపగ్రహాలకు చెందిన సాంకేతిక పరికరాలను నిర్మిస్తుంది. వీటిని బెంగళూరులోని ఇస్రో శాటిలైట్ సెంటర్ అనుసంధానించి ఉపగ్రహాలను నిర్మిస్తుంది. శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ వాహక నౌకల ద్వారా ఇన్‌శాట్, ఐఆర్ఎస్ ఉపగ్రహాలను ప్రయోగిస్తారు.

ఉపగ్రహ వ్యవస్థలు

భారత అంతరిక్ష కార్యక్రమంలో ప్రధానంగా మూడు రకాల ఉపగ్రహ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నారు. ఇన్‌శాట్ (ఇండియన్ శాటిలైట్ సిస్టం) వ్యవస్థ ఉపగ్రహాల ద్వారా టెలికమ్యూనికేషన్, రేడియో, టీవీ కార్యక్రమాల ప్రసారం, డీటీహెచ్ సేవలు, టెలి మెడిసిన్, టెలి ఎడ్యుకేషన్, వీడియో కాన్ఫరెన్సింగ్, విపత్తుల నిర్వహణ, విలేజ్ రిసోర్స్ సెంటర్లు, శాటిలైట్ న్యూస్ గ్యాథరింగ్, వాతావరణ సమాచార సేకరణ, హెచ్చరికల జారీ, ప్రమాదంలో చిక్కుకున్న వారిని గుర్తించడం, రక్షించడం మొదలైన సేవలు అందిస్తున్నారు.

ఐఆర్ఎస్ (ఇండియన్ రిమోట్ సెన్సింగ్ సిస్టం) ఉపగ్రహాల ద్వారా సహజ వనరుల పరిశీలన, సమాచార సేకరణ, నిర్వహణ, సంరక్షణ, నియంత్రణ, ముఖ్యంగా అటవీ, ఖనిజ, నేల, సముద్ర వనరుల నిర్వహణ సాధ్యమవుతోంది. దీంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, విద్యుద్దీకరణ, కరవు నియంత్రణ, వాటర్‌షెడ్ల అభివృద్ధి, అడవులు, బంజరు భూముల నిర్వహణ తదితర సేవలు లభ్యమవుతున్నాయి. విపత్తు నిర్వహణ, జీవ వైవిధ్య సంరక్షణ, శీతోష్ణస్థితి మార్పు ప్రభావాల అధ్యయనం - నిర్మూలన, దేశ రక్షణ మొదలైనవాటిలోనూ ఐఆర్ఎస్ ఉపగ్రహాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. రిసోర్స్‌శాట్, ఓషన్‌శాట్, కార్టోశాట్, రీశాట్, మేఘట్రాపిక్స్, సరళ మొదలైనవి ముఖ్యమైన ఐఆర్ఎస్ ఉపగ్రహాలు.

ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ అభివృద్ధి లక్ష్యంతో ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం (IRNSS) అనే సరికొత్త జీపీఎస్ వ్యవస్థను ఇస్రో వృద్ధి చేసుకుంది. ఇందులో మొత్తం ఏడు ఉపగ్రహాలు ఉంటాయి. ఇస్రో ఇప్పటి వరకు IRNSS-1A, 1B, 1C & 1D అనే నాలుగు ఉపగ్రహాలను ప్రయోగించింది. రవాణా రంగంలో ఈ వ్యవస్థ సాధారణ వ్యక్తులు సైతం తమ గమనం, చేరాల్సిన ప్రదేశం గురించి తెలుసుకోవడానికి, లక్ష్యం ఎంత దూరంలో ఉందో నిర్ధారించుకోవడానికి తోడ్పడుతుంది. తద్వారా మెరుగైన ట్రాఫిక్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి వీలవుతుంది. సుదూర ప్రాంతాల్లోని పర్యావరణ పరిశోధన కేంద్రాలను అనుసంధానించడానికి ఇది ఉపయోగపడుతుంది. మొదటిసారిగా 1970లో అమెరికా సైనికులకు దిశానిర్దేశం చేయడానికి మాత్రమే ఉద్దేశించిన గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం ప్రస్తుతం సైనిక అవసరాలతో పాటు అనేక ఇతర అవసరాలకు కూడా ఉపయోగపడుతోంది. ఐఆర్ఎన్ఎస్ఎస్ ద్వారా బ్యాంకింగ్, వాణిజ్యం, కమ్యూనికేషన్స్ సేవలు మెరుగవుతాయి. ఇతర దేశాల ఉపగ్రహాలపై ఆధారపడటం కంటే దేశీయ నావిగేషన్ వ్యవస్థ ద్వారా పూర్తి భద్రతతో కూడిన మిలటరీ కార్యకలాపాలను నిర్వహించవచ్చు. దీనికి ఐఆర్ఎన్ఎస్ఎస్ ఎంతగానో దోహదపడుతుంది.

GSLV	తేది	ప్రయోగించిన ఉపగ్రహాలు	ఫలితం
1. GSLV-D1	2001 Apr 18	జీ శాట్–1	విజయం
2. GSLV-D2	2003 May 8	జీ శాట్–2	విజయం
3. GSLV-Fo1	2004 Sep 20	ఎడ్యు శాట్	విజయం
4. GSLV-Fo2	2006 July 10	ఇన్ శాట్–4సి	వైఫల్యం
5. GSLV-Fo4	2007 Sep 2	ఇన్ శాట్–4సిఆర్	విజయం
6. GSLV-D3	2010 Apr 15	జీ శాట్–4	విఫలం
7. GSLV-Fo6	2010 Dec 25	జీ శాట్–5 పి	విఫలం
8. GSLV-D5	2014 Jan 5	జీ శాట్–14	విజయం

ఇది భారత భూభాగంలో, ప్రధాన భూభాగం నుంచి 1500 కిలోమీటర్ల విస్తీర్ణంలోనూ పనిచేస్తుంది.

అంతరిక్ష నౌకలు

ఉపగ్రహాలతో పాటు వాటిని ప్రయోగించే అంతరిక్ష నౌకలు కూడా చాలా కీలకమైనవి. ఇప్పటికీ ప్రపంచంలో కేవలం కొన్ని దేశాలకే రాకెట్ పరిజ్ఞానం ఉంది. అనేక అవాంతరాలు ఎదురైనప్పటికీ భారత్ రాకెట్ విజ్ఞానాన్ని దాదాపుగా సొంతంగానే అభివృద్ధి చేసుకుంది. ప్రారంభంలో శాటిలైట్ లాంచ్ వెహికల్–3 (SLV-3), అగ్‌మెంటెడ్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ASLV) అనే రెండు పరిశోధన నౌకలను ఇస్రో అభివృద్ధి చేసి, వాటి ద్వారానే ఉపగ్రహాలను ప్రయోగించింది. వీటి అభివృద్ధిలో సాధించిన పరిజ్ఞానం, వైఫల్యాలు అందించిన పాఠాలను దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ అంతరిక్ష నౌకలను ఇస్రో అభివృద్ధి చేసింది. ఇవి రెండు రకాలు. అవి..

1) **పీఎస్ఎల్వీ (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్):** ప్రపంచంలో విజయవంతమైన అతి కొద్ది రాకెట్లలో ఇది ఒకటి. ఈ విధంగా అంతరిక్ష సేవలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడంలో పీఎస్ఎల్వీ కీలక పాత్ర పోషిస్తుంది.

2) **జీఎస్ఎల్వీ (జియోస్టేషనరీ శాటిలైట్ లాంచ్ వెహికల్):** ధ్రువ కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టడానికి ఉద్దేశించిన నౌక ఇది. దీని ద్వారా భూస్థిర కక్ష్యలోనూ ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇది మూడంచెల నౌక. దీని మూడో దశ 'క్రయోజనిక్ దశ'. అమెరికా ఒత్తిళ్ల మేరకు రష్యా ఈ ఇంజన్ సరఫరాను నిరాకరించినప్పటికీ భారత్ 1996లో దీని అభివృద్ధిని ప్రారంభించి సొంతంగా తయారు చేసుకుంది. ఇప్పటివరకు జీఎస్ఎల్వీ ద్వారా 8ప్రయోగాలు నిర్వహించగా.. 5 విజయవంతమయ్యాయి. జీఎస్ఎల్వీ మార్క్–III అభివృద్ధితో ఇస్రో భారీ ఉపగ్రహాలను సైతం ప్రయోగించనుంది. ఇప్పటివరకు ఇలాంటి భారీ ఉపగ్రహాల ప్రయోగం కోసం ఏరియేన్ అనే విదేశీ రాకెట్‌పై ఆధారపడుతున్నారు. దీనికి సంబంధించిన ఎల్వీఎమ్–3 అనే ప్రయోగం ద్వారా ఇస్రో డిసెంబర్ 2014లో క్రూ మాడ్యూల్ అట్మాస్ఫియరిక్ రీ ఎంట్రీ ఎక్స్‌పరిమెంట్ అనే కాప్స్యూల్‌ను విజయ వంతంగా భూమిపైకి తీసుకురాగలిగింది.

One thing that is usually true...

BANK EXAMS

MARKETING AWARENESS

1. The term marketing refers to:
a) New product concepts and improvements
b) Advertising and promotion activities
c) A philosophy that stresses more on customer value and satisfaction
d) Planning sales campaigns
e) None of these

2. In the history of marketing, when did the production period end?
a) In the late 1800s
b) In the early 1900s
c) In the 1920s
d) After the end of the Second World War
e) None of these

3. A marketing philosophy summarized by the phrase 'a stronger focus on social and ethical concerns in marketing' is characteristic of the ____ period.
a) production b) sales
c) marketing
d) societal marketing
e) None of these

4. Which skills and capabilities will marketers need to increasingly have?
a) Market research
b) Digital and social media marketing
c) Strategic marketing
d) Sales
e) None of these

5. Which of the following is not part of the external marketing environment?
a) Political b) Legal
c) Product d) Socio-cultural
e) None of these

6. Tobacco advertising is now virtually banned in all marketing communication forms in many countries around the world. This can be explained as an influence of:
a) Technological environment
b) Legal environment
c) Economic environment
d) Ecological environment
e) None of these

7. A firm has decided to alter its pricing and promotional strategies in response to slower than expected job growth and declining personal incomes. The firm is responding to changes in it's:
a) Socio-cultural environment
b) Political environment
c) Economic environment
d) Competitive environment
e) None of these

8. The process of collecting information about the external marketing environment is:
a) Environmental management
b) Environmental scanning
c) Marketing management
d) Marketing research
e) None of these

9. Which is NOT classified in buy classes?
a) New task
b) Information gathering
c) Modified re-buy
d) Straight re-buy
e) None of these

10. With respect to consumer behaviour, one's friends and relatives could be considered a/an:
a) Impersonal influence
b) Reference group influence
c) Perceptual influence
d) Institutional influence
e) None of these

11. Which of the following is not part of the consumer proposition acquisition process?
a) Motive development
b) Information gathering
c) Proposition evaluation
d) Perception
e) None of these

12. The purchasing department reorders on a routine basis, very often working from an approved list of suppliers. This is referred to as:
a) Straight re-buy b) New task
c) Modified re-buy
d) Routine buying
e) None of these

13. Which sampling techniques are often selected in qualitative research?
a) Non-probability sampling
b) Probability sampling
c) Stratified sampling
d) Random sampling
e) None of these

14. What is the term used to describe the degree to which the data elicited in a study is replicated in a repeat study?
a) Replication b) Pre-code
c) Reliability d) Convenience
e) None of these

15. One thing that is usually true of focus groups is that:
a) Most groups involve a small number of participants
b) They usually average 5 to 10 minutes in length
c) The moderator's job is to keep the group busy for the entire time and not let anyone leave
d) The questions used are highly structured and response-driven
e) None of these

16. Which type of research methods are designed to elicit responses to predetermined, standardized questions from a large number of respondents?
a) Quantitative b) Qualitative
c) Non-probability
d) Probability e) None of these

17. The ____ process commences at corporate level. Here the organization sets out its overall mission, purpose and values.
a) researching
b) strategic planning
c) controlling d) managing
e) None of these

18. A statement about what an organization wants to become, which sets out an organization's future, is referred to as:
a) Mission b) Values
c) Organizational goals
d) Vision e) None of these

19. A statement that sets out what the organization wishes to achieve in the long term is referred to as:
a) Mission b) Vision
c) Values
d) Strategic context
e) None of these

20. Organizational values are important because they ___.
a) help shape mission statements
b) help increase sales
c) help guide behaviour and the recruitment and selection decisions
d) help define market research
e) None of these

21. A commonly used basis for segmenting consumer markets:
a) Organizational size
b) Demographics
c) Product type
d) Price e) None of these

22. Which of the following is not an example of a behavioural variable?
a) Product usage
b) Media usage
c) Purchase occasion
d) Personality e) None of these

23. ACORN, a segmentation analysis technique, stands for which of the following?
a) A Corresponding Official Residential Notation
b) A Classification of Reported Nationals
c) A Classification of Residential Neighbourhood
d) A Countrywide Official Resources Navigation
e) None of these

24. The family life cycle:
a) is a way to apply psychographic segmentation
b) refers to the process of family formation and dissolution
c) provides insights into the relationships among age, occupation, income and housing
d) is composed of the 11 stages of personal growth from infancy to retirement
e) None of these

25. Offerings move through a sequential, pre-determined pattern of development similar to the biological path that life forms follow. This is the concept of:
a) Process of diffusion
b) New product development
c) Product life cycle
d) Brand management
e) None of these

26. Which of the following is NOT a service innovation strategy?
a) Branded service innovation
b) Established service innovation
c) Incremental service innovation
d) Radical service innovation
e) None of these

27. ____ is concerned with value creation generated through novel or unusual service concepts.
a) Established service innovation
b) Radical service innovation
c) Generic service innovation
d) Incremental service innovation
e) None of these

28. At the highest end of innovation maturity, firms seek to integrate the services dimension as part of their total offer. This is known as:
a) Servitization b) Reutilization
c) Diffusion d) Productization
e) None of these

29. In marketing terms, ____ refers to what we get for what we pay.
a) Revenue b) Cost
c) Value d) Product
e) None of these

30. ____ act as cues by indicating to a potential customer that there is a bargain to be had.
a) Odd-number pricing
b) Sale signs c) Relative price
d) Price surplus e) None of these

31. ____vary according to the number of units of goods made or services sold.
a) Product assets
b) Price elasticity
c) Fixed costs d) Variable costs
e) None of these

32. Costs which do not vary according to the number of units of product made or service sold:
a) Fixed costs b) Moving assets
c) Working capital
d) Fixed capital e) None of these

33. This is a hierarchy of effects or sequential model used to explain how advertising works:
a) ADD b) AIDA
c) PESTLE d) SWOT
e) None of these

34. AIDA stands for Awareness, ___, Desire and _____.
a) Interest; Action
b) Intensity; Appeal
c) Involvement; Action
d) Involvement; Appeal
e) None of these

35. Marketing communications is used to achieve one of two principal goals. The first concerns the development of brand values. What is the other goal?
a) Increasing sales
b) Informing about products
c) Changing the behavior of target audiences
d) Channeling communication tools
e) None of these

36. Sharing of meaning created through the transmission of information:
a) Communication
b) Noise c) Transfer
d) Understanding
e) None of these

37. Users are able to create content and become more involved with a brand through:
a) Door to door
b) Online communities
c) Direct mail d) Telemarketing
e) None of these

38. A commercial activity, whereby one party permits another an opportunity to exploit an association with a target audience in return for funds, services or resources is referred to as:
a) Advertising b) Exchange
c) Sponsorship
d) Public relations e) None

39. These sell directly to end consumers and may purchase directly from manufacturers and/or deal with wholesalers:
a) Distributors b) Franchising
c) Merchant d) Retailers
e) None of these

40. These store goods for moderate to long periods:
a) Storage warehouses
b) Distribution centres
c) Haulage transport
d) Electronic data interchange
e) None of these

KEY

1) c;	2) c;	3) d;	4) b;
5) c;	6) b;	7) c;	8) b;
9) b;	10) b;	11) d;	12) a;
13) a;	14) c;	15) a;	16) a;
17) b;	18) d;	19) a;	20) c;
21) b;	22) d;	23) c;	24) b;
25) c;	26) a;	27) b;	28) a;
29) c;	30) b;	31) d;	32) a;
33) b;	34) a;	35) c;	36) a;
37) b;	38) c;	39) d;	40) a.